www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

పేజీలు: 16 + 20 వెల: రూ. 6.50 సంపుటి: 59 సంచిక: 286

గురువారం | 31-1-2019

శ్రీవిళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: ఏకాదశి సా. 5.02 తదుపరి ద్వాదశి; నక్షత్రం: జ్యేష్ఠ సా. 6.41 తదుపరి మూల; వర్జ్యం: తె. 3.30-5.15; దుర్ముహూర్తం: ఉ. 10.37-11.22, మ. 3.06-3.51; అమృతఘడియలు: ఉ. 9.09-10.53; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.53; సూర్యాస్తమయం: 6.05

విజయవాడ సిటీ

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai


శాసనసభలో మాట్లాడుతున్న గవర్నర్ నరసింహన్

అటు అసెంబ్లీ.. ఇటు అఖిలపక్షం.. వేదిక ఏదైనా లక్ష్యం ఒక్కటే. రాష్ట్రానికి కేంద్రం చేసిన అన్యాయాన్ని ఎలుగెత్తి చాటడమే ధ్యేయం. ప్రధాని మోదీ చేసిన మోసంపై రాష్ట్ర ప్రజల్ని పోరాటానికి సన్నద్ధం చేయడమే లక్ష్యం. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రైల్వేజోన్, విభజన హామీలు నెరవేర్చకుండా కేంద్రం చేసిన మోసాన్ని అసెంబ్లీ వేదికగా గవర్నర్ నోటి ద్వారానే చెప్పించిన టీడీపీ ప్రభుత్వం.. అఖిలపక్ష భేటీలో కేంద్రంపై పోరాటానికి సమర శంఖం పూరించింది. హస్తినలో దీక్ష చేస్తానంటూ సీఎం చంద్రబాబు స్వయంగా ప్రత్యక్ష సమరానికి సై అన్నారు. మరోవైపు కేంద్రం బడ్జెట్‌ను ప్రవేశపెట్టే ఫిబ్రవరి 1న హోదా సాధన సమితి చేపట్టిన బంద్‌కు సంఘీభావం తెలుపకుండా అదే రోజు అసెంబ్లీలో కేంద్రం మోసంపై ప్రత్యేక చర్చ జరిగేలా వ్యూహం రూపొందించారు.

కేంద్రం గాయపరిచింది

- నాలుగున్నరేళ్లయినా విభజన కష్టాలు తీర్చలేదు.. హోదా ఇవ్వకపోవడం పెద్ద దెబ్బ
- నాటి ప్రధాని హామీలేమయ్యాయి?.. కేంద్రం సహకరించకున్నా ముందడుగు
- సంక్షేమం, వృద్ధిలో దేశంలోనే రోల్‌మోడల్.. 50 లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా
- పెన్షన్ రూ.2 వేలకు పెంపు.. డ్వాక్రా మహిళలకు మరో పది వేలు
- 15.78 లక్షల గృహాల మంజూరు.. 30.61 లక్షల మందికి దీపం కనెక్షన్లు
- ఈడబ్ల్యూఎస్ కోటాలో కాపులకు సగం.. 24 వేల కోట్లతో రైతు రుణ మాఫీ
- మహిళలపై నేరాలు తగ్గుముఖం.. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం

కేంద్రంపై పోరుబాట

ఢిల్లీ దద్దరిల్లేలా..!

రాష్ట్రంలో రేపటి నుంచి నిరసనలు.. 11న ఢిల్లీలో సీఎం దీక్ష

- ఆందోళనల్లో ప్రజలందరికీ భాగస్వామ్యం
- సంఘాలు, యువత, విద్యార్థులు తరలాలి
- మనపై అడుగడుగునా కక్ష, వివక్ష
- అయినా కేంద్రాన్ని ప్రాధేయపడేది లేదు
- పన్నులు కడుతున్నాం.. నిధులెందుకివ్వరు?
- హోదా ఇచ్చి తీరాల్సిందే: అఖిలపక్షంలో సీఎం

అమరావతి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి రావలసిన ప్రత్యేక హోదా ప్రయోజనాలు, విభజన హామీల సాధన కోసం చేస్తున్న ధర్మ పోరాటాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని అఖిల పక్ష సమావేశం నిర్ణయించింది. ఫిబ్రవరి 11న సహచర మంత్రులతో కలిసి అక్కడ ఒక రోజు

మిగతా 13వ పేజీలో...



పోరుకు రెడీ

- 1న రాష్ట్రంలో భారీగా ప్రదర్శనలు
- ద్రోహంపై 1న అసెంబ్లీలో చర్చ
- 11న ఢిల్లీలో సీఎం, మంత్రుల దీక్ష
- 12న రాష్ట్రపతిని కలవనున్న నేతలు
- 13 వరకు అఖిలపక్ష జేఏసీ నిరసనలు

ఐక్యంగా కదులుదాం

అఖిలపక్షంలో ముక్తకంఠం.. బాబు దీక్షకు మద్దతు

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక హోదాకోసం ముఖ్యమంత్రి చంద్రబాబు చేసే ఉద్యమానికి పలు ఉద్యోగ, ప్రజాసంఘాలు మద్దతు ప్రకటించాయి. సీఎం అధ్యక్షతన బుధవారం జరిగిన అఖిలపక్ష సమావేశం సందర్భంగా.. కేంద్రంపై ఐక్యపోరాటానికి సంసిద్ధత వ్యక్తం చేశాయి. ఉద్యమాలకు ఎన్జీవోల మద్దతు ఎప్పుడూ ఉంటుందని, తామంతా సీఎం వెంటే ఉంటామని ఏపీ ఎన్జీవో నేత చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు. సాధారణంగా ప్రభుత్వాలు నక్సలిజంపైనో, టెర్రరిజంపైనో పోరాడతాయి కానీ, మనం విచిత్రంగా మోదీయిజంపై పోరాటం చేయాల్సి వస్తోందని ఏపీ ఎన్జీవోల సంఘం మాజీ అధ్యక్షుడు అశోక్‌బాబు అన్నారు. కేంద్రం ప్రత్యేక హోదా ఇవ్వలేదన్న కసి ప్రజల్లో, ప్రజాసంఘాల్లో, ఉద్యోగుల్లో ఉందని ఏపీ జేఏసీ అమరావతి ఉద్యోగసంఘ నేత బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. సచివాలయ సంఘం తరఫున ఫిబ్రవరి 1న నిరసన ర్యాలీ చేపడతామని, 11, 12తేదీల్లో ఢిల్లీలో చేపట్టే ఉద్యమానికి మద్దతిస్తామని ఏపీ సచివాలయ ఉద్యోగ సంఘం నేత

మిగతా 3వ పేజీలో...



10, 16 తేదీల్లో రాష్ట్రానికి మోదీ

- గుంటూరు, విశాఖలో ఎన్నికల ప్రచారం
- 'హోదా' ముగిసిన అధ్యాయం
- కియ వచ్చింది మోదీ వల్లే: కన్నా

13


వన్ స్టేట్ వన్ సిరీస్‌లో భాగంగా జారీ చేసిన ఆర్సీ, నంబరు ప్లేట్లను వాహనదారుకు అందజేస్తున్న మంత్రి

AP 39

వచ్చేసింది

2

- ఒక రాష్ట్రం-ఒక కోడ్ అమల్లోకి
- ప్రారంభించిన అచ్చెన్నాయుడు
- ప్రపంచంలోనే ఏపీలో తొలిసారి
- నాలుగేళ్లలో దశ తిరిగిన రవాణా
- ఫిట్‌నెస్ తప్ప ప్రతిదీ ఆన్‌లైన్‌లో
- చంద్రబాబు పాలన గర్వకారణం

మీ సలహాలు కావాలి!

14

- ఉద్యోగులకు విపక్ష నేత జగన్ లేఖలు
- పోస్టు ద్వారా నేరుగా చేరుతున్న ఉత్తరాలు



పథకం తెచ్చిన విభజన

కార్డు కోసం కుటుంబాల వేరుబాట

- పథకాలకు రేషన్ కార్డు ప్రామాణికమే కారణం
- తాజాగా స్ప్లిట్ రేషన్ కార్డులకు 1.05 లక్షల దరఖాస్తులు
- 'సాధికార సర్వే'తోనే చిక్కుముడి
- విడిపోతే కొత్త కార్డు ఓకే



అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కలిసి ఉంటే కలదు సుఖం.. అన్నది పాత నానుడి.. కానీ వేరుపడితేనే అధిక లాభం అనేది కొన్ని కుటుంబాలు చెబుతున్నమాట!. రెండు పెన్షన్లు కావాలన్నా.. రెండు ఇళ్లు కావాలన్నా.. ప్రభుత్వం నుంచి వీలైనంత ఎక్కువ లబ్ధి చేకూరాలన్నా రెండో రేషన్ కార్డు పొందడమే సులువైన మార్గమనేది ఆయా కుటుంబాల ఆలోచన!. ఇందుకోసం వేరుపడేందుకూ ఏమాత్రం ఆలోచించడం లేదు. ప్రస్తుతం ఒకే కుటుంబంగా ఒకే రేషన్ కార్డు ఉన్న అనేక కుటుంబాలు.. కొత్త రేషన్ కార్డు కోసం వేరుపడేందుకు సిద్ధమవుతున్నారు. రేషన్ కార్డును కేవలం సరుకులకే పరిమితం చేస్తామని ప్రభుత్వం గతంలో అనేకసార్లు ప్రకటనలు చేసింది. కానీ ఆచరణలోకి తీసుకురాలేకపోయింది. ఇప్పటికీ ఏ ప్రభుత్వ పథకంలో లబ్ధి పొందాలన్నా

మిగతా 2వ పేజీలో...



'సీమ'లో హైకోర్టు బెంచ్!

- మీ అభిప్రాయం చెప్పండి
- కేంద్రానికి హైకోర్టు ఆదేశం

అక్రమార్కులపై ఉపేక్ష ఎందుకు?

విద్యుత్‌శాఖలో అక్రమాలపై ధర్మాసనం ఆగ్రహం

అమరావతి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలో ఏపీ హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై అభిప్రాయం చెప్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. శ్రీబాగ్ ఒడంబడిక మేరకు సీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలని అభ్యర్థిస్తూ సీనియర్ న్యాయవాది జె.నారాయణస్వామి 2017లో ఉమ్మడి హైకోర్టులో

మిగతా 14వ పేజీలో...

కౌలు రైతుకూ సాయం!

రైతుతోపాటే వారికీ సర్కారీ అండ



ఎకరాకు 2,500!

సాగు సంక్షోభం నుంచి రైతును గట్టెక్కించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్ద కసరత్తే చేస్తున్నారు. రైతులకు సాగు సాయం పథకం అమలు చేయబోతున్నారు. వ్యవసాయానికి అవసరమైన సాయాన్ని నగదు రూపేణా అందించాలని ఆయన నిర్ణయించినట్లు సమాచారం.

- సాగు సాయంపై ముఖ్యమంత్రి కసరత్తు
- ఏడాదిలో 2 సీజన్లకు విడివిడిగా సాయం
- వచ్చేఏడాది భారీగా పెంచే అవకాశం!
- అదనులో అందేలా పోస్ట్ డేటెడ్ చెక్కులు
- ఇచ్చే మొత్తంలో కౌలు రైతుకు 1,500 భూయజమానికి రూ.1,000
- రాష్ట్రంలో సాగులో కోటిన్నర ఎకరాలు
- ఈ లెక్కన ప్రభుత్వంపై 4 వేల కోట్ల భారం
- వచ్చేఏడాది మరింత పెరగనున్న ఖర్చు
- పథకం పేరు రైతు రక్ష లేదా ఏరువాక
- 2-3 రోజుల్లో అధికారిక ప్రకటన జారీ!

అమరావతి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో ఎకరానికి రూ.2,500 చొప్పున రైతులకు విడివిడిగా సాయం చేయాలని నిర్ణయించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. వచ్చే ఏడాది ఈ మొత్తాన్ని భారీగా పెంచాలనుకుంటున్నారు. ఈ పథకాన్ని రైతు రక్ష లేదా ఏరువాక పేరుతో అమలు చేసే అవకాశం ఉంది. 2-3 రోజుల్లో అధికారిక ప్రకటన జారీకానుంది. ప్రస్తుతం రాష్ట్రప్రభుత్వ ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉండడంతో సాయం మొత్తాన్ని రూ.2,500గా

మిగతా 14వ పేజీలో...

ఓటాన్ అకౌంటే

పూర్తి బడ్జెట్ కాదు: ఆర్థిక శాఖ స్పష్టీకరణ

- అయినా 3 లక్షల కోట్ల మేర రాయితీలు?
- రేపు ప్రవేశపెట్టనున్న పీయూష్ గోయల్
- ఐటీ రాయితీ రూ.8 లక్షలకు పెంచే చాన్స్
- నేటి నుంచి పార్లమెంటు సమావేశాలు





న్యూఢిల్లీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలకు ముందు చిట్టచివరి బడ్జెట్ సమావేశాలు గురువారం నుంచి జరగబోతున్నాయి. 16వ లోక్‌సభ కాలపరిమితి ఈ ఏడాది మేనెలలో ముగుస్తున్నందున ఈ సమావేశాలకు విశేష ప్రాధాన్యం ఉంది. ఫిబ్రవరి 1న కేంద్రం ఆర్థిక పద్దును ప్రవేశపెట్టబోతోంది. నరేంద్ర మోదీ ప్రభుత్వానికిది ఆరో బడ్జెట్టు, ఆఖరిదీ కూడా! సాధారణంగా ఎన్నికలకు ముందు ఓటాన్ అకౌంటే ప్రవేశపెట్టడం సంప్రదాయం. దాన్ని పాటించనున్నట్లు ఆర్థిక శాఖ బుధవారం నాడు ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. కేంద్రం పూర్తిస్థాయి

మిగతా 16వ పేజీలో...

మోదీ రైతు బంధు?

- భారీ తాయిలాలు ఖాయం
- ఒడిసా తరహా పథకమా? లేక తెలంగాణ స్కీమా?
- 'ఒక కుటుంబానికి ఒక రాయితీ' పథకంపై చర్చ

16

హిందూత్వ అజెండాతో బీజేపీ ప్రచారానికెళ్తే...

భారత్‌లో మత ఘర్షణలకు అవకాశం

- ఎన్నికల ముందు ముప్పు
- సీఐఏ నివేదికలో హెచ్చరిక

పళ్లూడగొట్టి.. చావబాది..

ఏడేళ్ల బాలికపై అత్యాచారం

- తీవ్ర రక్తస్రావం.. గుంటూరు ఆస్పత్రికి తరలింపు
- పెల్లుబికిన జనాగ్రహం.. రెంటచింతలలో రాస్తారోకో



నిందితుడు మిర్యాల జయరావ్ (ఫైల్)

2



పరంజ్యోతి

తాగరా... శ్రీరామ నామామృతం



నారద మహర్షి తెలిపన శ్రీ మహావిష్ణువు వేయి నామాలకు సమాన ఫలితాన్నిచ్చే సులభమైన మంత్రం ఏదైనా ఉంటే బోధించవల్సిందిగా పార్వతీదేవి తన పతియైన పరమేశ్వరుణ్ని కోరుతుంది. 'రామ' అనే పదాన్ని మూడుసార్లు పఠిస్తే అంతటి ఫలితం కలుగుతుందని చెప్పాడు పరమశివుడు. అంత గొప్పది రామనామం. తన గురువైన రామానందుని నోట విన్న 'రామ' శబ్దాన్నే తారక మంత్రంగా భావించి నిత్యం ధ్యానిస్తూ మహాత్మా కబీరు పరామానందాన్ని అనుభవించేవాడు. రామనామంతో తాను పొందిన అనుభూతులను పద్యాలుగా అల్లి సమాజానికి బోధించాడు. అలాంటి పద్యాల్లో ఒకటిది..

కబీర్ కహతా జాత్‌హు సున్‌తాహై సబ్‌కోయి
రామ్ కహే భలా హోయిగా నహి తర్ భలాన హోయి

'రామానామాన్ని ఎప్పుడూ స్మరిస్తూ ఉంటే అన్నింటా మంచి జరుగుతుందని కబీరునైన నేను నిత్యం చెబుతూ ఉంటా. అందరూ వింటూ ఉంటారు. కానీ ఎవ్వరూ నిండు మనసుతో ఆచరించ ప్రయత్నించరు' అని దీని అర్థం. 'రామనామం' మనిషి మనసుకు పగ్గాలు వేసి ఆధ్యాత్మికత వైపు నడిపిస్తుంది. అహాన్ని దూరం చేసి శ్రీమన్నారాయణునికి చేరువ చేస్తుంది. రెండక్షరాలు మాత్రమే ఉన్న 'రామ' నామం.. ఈతి బాధలు లేకుండా మనిషిని సుఖంగా ఉంచే శక్తి కలిగి ఉన్నది. వాగ్గేయకారుడైన త్యాగయ్య.. 'రామ' నామ మహత్యం గురించి ఓ కీర్తనలో ఇలా తెలిపారు. 'ఓం నమో నారాయణాయ' అనే అష్టాక్షరిలో 'రా' అనే బీజాక్షరం, 'ఓం నమఃశివాయ' అనే పంచాక్షరిలో 'మ' అనే బీజాక్షరం కలిసి 'రామ' అనే మహిమాన్వితమైన, శక్తిమంతమైన శబ్దం ఏర్పడిందని వర్ణించారు. రామ నామం గొప్పదనాన్ని తెలిపే గాథ ఒకటి రామాయణంలోనే కనపడుతుంది. లంకపై దండెత్తడానికి బయల్దేరిన వానరసైన్యం.. సముద్రంపై వారధి నిర్మించేందుకు సమాయత్తమవుతుంది. హనుమంతుని నాయకత్వంలో వానరులంతా రామ నామాన్ని స్మరిస్తూ ఒక్కొక్క బండరాయిని సముద్రంలో వేస్తుంటారు. వారువేసిన బండరాళ్లన్నీ నీటి మీద తేలుతుంటాయి. ఇది చూసిన శ్రీరామచంద్రుడు కూడా ఓ రాయిని నీటిలో వేస్తాడు. అది నీటిలో మునిగిపోతుంది. వానరులు వేసిన రాళ్లు ఎలా తేలియాడాయని రామచంద్ర ప్రభువు ఆలోచిస్తుంటాడు. దీన్ని గమనించిన పవనసుతుడు పరుగున వెళ్లి కారణం తెలుసుకుంటాడు. రామ ప్రభువు సందేహం విని.. 'దశరథ నందనా, అది మీ నామ మహిమ. రామనామం శక్తిమంతం, సర్వశ్రేష్ఠం. అందుకే మీ నామాన్ని స్మరిస్తూ మేం వేసిన రాళ్లన్నీ ఆ శక్తితో మునగకుండా తేలుతున్నాయి' అని నమ్రతగా వివరిస్తాడు హనుమ. రామనామ స్మరణతో తరించినవారికి.. మరణానంతరం సద్గతులు ప్రాప్తిస్తాయంటుంది రహస్యోపనిషత్తు. అందుకే భారతీయ జీవన స్రవంతిలో రామనామం లీనమై పోయింది. పసిబిడ్డను తొట్టెలో పడుకోబెట్టి పాడే "రామలాలీ" అన్న జోలపాటతో మొదలై "రామ్‌నామ్ సత్యహై" అంటూ జరిగే అంత్యేష్టి వరకూ మనందరి జీవన ప్రస్థానంలో ప్రతిక్షణం వినబడేది రామనామమే!

- పరికిపండ్ల సారంగపాణి

ఏపీ 39 వచ్చేసింది

- ఒక రాష్ట్రం-ఒక కోడ్ అమల్లోకి..
- ప్రారంభించిన అచ్చెన్నాయుడు



నంబరు ప్లేటును వాహనదారుకు అందజేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఇకపై ఏపీ 39 కోడ్ అమలు కానుంది. ఒకే రాష్ట్రం, ఒకే కోడ్ విధానాన్ని రాష్ట్ర రవాణాశాఖ బుధవారం అమల్లోకి తీసుకొచ్చింది. గత కొన్ని రోజులుగా కసరత్తు చేసిన రవాణాశాఖ, జిల్లాకు ఒక కోడ్ నంబర్ కాకుండా రాష్ట్రమంతా ఒక్కటే ఉండేలా చర్యలు చేపట్టింది. బెజవాడలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఈ విధానానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలో ప్రస్తుతం అనంతపురం ఏపీ 02 నుంచి ప్రారంభమైతే పశ్చిమగోదావరి జిల్లాలో ఏపీ 38ఉంది. రాష్ట్ర విభజనకు ముందున్న కోడ్లలో విభజన తర్వాత ఏపీ01 ఆదిలాబాద్‌కు వెళ్లిన విధంగా మరిన్ని కోడ్ నంబర్లు తెలంగాణలోని జిల్లాలకు వెళ్లాయి. దీంతో మన రాష్ట్రంలో 13జిల్లాల కోడ్ నంబర్లు మారతాయని ప్రచారం జరిగింది. చివరికి రాష్ట్రమంతా ఒకే నంబర్ అమలుకు రవాణాశాఖ మొగ్గు చూపింది. పలువురికి ఫ్యాన్సీ నంబర్లపై క్రేజ్ ఉండగా మరికొందరు సెంటిమెంట్ నంబర్లు కావాలని ప్రయత్నిస్తుంటారు. అనంతపురం జిల్లాలో వాహనం కొనుగోలు చేసిన వ్యక్తికి సంబంధించిన సెంటిమెంట్ నంబర్ (పుట్టినరోజు, పెళ్లిరోజు, ఇంకేదైనా) విశాఖ జిల్లాలో ఉంటుంది. కానీ అడ్రస్ వల్ల తీసుకోవడం సాధ్యం కాదు. మరో జిల్లాలో ఫ్యాన్సీ నంబర్లు(1234, 9999) తక్కువ ధరకే అందుబాటులో ఉంటాయి. వాటిని కొనాలనుకున్న వారు ఇంకో జిల్లాలో ఉంటారు. ఈ పరిస్థితుల్లో నంబర్లు కావాల్సిన వారికి సౌలభ్యంగా ఉండేలా రాష్ట్రమంతా ఒకే కోడ్ అమల్లోకి తీసుకొచ్చింది. ఇకపై ఏ జిల్లా వ్యక్తి అయినా ఏపీ 39 తర్వాత ఎటువంటి ఫ్యాన్సీ నంబర్ కావాలన్నా, ఆన్‌లైన్ ద్వారా బిడ్ వేసుకోవచ్చు. నెలల తరబడి ఆగకుండా 0001 నుంచి 9999 నంబర్ దాకా.. ఏదైనా 3రోజుల్లో అయిపోతోందని ఆర్టీఏ అధికారులు చెబుతున్నారు.

చెడ్డపేరు నుంచి బెస్ట్ సేవలకు : అచ్చెన్న

ప్రభుత్వ శాఖల్లో ఎక్కువ చెడ్డపేరున్న రవాణా శాఖను నాలుగేళ్లలో ఉత్తమ సేవల శాఖగా తీర్చిదిద్దిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ఒకే రాష్ట్రం ఒకే నంబర్ అనేది ప్రపంచంలో ఎక్కడా లేదని, అది ఆంధ్రప్రదేశ్‌లో సాకారమైనందుకు గర్వపడుతున్నానన్నారు. 'నాలుగేళ్ల క్రితం ఆర్టీఏ కార్యాలయాలకు వెళ్లే ప్రజలకు అధికారులు కాకుండా బయట ఏజెంట్లు మాత్రమే కనిపించేవారు. ఇప్పుడు ఆర్టీఏ కార్యాలయానికే వెళ్లకుండా అన్ని సేవలూ ఆన్‌లైన్‌లోకి తీసుకొచ్చాం. 83సేవల్లో 70ఇప్పటికే ఆన్‌లైన్‌లో అందుతున్నాయి. ఫిట్‌నెస్ లాంటివి తప్ప ఇతరత్రా దేనికీ ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లే అవసరం లేకుండా చేస్తాం' అని మంత్రి తెలిపారు. షోరూమ్‌లో వాహనం కొనుగోలు చేసిన వ్యక్తి ఆర్టీఏ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కోసం వేచియుండే పరిస్థితి పోయి, కొత్త బండిపై కుటుంబ సభ్యులతో కలిసి గుడికి వెళ్లే పరిస్థితి ఇప్పటికే తీసుకొచ్చామని వివరించారు. రాష్ట్ర విభజన నాటికి రూ.1400కోట్ల ఆదాయాన్ని ఆర్జించే రవాణాశాఖ ఒక్క రూపాయి పన్ను పెంచకుండా ప్రస్తుతం రూ.3వేల కోట్లు ప్రభుత్వ ఖజానాకు జమ చేస్తోందన్నారు. మహిళలు ఆటోల్లో ప్రయాణించే సమయాల్లో వారి రక్షణకు ఇబ్బంది లేకుండా ఆటోల్లో ప్రత్యేక పరికరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మూడున్నరేళ్ల క్రితం సేవలన్నీ ఆన్‌లైన్ చేయాలన్న సీఎం సూచనవల్లే, ఈ రోజు ప్రజలు ఆఫీసుల చుట్టూ తిరగకుండా సేవల్ని పొందగలుగుతున్నారని రవాణా శాఖ కమిషనర్ బాలసుబ్రమణ్యం అన్నారు.

విజయవాడ కల్పనకు తొలి నంబర్

మంత్రి చేతుల మీదుగా ప్రారంభించిన కొత్తసిరీస్‌లో ఏపీ39 ఏ0002 నంబర్ విజయవాడకు చెందిన కల్పనకు వచ్చింది. ఆటోలపై పన్ను రద్దు చేసినందుకు చంద్రబాబుకు డ్రైవర్ల సంఘం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది.

అప్పు కాదు... కానుక

- ఈ రెంటికీ తేడా తెలియదా!
- జగన్ మీడియా కథనాలు నమ్మవద్దు: సునీత, అచ్చెన్న



అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): "పసుపు కుంకుమ కింద డ్వాక్రా మహిళలకిచ్చే రూ.10 వేలు ఉచితంగా ఇస్తున్నాం. తిరిగి చెల్లించే పనేలేదు. ఆ డబ్బు మీ అవసరాలకు... మీ ఇష్టమొచ్చినట్లు వాడుకోవొచ్చు. ఓ పత్రిక, చానల్‌లో వచ్చిన కథనాలను, వైసీపీ నేతల మాటలను ఎవ్వరూ నమ్మొద్దు. ఎప్పుడో క్లోజ్ చేసిన మెమోను భూతంలా చూపిస్తున్నారు. 90 లక్షల మంది (డ్వాక్రా మహిళల) మహిళల మనోభావాలను దెబ్బతీస్తున్నారు. అయోమయానికి గురి చేస్తున్నారు" అని మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, పరిటాల సునీత పేర్కొన్నారు. బుధవారం అమరావతి సచివాలయంలో మంత్రులు విలేకరులతో మాట్లాడారు. "ప్రస్తుతం ప్రభుత్వమిస్తున్న రూ.10 వేలకు సంబంధించి ఇచ్చిన జీవోలో స్పష్టంగా గ్రాంట్ అని పేర్కొన్నాం. వాస్తవాలు తెలుసుకుని ప్రతిపక్ష నాయకులు మాట్లాడాలి. రాసేటప్పుడు నిజాలు రాయాలి. డ్వాక్రా సంఘాల సభ్యులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.10 వేలు రుణంగా ఇస్తున్నారంటూ వచ్చిన వార్తలు పూర్తిగా అవాస్తవం. టీడీపీ ప్రభుత్వ పథకాలపై వైసీపీ దుష్ప్రచారం చేస్తోంది. వైసీపీ నేతలకు గ్రాంట్ అంటే ఏంటో.. అప్పు అంటే ఏంటో కూడా తెలియదా? ప్రభుత్వం మూడు విడతలుగా అంటే ఫిబ్రవరి 1, మార్చి 8, ఏప్రిల్ 5న మూడు తేదీలతో చెక్కులు అందిస్తుంది" అని అచ్చన్న స్పష్టం చేశారు. "డ్వాక్రా సంఘాలకు ప్రభుత్వం ప్రకటించిన 'పసుపు-కుంకుమ' పథకంపై ప్రతిపక్షనేత జగన్ మీడియాలో తప్పుడు వార్తలు రాశారు. డ్వాక్రా సంఘాలకు ఇచ్చిన రుణాలపై వడ్డీ మాఫీ చేయలేదని నేను చెప్పానంటూ ఆ పత్రికలో వక్రీకరించి రాశారు. రాసేటప్పుడు వాస్తవాలు తెలుసుకుని రాయాలి. పథకం అందరికీ వర్తించాలనే ఉద్దేశంతోనే 'పసుపు కుంకుమ' పేరుతో అందరికీ ప్రయోజనం కలిగేలా చేస్తున్నాం.ప్రస్తుతం రాష్ట్రంలో 94 లక్షల మంది డ్వాక్రా మహిళలున్నారు. ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.9,400 కోట్ల గ్రాంటు మూడు విడతల్లో చెక్కుల రూపంలో అందిస్తాం. ప్రభుత్వం గ్రాంటుగా ఇచ్చే మొత్తాలను తిరిగి చెల్లించాల్సిన పనిలేదు" అని సునీత స్పష్టం చేశారు.



పాలువాయి జంక్షన్లో రాస్తారోకో చేస్తున్న గ్రామస్థులు

ఏడేళ్ల బాలికపై అత్యాచారం

- పెల్లుబికిన జనాగ్రహం.. రెంటచింతలలో రాస్తారోకో



నిందితుడు మిర్యాల జయరావ్ (ఫైల్)

రెంటచింతల/గుంటూరు(సంగడిగుంట), జనవరి 30: గుంటూరు జిల్లా రెంటచింతల మండలంలోని ఓ గ్రామంలో ఏడేళ్ల బాలికపై తాగుబోతు లైంగిక దాడికి పాల్పడ్డాడు. తొలుత ఆమెను దారుణంగా కొట్టి, ఆపై ఘాతుకానికి తెగబడ్డాడు. గురజాల డీఎస్పీ శ్రీహరి బాబు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బాలిక మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో బహిర్భూమికి వెళ్లగా, మద్యంమత్తులో ఉన్న ట్రాక్టర్ డ్రైవర్ మిర్యాల జయరావ్(25) ఆ చిన్నారిని పట్టుకున్నాడు. తొలుత రాయితో పళ్లూడగొట్టి, ఆపై అత్యాచారం చేశాడు. బాలిక తీవ్ర రక్తస్రావంతో ఇంటికి రాగా, తల్లి, బంధువులు ఆరా తీశారు. వెంటనే జయరావ్‌ను పట్టుకుని నిలదీశారు. అయితే, తనకేమీ సంబంధం లేదని, సంఘటన స్థలం వద్ద మరో వ్యక్తి ఉన్నాడంటూ బుకాయించి.. వారిని అక్కడికి తీసుకెళ్లాడు. తర్వాత మభ్యపెట్టి అక్కడి నుంచి ఉడాయించాడు. బాధితురాలిని తొలుత గురజాల ఆస్పత్రికి, తర్వాత గుంటూరు జనరల్ ఆస్పత్రికి తరలించారు. కాగా, నిందితుడు మిర్యాల జయరావ్‌కు ఇద్దరు సంతానం. అతడి నుంచి కుటుంబీకులు దూరంగా ఉంటున్నారు. ఎస్‌ఐ ఆవుల హరిబాబు బృందం రాత్రి నుంచి నిందితుడి కోసం గాలిస్తోంది. ఇదిలా ఉంటే.. జయరావ్‌ను బహిరంగంగా ఉరి తీయాలని, లేదంటే తమకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు బుధవారం రెంటచింతల దరి పాలువాయి జంక్షన్‌లో రాస్తారోకో చేపట్టారు. దీంతో 2 గంటలపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది.

రూ.5 లక్షల ఆర్థిక సాయం: మంత్రి సునీత

జరిగిన దారుణంపై మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి పరిటాల సునీత తీవ్రంగా స్పందించారు. ఆస్పత్రిలో బాధిత చిన్నారిని, ఆమె కుటుంబ సభ్యులను మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారితో కలిసివెళ్లి పరామర్శించారు. మంత్రి సునీత బాధితురాలికి రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. నన్నపనేని వ్యక్తిగతంగా రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఇలాంటి ఘాతుకాలకు పాల్పడే వారిని ఊళ్ల నుంచి తరిమితరిమి కొట్టాలన్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించేలా పోలీసుశాఖ చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించినట్లు తెలిపారు.

ఉసురు తీసిన ముక్కోణపు ప్రేమ!

బెంగళూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ముక్కోణపు ప్రేమ వ్యవహారం ఇద్దరు ఇంటర్ విద్యార్థుల మధ్య చిచ్చుపెట్టింది. దీంతో ఓ విద్యార్థిని తోటి విద్యార్థి కళాశాల టాయిలెట్‌లోనే చాకుతో పొడిచి హత్య చేశాడు. ఈ ఘటన బుధవారం బెంగళూరులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బాగలకుంటలోని సౌందర్య కళాశాలలో ఇంటర్ విద్యార్థి దయాసాగర్ (18)ను తోటి విద్యార్థి రక్షిత్ హతమార్చాడు. కొద్ది రోజులుగా వీరిరువురూ ఒకే విద్యార్థిని ప్రేమిస్తూ ఆమెతో చనువుగా ఉంటున్నారు. దయాసాగర్‌పై కక్ష పెంచుకున్న రక్షిత్.. పుస్తకాల బ్యాగులో చాకును వెంట తెచ్చుకున్నాడు. దయాసాగర్ టాయిలెట్స్‌లోకి ప్రవేశించగానే వెంటపడి.. 'నా ప్రియురాలితో సన్నిహితంగా ఉంటావా..?' అంటూ గొంతుపై బలంగా పొడిచాడు. దీంతో అతడు రక్తపుమడుగులో పడిపోయాడు. దయాసాగర్‌ను కళాశాల అధ్యాపకులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. దయాసాగర్ తండ్రి మంజునాథ్ అదే కళాశాలలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. హత్యకు పాల్పడిన విద్యార్థి రక్షిత్ చిక్కసంద్రలో నివసిస్తున్నాడు. అతడికి సహకరించిన మరో విద్యార్థిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు డీసీపీ చేతన్‌సింగ్ తెలిపారు.

పథకం తెచ్చిన విభజన

(మొదటిపేజీ తరువాయి)

రేషన్ కార్డే పేదరికానికి ప్రామాణికం. పెన్షన్లు, పక్కా ఇళ్లు, స్వయం ఉపాధి పథకాలు, విదేశీవిద్య, విద్యోన్నతి, ఆదరణ, గేదెల రుణాలు ఏ పథకం అయినా కచ్చితంగా రేషన్ కార్డు ఉండాలి. అయితే ఒక కార్డుకు ఒకేసారి ఒక పథకంలో లబ్ధి పొందే వీలుంటుంది. కాగా ఇటీవల ఒకే కుటుంబం అయినా రెండు పెన్షన్లు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయినప్పటికీ విభజన కార్డుల కోసం ప్రజల నుంచి దరఖాస్తులు తగ్గడం లేదు. ఎప్పుడు 'జన్మభూమి' నిర్వహించినా వేల సంఖ్యలో స్ప్లిట్ కార్డుల కోసం దరఖాస్తు వచ్చి పడుతున్నాయి. కొత్త కార్డుల కోసం వస్తున్న దరఖాస్తులతో పోలిస్తే ఇవి మూడు నాలుగు రెట్లు అధికంగా ఉంటున్నాయని అధికారులు తెలిపారు.

తాజా దరఖాస్తులు లక్ష పైనే!

ఆరు నెలల కిందట సుమారు 2లక్షల కుటుంబాలు రేషన్ కార్డుల విభజన(స్ప్లిట్) కోసం దరఖాస్తు చేసుకుంటే, తాజాగా మరో లక్ష కుటుంబాలు ఆ జాబితాలో చేరడమే ఇందుకు నిదర్శనం!. ఈమధ్య కాలంలో స్ప్లిట్ కార్డుల కోసం 1,05,765 మంది దరఖాస్తు చేసుకున్నారు. తాము కుటుంబపరంగా విడిపోయామని, తమకు కొత్త కార్డు ఇవ్వాలని ప్రభుత్వానికి విన్నవించారు. అందులో 4,569 కుటుంబాలకు ఇప్పటికే పౌరసరఫరాలశాఖ కార్డులు జారీచేసింది. 42 వేల కుటుంబాల దరఖాస్తులు పరిశీలించగా, విభజన కార్డుకు అర్హులేనని తేలినా, ప్రజాసాధికార సర్వేలో విభజన చేసుకోనందున వారికి జారీచేయలేదు. దారిద్ర్యరేఖకు దిగువన లేరని గుర్తించి.. మరో 5,489 కుటుంబాలు కొత్త కార్డులను తిరస్కరించారు. 28,932 దరఖాస్తులను పరిశీలించాల్సి ఉంది. తిరస్కరించిన 5489 దరఖాస్తులు తప్ప మిగిలిన కుటుంబాలన్నీ విభజనకు అర్హమైనవేనని ప్రాథమికంగా గుర్తించారు.

సాధికార సర్వేనే ప్రామాణికం

రేషన్ కార్డుల విభజనకు ప్రజాసాధికార సర్వేనే ప్రధానంగా మారింది. రేషన్ కార్డును విభజించుకోవాలనుకునే వారు తొలుత సాధికార సర్వేలో విభజన చేసుకోవాలి. ఇందుకోసం స్థానికంగా సాధికార సర్వే సంబంధిత అధికారికి దరఖాస్తు చేసుకోవాలి. ఆ అధికారి క్షేత్రస్థాయికి వెళ్లి, నిజంగానే విడిపోయారా? అనేది పరిశీలించి అర్హులైతే సర్వేలో విభజిస్తారు. ఆ తర్వాత కార్డుదారు 1100కు ఫోన్ చేసి కొత్త కార్డుకోసం దరఖాస్తు చేసుకోవాలి. సర్వేలో విడిపోయారని నిర్ధారణ జరిగితే పౌరసరఫరాల నోడల్ అధాకారికి ఆ దరఖాస్తును పంపుతారు. నోడల్ అధికారి మరోమారు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. కుటుంబ ఆదాయం, భూములు, విద్యుత్ బిల్లు, వాహనాలు పరిశీలించి దారిద్ర రేఖకు దిగువనే ఉన్నారని తేలితే వారికి కార్డు జనరేట్ చేయాలని సిఫారసు చేస్తారు. కాగా అప్పటికే ప్రజాసాధికార సర్వేలో ఉన్న ఆస్తుల, ఇతర వివరాలను కూడా సరిపోల్చి అర్హతను నిర్ణయిస్తారు. సర్వేలో విభజన కాకుండా విభజన కోసం దరఖాస్తు చేసుకుంటే దానిని తీసుకోవడం లేదు.

దీంతో సర్వేలో విభజన కావడమే దరఖాస్తుదారులకు పెద్ద సమస్యగా మారింది. ఇప్పుడన్నీ ఆధార్‌తో అనుసంధానం చేస్తుండటం వల్ల కొత్త వాహనం కొన్నా అది కార్డుదారుని ఆధార్‌తో చేరిపోతోంది. కార్డుదారు దాని గురించి చెప్పకపోయినా సాధికార సర్వే వివరాల్లో తెలుస్తోంది.



నృత్య 'సౌజన్యం'

- అలరించిన త్రివిక్రమ్ సతీమణి నాట్యం

విశాఖపట్నం-కల్చరల్, జనవరి 30: ప్రముఖ సినీ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ భార్య సౌజన్య శాస్త్రీయ నృత్య ప్రదర్శన కళాభిమానులను అలరించింది. విశాఖపట్నం కళాభారతిలో బుధవారం సాయంత్రం ఇచ్చిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలో సౌజన్య త్రివిక్రమ్.. గజాననీయం, శ్రీరామ కథాసారం, శశిరేఖా పరిణయం, నరకాసుర సంహారం, కృష్ణతత్వం, థిల్లానా అంశాలకు నృత్యాభినయం చేసి మెప్పించారు. సంగమం ఫౌండేషన్, కళావేదిక కల్చరల్ అండ్ చారిటబుల్ ట్రస్టు సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి పద్మశ్రీ సిరివెన్నెల సీతారామశాస్త్రి, త్రివిక్రమ్ శ్రీనివాస్, నటుడు జయప్రకాష్‌రెడ్డి హాజరయ్యారు.

సవరణ

ఆయన 'కట్టప్ప' కాదు!

ప్రధాని మోదీ వ్యంగ్య చిత్రంతో ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టిన కేసులో ఎండీఎంకే నాగపట్టణం ఇంచార్జ్ సత్యరాజ్ బాలును పోలీసులు అరెస్టు చేశారు. అయితే బుధవారంనాటి 'ఆంధ్రజ్యోతి' సంచికలో ఎండీఎంకే నేత సత్యరాజ్ బదులు బాహుబలి చిత్రంలో కట్టప్పగా నటించిన నటుడు సత్యరాజ్‌ను అరెస్టు చేసినట్లు పొరపాటుగా వచ్చింది. ఈ పొరపాటుకు చింతిస్తున్నాం.

-ఎడిటర్



అంగన్‌వాడీ కేంద్రంలోనే కుమారుడి పుట్టినరోజు నిర్వహిస్తున్న సీతంపేట ఐటీడీఏ పీవో శివశంకర్ దంపతులు(ఫైల్)

అంగన్‌వాడీలో ఐఏఎస్ బిడ్డ

నిరుపేదలు సైతం తాహతుకు మించి పిల్లలను కార్పొరేట్ స్కూళ్లలో చేర్పిస్తుండగా, ఓ ఐఏఎస్ అధికారి తన కుమారుడిని అంగన్‌వాడీ కేంద్రానికి పంపి ప్రభుత్వ విద్యపై విశ్వాసాన్ని చాటుతున్నారు. సీతంపేట ఐటీడీఏ పీవో శివశంకర్ చిన్న కుమారుడు స్వాహానంద్ వయసు రెండేళ్లు. స్వాహానంద్ ప్రతిరోజూ సీతంపేటలోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్తున్నాడు. తోటి పిల్లలతో కలిసిపోయి ఆనందంగా అక్కడే పూర్వ ప్రాథమిక విద్యను అభ్యసిస్తున్నాడు. అక్కడ అందించే పౌష్టికాహారాన్ని మిగిలిన పిల్లలతోపాటు తింటున్నాడు. ఇటీవల స్వాహానంద్ పుట్టినరోజు వేడుకలను కూడా ఆ అంగన్‌వాడీ కేంద్రంలోనే పీవో దంపతులు నిర్వహించారు. జిల్లా ప్రముఖులు, పలువురు పీవోను అభినందిస్తున్నారు.

- సీతంపేట రూరల్(శ్రీకాకుళం జిల్లా)

'అగ్రి' బాధితులకు ఊరట

- 10 వేలలోపు డిపాజిటర్లకు పరిహారం చెల్లింపు

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): "ఏళ్లతరబడి నలుగుతున్న అగ్రిగోల్డ్ సమస్యకు పాక్షిక పరిష్కారం చూపించడానికి ప్రభుత్వం సిద్ధపడింది. రూ.10వేలలోపు డిపాజిటర్లకు తామే చెల్లించాలని ప్రభుత్వం భావిస్తోంది. అవకాశముంటే రూ.20వేలలోపు డిపాజిటర్లకూ న్యాయం చేయాడానికే ఆలోచన చేస్తోంది. లక్షలాది మంది బాధితులకు ఊరట కలిగించే దిశగా గురువారం జరగనున్న కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకోనున్నారు" అని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావు తెలిపారు. బుధవారం సచివాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. "ఆంధ్రలో 10.5లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితులు ఉన్నారు. రూ.10వేలలోపు డిపాజిటర్లు 5.50లక్షల మంది ఉన్నారు. కోర్టు అనుమతితో త్వరలో వారికి పరిహారం ప్రభుత్వం చెల్లించనుంది. అగ్రిగోల్డ్ సమస్యను సత్వరం పరిష్కరించేందుకు కేసులను విభజించాలని తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్‌ను కోరాం. తెలంగాణలో 36, ఏపీలో 33 కేసులు నమోదయ్యాయి. అగ్రిగోల్డ్‌పై వైసీపీ నేత బొత్స సత్యనారాయణ అవాస్తవాలు మాట్లాడుతున్నారు. కోర్టులో ఏం జరుగుతుందో బొత్సకూ తెలుసు. బాధితుల ఉసురు పోసుకోవద్దు. టీడీపీ నేతలు ఎవ్వరు అగ్రిగోల్డ్ ఆస్తులు కొనలేదు. మా ప్రభుత్వం ఎప్పుడూ అగ్రిగోల్డ్ అంశాన్ని ప్రధాన అజెండాగానే తీసుకుంది. సమస్యను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తుంది. పూర్తి పారదర్శకంగా అగ్రిగోల్డ్ కేసు దర్యాప్తు జరుగుతుంది. మోదీ వల్లే కియా ఆంధ్రకి వచ్చిందని బీజేపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారు. మోదీ కొరియాకు వెళ్లినపుడు తెచ్చారంటూ వీడియోలు వైరల్ చేస్తున్నారు. కియా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతోనే ఒప్పందం చేసుకుంది. తెలుగుదేశం విజయాన్ని తన ఖాతాలో వేసుకునే ప్రయత్నం బీజేపీ చేస్తుంది" అని కుటుంబరావు విమర్శించారు.

లోకం తీరు



నోట్లరద్దు, జీఎస్టీ... లాంటి ఆయన కలలను మాత్రం మన మీద రుద్దొచ్చంటావా డియర్..!

చలికాలం

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
హైదరాబాద్	9.3	28.0
గుంటూరు	11.8	29.4
కడప	16.0	31.0
విజయనగరం	16.0	28.0
అనంతపురం	16.8	29.4
విజయవాడ	18.6	29.1
ఒంగోలు	17.5	31.7
నెల్లూరు	18.5	31.0
విశాఖపట్నం	20.0	28.0

పెరిగిన చలి


విశాఖపట్నం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మధ్యభారతం దానికి ఆనుకుని వున్న విదర్భ, తెలంగాణలో తీవ్రమైన చలి గాలులు వీస్తున్నాయి. ఆ ప్రభావంతో కోస్తాలో కూడా పలుచోట్ల చలి వాతావరణం నెలకొంది. ముఖ్యంగా తెలంగాణకు ఆనుకుని వున్న గుంటూరు జిల్లాలో చలిగాలులు వీస్తున్నాయి. రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఐదు డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. ఇంకా రాయలసీమ, కోస్తాల్లో అనేకచోట్ల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నాలుగు నుంచి ఆరు డిగ్రీలు తక్కువగా నమోదుకావడంతో పగటిపూట చలి వాతావరణం నెలకొంది. రానున్న రెండు రోజుల వరకు కోస్తా, రాయలసీమల్లో చలి వాతావరణం కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది. కాగా కోస్తా, రాయలసీమల్లో ఉదయం పూట మంచు కురిసింది.



బీజేపీ, వైసీపీలది భార్యాభర్తల బంధం

"పురందేశ్వరి బీజేపీలో ఉండడం, ఆమె భర్త వైసీపీలోకి వెళ్ళడం లాంటి సంఘటనలు చూస్తే ఉభయ పార్టీల బంధం... భార్యభర్తల అనుబంధంగా ఉంది. రాష్ట్రంలో ఎన్నికలు దగ్గరపడే కొద్దీ పార్టీలు మారడం ఫ్యాషన్ అయిపోయింది. కేంద్రంలో ప్రధాని మోదీ ప్రతిపక్షాలను అణగదొక్కడం, వ్యక్తిగత కక్షలకు పాల్పడడం, సీబీఐ, ఈడీలాంటి సంస్థలను స్వప్రయోజనాలకు వాడుకోవడం సిగ్గుచేటు. అభివృద్ధిని మరచి ఆర్థిక వ్యవస్థలన్నింటినీ నాశనం చేస్తున్నారు. చివరకు న్యాయవ్యవస్థపై బెదిరింపు ధోరణికి దిగారు."

- కె.నారాయణ, జాతీయ కార్యదర్శి, సీపీఐ



రాహుల్ రావణుడైతే.. ప్రియాంక శూర్పణఖ

మోదీది రాముడి పాత్ర. రాహుల్ రావణుడైతే ఆయన సోదరి ప్రియాంక.. శూర్పణఖ. మా రాముడి(మోదీ)తో యుద్ధం చేసేందుకు రావణుడు తన సోదరి శూర్పణఖను రంగంలోకి పంపాడు. ప్రియాంకను ప్రత్యక్ష రాజకీయాల్లోకి తీసుకురావడం ద్వారా మోదీపై పోరాడలేనంటూ రాహుల్ తన అసమర్థతను చాటాడు.

- బీజేపీ ఎమ్మెల్యే సురేంద్రసింగ్

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్ (విజయవాడలో)		డీజిల్	
పాత ధర	రూ. 75.02	పాత ధర	రూ. 70.80
కొత్త ధర	రూ. 74.93	కొత్త ధర	రూ. 70.69
తగ్గుదల: 9 పైసలు		తగ్గుదల: 11 పైసలు	

పసిపిల్లలూ

మన మాటలు గుర్తిస్తారు!

లండన్, జనవరి 30: నవజాత శిశువులకు మనం మాట్లాడే మాటల్లో కొన్ని పదాలను గుర్తించే సామర్థ్యం ఉంటుందని బ్రిటన్‌లోని మాంచెస్టర్ యూనివర్సిటీ పరిశోధకులు ఒక అధ్యయనంలో గుర్తించారు. మూడు రోజుల వయసున్న చిన్నారుల్లో అందుకు సంబంధించి రెండు విధానాలను వారు కనుగొన్నారు. 'మా అధ్యయనం నవజాత శిశువుల సున్నితత్వాన్ని తెలియజేస్తుంది. అలాగే వారు ఎంతమేరకు సమాచారాన్ని గ్రహిస్తున్నారు అనే అంశాలను గుర్తించాం' అని మాంచెస్టర్‌వర్సిటీ శాస్త్రవేత్త అలిస్సా ఫెర్రీ పేర్కొన్నారు.



గ్లోబల్ ఇండియన్ ఇన్స్పిరేషనల్ బ్రాండ్ అవార్డును అందుకుంటున్న నారాయణ విద్యాసంస్థల చైర్మన్ కె.పునీత్, మేనేజింగ్ డైరెక్టర్ సింధూర. నారాయణ విద్యాసంస్థలను సమర్థంగా నడిపిస్తున్నందుకు వారిద్దరినీ గ్లోబల్ లీడర్లుగా ఎంపిక చేసి వరల్డ్ కన్సల్టింగ్ కార్పొరేషన్ ఈ అవార్డును ప్రకటించింది. యూకే ఇండియా బిజినెస్ కౌన్సిల్ సీఈవో రిచర్డ్ చేతుల మీదుగా లండన్‌లో పునీత్, సింధూర అవార్డు అందుకున్నారు.

3 వేల మంది.. 202 కిలోమీటర్లు..

- మద్య నిషేధానికి మహిళల పాదయాత్ర
- సాధ్యం కాదన్న కర్ణాటక సీఎం



బెంగళూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఒకరా ఇద్దరా.. 3 వేల మంది మహిళలు.. 'మద్యనిషేధ ఆందోళన కర్ణాటక' సంఘం ఆధ్వర్యంలో మరో మహా పోరాటానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తొలుత చిత్రదుర్గ పట్టణానికి చేరుకుని జనవరి 19న బెంగళూరుకు పాదయాత్రగా బయల్దేరారు. చలిని, వర్షాన్ని ఏమాత్రం లెక్క చేయకుండా బుధవారం రాజధాని చేరుకున్నారు. పాదయాత్ర ప్రారంభంలో పాల్గొన్న రాయచూరుకు చెందిన రేణుకమ్మ ప్రమాదంలో మృతి చెందినప్పటికీ ఉద్యమకారుల ఆత్మస్థైర్యం పట్టుసడలలేదు. వేలాది కుటుంబాలు నరకప్రాయంగా మారాయని, రోజూ గృహహింసతో అట్టుడికిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ లక్ష్యం నెరవేరే వరకు పోరాటం కొనసాగుతుందన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి రోజే బెంగళూరుకు చేరుకున్న మహిళల పాదయాత్రకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇదే సమయంలో.. ముఖ్యమంత్రి హెచ్.డి.కుమారస్వామి నగరంలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు సాధ్యం కాదని తేల్చిచెప్పారు.

బెంగళూరులో హ్యూమన్ స్పేస్ ఫ్లైట్ సెంటర్

బెంగళూరు, జనవరి 30: గగన్‌యాన్ సన్నాహాల్లో మునిగిపోయిన ఇస్రో.. బెంగళూరులోని ప్రధాన కార్యాలయంలో 'హ్యూమన్ స్పేస్ ఫ్లైట్ సెంటర్' (హెచ్ఎస్ఎఫ్‌సీ)ను బుధవారం ప్రారంభించింది. ఇస్రో చైర్మన్ కె శివన్ సమక్షంలో మాజీ చైర్మన్ కె కస్తూరిరంగన్ ఈ హెచ్ఎస్ఎఫ్‌సీని లాంఛనంగా ప్రారంభించారు. 2021 చివరికల్లా మానవ సహిత రాకెట్‌ను అంతరిక్షంలోకి ప్రవేశపెట్టాలని భావిస్తున్న ఇస్రో.. ఆ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు అధిక ప్రాధాన్యమిస్తోంది. ఈ సందర్భంగా గగన్‌యాన్‌కు సంబంధించిన క్రూ మాడ్యూల్ పూర్తిస్థాయి నమూనాను కూడా ఆవిష్కరించారు. గగన్‌యాన్‌లో భాగంగా మిషన్ ప్లానింగ్‌ను హెచ్ఎస్ఎఫ్‌సీ పర్యవేక్షిస్తుంది. క్రూ మాడ్యూల్ ఇంజనీరింగ్ వ్యవస్థ అభివృద్ధి, క్రూ సెలెక్షన్, శిక్షణ వంటి అంశాలకు కూడా బాధ్యత వహిస్తుందని ఇస్రో తెలిపింది. ఇస్రో సెంటర్ల సహకారంతో ఇది పనిచేస్తుంది.

హంగ్ పార్లమెంటే!

న్యూఢిల్లీ, జనవరి 30: రానున్నది హంగ్ పార్లమెంటేనని టైమ్స్ నౌ - వీఎంఆర్ సర్వే వెల్లడించింది. బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏకు 252, కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏకు 147, ఇతరులకు 144 సీట్లు వస్తాయని అంచనా వేసింది.

ఐక్యంగా కదులుదాం

(మొదటి పేజీ తరువాయి)

మురళీకృష్ణ చెప్పారు. ప్రత్యేకహోదా కోసం జరిగే ప్రతి కార్యక్రమానికి మహిళలంతా అండగా ఉంటారని మహిళా ఉద్యోగుల సంఘం ప్రతినిధులు తెలిపారు. రాష్ట్ర ఎంపీల పోరాటం స్ఫూర్తిదాయకంగా ఉందని, ఢిల్లీలో చేసే పోరాటానికి తామంతా అండగా ఉంటామని గెజిటెడ్ అధికారుల అసోసియేషన్ ప్రతినిధి చెప్పారు. చంద్రబాబు పోరాటానికి తమ మద్దతు ఉంటుందని ఆంధ్రా యాక్షన్ కమిటీ ప్రతినిధి తెలిపారు. సమావేశానంతరం మంత్రి కాల్వ శ్రీనివాసులు మాట్లాడుతూ.. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ఐక్య ఉద్యమాన్ని నిర్మించడానికి తనతోపాటు మంత్రులు నక్కా ఆనందబాబు, అచ్చెన్నాయుడు, ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్, ఎన్జీవో అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి, అశోక్‌బాబు, సచివాలయ ఉద్యోగుల సంఘం నేత మురళీకృష్ణ తదితరులతో 'ఏపీ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన జేఏసీ'ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కేసీఆర్‌ను నమ్ముతున్న జగన్.. విభజనతో దగాపడ్డ రాష్ట్రాన్ని నిజాయితీగా అభివృద్ధి చేస్తున్న సీఎం చంద్రబాబును నమ్మడం లేదని నవసమాజ్ పార్టీ ప్రతినిధి చంద్రమౌళి విమర్శించారు. చంద్రబాబు ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడం చారిత్రక అవసరమని ఏపీ కాలేజ్ అసోసియేషన్ ప్రతినిధి అన్నారు. సీఎం దీక్షకు మద్దతు ప్రకటిస్తున్నామని హ్యూమన్‌రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ ప్రతినిధి చెప్పారు. విభజన చట్టంలోని అంశాలపై ప్రామాణికమైన లెక్కలు కట్టి కచ్చితమైన ఆధారాలతో లోక్‌సత్తా బృందం ఒక నివేదికను తయారు చేసిందని లోక్‌సత్తా ప్రతినిధి ఉప్పలపాటి మాచిరాజు చెప్పారు. ఢిల్లీలో సీఎం దీక్షకు సంఘీభావంగా 11న వేలాది మందితో కవాతు నిర్వహిస్తామని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మం చౌదరి తెలిపారు. 1న ప్రత్యేక హోదా సాధన సమితి నిర్వహించే బంద్‌కు, ఢిల్లీలో సీఎం దీక్షకు సంఘీభావం తెలుపుతున్నట్టు యువజన సంఘాల సమాఖ్య అధ్యక్షుడు ఆడారి కిషోర్ చెప్పారు.



జగన్, పవన్‌తో సీఎం మాట్లాడాలి

రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం ఐక్య ఉద్యమాన్ని నిర్వహించే క్రమంలో ప్రతిపక్షనేత జగన్, జనసేన అధినేత పవన్‌తోనూ సీఎం చంద్రబాబు ఫోన్‌లో మాట్లాడాలి. మేం సమైక్యాంధ్ర ఉద్యమం నిర్వహించినప్పుడు అన్ని పార్టీలు కలిసి వచ్చాయి. ప్రస్తుతం రాజకీయాలే పరమార్థంగా కొన్ని పార్టీలు కేంద్రంపై పోరాటానికి కలిసి రావట్లేదు. అందువల్ల అఖిలపక్ష సమావేశానికి రాకపోయినా ప్రభుత్వ లోపం లేకుండా ఓ వారంలో జగన్, పవన్‌తో సీఎం, మంత్రులు మాట్లాడాలి. వారితో పాటు ఇతర పార్టీల నాయకుల వద్దకు వెళ్లి హోదా, విభజన హామీల సాధనకు కేంద్రంపై పోరాటానికి రావాల్సిందిగా కోరతాం.

- ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్

‘అన్నా’ దీక్ష!

అన్నా హజారే మళ్ళీ నిరాహారదీక్షకు కూర్చున్నారు. ఐదేళ్ళుగా నరేంద్రమోదీ లోక్‌పాల్ ఊసెత్తనందుకు ఆగ్రహిస్తూ, సాధించేవరకూ వెనక్కు తగ్గేది లేదంటూ స్వగ్రామం రాలేగావ్ సిద్ధిలో ఈ ఎనిమిది పదుల వృద్ధుడు దీక్ష బూనారు. లోక్‌పాల్ కోసం హజారే దీక్షలు చేయడం కొత్తేమీ కాదు. కానీ, ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ అవినీతి వ్యతిరేక పోరాటయోధుడు రంగంలోకి దిగడం మోదీ ప్రభుత్వాన్ని ఇబ్బందిలో పడవేసేదే. దీనికితోడు, లోక్‌పాల్ ఉండివుంటే రాఫెల్ కుంభకోణం జరిగేదా? అని ప్రశ్నిస్తున్నారాయన. రాఫెల్‌పై అనుమానాలూ విమర్శలే కాక, ఆధారాలంటూ కొన్ని బయటకు వచ్చిన నేపథ్యంలో, లోక్‌పాల్ ఉంటే కనీసం నిజం నిగ్గుతేలేది కదా అన్నది ఆయన వాదన. రాఫెల్‌తో లోక్‌పాల్‌ను ముడివేసి ఆయన చేస్తున్న ఈ విమర్శలతో, మోదీ ప్రభుత్వం లోక్‌పాల్ ఊసెత్తకపోవడానికి రాఫెల్ విచారణ భయం కారణమని ప్రజలు నమ్మే అవకాశమూ ఉంది. లోక్‌పాల్ విషయంలో సుప్రీంకోర్టు చీవాట్లతో పాటు, అన్నా బైఠాయింపు మోదీ ప్రభుత్వాన్ని మరింత ఇబ్బందుల్లోకి నెట్టింది.

అన్నా దీక్షకు కూర్చున్న గాంధీ వర్ధంతి నాడే ఎనిమిదిమంది సభ్యులతో కూడిన లోక్‌పాల్ సెర్చి కమిటీ కూడా సమావేశమైంది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి రంజన్ ప్రకాశ్ దేశాయ్ నాయకత్వంలోని ఈ కమిటీ ఏర్పడి ఇప్పటికే నాలుగు నెలలైంది. లోక్‌పాల్ చైర్‌పర్సన్‌ను, ఇతర సభ్యులను సూచించవలసిన ఈ కమిటీని విపక్ష కాంగ్రెస్ ప్రమేయం లేకుండానే ప్రభుత్వం నియమించింది. ఫిబ్రవరి నెలాఖరులోగా పేర్లను సూచించే పని పూర్తికావాలని సుప్రీంకోర్టు ఇటీవల డెడ్ లైన్ విధించడంతోనూ, అన్నా దీక్షకు సమాధానంగానూ కమిటీ తొలి సమావేశం జరిగింది. మరిన్ని సమావేశాలు జరిపితే కానీ ఈ కమిటీ ప్రాథమిక జాబితాను తయారుచేయగలిగే అవకాశాలు లేవు. కోర్టు విధించిన గడువులోగా కమిటీ నిజంగానే పనిపూర్తిచేస్తే, ఇది ఇచ్చిన జాబితా నుంచి ప్రధాని నాయకత్వంలోని సెలక్షన్ కమిటీ పేర్లను ఖరారు చేస్తుంది. ప్రభుత్వం తీరు గమనించినప్పుడు రాబోయే రోజుల్లోనూ సుప్రీంకోర్టు ప్రభుత్వాన్ని తరమకతప్పదు. అవినీతి నిర్మూలనకు ఉద్దేశించిన ఒక సంస్థ ఏర్పాటు విషయంలో ప్రభుత్వం ఇలా వ్యవహరించడం శోచనీయం. గత ఎన్నికల్లో కాంగ్రెస్ అవినీతిపై ఉపన్యాసాలు దంచి, తాను అధికారంలోకి రాగానే లోక్‌పాల్ ఏర్పాటు ఖాయమని హామీ ఇచ్చిన మోదీ ఇప్పుడు దానిని ముందుకు కదలనీయకుండా అడ్డుపడుతున్న విధానం ఆశ్చర్యం కలిగిస్తున్నది. 2014 జనవరి 1న లోక్‌పాల్ చట్టానికి రాష్ట్రపతి ఆమోదముద్ర పడితే, ఐదేళ్ళ తరువాత కానీ సెర్చి కమిటీ తొలి సమావేశం జరగలేదు. ఈ కమిటీ ఏర్పాటు కూడా సుప్రీంకోర్టు కన్నెర్రతోనే సాధ్యపడింది. 2017 ఏప్రిల్ నాటి తీర్పును కేంద్ర ప్రభుత్వం ఉల్లంఘించిందంటూ ప్రశాంత్ భూషణ్‌కు చెందిన కామన్ కాజ్ అనే స్వచ్ఛంద సంస్థ పిటిషన్ వేయడంతో ఈ మాత్రం కదలికైనా వచ్చింది. ఏర్పడిన నాలుగునెలలకు కానీ పని ఆరంభం కాకపోవడానికి మౌలిక సదుపాయాల లేమి మరో కారణం. చివరకు కుర్చీలూ, టేబుళ్ళు, ఇతరత్రా సౌకర్యాలన్నీ సమకూర్చమని కోర్టు చెప్పవలసి వచ్చింది. లోక్‌పాల్ నియామకం విషయంలో మోదీ ప్రభుత్వం ఆదినుంచీ మడతపేచీలు పెడుతున్నది. న్యాయస్థానం ముందు వినయాన్ని నటిస్తూనే ఆటంకాలు సృష్టిస్తున్నది. లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గేను సెలక్షన్ కమిటీ సమావేశాలకు ‘ప్రత్యేక ఆహ్వానితుడు’గా పిలుస్తున్నందున ఆయన రానంటున్నారు. తన మాటకు విలువ, ఓటింగ్ హక్కు ఇచ్చే విపక్ష నాయకుడి హోదాలో పిలవమని ఆయన అడుగుతుంటే మోదీ ఒప్పుకోవడం లేదు. ఖర్గేకు లోక్‌సభ స్పీకర్ విపక్ష నాయకుడి గుర్తింపు ఇవ్వలేదని అధికార పక్షం గుర్తుచేస్తున్నది. సీవీసీ, సీబీఐ డైరక్టర్ నియామకాల వరకూ మోదీ ప్రభుత్వం ఖర్గేకు తాత్కాలికంగా విపక్ష హోదా కట్టబెట్టి పని పూర్తిచేసుకుంది. లోక్‌పాల్ విషయానికి వచ్చేసరికి మాత్రం భిన్నమైన వాదనలు చేస్తున్నది. మోదీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనీ, సుప్రీంకోర్టే నేరుగా లోక్‌పాల్‌ను నియమించడం ఉత్తమమని ప్రశాంత్ భూషణ్ ఎప్పటినుంచో కోరుతున్నారు. గతంలో అన్నా ఉద్యమం కాంగ్రెస్ ఓటమికి కారణమైన విషయాన్ని మోదీ ప్రభుత్వం మరిచిపోయినట్టు ఉంది.

జనవాక్యం

మన విజ్ఞానాన్ని గౌరవించే పద్ధతి ఇది కాదు!



ఆంధ్రజ్యోతిలో పి. భాస్కర యోగి వ్యాసం ‘మన మహోన్నత వైజ్ఞానిక వారసత్వం’కు జవాబుగా జనవరి 29న కలపాల బాబూరావు రాసిన ‘మన విశ్వాసాల కోసం సైన్సుపై నిందలా?’ వ్యాసం బాగుంది. భారత శాస్త్రవేత్తలకు, భారతీయ సైన్సు విజ్ఞానంపై గౌరవం లేదనటం సరికాదు. భారత విజ్ఞానాన్ని ముందుకు తీసుకు వెళ్ళటానికి ప్రయత్నిస్తున్న మన శాస్త్రవేత్తలెందరో నాకు తెలుసు. బెంగుళూరులో డా.వివేక్ ఆయుర్వేద దంత చికిత్సమీద చక్కని పని చేస్తున్నారు. ఏ మత్తూ ఇవ్వకుండా, ఒకేసారి నాలుగు దంతాలుతీసి వీడియో చేశారు. ఆంటీ బయోటిక్స్ వాడకుండా, డయాబెటిస్ ఉన్నవారికి కూడా ఇలా తియ్యవచ్చని నిరూపించారు. ఈ విషయాన్ని 2018లో సైంటిఫిక్ జర్నల్‌లో ప్రచురించారు. అలాగే ఆయుర్వేదంపై డా.శివానందయ్య 2010లో ఒక అద్భుతమైన సైంటిఫిక్ పేపర్ ప్రచురించారు. స్త్రీ గర్భాశయ భ్రంశము (uterine prolapse)ను 34 స్టేజిలలో కూడా, శస్త్ర చికిత్స లేకుండా లజ్జాలు (అత్తిపత్తి – టచ్ మీ నాట్) మొక్కని ఉపయోగించి 40 రోజులలో తగ్గించారు. రోగి పరిస్థితిని ట్రీట్మెంట్‌కు ముందూ, తర్వాత ఆల్ట్రాసౌండ్ స్కానింగ్ చేయించారు. ఆ స్కాన్‌ను వివరాలతో సహా ప్రచురించారు. ఇవీ భారత విజ్ఞానానికి సిసలైన సేవలు. కాకమ్మ కబుర్లు చెప్పి ప్రజలలో మూర్ఖత్వం పెంచడం సరి కాదు. మగ నెమలి కన్నీరు తాగితే ఆడ నెమలికి పిల్లలు పుడతాయని, ఆ రోజుల్లోనే విమానాలు ఉండేవనీ పిచ్చి మాటలు చెబితే సరిపోదు. భరద్వాజ మహర్షి రచనను హిందూస్తాన్ ఏరోనాటికల్ లాబరేటరీ, బెంగళూరులో నిరూపిస్తే ప్రపంచం మెచ్చుకుంటుంది. మనల్ని గౌరవిస్తుంది. లేకపోతే వెర్రివాళ్ళు అనుకుని దూరంగా నిలబడుతుంది.

– డా. ఎమ్. బాపూజీ, రిటైర్డ్ సి.ఎస్.ఐ.ఆర్ సైంటిస్ట్

విభిన్న ‘ద్విజుడు’

కంచ ఐలయ్య మొదటి పుస్తకం ‘వై ఐ యామ్ నాట్ ఏ హిందూ’ (1996) దేశంలోను, విదేశాలలోను గొప్ప ప్రభావం కల్గించింది. ఇటీవల విడుదలయిన ఆయన ఆత్మకథ ‘ఫ్రమ్ ఏ షెపర్డ్ బాయ్ టు ఏన్ ఇంటెలెక్చువల్’ను ఆసక్తిగా చదివాను. సాధారణంగా ఆత్మస్తుతికి పాల్పడే ఇతర ఆత్మకథల వలే కాకుండా ఐలయ్య స్వీయ చరిత్ర భిన్నమైనది. కొత్త ఆలోచనలకు మనలను పురిగొల్పుతుంది.

ఐలయ్య షెపర్డ్ జ్ఞాపకాలు– వరంగల్ జిల్లా లోని కుగ్రామమైన పాపయ్య పేట్‌లో బాల్య జీవితం నుంచి ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆలంబనతో మేధావిగా ఎదిగే దాకా ఆయన జీవన ప్రస్థానం సాగిన శూద్ర/ ఓబీసీ జీవితావరణాలలోకి మనలను తీసుకువెళ్ళుతాయి. ఆనాటి గ్రామీణ జీవితాన్ని ఐలయ్య ఆత్మకథ విపులంగా వివరించింది. నిసర్గ, నిష్కపట బతుకుల సంతోష సౌందర్యాల స్మృతులవి. గొర్రెలు, బర్రెలను మేతకై పొలాలకు తీసుకు తీసుకువెళ్ళే సమయంలో తన ఆటపాటలు, ఆ మూగజీవాల విసర్జితాలను తాను ఎలా ఆఘ్రాణించిందీ ఆయన వివరించారు. ఆ పశువులు సాగుతూ వుంటే రేగిన దుమ్ము ధూళిని తాను ఎలా పీల్చిందీ, బర్రెలపై ఎలా స్వారీ చేసిందీ, వాగులు వంకలలో తాను ఎలా జలకాలాటలు ఆడిందీ ఐలయ్య వర్ణించారు.

నవమాసాలు గర్భంలో మోసిన బిడ్డను ఈ లోకంలోకి తీసుకు వచ్చే వేళ ఒక గొర్రె లోనైన బాధాకర ప్రయాసలను తొలగించడంలో ఆ మూగ జీవానికి తన తండ్రి అందించిన సహాయాన్ని తాను ఎలా వీక్షించింది మన పుస్తక రచయిత చెప్పారు. ప్రపంచంలో మొట్టమొదటి



మనకు తెలిసిన కంచ ఐలయ్య ఎప్పుడు పుట్టారు? మాతృమూర్తి కట్టమ్మ గర్భం నుంచి బయటకు వచ్చిన రోజు కాదు. తనకు సాష్టాంగ నమస్కారం చేయమని బ్రాహ్మణ పూజారి జారీ చేసిన ఆదేశాన్ని ఎదిరించి, సవాల్ చేసిన రోజున కంచ ఐలయ్య జన్మించారు. అప్పుడు ఆయన 9వ తరగతి చదువుతున్నారు.

పశు వైద్యుడు గోపాలుడేననడంలో ఎటువంటి సందేహం లేదు.

ప్రతి సాయంత్రమూ పురుషులు కల్లు సేవనంతో పొందే ఆనందోత్సాహాలను కూడా ఐలయ్య అభివర్ణించారు. ఒకవేళ అనారోగ్యగ్రస్తురాలైన భార్య వద్దనే ఉండిపోయి, కల్లు సేవనం ఉల్లాసాన్ని కోల్పోవలసివస్తే ఆ సురాపాన ప్రియులు ఎటువంటి అసహనానికి లోనవుతారో కూడా ఆయన పేర్కొన్నారు. సరే, మన రచయిత కల్లు సేవనానికై సదా తన తండ్రితో కలిసి వెళ్ళేవారు. ఈ జీవితానందం వెంబడే అచంచల మూఢ విశ్వాసాలూ, కఠోర ఆచారాలూ వుండేవి. ఆనాటివారు అనూచానంగా వస్తున్న ఆ మూఢ విశ్వాసాలను ఎటువంటి పరిస్థితులలోనూ త్యజించేవారు కాదు; కష్ట నష్టాలు ఎంతగా ఎదురైనా ఆచారపరాయణతను విడనాడేవారు కాదు.

బాల ఐలయ్య బడి బాలుడు కూడా. ఒక శూద్ర పిల్లడు చదువుకోవడమా? అటువంటి బుడతలను సరస్వతీ దేవి తప్పక శిక్షిస్తుందని తన విద్యాభ్యాసం మూలంగా ఐలయ్య చాలా నిందలు పడ్డారు. పైగా బాల్య వివాహాన్ని అంగీకరించనందుకు చాలా సంవత్సరాల పాటు హేళనకు గురయ్యారు. శూద్రబాలుడై వుండి చదువుకోవడమూ, బాల్యంలోనే పెళ్ళి చేసుకోకుండా ఆచారాన్ని ఉల్లంఘించిన కారణంగా సరస్వతీ దేవి ఆగ్రహించిందని, తత్కారణంగానే ఐలయ్య తల్లి మరణించిందని గ్రామస్తులు విశ్వసించారు. ఈ విషాదానికి బాల ఐలయ్యే బాధ్యుడని ఆరోపించారు. ఈ సామాజిక ప్రతిబంధకాలకు ఐలయ్య కృంగిపోలేదు. మరింతగా కృతనిశ్చయుడయ్యాడు. దృఢ సంకల్పంతో ఆ అవరోధాలన్నిటినీ ఆయన అధిగమించారు. తనను తాను కంచ ఐలయ్య షెపర్డ్‌గా రూపొందించుకున్నారు

ఐలయ్యకు అమిత ఆవేదన కలిగించిన మూడో అంశం ఆయన సొంత నామధేయమే. స్థానిక వేలుపు ఐలోని మల్లన్న పట్ల భక్తితో ఐలయ్య తల్లిదండ్రులు తమ బిడ్డకు తమ నిత్య ఆరాధ్యుని పేరు పెట్టారు. ఐలోని మల్లన్న శూద్ర దేవుడు. శూద్రులు మాత్రమే కొలిచే దేవుడు. శివ, విష్ణు, రామ, కృష్ణ మొదలైన హిందూ దేవుళ్ళ, శర్మ, శాస్త్రి, రెడ్డి, రావు మొదలైన హిందూ వ్యక్తుల పేర్లు చాలా గౌరవనీయంగా ఉంటాయి. తన శూద్ర నామ ధేయం ఐలయ్యకు కళాశాల, విశ్వవిద్యాలయంలో తీవ్ర ఇబ్బందులకు కారణమయింది. శూద్ర కులాలకు చెందిన పలువురు విద్యార్థులు తమ పేర్లను శూద్రేతర నామధేయాలుగా మార్చుకోవడాన్ని ఆయన గమనించారు. అయితే ఐలయ్య అలా చేయలేదు. తన శూద్ర నామధేయాన్ని గర్వంగా కొనసాగించారు.

ఐలయ్య జీవిత కథ ఒక ఆఫ్రికన్–అమెరికన్ ఆత్మకథను గుర్తుకు తెస్తుంది. ఎలెక్స్ హేలీ ఆ ఆఫ్రికన్–అమెరికన్. 1976లో ఆయన ఆత్మకథ ‘రూట్స్’ ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆఫ్రికన్–అమెరికన్ల సమస్యలపై ప్రపంచ ప్రజలకు మెరుగైన అవగాహనను కల్గించి, ప్రపంచవ్యాప్తంగా అణగారిన వర్గాల ప్రజలకు స్ఫూర్తినిచ్చిన పుస్తకమది.

మనకు తెలిసిన కంచ ఐలయ్య ఎప్పుడు పుట్టారు? మాతృమూర్తి కట్టమ్మ గర్భం నుంచి బయటకువచ్చిన రోజు కాదు సుమా! తనకు సాగిలపడమని, నీ తలను నా కాళ్ళ వద్ద పెట్టి మొక్కమని బ్రాహ్మణ పూజారి జారీ చేసిన ఆదేశాన్ని ఎదిరించి, సవాల్ చేసిన రోజున మన కంచ ఐలయ్య జన్మించారు. అప్పుడు ఆయన 9వ తరగతి చదువుతున్నారు. తల్లి కట్టమ్మకు అంత్యక్రియలు నిర్వహించిన రోజు అది. పూజారితోపాటు బంధువులందరూ ఐలయ్యను పురోహితునికి సాష్టాంగ నమస్కారం చేయమని ఒత్తిడి చేశారు. నీవలా చేయనిపక్షంలో నీ తల్లికి స్వర్గంలో ప్రవేశం లభించదని బెదిరించారు. అయినా ఐలయ్య తన నిర్ణయానికే దృఢంగా కట్టుబడి వున్నారు. అటువంటి మర్యాదలు పూర్తిగా నిర్హేతుకమైనవని, అర్థం లేనివని ఆయన ఆ చిన్న వయస్సులోనే విశ్వసించారు. ఈ వ్యక్తిగత అంశాలను అలావుంచి, ఆయన తాత్విక దృక్పథం, భావజాలం (ఐలయ్యను సుప్రసిద్ధుడిని చేసిన విషయాలు)ను చూద్దాం.

ప్రప్రథమంగా పేర్కొనవలసింది ఆంగ్ల భాష పట్ల ఐలయ్య ప్రగాఢ ప్రేమ. ఆ భాష ఆయన వ్యక్తిగత సాధికారతకు ఒక సాధనమయింది. ఉన్నత విద్యాభ్యాసానికై ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ప్రవేశించిన తరువాత ఆ సాధనాన్ని, సహచర దళిత, ఓబీసీ విద్యార్థినీ విద్యార్థుల ఉన్నతికి, కులరక్కసిపై పోరుకు ఒక ఆయుధంగా ఆయన మార్చివేశారు.

కన్న ఊరులో పోలీస్ పటేల్ (ఐలయ్య తల్లిని నానా బాధలకు గురి చేశాడు) మొదలు వరంగల్ జిల్లాలోని ప్రతి గ్రామమూ భూస్వాముల పదఘట్టనల కింద నలిగిపోయిన రోజులవి. భూస్వాములు, దాదాపుగా మినహాయింపు లేకుండా, అందరూ దురహంకారులు, దోపిడీదారులు, దయారహితులు. భూమిలేని నిరుపేదలు అనివార్యంగా వారికి కట్టు బానిసలే. చిన్నకారు, సన్నకారు రైతులు భూస్వాముల దయాదాక్షిణ్యాలపై ఆధారపడక తప్పని పరిస్థితి. పేదలను బానిసలుగా పనిచేయించుకుంటూ వారికి కనీసం తిండి కూడా పెట్టని దుర్మార్గ భూస్వామ్యమది. ఇటువంటి అమానుష పరిస్థితులు, సామాజిక ప్రతిబంధకాలను ఎదుర్కొంటూ కళాశాలలో చదువుకొంటున్న రోజుల్లో దళిత అధికారి ఒకరు వరంగల్ జిల్లా కలెక్టర్‌గా వచ్చారని ఐలయ్య విన్నారు. పేదల పక్షాన నిలబడి భూస్వాముల ఆగడాలను అరికట్టడానికి ఆ కలెక్టర్ కృషి చేశాడు. ఒకసారి కళాశాల కార్యక్రమం ఒకదానిలో ఆ కలెక్టర్ పాల్గొన్నాడు. ఆ ఐఏఎస్ అధికారి అనర్గళంగా ఆంగ్లంలో ప్రసంగించడాన్ని ఐలయ్య విన్నాడు. ఆ ప్రసంగం విన్న వెన్వెంటనే భూస్వాములపై ఆ దళిత అధికారి ఆధిక్యతకు ఆయన ఆంగ్ల భాషా ప్రావీణ్యమే కారణమని ఐలయ్య అర్థం చేసుకున్నారు.

ఆధునిక జీవిత స్వేచ్ఛకు దోహదం చేసేదేమిటో తెలుసుకున్న ఐలయ్య కార్ల్ మార్క్స్, ఫ్రెడరిఖ్ ఏంగెల్స్ ల ‘కమ్యూనిస్ట్ మానిఫెస్టో’ అధ్యయనానికి ఉపక్రమించారు. ఆ మానిఫెస్టో ఉద్ఘోషించిన విప్లవ తాత్వికత కంటే అందులోని ఇంగ్లీష్ భాషే ఐలయ్యను విశేషంగా ఆకట్టుకొంది. పూజారిపై తిరుగుబాటు అనంతరం దళిత కలెక్టర్ ప్రసంగాన్ని వినడం, మార్క్స్ మానిఫెస్టోను చదవడం ఐలయ్య జీవితంలో ప్రధాన ప్రభావశీల ఘటనలుగా నిలిచిపోయాయి. ఆయన మాటల్లోనే చెప్పాలంటే ‘దళిత కలెక్టర్ మాధవరావు నాకు ఒక జీవిత ధ్యేయన్ని కల్పించగా జర్మన్ రచయిత మార్క్స్ నాకు దిశా నిర్దేశం చేశాడు’.

తాను కార్యకర్తగా ఉన్న సిపిఐ (ఎమ్ఎల్) తరిమెల నాగిరెడ్డి గ్రూపు మొదలైన విప్లవ కమ్యూనిస్టు సంస్థలు, పౌర హక్కుల సంఘాలలోనూ బ్రాహ్మణిజం పెత్తనం సాగుతుందనే వాస్తవాన్ని తెలుసుకోవడం ఐలయ్య జీవితంలో మూడో మలుపునకు కారణమయింది. గ్రామీణ, వెనుకపడిన సామాజిక నేపథ్యం ఐలయ్యను ఉస్మానియా వర్సిటీలో వామపక్ష విద్యార్థి సంఘాల వైపు ఆకర్షితుడిని చేసాయి. ఆ సంఘాల చర్చలు, కార్యకలాపాలలో ఆయన చురుగ్గా పాల్గొనేవారు. అయితే తన విప్లవ సహచరులు కుల వ్యవస్థ అమానుషాలపై మౌనం వహించడం, బాధితుల సమస్యలపై ఉదాసీనత చూపడం ఆయన్ని తీవ్రంగా కలచివేశాయి. వర్గ పోరాటం గురించే మాట్లాడుతూ కుల పరమైన వైరుధ్యాలను గుర్తించడంలో వామపక్షాల బుద్ధిజీవుల వైఫల్యం గురించి ఐలయ్య సుదీర్ఘంగా రాశారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఒక అధ్యాపక పోస్టునకు ఇంటర్వ్యూకు పిలవడానికి సైతం తనకు అవకాశాన్ని నిరాకరించారని ఐలయ్య రాశారు. ఇందుకు వీరే బాధ్యులు కావచ్చంటూ కొంతమంది పేర్లను కూడా ఆయన ప్రస్తావించారు. ఇందులోని నిజానిజాలేమిటో వారికి తెలియాలి. అయితే ఒక విషయాన్ని నిశ్చితంగా చెప్పవచ్చు. ఐలయ్య ఆ విశ్వవిద్యాలయంలో చేరివుంటే అక్కడ ఒక రోహిత్, ఒక ప్రశాంత్, ఒక మున్నా కంటే ఎక్కువ మంది రోహిత్‌లు, ప్రశాంత్‌లు, మున్నాలు ఉండేవారు. బహుజన విద్యార్థులు, పరిశోధకులను ప్రోత్సహిస్తూ వారికి అండగా నిలవాలని ఆయన తన సహచర అధ్యాపకులను తప్పక ప్రేరేపించేవారు.

ఐలయ్య పుట్టుకతోనే పోరాట యోధుడు. లక్ష్యపరిపూర్తికి వామపక్ష మార్గాన్ని ఆయన ఎంచుకున్నారు. అయితే అది ఆయన్ని ఎంతో దూరం తీసుకువెళ్ళలేదు. వామపక్షీయులు (మితవాద, అతివాద, తీవ్రవాద) కులవ్యవస్థ అమానుషాలపై మౌనం వహిస్తూ, బాధితులకు న్యాయం చేకూర్చడానికి పనిచేయకపోవడమనే వాస్తవాన్ని ఐలయ్య శూద్ర, గ్రామీణ నేపథ్యం సహించలేకపోయింది. అణగారిన వర్గాల వారికి న్యాయాన్ని సాధించేందుకై కులవ్యవస్థ అన్యాయాలను ఎదిరించిన మహాత్మా పూలే, రామస్వామి నాయకర్, నారాయణ గురు, బాబాసాహెబ్ అంబేడ్కర్ దార్శనికతా కార్యాచరణల స్ఫూర్తితో ఐలయ్య కొత్త ప్రస్థానాన్ని ప్రారంభించారు. పూలే, నాయకర్, గురు, అంబేడ్కర్ల మానవీయ, పోరాట వారసత్వాన్ని కాలానుగుణంగా మరింత ముందుకు తీసుకు వెళ్ళాలని ఐలయ్య నిర్ణయించుకున్నారు.

కులాన్ని సంపూర్ణంగా తిరస్కరించింది బౌద్ధం మాత్రమేనని ఐలయ్య తెలుసుకున్నారు. బౌద్ధాన్ని ఆయన లోతుగా, విస్తృతంగా అధ్యయనం చేశారు. హిందూ కుల వ్యవస్థను సవాల్ చేయగల రాజకీయ దార్శనికుడు బుద్ధుడు అని ఆయన అర్థం చేసుకున్నారు. బౌద్ధం స్ఫూర్తితో తాను ప్రయోజనకరంగా కులవ్యవస్థను సవాల్ చేయాలంటే తాను ఒక మేధావిగా, ఒక వక్తగా, ఒక రచయితగా రూపొందితీరాలి. ఐఏఎస్ అధికారి కావడం కంటే ఒక మేధావిగా రూపొందడమే అన్నివిధాల ఆదర్శప్రాయమని ఆయన భావించారు.

హిందూ దేవుళ్ళ బొమ్మలు, ప్రతిమలు సదా మారణాయుధాలతో కన్పించడం గురించి ఐలయ్య నిశితంగా ఆలోచించారు. అటువంటి సాయుధ దేవుళ్ళను శూన్యహస్తాలతో పోరాడటం అసాధ్యం. పూలే, అంబేడ్కర్ల తరపున పోరాట యోధుడు కావడానికి ఐలయ్య నిర్ణయించుకున్నారు. త్రిశూల్ ఆచరణలోకి తెచ్చిన కుల వ్యవస్థపై పోరాడేందుకు తన ఆయుధంగా ఆంగ్ల భాషను చేపట్టాలని ఆయన నిర్ణయించుకున్నారు. ఒక ఆగ్రహ పూలే, ఒక ఆగ్రహ అంబేడ్కర్ ఒక ఆగ్రహ బుద్ధుడు పాత్ర వహించి, ఆ మహనీయుల మహోన్నత కృషిని ముందుకు తీసుకువెళ్ళడమే తన విద్యుక్త ధర్మంగా ఐలయ్య ఔదల దాల్చారు. కుల వ్యవస్థను నిర్మూలించేందుకు, దళితుల, బహుజనుల ఆర్థిక సాధికారతకు, రాజకీయ అధికార సాధనకు ఆంగ్ల భాషలో ప్రావీణ్యం సాధించడమే మాస్టర్ కీ అని ఐలయ్య సరిగానే విశ్వసించారు. ఆంగ్ల భాష ఆయన భావావేశం; లక్ష్య సాధనకు ఆయన ఆయుధం. ‘ఇంగ్లీష్ చదువు, ఇంగ్లీష్ మాట్లాడు, ఇంగ్లీష్‌లో రాయి’ అనేవి ఆయన నినాదాలు; ఆయన పూనుకున్న బృహత్కార్యాలు. ఐలయ్య ఆత్మకథ, భారతీయ శూద్రులలో మేధో తిరుగుబాటుదారుగా సుప్రసిద్ధుడైన ఒక సామాజిక చింతకుని జీవిత గాథ. మరి భారత జనాభాలో శూద్రులు అరవై శాతానికి పైగా ఉన్నారు.

■ కాకి మాధవరావు
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి

‘సిరివెన్నెల’లో విధాత భావాల అనుభూతి



వ్యక్తిత్వ వికాసం... ఈ మధ్య తరచూ వినిపిస్తున్న మాట. వక్తిత్వాన్ని వికసింపజేసుకోవాలంటే ఏం చేయాలి? వైవిధ్యంగా ఆలోచించాలి. నలుగురినీ కలుపుకొని పోవాలి. సమయపాలన కీలకం. చెరగని చిరునవ్వు అత్యంత ప్రధానం. మొక్కవోని ధైర్యం, మొండిపట్టుదలా అవసరం. ఇంకా... ఇంకా.. ఇలాంటివెన్నెన్నో. ‘సిరివెన్నెల’ను ఇంటిపేరుగా మార్చుకున్న చేంబోలు సీతారామశాస్త్రి పాటలు వినేవారికి వీటి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఆయన పాటల్లో ఇవన్నీ ఎక్కడో ఒక చోట ధ్వనిస్తూనే ఉంటాయి.

ఆయన కుటుంబం జగమంతది. ఆయన భావాలు విశ్వమంతా వ్యాపించి ఉంటాయి. ఇన్నీ తెలిసిన ఆయనే జీవితాన్ని తేలిగ్గా తీసుకోవద్దంటారు. ఆయన కూడా తేలిగ్గా తీసుకోలేదు. చిన్నతనంలో పెద్దలు ‘బయటికి వెళ్లి ఆడుకో’ అంటే.. ‘నేనిక్కడే ఉంటాను. ఇంకా చెప్పండి. ఇంకా వింటాను. ఇంకా చాలా తెలుసుకోవాలని ఉంది’ అని తన విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి తహతహలాడేవారు. జీవితం పట్ల అంత నిర్దిష్టమైన అభిప్రాయం ఉన్న వ్యక్తి కావడం వల్లనే జీవితమంటే ఆట (‘ఆట’ చిత్రంలోని ‘ఆట ఆట...’ పాటలో) కాదంటారు. గెలవక తప్పదని మెత్తగా హెచ్చరిస్తారు. ఆ మాట విని ఎక్కడ బెంబేలెత్తుతామోనని... గుండెల్లో నమ్మకం ఉన్నవారికి బెరుకు అక్కర్లేదని వెంటనే ధైర్యం చెబుతారు. సంకల్పం తోడుంటే అల్లావుద్దీన్ అద్భుత దీపాలతో అస్సలు పనే లేదని అంటారు. అంతేనా..? వ్యక్తిత్వ వికాసాల్లో పదే పదే చెప్పే ‘ముందస్తు ప్రణాళిక’ గురించి ప్రస్తావించడాన్నీ ఆయన మరువలేదు.

‘ముందుగా తెలుసుకో మునిగే లోతెంతో
సరదాగా సాగదు బేటా నట్టేట ఎదురీత
తెలివిగా మలచుకో నడిచే దారంతా

పులిమీద స్వారీ కూడా అలవాటు అయిపోదా’ అని మార్గదర్శకుడిలా సూచిస్తారు. సాధించిన వారిని చూసి జనాలు జేజేలు పలుకుతారని, అభిమానులవుతారని చెప్పి భవిష్యత్తు మీద తీయటి ఆశలు రేకెత్తిస్తారు. ‘పది ఫైర్లు వేసి నేల మీద పదకొండో ఫైరు వేసినప్పుడు పెద్దగా దిగుబడి రాకపోవచ్చు. కానీ సారవంతమైన నేలమీద తొలిసారి చల్లే గింజలు తప్పక మంచి ఫలితాన్నిస్తాయి’ అని నమ్మే వ్యక్తి సీతారామశాస్త్రి. ఆయనకు యువత అంటే ఇష్టం. భావితరాలకు మన విలువలను అందించాల్సిన యువతకు నాలుగు మంచి విషయాలను చెప్పడానికి ఆయన ఎప్పుడూ ముందుంటారు. అందుకే నలుగురు నడిచిన దారిలో నడిస్తే ప్రయోజనం లేదని యువతను జాగృతపరిచారు. కొత్త బాటను కనుక్కోమని చెప్పారు. ‘అంకురం’లోని–

‘ఎవరో ఒకరు ఎపుడో అపుడు/ నడవరా ముందుకు అటో ఇటో ఎటో వైపు

మొదటివాడు ఎప్పుడూ ఒక్కడే మరి/ మొదటి అడుగు ఎప్పుడూ ఒంటరే మరి

వెనకవచ్చు వాళ్లకు బాట అయినది..’ పంక్తులు అలాంటివే.

ఆయన చెప్పింది అంతా విని కూడా ఎవరైనా సోమరితనంగా ఉంటూ తామేదో కష్టాల్లో ఉన్నామని పదే పదే చెబుతుంటే ఊకొడుతూ ఊరుకోవడం ఆయన నైజం కాదు. అలాంటి వారికి కూడా అర్థమయ్యే తీరులో సుతిమెత్తగా–

‘పనేం తోచక పరేషానుగా గడబిడపడకు అలా.../ సరే చాలిక అలా జాలిగ తికమకపడితె ఎలా!

ఎక్కిళ్లే పెట్టి ఏడుస్తుంటే కష్టం పోతుందా./ కదా.. మరెందుకు గోలా

అయ్యొయ్యో పాపం అంటే ఏదో లాభం వస్తుందా../ వృథా ప్రయాసలేలా’ అని తమ ఇంట్లో మనవరాలిని బుజ్జగించి చెప్పినట్టు చెబుతారు. అలా చెప్పి, అంతటితో వదిలేస్తారనుకుంటే మనం పొరపడ్డట్టే. వారి జీవన గమనాన్ని పరిశీలిస్తారు. ఆఫీసుల్లోనూ, పొరుగిళ్లవాళ్లతోనూ చీటికీ మాటికీ గొడవపడేవారిని ఉద్దేశించి ‘ఎండకూ వానకూ సర్దుకుని పోయే మనస్తత్వం ఉన్న మనిషికి... సాటి మనుషులతో మాత్రం సాగనని ఎందుకు పంతం?’ అని ఇంటిపెద్ద స్థానంలో నిలుచుని మందలిస్తారు. కలిసి ఉంటే కలదు సుఖం అని గుర్తుచేస్తారు. గమ్యం చేరాలన్న ఉరుకులాటలో ఒత్తిడి నెత్తికెత్తుకోవద్దని, అందుకు ప్రత్యామ్నాయంగా గమనాన్నే గమ్యంగా భావించమని గురువులా సలహా ఇస్తారు. ప్రతి విషయాన్ని నిలిచి నిదానంగా ఆలోచించమని, లోతుగా విశ్లేషించమనీ సూచిస్తారు.

‘ఎంతవరకు ఎందుకొరకు ఇంత పరుగు అని అడక్కు/ గమనమే నీ గమ్యమైతే బాటలోనే బతుకు దొరుకు/ ప్రశ్నలోనే బదులు ఉందే గుర్తుపట్టే గుండెనడుగు/ ప్రపంచం నీలో ఉన్నదని చెప్పేదాక ఆ నిజం తెలుసుకోవా/ తెలిస్తే ప్రతిచోట నిను నువే కలుసుకుని పలకరించుకోవా’ అని ‘గమ్యం’లో వినిపించే పంక్తులు ఆ కోవలోవే.

సీతారామశాస్త్రి రూపం గుర్తుచేసుకున్నవారికి ఎవరికైనా మొదట గుర్తుకొచ్చే విషయం ఆయన నుదుట విభూతి మధ్య పెట్టుకున్న బొట్టు. పెదాలపై చెరగని నవ్వు. నలుగురూ నవ్వుతుంటే చూడటం ఆయనకిష్టం. వంద సమస్యలకు సమాధానం ఒక్క చిరునవ్వు అని నమ్మే వ్యక్తి ఆయన. ‘సిరివెన్నెల ఎక్కడుంటే అక్కడ నవ్వులు పూయాల్సిందే’ అని ఆయన్ని బాగా ఎరిగిన వారు చెప్పే మాట. ‘చక్రం’లో హోలీ పాటలో–

‘పంచాంగం చెబితేగానీ పండుగ రానందా

సంతోషంగా గడపడానికీ సుముహూర్తం ఉంటుందా?’ అనే పంక్తులు ఆయన ఆలోచనా తీరుకు అద్దంపడుతాయి. ‘సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు’ చిత్రంలోనూ–

‘చెమటలేం చిందించాలా శ్రమపడీ పండించాలా?

పెదవిపై చిగురించేలా చిరునవ్వులూ..’ అని వ్యంగ్యాస్త్రాలను వదిలారు సీతారామశాస్త్రి. ‘అంకురం’లోని ‘ఎవరో ఒకరు’ పాటలోనూ నవ్వు ప్రస్తావన ఉంది.

‘పెదవి ప్రమిద నిలపనీ నవ్వు జ్యోతినీ
రెప్ప వెనుక ఆపనీ కంటి నీటినీ
సాగలేక ఆగితే దారి తరుగునా
జాలి చూపి తీరమే దరికి చేరునా’ అనే పంక్తులు అందులోనివే. నిస్సత్తువ ఆవహించినా సరే చిరునవ్వులతో కష్టాలసాగరాన్ని ఈదగలగాలని అంటారు సిరివెన్నెల.

సిరివెన్నెల సీతారామశాస్త్రికి నిశిత పరిశీలన ఎక్కువ. ఆయన ఆలోచనల్లో పంచభూతాలూ ఉంటాయి. పశు, పక్షాది విషయాలూ ఉంటాయి. అందుకే నిత్య జీవితంలో ఆయన స్ఫూర్తి పొందే అంశాలన్నీ... పదాల వెంట కాకుండా భావాల వెంట పరుగులు తీసే ఆయన పాటలోనూ ప్రతిబింబిస్తుంటాయి. ‘ఎప్పుడూ ఒప్పుకోవద్దురా ఓటమి, ఎప్పుడూ వదులుకోవద్దురా ఓరిమి’ (పట్టుదల) అంటూ చాలా గట్టి విషయాన్ని, గంభీరంగా చెప్పేటప్పుడు కూడా ఆయన రివ్వుమన్న గువ్వపిల్లను, ఈదుతున్న చేపపిల్లలను, మిణుగురులను ఉదాహరణలుగా చూపించారు.

‘నింగి ఎంత గొప్పదైనా రివ్వుమన్న గువ్వపిల్ల రెక్క ముందు చిన్నదేనురా
సంద్రమెంత పెద్దదైనా ఈదుతున్న చేపపిల్ల మొప్ప ముందు చిన్నదేనురా’ అన్న పంక్తులు అందుకు నిదర్శనాలు. ‘మీరు చెప్పేవన్నీ వినాలనిపిస్తాయి. వింటున్నకొద్దీ బావుంటాయి. కానీ మా సమస్యలు మీకు అర్థం కావు. మా ప్రశ్నలకు సమాధానం ఎక్కడ దొరుకుతుంది?’ అని మనసులోనే తటపటాయించే వారి కోసమే ‘కొత్తబంగారులోకం’లో–

‘నీ ప్రశ్నలు నీవే ఎవ్వరూ బదులివ్వరుగా / నీ చిక్కులు నీవే ఎవ్వరూ విడిపించరుగా
ఏ గాలో నిన్ను తరుముతుంటే అల్లరిగా
ఆగాలో లేదో తెలియదంటే చెల్లదుగా’ అని గట్టి సమాధానమే ఇస్తారు. అంతే కాదు లక్ష్యం దిశగా అడుగులు వేసేటప్పుడు–

‘విశ్రమించవద్దు ఏ క్షణం / విస్మరించవద్దు నిర్ణయం
అప్పుడే నీ జయం నిశ్చయంరా’ (పట్టుదల) అని అంటారు. సమయపాలనంటే సిరివెన్నెలకు ఎంతో ఇష్టం. ఆయన సెకనుల ముల్లుతో పోటీపడుతుంటారు. అందుకే ‘కొత్త బంగారు లోకం’లో ‘నీ ప్రశ్నలు నీవే’ పాటలో–

‘పొరపాటున చెయిజారిన తరుణం తిరిగొస్తుందా
ప్రతిపూటొక పుటగా తన పాఠం వివరిస్తుందా’ అని కాలం విలువ చెబుతారు. కష్టపడనిదే ఫలితం రాదని, గెలుపు తలుపు తీయడానికి దగ్గరి దారులుండవని ఆయన నమ్మకం. “నొప్పిని, నిత్యం జరిగే సంఘర్షణను మనం గుర్తించాలి. అవే లేకుంటే హాయి విలువ మనకు ఎలా తెలుస్తుంది? తల్లి ప్రసవించేటప్పుడు నొప్పులు పడుతుంది. తల్లి గర్భంలో ఉన్న బిడ్డ కూడా బయటకు రావడానికి నొప్పులు భరిస్తాడు. అప్పుడే అతను ఈ లోకంలో వెలుగులు చూడగలడు. ఈ విషయాన్నే నేను–

సిరివెన్నెల సీతారామ శాస్త్రి పాట పదాల వెంట కాకుండా, భావాల వెంట పరుగులు తీస్తుంది. ఆయన భావాల వంతెన మీద నడిస్తే ఎలాంటి ఉధృతమైన వాగులనైనా సులభంగా దాటగలం. ఎందుకంటే ఆయన పాట అనుభవసారం. విధాత తలపున ప్రభవించిన అనాది జీవనరాగాల తాలూకు భావాల అనుభూతిని సీతారామ శాస్త్రి కవితీకరించారు.

‘నొప్పిలేని నిమిషమేది జననమైనా మరణమైనా జీవితాన అడుగు అడుగునా
నీరసించి నిలిచిపోతే నిమిషమైన నీది కాదు బ్రతుకు అంటే నిత్య ఘర్షణ
దేహముంది ప్రాణముంది నెత్తురుంది సత్తువుంది ఇంతకన్న సైన్యముండునా
ఆశ నీకు అస్త్రమౌను, శ్వాస నీకు శస్త్రమౌను దీక్షకన్న సారథెవరురా
నిరంతరం ప్రయత్నమున్నదా నిరాశకే నిరాశ పుట్టదా’ అని ‘పట్టుదల’ చిత్రంలోని పాటలో చెప్పాను” అని అంటారు సీతారామశాస్త్రి. జాగ్రత్తగా గమనించాలే కానీ ఆయన ప్రతి పాటా ఓ వజ్రాయుధమే. ఆయన భావాల వంతెన మీద నడిస్తే ఎలాంటి ఉధృతమైన వాగులనైనా సులభంగా దాటగలం. ఎందుకంటే ఆయన పాట అనుభవసారం. అందులోనూ ఇష్టపడి రాసుకున్నది కనుక. ఆయన ఇష్టాలు వ్యక్తిత్వ వికాసాలకు మాత్రమే చిరునామాలు అనుకుంటే పొరపాటు.

అవి అనంతాలు. ఆయనకు మండే అగ్నిగోళం ఇష్టం. సిరివెన్నెలా ఇష్టం. అందుకే పూలరెక్కల్ని, తేనె చుక్కల్ని కలిపి ప్రణయగీతాలాపన చేయగలరు. అర్థశతాబ్దపు అజ్ఞానాన్నే స్వతంత్రమనాలా? అని ప్రశ్నించగలరు. సమాజాన్ని నిగ్గదీసి అడగలగలరు. నిప్పుతోటి కడగగలరు. ‘నిను చూసిన క్షణంలో, నను తాకిన అలల్లో చెయి జారిన మనస్సు ఏమైందో’ అని చిలిపి ఊహలకు తెరతీయగలరు. ఆదిభిక్షువు వాడిని ఏమి అడిగేది? అని అమాయకంగా ప్రశ్నించగలరు. విధాత తలపున ప్రభవించిన అనాది జీవనరాగాల తాలూకు భావాలను తన కలంతో పలికించగలరు. ఆయనే రాసినట్టు ‘ఇంతకీ నువ్వు ఒకడివా వందవా’ అంటే ఆయన ఒక్కరే. కానీ ఆయన తోటలో పాటల పుష్పాలు మాత్రం మూడువేలకుపైగానే పుష్పించాయి.


■ డా. చల్లా భాగ్యలక్ష్మి
(‘సిరివెన్నెల’ సీతారామశాస్త్రికి పద్మశ్రీ వచ్చిన సందర్భంగా)

మౌఢ్యంతో పోరాడిన గాంధేయవాది

నాలుగు చెరగులా కల్ల కపటం, ప్రచారం, కృత్రిమత్వం, వ్యాపార ధోరణి... ఇలా డొంకదార్లు పరచుకుని సమాజం సాగుతున్న వేళ కొందరు పోరాట యోధుల గురించి తప్పక తెలుసుకోవాలి. అలాంటి అపురూపమైన వ్యక్తి హెచ్.ఎన్.గా ప్రఖ్యాతులయిన డా.హెచ్. నరసింహయ్య.

హోసూరు నరసింహయ్యగా పిలువబడే హనుమంతప్ప నరసింహయ్య 1920 జూన్ 6న ఆంధ్ర సరిహద్దు కర్ణాటక జిల్లా కోలారు గౌరిబిదనూరు దగ్గరుండే హోసూరులో జన్మించారు. తండ్రి మేస్త్రీ, తల్లి దినసరి కూలి. ఉపాధ్యాయుల సాయంతో చదువుకున్నారు. 1936లో బసవనగుడి నేషనల్ హైస్కూల్లో ఆయన చదువుకుంటున్నప్పుడు ఆ స్కూలుకు గాంధీ వచ్చారు. గాంధీ హిందీ ప్రసంగాన్ని కన్నడంలోకి తర్జుమా చేయమని నరసింహయ్యను ఉపాధ్యాయుడు కోరారు. ఆ క్షణం నుంచి గాంధీ ప్రభావం అతనిని వదలలేదు. జీవితాంతం ఖాదీ ధరించారు. గాంధీ టోపీ లేకుండా నరసింహయ్యను ఊహించలేము.

కాలేజీలో చదువుతూనే క్విట్ ఇండియా స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. తొమ్మిది నెలలపాటు ఎర్రవాడ (మహారాష్ట్ర), మైసూరు, బెంగుళూరు జైళ్ళలో కారాగారవాసం పిమ్మట తామ్రపత్రం పొందిన యువకుడుగా నిలిచారు. తర్వాత ఒక సంవత్సరానికి అంటే 1944లో బి.ఎస్సి., పిమ్మట 1946లో ఫిజిక్స్‌లో ఎం.ఎస్సి. పూర్తి చేశారు. అదే సంవత్సరం అదే కళాశాలలో లెక్చరర్‌గా చేరి పదేళ్ళు ఉద్యోగం చేశారు. 1957లో కొలంబస్ వెళ్ళి ఓహియో స్టేట్ యూనివర్సిటీలో ఫిజిక్స్ లో పి.హెచ్.డి. 1960లో పూర్తి చేశారు. మళ్ళీ తన కళాశాలలో ప్రిన్సిపల్‌గా చేరి 1972 దాకా ఉద్యోగం చేశారు. 1972లో బెంగుళూరు విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్ గా పని ప్రారంభించి 1977లో ఒత్తిడి కారణంగా రాజీనామా చేసేదాకా అదే హోదాలో కొనసాగారు. ఆజన్మ బ్రహ్మచారి. ‘పెళ్ళి ఒక జూదం, లాటరి. సర్దుకుపోయే మనిషి దొరక్కపోతే ఆ పెళ్ళిని ఎవరూ కాపాడలేరు’ అని భావించారు. దాదాపు ఆరు దశాబ్దాలపాటు పిల్లల హాస్టల్ లో ఒక గదిలోనే వుండేవారు. కర్ణాటక సంగీతం అంటే ప్రాణం. కర్ణాటక సంగీత విద్వాంసులు ఆర్కే పద్మనాభకు మంచి మిత్రులు. డా. నరసింహయ్య గౌరవార్థం పద్మనాభ వెయ్యిమంది సంగీత విద్వాంసులతో గోష్ఠి నిర్వహించడం విశేషం.



నరసింహయ్యకు ప్రశ్న అంటే ప్రాణం. ఆఫీసులో ఆయన టేబుల్ వెనుక ప్రశ్నార్థకం (?) గుర్తు పెద్దగా దర్శనమిచ్చేది. మాయలు, మంత్రాలు, బాణామతి వంటి మూఢ నమ్మకాలను బట్టబయలు చేయడానికి జీవితాంతం కృషి చేశారు. మహిమలతో రోగాలను నయం చేస్తామనే వారిని బహిరంగంగా చేయమని మరో సవాలు చేశారు. అప్పట్లో అది చాలా సంచలనం.

బెంగుళూరు లలితకళా పరిషత్ ఏర్పడటానికి కారణం నరసింహయ్యగారే!

నరసింహయ్యకు ప్రశ్న అంటే ప్రాణం. ఆఫీసులో ఆయన టేబుల్ వెనుక ప్రశ్నార్థకం (?) గుర్తు పెద్దగా దర్శనమిచ్చేది. 1962లో ‘బెంగుళూరు సైన్స్ ఫోరం’ ప్రారంభించి వారం వారం సైన్స్ ప్రసంగాలు ఏర్పాటు చేసి సుమారు 2000 కార్యక్రమాలు జరిపించి ఉంటారు. వీరి పూనికతోనే బి.వి.జగదీష్ సైన్స్ సెంటర్ ఏర్పడింది. ఆయన మాతృభాష తెలుగు. కానీ కన్నడం బాగావచ్చు. ‘హోరాటద హాడి’ అనే స్వీయచరిత్ర, ‘తీరెద మన’ అనే వ్యాససంపుటి కన్నడంలో ప్రాచుర్యం పొందడమే కాదు, వారికి సాహిత్య అకాడమి గౌరవాన్ని కూడా కొనితెచ్చాయి. బాబాల మాయలు, మంత్రాలు, బాణామతి వంటి మూఢ నమ్మకాలను బట్టబయలు చేయడానికి జీవితాంతం కృషి చేశారు. మూఢనమ్మకాలను పరిశోధించి, నిగ్గుదేల్చడానికి 1976లో తన అధ్యక్షతన ఒక కమిటీ వేశారు. గాలి నుంచి సత్యసాయి విభూతి, ఉంగరాలు తీయడం గురించి సవాలు విసిరి అధ్యయనం చేశారు. మహిమలతో రోగాలను నయం చేస్తామనే వారిని బహిరంగంగా చేయమని మరో సవాలు చేశారు. అప్పట్లో అది చాలా సంచలనం. తండ్రి చనిపోయినపుడు గుండు చేయించుకోని నరసింహయ్య గ్రహణం సమయంలో భోజనం చేస్తూ అపోహలు తొలగించారు. అప్పటి ముఖ్యమంత్రి గుండూరావు విధానమండలి సభ్యులుగా ఆహ్వానించి, కాంగ్రెస్ పార్టీలో చేరమన్నారు. దానిని తిరస్కరించి స్వతంత్ర సభ్యుడుగా విధానసభకు ఎన్నికయ్యారు. 2005 జనవరి 31న హెచ్.ఎన్. కనుమూసినా ఆయన పోరాటశీలం, సైన్స్ దృష్టి ప్రస్తుత కాలానికీ, ఈ ఆధునిక సమాజానికీ ఎంతో అవసరం.

■ డా. నాగసూరి వేణుగోపాల్
(నేడు నరసింహయ్య వర్ధంతి)

రేపు రాష్ట్రానికి 'బ్లాక్ డే'

» శాంతియుతంగానే నల్లజెండాలతో నిరసనలు: చంద్రబాబు

అమరావతి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): 'ఇటు పార్లమెంట్ సమావేశాలు, ఇటు అసెంబ్లీ సమావేశాలు. ఈ 60రోజులు అనుకులం ఉద్యమంతో ఉండాలి. ఫిబ్రవరి 1న రాష్ట్రానికి బ్లాక్‌డే. కేంద్రం ఇప్పటికి ఐదు బడ్జెట్లు పెట్టి మనల్ని మోసం చేసింది. ఈసారి బడ్జెట్ ప్రవేశపెట్టే రోజు నల్ల బ్యాడ్జీలు, నల్ల జెండాలతో శాంతియుతంగానే మన నిరసనలు తెలిపాలి. రాష్ట్ర రాబడికి నష్టం కలిగేలా నిరసనలు ఉండకూడదు' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 'ఎలక్షన్ మిషన్- 2019'పై బుధవారం ఉండవల్లిలోని తన నివాసం నుంచి టీడీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ బాధ్యులు, బూత్ కన్వీనర్లతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ విపత్తు సాయంలోనూ ఏపీపై మోదీ వివక్ష చూపారన్నారు. మహారాష్ట్రకు రూ.4,717 కోట్లు ఇచ్చి, ఏపీకి రూ.900కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. తిత్లీ, పెథాయ్ తుఫాన్ల సాయం రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. అడుగడుగునా ఏపీపై బీజేపీ వివక్ష చూపుతోందని ఆయన అన్నారు.

బంద్‌ను జయప్రదం చేయండి: సీపీఐ రామకృష్ణ

అమరావతి, గవర్నర్‌పేట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1న జరిగే రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం విజయవాడలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

అగ్రిగోల్డ్ బాధితుడు మృతి

బొబ్బిలి రూరల్: విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం నారసింహునిపేటకు చెందిన అగ్రిగోల్డ్ బాధితుడు చిన్నయ్య(59) బుధవారం మృతిచెందాడు. అగ్రిగోల్డ్‌లో సుమారు రూ.3 లక్షలు డిపాజిట్ చేసిన చిన్నయ్య.. ఆ దిగులుతో మంచంపట్టాడు. ఈ క్రమంలో ఆందోళనకు గురైన చిన్నయ్య బుధవారం మృతిచెందాడు.

కోడికత్తి కేసు విచారణ 12కు వాయిదా

అమరావతి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డిపై కోడి కత్తి దాడి కేసు విచారణ వచ్చేనెల 12కు వాయిదా పడింది. ఈ కేసు విచారణ బుధవారం జస్టిస్ జి.శ్యాంప్రసాద్ సమక్షంలో జరగ్గా.. ఎన్ఐఏ విచారణకు గల కారణాలు వివరిస్తూ కేంద్రం కౌంటర్ దాఖలు చేసింది. ఈ కేసులో తమను ఇంప్లీడ్ చేసుకోవాలని వైసీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ తగిన సమాధానానికి గడువు కావాలని కోరింది. దీంతో న్యాయమూర్తి తదుపరి విచారణను 12వ తేదీకి వాయిదా వేశారు.

175 కోట్లు 'ఉపాధి'కి విడుదల!

» మార్చిలోగా బకాయి మొత్తం చెల్లింపు
» కేంద్ర మంత్రి హామీ
» ఫలించిన మంత్రి లోకేశ్ చర్చలు


కేంద్రమంత్రి తోమర్‌తో చర్చిస్తున్న లోకేశ్, చిత్రంలో ఎంపీలు అశోక్, జయదేవ్, బాబు

న్యూఢిల్లీ/అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద ఏపీకి బకాయి ఉన్న నిధులను విడుదల చేయడానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. వేతనాల కోసం రూ.150 కోట్లు, మెటీరియల్ కాంపోనెంట్ కింద మరో రూ.200 కోట్లను మార్చి నాటికి విడుదల చేస్తామని మంత్రి లోకేశ్‌కు కేంద్ర మంత్రి నరేంద్రసింగ్ తోమర్ హామీ ఇచ్చారు. అయితే, ఏపీ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని రూ.175 కోట్లను వెంటనే విడుదల చేస్తానని చెప్పారు. ఈ మేరకు కేంద్రమంత్రితో బుధవారం ఢిల్లీలో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. చర్చల అనంతరం, లోకేశ్ మీడియాతో మాట్లాడుతూ.. కేంద్రం నుంచి ఉపాధిహామీ పథకానికి చెందిన దాదాపు రూ.1673 కోట్ల బకాయిలు రావాల్సి ఉందని, దీనిలో వేతనాలు రూ.498 కోట్లు, కాంపొనెంట్ కింద రూ.1,175 కోట్లు విడుదల చేయాల్సి ఉందన్నారు. రాష్ట్రం ఖర్చుచేస్తే తర్వాత నిధులు ఇస్తామని కేంద్రం చెప్పిందని, దీంతో రాష్ట్రం రూ.1351 కోట్లను ఖర్చు చేసిందని లోకేశ్ వివరించారు. ఈ క్రమంలో రూ.175 కోట్లు వెంటనే విడుదల చేస్తామని కేంద్ర మంత్రి అన్నారని, కానీ, ఈ నిధులు సరిపోవని చెప్పినట్టు వెల్లడించారు.

బీజేపీయేతర రాష్ట్రాలకే పెండింగ్

దేశవ్యాప్తంగా ఉపాధి పథకం కింద కొన్ని రాష్ట్రాలకు కేంద్రం రూ.6,449 కోట్లను పెండింగ్‌లో పెట్టిందని, వీటిలో ఏపీ, పశ్చిమబెంగాల్, కేరళ ఉన్నాయన్నారు. అయితే, ఈ మూడు రాష్ట్రాలు బీజేపీయేతర రాష్ట్రాలేనని అన్నారు. కాగా, రాష్ట్రంలో ఈ పథకం ద్వారా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను కేంద్ర మంత్రి తోమర్‌కు వివరించానన్నారు. ఏపీలో అభివృద్ధి బాగుందని తోమర్ కితాబిచ్చినట్టు చెప్పారు. అయితే, "టీడీపీ నేతల కోసం నిధులు ఖర్చు చేస్తున్నామనే ఆరోపణల్లో నిజం లేదు. పేద ప్రజలకే నిధులు వెళ్తున్నాయి. ఇప్పటికే రెండు సార్లు కేంద్ర ఆడిట్ బృందాలు వచ్చి పరిశీలించాయి. కేంద్రం అనేక అవార్డులూ ఇచ్చింది" అని లోకేశ్ వ్యాఖ్యానించారు. రెండు మండలాల్లో డ్రోన్ల ద్వారా పనుల పర్యవేక్షణను పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన విషయం తెలుసుకున్న గ్రామీణాభివృద్ధిశాఖ కార్యదర్శి ఆశ్చర్యపోయారని వెల్లడించారు.

ఏపీ ఆలోచన దేశం మొత్తం అమలు

ఉపాధి హామీ పథకం అమలు, టెక్నాలజీ సాయంతో పారదర్శకత, డ్రోన్లతో సోషల్ ఆడిటింగ్, డ్యాష్‌బోర్డ్‌తో రియల్‌టైం పర్యవేక్షణ తదితర అంశాలను తోమర్‌కు లోకేశ్ వివరించారు. దీనిపై స్పందించిన తోమర్.. ఉపాధి పథకం అమల్లో ఏపీ అద్భుతమైన ఫలితాలు సాధిస్తోందని, ఇతర రాష్ట్రాల కంటే ముందున్నారని ప్రశంసించారు. డ్రోన్ల సాయంతో సోషల్ ఆడిటింగ్ పైలట్ ప్రాజెక్టు పూర్తి అయిన వెంటనే ఆ సమాచారం తమకు కూడా పంపితే దేశవ్యాప్తంగా అమలు చేస్తామని లోకేశ్‌ను కోరారు.

నకిలీ సర్వేలపై నమ్మకం లేదు

2014 ఎన్నికలకు ముందు చాలా మంది సర్వేలు చేసి టీడీపీ గెలవబోదని చెప్పారని, కానీ భారీ విజయం సాధించిందని మంత్రి లోకేశ్ అన్నారు. ప్రజలు టీడీపీతోనే ఉన్నారని తెలిపారు. నకిలీ సర్వేలపై తమకు నమ్మకం లేదన్నారు. కాగా, ఐటీ కంపెనీల పేరిట తన స్నేహితులకు భూములు ఇచ్చారని బీజేపీ నేతలు చేసిన ఆరోపణలపై లోకేశ్ స్పందిస్తూ.. "హెచ్‌సీఎల్‌కు భూములు ఇవ్వడం తప్పా? 10 కంపెనీలను తీసుకు రమ్మనండి.. తక్కువ ధరకే భూములు ఇస్తాం. ఎకరానికి రూ.5 కోట్లు ఇవ్వమంటే ఎవరు వస్తారు? హెచ్‌సీఎల్ 25 వేల ఉద్యోగాలు సృష్టిస్తుంది" అన్నారు. కాగా, డ్వాక్రా మహిళలకు ఇస్తున్న చెక్కులపైనా విమర్శలు చేయడం దారుణమన్నారు. "రైతు రుణ మాఫీ సాధ్యం కాదని జగన్ చెప్పారు. డ్వాక్రా మహిళలకు పెట్టుబడి ఇవ్వడం సాధ్యం కాదన్నారు. కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయలేమన్నారు. కానీ, ఇవన్నీ మేం చేశాం" అని తెలిపారు.

ఏపీ రైతులను ఆదుకోండి

» ఇన్‌పుట్ సబ్సిడీ 1,970కోట్లు ఇవ్వండి
» అగ్రి వర్సిటీకి ప్రాజెక్టులు మంజూరు
» కేంద్రమంత్రికి సోమిరెడ్డి, ప్రత్తిపాటి వినతి

న్యూఢిల్లీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తుఫాను, కరువుతో తీవ్రంగా నష్టపోయిన ఏపీ రైతాంగాన్ని ఆదుకోవాలని, అందుకు అవసరమైన నిధులు వెంటనే విడుదల చేయాలని మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ప్రత్తిపాటి పుల్లారావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వీరు బుధవారం ఢిల్లీలో కేంద్ర వ్యవసాయశాఖ సహాయమంత్రి కృష్ణరాజ్, కేంద్ర ఆహార, ప్రజాపంపిణీశాఖ కార్యదర్శి రవికాంత్‌కు మూడు వినతిపత్రాలు అందించారు. 2018ఖరీఫ్‌లో కరువు వల్ల అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని 13,41,893.66 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లిందని తెలిపారు. ఈ నష్టానికి రూ.1,862కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ కింద ఇవ్వాలని ఇప్పటికే విపత్తు నిర్వహణ విభాగం ద్వారా ప్రతిపాదనలు పంపించామని గుర్తుచేశారు. ఆ మొత్తాన్ని వెంటనే విడుదల చేయాలని అభ్యర్థించారు. అలాగే, పెథాయ్ తుఫాను వల్ల 44,754.82హెక్టార్లలో పంటనష్టం జరిగిందని, అందుకుగాను రూ.108కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కరువు, తుఫాను నిధులు మొత్తం రూ.1,970కోట్లు విడుదల చేసి రాష్ట్ర రైతులను ఆదుకోవాలని కోరారు. అలాగే 2012-13 రబీ సీజన్‌కు చెందిన పంట బీమా క్లెయిమ్‌లు చాలా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరగా సెటిల్ చేసేలా వ్యవసాయ బీమా కంపెనీ(ఏఐసీ)ని ఆదేశించాలని కేంద్రమంత్రిని కోరారు. శెనగలు, పొద్దుతిరుగుడు పంటలకు సంబంధించి విత్తనాలు నాటిన తేదీ పేర్కొనని కారణంగా బీమా సంస్థ క్లెయిమ్‌లు తిరస్కరించిందని తెలిపారు. రైతుల పట్ల సానుభూతితో వ్యవహరించి ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఇక ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీకి ఆల్ ఇండియా కోఆర్డినేటెడ్ రిసెర్చ్ ప్రాజెక్టులు(ఏఐసీఆర్‌పీ)మంజూరు చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. గతంలో ఇచ్చిన ప్రాజెక్టులు రాష్ట్ర విభజనతో తెలంగాణకు వెళ్లాయని, దీంతో పంట ఉత్పాదకత, రైతుల సంక్షేమానికి సంబంధించి పరిశోధన సౌకర్యాలు ఏపీలో కొరవడ్డాయని తెలిపారు. మంత్రుల వెంట ఎంపీలు మాగంటి బాబు, తోటా సీతారామలక్ష్మి, రామ్మోహన్‌నాయుడు, గల్లా జయదేవ్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ ఉన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

» ఎన్జీవోల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి

సత్తెనపల్లి, జనవరి 30: కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని ఏపీఎన్జీవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి లేఖ పంపినట్లుగా ఏపీ ముఖ్యమంత్రి కూడా అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు. సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 35శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను దశల వారీగా క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1న రాష్ట్ర బంద్‌కు ఏపీఎన్జీవోల సంఘం తరపున సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు.

సమ్మె విరమించిన సంచార చికిత్స

» నేటి నుంచి గ్రామాలకు 104

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): చంద్రన్న సంచార చికిత్స ఉద్యోగులు తొమ్మిది రోజులుగా చేస్తున్న సమ్మెను విరమించారు. ఆరోగ్యశాఖ అధికారులు బుధవారం ఉద్యోగ సంఘాల నేతలతో సచివాలయంలో చర్చించారు. ఉద్యోగుల ప్రధాన సమస్య అయినా జీవో 151 అమలు, ఈఎస్ఐ, పీఎఫ్‌లు పిరామిల్ సంస్థ చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. దీంతో ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్యను కలిసిన ఉద్యోగులు సమ్మెను విరమిస్తున్నట్లు తెలిపారు. గురువారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సంచార చికిత్స ఉద్యోగులు విధుల్లో చేరుతున్నారు.

సదరన్ ట్రావెల్స్ 'హాలిడే బజార్'లకు విశేష స్పందన

అమరావతి, జనవరి 30: కేంద్ర పర్యాటకశాఖ నుంచి ఎనిమిదిసార్లు 'బెస్ట్ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్' అవార్డు అందుకున్న సదరన్ ట్రావెల్స్ రాష్ట్రంలోని పలుప్రాంతాల్లో హాలిడే బజార్లను నిర్వహిస్తోంది. ఈ నెల 30, 31వ తేదీల్లో శ్రీకాకుళంలోని హోటల్ బ్లూ ఎర్త్, విజయనగరంలోని ఎస్.వి.ఎన్ లేక్ ప్యాలస్, కాకినాడలో బెస్ట్ వెస్ట్రన్ ఎన్‌వీఎన్ గ్రాండ్, రాజమహేంద్రవరంలో హోటల్ షెల్టాన్, భీమవరంలో గ్రాండ్ లీలాకృష్ణ నందు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9గంటల వరకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసింది. పర్యాటకులు తమ సెలవుల ప్రణాళిక రూపొందించుకుని అధిక మొత్తంలో తాము అందించే డిస్కౌంట్లను సొంతం చేసుకోవచ్చని సదరన్ సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. కాగా ఈ బజార్లకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. అధిక సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు పలు టూర్ ప్యాకేజీల గురించి అడిగి తెలుసుకున్నారు. దేశ, విదేశాల్లోని పర్యాటక ప్రాంతాలకు విహారయాత్రలకు వెళ్లే పర్యాటకులు సదరన్ ట్రావెల్స్ ఎక్స్‌పర్ట్స్‌ను సంప్రదించి తమ పర్యటనలకు సంబంధించి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. కాగా.. ఈ హాలిడే బజార్లలో టూర్ ప్యాకేజీ వివరాలు, ట్రావెల్ డెస్టినేషన్ ఎక్స్‌పర్ట్స్ అందరినీ ఒకేచోట కలిసేందుకు పర్యాటకులకు వీలు కల్పించారు.


డిస్కౌంట్ కూపన్లను అందజేస్తున్న సదరన్ ప్రతినిధి

ఆర్థిక బలహీన వర్గాల రిజర్వేషన్లతో

ఎవరికీ నష్టం లేదు

» మాజీ గవర్నర్ రోశయ్య


మాట్లాడుతున్న రోశయ్య, చిత్రంలో రామకృష్ణ తదితరులు

ఖైరతాబాద్/బర్కత్‌పుర/హైదరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులు సేవా కార్యక్రమాలతో పాటు ఐక్యంగా ఉంటూ సమస్యలను పరిష్కరించుకోవాలని తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య అన్నారు. ఆర్థిక బలహీన వర్గాలకు (ఈడబ్ల్యూఎస్) 10 శాతం రిజర్వేషన్లను కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన నేపథ్యంలో బుధవారం ఖైరతాబాద్‌లోని వాసవీ కేంద్రంలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో విజయోత్సవ సభ నిర్వహించారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గౌరవ అధ్యక్షులు టంగుటూరి రామకృష్ణ విశేష కృషిని గుర్తిస్తూ రోశయ్యతో పాటు పలువురు ఆయనను సత్కరించారు. అనంతరం రోశయ్య మాట్లాడుతూ ఈడబ్ల్యూఎస్‌లకు రిజర్వేషన్లు అమలువల్ల ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఎందరో ఈడబ్ల్యూఎస్‌లు ఆర్థిక స్తోమత లేని కారణంగా ఉన్నత స్థానాలను అందుకోలేక పోతున్నారని, వారికి ఈ రిజర్వేషన్ల ఫలాలు అందేలా కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. టంగుటూరి రామకృష్ణ మాట్లాడుతూ ఈడబ్ల్యూఎస్‌లు అనుభవిస్తున్న వివక్ష వల్ల మేధావులు కూడా ఉన్నత విద్య అభ్యసించలేక గుమాస్తాలుగా మారుతున్నారని వాపోయారు. రోశయ్య అడుగుజాడల్లో నడుస్తూ ఉద్యమాన్ని మరింత ఉవ్వెత్తున నడిపేందుకు పూనుకున్న సమయంలోనే కేంద్రం సానుకూలంగా వ్యవహరించడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఈ బిల్లును ఆమోదానికి సహకరించిన అన్ని పార్టీలకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

అమరావతిలో రూ.150 కోట్ల వ్యయంతో శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం నిర్మాణం చేపట్టనున్నట్లు టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. గుంటూరు జిల్లా చాగంటివారిపాలెంలో రూ.కోటి 40 లక్షలతో నిర్మించనున్న టీటీడీ కల్యాణ మండపానికి స్పీకర్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ సింఘాల్ మాట్లాడుతూ సీఎం ఆదేశాల మేరకు దేవాలయ నిర్మాణానికి సీఆర్‌డీఏ 25 ఎకరాలు కేటాయించిందన్నారు.

దండి వీరులకు నిండు నివాళి



2.5 టన్నుల బరువుండే గ్లాస్ క్రిస్టల్



ఉప్పు సత్యాగ్రహ స్మారక స్థలి విహంగ వీక్షణం





గాంధీజీ, ఆయనతో పాటు ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొన్న వారి ప్రతిమలు

జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా.. దండిలోని జాతీయ ఉప్పు సత్యాగ్రహ స్మారకాన్ని ప్రధాని మోదీ బుధవారం జాతికి అంకితమిచ్చారు. ఆంగ్లేయులు ఉప్పుపై పన్ను విధించడాన్ని నిరసిస్తూ 1930లో గాంధీజీ నిర్వహించిన సత్యాగ్రహానికి 75 ఏళ్లయిన సందర్భంగా.. 2005లో నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ఈ ప్రాజెక్టును ప్రకటించారు. ఐఐటీ బాంబే సహకారంతో కేంద్ర సాంస్కృతిక శాఖ ఈ ప్రాజెక్టును చేపట్టింది. ఇది జీరో ఎనర్జీ ప్రాజెక్ట్. అంటే.. ఈ స్మారకానికి అవసరమైన విద్యుత్తు సౌర శక్తి ద్వారానే వస్తుంది. ఇందుకోసం సౌరవృక్షాలను తయారుచేశారు. ఉప్పు సత్యాగ్రహ ఘట్టాలను ఆవిష్కరించేలా.. నాడు గాంధీతోపాటు నడిచిన 80 మంది ప్రతిమలు, 24 మ్యూరల్ పెయింటింగ్స్‌ను పొందుపరచారు. ఈ పెయింటింగ్స్ రూపకల్పనలో హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీకి చెందిన శాంతి స్వరూపిణి రాయ్, జె.రమేశ్, రాంభూపాల్ గౌడ్, ఎం.సురేశ్ కీలక పాత్ర పోషించారు. ఇక పార్కులో ప్రధానమైనది సదాశివ్ సాఠే రూపొందించిన 15 అడుగుల బాపూజీ కాంస్య విగ్రహం. ఆ విగ్రహాన్ని 132 అడుగుల ఎత్తైన ఏ-ఫ్రేమ్ మధ్యలో పెట్టారు. దాని పై భాగంలో రెండు చేతులను చెక్కి, మధ్యలో 2500 కిలోల బరువున్న గ్లాస్ క్రిస్టల్‌ను పెట్టారు. ఆ చేతుల్లో ఉండే సోలార్ ప్యానెళ్ల నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్తును.. ఎల్ఈడీ సెర్చ్ లైట్లకు సరఫరా చేస్తున్నారు. దీనివల్ల... చీకట్లు పడే సమయానికి ఆ లైట్లు వెలిగి గ్లాస్ క్రిస్టల్ కాంతులీనుతూ అద్భుతమైన దృశ్యం ఆవిష్కృతమవుతుంది.



రాత్రివేళ కాంతులీనుతున్న గ్లాస్ క్రిస్టల్





గాంధీజీ కాంస్య ప్రతిమ, 132 అడుగుల ఎత్తయిన ఏ-ఫ్రేమ్; మ్యూరల్ పెయింటింగ్

ఆన్‌లైన్‌లో గద్వాల చీర



గద్వాల చేనేతల ఘన కీర్తి విదేశాలకు విస్తరిస్తోంది. వివాహాలు, వేడుకలు ఉన్నాయంటే చాలు ఒకప్పుడు కుటుంబ సమేతంగా గద్వాల వచ్చి పట్టు చీరలు కొనుక్కొని వెళ్లేవారు. ఇప్పుడా అవసరం లేకుండా ఆన్‌లైన్‌లోనే అందుబాటులోకి వచ్చేశాయి. ఫేస్‌బుక్, వాట్సాప్ వేదికగా అమ్మకాలు జోరందుకున్నాయి. అమెరికా, దుబాయ్ లాంటి దేశాల్లోనూ మంచి ఆదరణ ఉండటంతో అమెజాన్ గద్వాల చీరలను అంతర్జాతీయ మార్కెట్లోకి తీసుకొచ్చింది.



వాట్సాప్, ఫేస్‌బుక్ ద్వారా అమ్మకాలు

అమెజాన్‌లోనూ అమ్మకానికి ఆహ్వానం.. పట్టు చీరలకు అమెరికా నుంచి ఆర్డర్లు

జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రం గద్వాలతో పాటు రాజోలి, మాచర్ల, అలంపూర్, అయిజలలో ఎక్కువగా ఈ చీరలను నేస్తారు. వీటిపై ఆధారపడి 3వేల కుటుంబాలు జీవిస్తున్నాయి. వంద మందికి పైగా చీరల తయారు చేయించి అమ్మకాలు సాగించే వ్యాపారులు ఉన్నారు. నెలకు జిల్లాలో 750- 1000 చీరలను గద్వాల వీవర్స్‌ను నేస్తారు. ఒక్కో చీర ఖరీదు రూ. 5 వేల నుంచి రూ. 75 వేల వరకు ఉంటుంది. ఇక ధనవంతులైతే తమకు నచ్చినట్లుగా చీరలు నేయించుకుంటున్నారు. ఎంతైనా వెచ్చించేందుకు వెనకాడటం లేదు. గద్వాలలో నెలకు సుమారు రూ. కోటిన్నర మేర చీరల తయారీ, అమ్మకాలు జరుగుతుంటాయి. ఇతర రాష్ట్రాలు, దేశాలకు ప్రత్యేకంగా నేయించిన చీరలను ఎగుమతి చేస్తుంటారు. పెళ్లిళ్ల సమయంలో ఏపీ, తెలంగాణ నుంచి ఇక్కడికి వచ్చి చీరలను కొనుగోలు చేస్తారు. చాలా మంది మంత్రుల సతీమణులు గద్వాల వచ్చి చీరలను కొనుగోలు చేశారు.

8 శాతం కమిషన్

చేనేత జౌళి శాఖ ఏడీ చరణ్ సహాయంతో కొంత మంది అమెజాన్ ప్రతినిధులు ఇటీవల గద్వాల వచ్చి స్థానిక వీవర్స్‌తో సమావేశమయ్యారు. గద్వాల పట్టు చీరలను అమెజాన్‌లో అమ్మేందుకు అనుమతిస్తే వాటి ధరలపై 8 శాతం కమిషన్ తీసుకొని విక్రయిస్తామని తెలిపారు. దీనికి కొందరు వ్యాపారులు ఒకే చెప్పారు. ఇప్పటికే గద్వాలలో కీర్తి శారీస్‌తో పాటు మరో 20 వస్త్ర దుకాణదారులు ఈ చీరలను ఆన్‌లైన్ అమ్మకానికి పెట్టారు. ఇప్పటికే వాట్సాప్ ద్వారా అమ్మకాలు కొనసాగుతుండగా.. తాజాగా అమెజాన్ ముందుకు రావడంతో గద్వాల పట్టు చీరల వన్నె పెరిగింది.

- గద్వాల



మీ వాట్సాప్‌పై గూగుల్ కన్ను!

వాడకం వివరాలన్నీ నమోదు.. ఆప్షన్స్ అన్నీ తీసేయడమే ఉత్తమం!!

వాట్సాప్.. పూర్తిస్థాయిలో ఎన్‌క్రిప్ట్ అయిన మెసేజింగ్ యాప్.. వాట్సాప్ ద్వారా చేసే కాల్స్‌కూ అత్యంత భద్రత ఉంటుంది. అయితే మీరు ఆండ్రాయిడ్ ఫోన్ వాడుతున్నట్లయితే.. ఎప్పుడెప్పుడు వాట్సాప్‌ని వాడారు? రోజులో ఎంత సమయం వెచ్చిస్తున్నారు? వంటి వివరాలతోపాటు ప్రతి థర్డ్ పార్టీ యాప్ వివరాలు గూగుల్‌కు చేరుతున్నాయి. మీరు ఆండ్రాయిడ్ ఫోన్ ద్వారా, కంప్యూటర్ ద్వారా చేసే ఆన్‌లైన్ షాపింగ్ వివరాలు గూగుల్ రికార్డ్స్‌లో నమోదువుతున్నాయి. ఇందుకు కారణం.. మొబైల్ యూజర్లకు గూగుల్ సేవలపై పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడం.. గూగుల్‌ప్లే వాడేప్పుడు అగ్రిమెంట్ ను గుడ్డిగా ఆమోదించడమే. ఇలా గూగుల్ మిమ్మల్ని ట్రాక్ చేయకుండా ఉండాలంటే.. సెట్టింగ్స్‌లో కొన్ని ఆప్షన్లను తొలగించడమొక్కటే మార్గమని సైబర్ సెక్యూరిటీ నిపుణులు చెబుతున్నారు.

వాట్సాప్ ఇలా..

ఆండ్రాయిడ్ ఫోన్లు వాడుతున్న వాట్సాప్ యూజర్లు గూగుల్ 'వెబ్ అండ్ యాప్ యాక్టివిటీ' ఆప్షన్‌ను డిజేబుల్ చేస్తే ఏ రకమైన ట్రాకింగ్ ఉండబోదు. ఇక్క డా ఒక ట్విస్ట్ ఉంది. మీరు కంప్యూటర్‌లో ఆ ఫీచర్‌ను తొలగిస్తే.. డెస్క్‌టాప్‌లో గూగుల్ ట్రాకింగ్ నిలిచిపోతుంది. అంటే.. ఆండ్రాయిడ్, ఇతర ప్లాట్‌ఫాంలపై ట్రాకింగ్ కొనసాగుతుంది. అలా ఉండొద్దనుకుంటే.. ఆయా డివైజ్‌ల లోంచి ఆ ఆప్షన్‌ను తొలగించాల్సిందే.

ఇలా చేయండి..

- వినియోదారులు తమ గూగుల్ ఖాతాలోకి లాగిన్ అవ్వాలి.
- కంప్యూటర్ స్ర్కీన్‌పై కుడివైపు కనిపించే మీ ప్రొఫైల్ పిక్చర్ పక్కన 'గుడిగంట' లాంటి ఐకాన్‌ను క్లిక్ చేయాలి.
- అక్కడ మీ గూగుల్ ప్లస్, గూగుల్ ఫొటోలకు సంబంధించిన అప్‌డేట్స్ ఉంటాయి. గూగుల్ ప్లస్ సెట్టింగ్స్ ఐకాన్‌ను క్లిక్ చేయాలి.
- కొత్తగా ప్రత్యక్షమయ్యే వెబ్‌పేజీలో.. అడుగున ఉండే 'క్లియర్ గూగుల్ ప్లస్ సెర్చ్ హిస్టరీ'ని ఎంచుకోవడం ద్వారా బ్రౌజింగ్ చరిత్రను తుడిచివేయవచ్చు.
- ఆ తర్వాత 'వెబ్ అండ్ యాప్ యాక్టివిటీ'ని ఎంచుకుని, గూగుల్ ట్రాక్ చేయకుండా ఆ ఆప్షన్‌ను డిజేబుల్ చేయాలి.
- 'మేనేజ్ గూగుల్ యాక్టివిటీ'లో మీకు అవసరం లేని ఆప్షన్లను, యాప్‌లను డిజేబుల్ చేయడం ద్వారా గూగుల్ ట్రాకింగ్ నుంచి బయటపడవచ్చు.

రుణం తీర్చుకున్న కుక్క



ఇన్నాళ్లు తిండి పెట్టి.. ఆపదలో ఆదుకున్న వైద్యుడి ప్రాణాలు కాపాడి విశ్వాసాన్ని చాటుకుందో శునకం. మహారాష్ట్రలోని పుణెకు చెందిన డాక్టర్ రమేశ్ సంచేటి(65) రోడ్డుపై ఒంటరిగా కనిపించిన ఓ కుక్క పిల్లను పదహారేళ్ల క్రితం ఇంటికి తీసుకొచ్చాడు. దానికి బ్రౌనీ పేరు పెట్టి పెంచుకుంటున్నాడు. ఇటీవల ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో రమేశ్‌కు ఉన్నట్టుండి పక్షవాతంతో పాటు గుండెపోటు వచ్చి బెడ్‌రూంలో పడిపోయాడు. ఈ విషయాన్ని గుర్తించిన బ్రౌనీ.. వెంటనే పక్కింట్లో ఉండే యజమాని స్నేహితుడైన డాక్టర్ అమిత్ షా వద్దకు పరుగెత్తుకెళ్లింది. అరుస్తూ అతని చుట్టూ తిరిగింది. దాని పరిస్థితి చూసి ఆకలిగా ఉందేమోనని భోజనం పెట్టాడు. కానీ అది తినకుండా మొరుగుతూ రమేశ్ పడిపోయిన గది కిటికీ వద్దకు.. అమిత్ వద్దకు తిరిగింది. అనుమానం వచ్చిన అమిత్ కిటికీ వద్దకు వెళ్లి చూడగా.. అచేతన స్థితిలో కిందపడి ఉన్న రమేశ్ కనిపించాడు. వెంటనే తలుపులు పగులగొట్టి అతన్ని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. సకాలంలో వైద్యం అందడంతో రమేశ్ ప్రాణాలతో బయటపడ్డాడు. రెండేళ్ల క్రితం కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న బ్రౌనీకి తాను వైద్యం చేయగా.. ఇప్పుడు తన ప్రాణాలు కాపాడి విశ్వాసం చాటుకుందని రమేశ్ వ్యాఖ్యానించారు.

నూనె లేకుండా.. పొయ్యిపై పెట్టకుండా!

3.05 నిమిషాల్లో 300 రకాల ప్రకృతి ఆహార పదార్థాల తయారీ



చెన్నై, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నూనె లేకుండా, పొయ్యి మీద పెట్టకుండా 3.05 నిమిషాల్లోనే 300 రకాల ప్రకృతి సిద్ధమైన ఆహార పదార్థాలు తయారుచేసి చెన్నై విమానాశ్రయ సిబ్బంది, విద్యార్థులు ప్రపంచ రికార్డు సాధించారు. ఆరోగ్యానికి మేలుచేసే ఆహారంపై ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో భారత విమానాశ్రయాల అథారిటీ, జియో ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ సాధన చేశారు. ఇందుకోసం ప్రముఖ చెఫ్ పి.శివకుమార్ సారథ్యంలో విమానాశ్రయ సిబ్బంది, వివిధ కాలేజీ విద్యార్థులు 300 మందికి శిక్షణ ఇచ్చారు. 5నిమిషాల్లో 300రకాల పదార్థాలు తయారీ లక్ష్యం పెట్టుకోగా 3.05 నిమిషాల్లోనే సాధించారు. చెన్నై విమానాశ్రయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో సపోటా పాయసం, కొబ్బరి జామ్, బాదం పిసిన్ జామ్, నవధాన్య మొలకల పాలు వంటివి తయారు చేశారు. వారికి యూనివర్సల్ అచీవర్స్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

కొలీజియం.. మెరుపులు.. మరకలు!

లా-లోచనం
Law lochanam



కేవలం అత్యుత్తమ సేవలందించటమే ప్రాతిపదికగా సీనియారిటీని కాదని జూనియరు పోలీసు అధికారులకు పదోన్నతులివ్వటం చట్టవిరుద్ధమని ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని సుప్రీం త్రిసభ్య ధర్మాసనం ధర్మేంద్ర సింగ్ యాదవ్ కేసులో గత వారం ప్రకటించింది. ఈ తీర్పు ఇటీవల సుప్రీంకోర్టు కొలీజియం తీసుకున్న వివాదాస్పద నిర్ణయాలకు విరుద్ధం. దాదాపు 30 మంది సీనియర్ హైకోర్టు జడ్జీలను కాదని ఇద్దరు జూనియర్లను సుప్రీం న్యాయమూర్తులుగా నియమించాలని కొలీజియం చేసిన సిఫార్సును కేంద్రం తక్షణమే ఆమోదించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. సీనియర్లకు ఏ కారణం చూపకనే మొండిచేయి చూపటం కొత్త కాదు. సీనియర్లను కాదని ఇందిరాగాంధీ హయాంలో ఎమర్జెన్సీకి వంతపాడిన జడ్జీలకు ప్రధాన న్యాయమూర్తిగా పట్టం కట్టడంతో మొదలైన ప్రహసనం, సుప్రీం తనకు తానే జడ్జీలను ఎంపిక చేసే 'కొలీజియం' వ్యవస్థను సృష్టించుకోవడంతో కొన్నాళ్లు బాగానే నడిచినా, రాన్రానూ అప్రతిష్ట పాలవటం శోచనీయం.

సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల నియామక ప్రక్రియ రాజ్యాంగంలోని 214(2), 217(1) ఆర్టికల్స్‌లో సూచించిన విధంగా సాఫీగా జరగాలి. న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తిని కాపుగాచే రీతిలో ఈ విధానం రూపొందింది. సుప్రీం, హైకోర్టుల నియామకాలు ఆయా ప్రధాన న్యాయమూర్తులతో 'సంప్రదింపుల' ద్వారా జరగాలని రాజ్యాంగం స్పష్టం చేస్తుండగా, ప్రధాన న్యాయమూర్తి ఒక వ్యవస్థ అనీ, సహచర సీనియర్ న్యాయమూర్తులందరి సామూహిక అభిప్రాయాన్నే ప్రధాన న్యాయమూర్తి వ్యక్తపర్చాలనీ 'అడ్వకేట్స్ ఆన్ రికార్డు అసోసియేషన్' కేసులో రాజ్యాంగ ధర్మాసనం అభిప్రాయపడింది. నిష్పక్షపాత అధికార వర్తన కొలీజియం ప్రధాన లక్ష్యంగా ఈ తీర్పు స్పష్టం చేసింది. విచక్షణను నామమాత్రం చేసి 'సంప్రదింపుల' ప్రక్రియ ద్వారా పారదర్శకత, కొలీజియం సభ్యుల దార్శనికత, జడ్జీల ఎంపికలో ప్రతిఫలించాల్సి ఉంది. గత కొద్దికాలంగా కొలీజియం ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక సమావేశంలో తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా మరో నిర్ణయం తీసుకుని జూనియర్లకు సుప్రీంలోకి ప్రవేశం కల్పించటంపై ఆక్షేపణలూ వెల్లువెత్తాయి. గతంలో కొలీజియం వ్యవస్థకు సమాజం మద్దతునివ్వటానికి కారణం న్యాయమూర్తుల నియామకంలో సర్కారు పాత్రకు చోటివ్వడం జుడీషియల్ స్వతంత్రతకు గండిపడే ప్రమాదముందనే. కాగా జుడీషియల్ నియామకాల బిల్లు మాటున తన పెత్తనాన్ని చెలాయించాలన్న ప్రభుత్వ యత్నానికి రాజ్యాంగ ధర్మాసనం చెక్ పెట్టటం, ఈ తీర్పు నేపథ్యంలో 'కొలీజియం' ప్రక్రియ కొంతకాలం నిలిచిపోయినా, ఇప్పుడు వేగం పుంజుకోవటం మనకు తెలుసు. ప్రభుత్వానికి జడ్జీల నియామకంలో తగిన పాత్ర కల్పిస్తూనే, కొలీజియం ద్వారా సుప్రీంకోర్టు, హైకోర్టులు తమ స్వయంప్రతిపత్తికి అగ్రతాంబూలమిస్తూనే ఉన్నాయి. అయినప్పటికీ కొన్ని సందర్భాల్లో కొలీజియం నిర్ణయాలను మెరుపు వేగంతో ఆమోదించి అమలు చేసిన కేంద్రం, మరికొన్ని సిఫార్సులను పరిశీలిస్తూ, జాప్యం చేయటం.. రెండు వ్యవస్థల మధ్య కొనసాగుతున్నా ఘర్షణ వాతావరణాన్నే సూచిస్తున్నాయి. కోర్టుల మీద భారం పెరిగిపోతోంది. బలహీనమైన జుడీషియరీయే తన బలంగా అన్ని రాజకీయ ప్రభుత్వాలూ భావిస్తాయి. కొలీజియంలో సభ్యులైన న్యాయమూర్తులకు జుడీషియరీ భవిష్యత్ మీద అవగాహన ఉంది. పటిష్టమైన న్యాయవ్యవస్థనే భారత ప్రజలు కోరుకుంటున్నారనేది గౌరవ సభ్యులకు తెలుసు. బహిరంగంగా చర్చకు రాని అంశాలు కొలీజియం సభ్యులు ఆంతరంగికంగా చర్చించి, జడ్జీల నియామకానికి నిర్ణయం తీసుకుంటారు. దశాబ్దాలుగా న్యాయవ్యవస్థ పోగేసుకున్న విలువల్ని కాపాడటం, కొనసాగించటం కొలీజియం బాధ్యత కాగా, కొత్త సవాళ్ళ నేపథ్యంలో ఈ బాధ్యతను మరింత పటిష్ఠంగా నెరవేర్చాలని కొలీజియంకు ఈపాటికి అర్థమయ్యే ఉంటుంది. ఇప్పుడు వెలువెత్తిన విమర్శలన్నీ, కొలీజియం వ్యవస్థ ఇక ముందు నిర్మాణాత్మకంగా వ్యవహరించటానికే.

-వేదాంతం సీతారామావధాని,
భారత సుప్రీంకోర్టు మాజీ సెక్రటరీ జనరల్,
ఈ మెయిల్: sitharam.avadhani@gmail.com



ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబం కదంబం

శ్రీశక్తి



కొందరు ఏ పని చేసినా విభిన్నంగా చేయాలనుకుంటారు. అందులోనూ సామాజిక చైతన్యం ఉన్నవారు తాము చేసే పని నలుగురికీ ఉపయోగపడేలా ఉండాలనుకుంటారు. సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా... పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా... తనవంతుగా సమాజానికి ఏదైనా చేయాలనుకున్నారు కొవ్వూరి శోభాదేవి. ప్లాస్టిక్, పేపర్ బ్యాగుల వినియోగాన్ని తగ్గించేలా... పర్యావరణానికి ప్రమాదకరం కాని క్లాత్ బ్యాగులకు శ్రీకారం చుట్టారు. బ్యాగులు కుట్టేపనిని పేద, మధ్యతరగతి మహిళలకు ఇస్తూ... వారికి ఉపాధి కల్పించడంతోపాటు, పర్యావరణ పరిరక్షణలో వారిని భాగస్వాములు చేస్తున్నారు. ఆ విజయాలు ఆమె మాటల్లోనే...

బ్యాగుల్లో పర్యావరణం...



పుట్టింది తణుకులో అయినా, పెరిగింది మాత్రం మహారాష్ట్రలోనే. పదోతరగతి వరకూ చదివా. ఆ తర్వాత చదువు మీద ఆసక్తి లేక మానేశాను. అయితే కళలు, సృజనాత్మక విషయాల వైపు మనసు లాగేది. అందుకే టైలరింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్ నేర్చుకున్నా. మా ఇంటి పక్కనే బ్యూటీ పార్లర్ ఉండేది. అందులో మేకప్, మెహందీ వంటివన్నీ నేర్చుకున్నా.

నలుగురికీ నేర్పేదాన్ని..

మొదటి నుంచి నాకొచ్చిన విద్యను నలుగురికీ నేర్పేదాన్ని. దుస్తుల డిజైనింగ్‌లో రకరకాల ప్రయోగాలు చేస్తూనే స్వయంగా నేర్చుకున్నా. ఇన్ని రకాల వ్యాపకాలుండటంతో ఆయా రంగాలకు చెందిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడ్డాయి. 1999 నుంచి 2010 వరకూ 'ఒరిఫ్లేమ్'లో యాక్టివ్‌గా పనిచేశా. ఇందులో వస్త్రాల అమ్మకాలు చేయాలి. నేను చురుగ్గా పనిచేస్తూ ఏదైనా తొందరగా గ్రహిస్తా. అందుకే నాకు ఇచ్చిన టార్గెట్‌లు పూర్తి చేస్తూ టాప్‌లో ఉండేదాన్ని. నాకు ఇద్దరు మగ పిల్లలు. ఇద్దరూ బాగా చదువుకుని విదేశాల్లో స్థిరపడ్డారు. పిల్లలు విదేశాలకు వెళ్లిన తర్వాత కావాల్సినంత సమయం దొరికింది. అందుకే సమాజానికి ఏదైనా చేయాలనే ఆలోచన వచ్చింది.

సమాజసేవపై మక్కువ..

నిజానికి సమాజానికి ఉపయోగపడే పని ఏదైనా చేయాలనే తపన నాకు చిన్నతనం నుంచీ ఉండేది. మా తాతగారు పేరున్న కమ్యూనిస్టు నాయకులు. మా నాన్న రైల్వే ఉద్యోగిగా చేశారు. ఎప్పుడూ ఎదుటివారికి సహాయం చేసే స్థితిలో మనం ఉండాలని చెప్పేవారు. ఆయన వల్ల నాలో సామాజిక స్పృహ కూడా బాగా పెంపొందింది. ప్రకృతి ప్రేమికురాలిని కావడం వల్లనేమో పర్యావరణ పరిరక్షణ పట్ల ప్రత్యేకమైన ఇష్టం ఏర్పడింది.

నాకు పెళ్లయిన తర్వాత కొన్నాళ్లు ఏలూరులో ఉండి, ఆ తర్వాత హైదరాబాద్‌కు వచ్చేశాం. కెపిహెచ్‌బీలో ఉన్నప్పుడు మా ఇంటి పక్కనే ఖాళీ స్థలంలో చుట్టుపక్కల వాళ్లంతా చెత్త వేసేవారు. స్థానిక మున్సిపల్ అధికారిని కలిసి సమస్య వివరించి, మూడు చెత్త కుండీలు ఏర్పాటు చేసేలా చూశా. ఆ విధంగా పర్యావరణ పరిరక్షణ వైపు నా తొలి అడుగులు పడ్డాయి. మా ఏరియాలోని అందరం కలిసి ఆ ఖాళీ ప్రదేశాన్ని టెన్నిస్ కోర్టులా చేశాం. దాంతో చెత్త అక్కడ వేయడం ఆగిపోయింది. అందరూ చెత్తకుండీలను వినియోగించడం మొదలెట్టారు. ఈ విజయం నాలో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

ప్లాస్టిక్ ప్రమాదం...

ప్లాస్టిక్ పర్యావరణానికి ప్రమాదహేతువు. దాన్ని చేతనైనంత మేర నిరోధించాలనుకున్నా. నా ఆలోచనను స్నేహితురాలితో పంచుకున్నా. అదే సమయంలో ఆవిడకు 300 పేపర్ బ్యాగులు అవసరమయ్యాయి. వాటిని చేయమంటూ నాకు ఆర్డరు ఇచ్చింది. పేపర్ బ్యాగులు చేయడమంటే కూడా 'అడవులను పెద్ద ఎత్తున నరకడమే కదా' అనిపించింది. అందుకే నాదగ్గరున్న పాత చీరలతో 300 క్లాత్ బ్యాగులను కుట్టి ఇచ్చా. వాటిని చూసి తనెంతో సంతోషించింది. మంచి పనిచేశావని మెచ్చుకుంది. ఆ విధంగా తొలి ఆర్డర్‌ని సక్సెస్‌ఫుల్ చేశా. పాత చీరలను రీసైక్లింగ్ చేయడం ద్వారా దీర్ఘకాలికంగా పర్యావరణ పరిరక్షణ చేయొచ్చనేది నా ఆలోచన. అందుకే 'రైజింగ్ ఈవ్స్' అని గత ఏడాది జూలైలో మొదలుపెట్టా.



పేద మహిళలకు ఉపాధి...

సంచులు కుట్టే పనిని పేద, మురికివాడల్లో కుట్టడం తెలిసిన మహిళలకు ఇస్తున్నా. దీనివల్ల వాళ్లు ఎంతో కొంత ఆదాయం పొందుతారు కదా. ఇంట్లో కుట్టుమిషన్ ఉండి, పని చేస్తానన్న వాళ్లకి బ్యాగులు కుట్టే పనిని అప్పగిస్తున్నా. 'రైజింగ్ ఈవ్స్' పేరుతో ఈ పనిని చేపట్టడానికి మొదటి కారణం మహిళలను సాధికారులుగా చేయాలనే. రెండోది ప్లాస్టిక్ వాడకాన్ని బాగా తగ్గించి పాతబట్టలను రీసైక్లింగ్ చేయడం. మూడోది పర్యావరణ పరిరక్షణ. మేము కుట్టిన క్లాత్ బ్యాగులకు మంచి స్పందన వచ్చింది. చాలామంది తమ దగ్గర ఉన్న చీరలను ఇవ్వడం మొదలెట్టారు. పాతచీరలతో కుట్టిన బ్యాగులు ఇష్టం లేనివారు కొత్త వస్త్రాన్ని ఇచ్చి సంచీలుగా కుట్టమంటున్నారు. 'సేల్స్ ఫోర్స్' అనే సాఫ్ట్‌వేర్ కంపెనీవాళ్లు క్లాత్ బ్యాగులను కొనడమే కాదు మా క్లాత్ బ్యాగుల కౌంటర్‌ని కూడా వారి ఆఫీసు ప్రాంగణంలో పెట్టారు. అక్కడే మాకు 'గ్రీన్‌పీస్' సంస్థతో పరిచయం అయింది. పర్యావరణ పరిరక్షణ కోసం పనిచేస్తున్న పెద్ద సంస్థ అది. వాళ్లు మాకు నిరంతరాయంగా తోడ్పాటును అందిస్తున్నారు. ఈమధ్యన 700 క్లాత్ బ్యాగులకు ఆర్డరు ఇచ్చారు. ఆ సంస్థ నిర్వహించే సదస్సుల్లో మా సంచులను అందరికీ ఉచితంగా పంచుతుంది.

అవగాహన పెరగాలి...

నాకు వ్యక్తిగతంగా పాత బట్టలను రీసైక్లింగ్ చేయడం ఇష్టం. ఇటీవల ఒక యోగా గురు 300 క్లాత్ బ్యాగ్స్‌కు ఆర్డరు ఇచ్చి గుడిలో వాటిని పంచినట్టు చెప్పారు. మియాపూర్‌లోని డిఎవి స్కూలు విద్యార్థులు 300 క్లాత్ బ్యాగులకు ఆర్డరు ఇచ్చి వాటిని పంచడం ద్వారా ఎకో-ఫ్రెండ్లీ క్లాత్ బ్యాగుల గురించి ప్రజల్లో అవగాహన పెంచడానికి ప్రయత్నించారు. పలు ఎగ్జిబిషన్లలో కూడా మా సంచులను ప్రదర్శనలు పెట్టాం. ఈ బిజినెస్‌లో వచ్చిన ఆదాయమంతా సంచులను కుట్టే మహిళలకే ఇచ్చేస్తా. దీన్ని ప్రారంభించడం వెనుక నాకు లాభాపేక్ష లేదు. సామాజిక సేవ, పర్యావరణ పరిరక్షణ కోసం చేస్తున్నాను. నా చేతనైనంత మేర మహిళలకు ఉపాధి కల్పించడం ద్వారా కష్టాల్లో ఉన్న కొందరు మహిళలనైనా ఆదుకుంటున్నాననే తృప్తితో ఈ పని చేస్తున్నా. సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లో శిక్షణ తీసుకున్నా. క్లాత్ బ్యాగులను కమర్షియలైజ్ చేసుకోవాలనే మహిళలకు కూడా సహాయపడతా. బ్యాగులు ఏవైనా సరే ఆర్డర్ల మీద కుట్టి వినియోగదారులకు అందజేస్తాం. క్లాత్ సంచుల్లో ఐదు కేజీలు పడతాయి. కొత్త వస్త్రంతో చేసిన బ్యాగుల ధర 30 రూపాయలుంటే, పాతవస్త్రంతో చేసిన సంచుల ధర ఐదు రూపాయలు మాత్రమే.

రైతు బజార్లలో కౌంటర్ పెట్టాలి...

మనకున్న వనరులను ఉపయోగించుకుంటూనే పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలి. ఈ సందర్భంగా ప్రభుత్వానికి నేను చేసే విజ్ఞప్తి ఏమిటంటే రైతుబజార్లలో క్లాత్ బ్యాగులు అమ్మే కౌంటర్‌ని మహిళలకు ఇవ్వాలి. ఈ బ్యాగుల వాడకం ఎంత ఎక్కువైతే క్లాత్ రీసైక్లింగ్ కూడా అంత పెరుగుతుంది. ప్రకృతి పరిరక్షణ అంటే మహిళల ముందడుగని నేను ప్రగాఢంగా నమ్ముతా.



మేము తయారుచేసే క్లాత్ బ్యాగుల్లో కూరగాయల బ్యాగులు, హ్యాండ్ బ్యాగులు, వరలక్ష్మివ్రతం, ఇతర పండుగ సందర్భాలలో తాంబూలాలు ఇవ్వడానికి ప్రత్యేకంగా డిజైన్ చేసిన చిన్న బ్యాగులు, పార్టీవేర్ బ్యాగులు, లంచ్ బాక్సులు పెట్టే బ్యాగులు... ఇలా చాలా రకాలున్నాయి. చాలామంది మొబైల్ పెట్టుకోవడానికి చిన్న క్లాత్ పౌచ్‌లను తయారుచేసి ఇవ్వమని కూడా అడుగుతున్నారు.

● నాగసుందరి
ఫోటోలు: అశోకుడు

బ్యూటీ

ఇలా చేస్తే... మచ్చలు మాయం!

హైపర్ పిగ్మెంటేషన్ వల్ల చర్మం రంగు మారటమే గాక మొహంపై నల్లటి మచ్చలు ఏర్పడతాయి. మెడ, కాళ్లు, చేతుల మీదా ఈ సమస్య తలెత్తవచ్చు. శరీరం మెలనిన్‌ను అధికంగా ఉత్పత్తి చేయటమే దీనికి కారణం. ఆరోగ్య సమస్యలు, గర్భం దాల్చటం, హార్మోన్ల



మార్పులాంటి అంతర్గత కారణాలు.. ఎండ ప్రభావం, చర్మం గాయాలపాలవటం, మానసిక ఒత్తిడి, కొన్ని రకాల రసాయనాలు వంటి బాహ్య కారణాలు హైపర్ పిగ్మెంటేషన్‌కు దారి తీస్తాయి.

పచ్చి బంగాళ దుంపతో ఈ సమస్యను నివారించవచ్చు. ఇందులో ఉండే కాటెకోలాజ్ అనే ఎంజైమ్ అధిక మెలనిన్ ఉత్పత్తిని నిరోధిస్తుంది. చర్మంపైన మచ్చలు లేకుండా చేసి మంచి ఛాయను ఇస్తుంది.

శుభ్రంగా కడిగిన బంగాళ దుంపను రెండు ముక్కలుగా కోయాలి. లోపల వైపు కొంచెం నీళ్ల చిలకరించాలి. చర్మంపైన మచ్చలు ఉన్న చోట గుండ్రంగా ఆ ముక్కలను రెండు నిమిషాల పాటు రుద్దాలి. పది నిమిషాలు ఆగి గోరు వెచ్చని నీటితో కడగాలి. ఇలా రోజుకు నాలుగు సార్లు, నెల రోజుల పాటు చేస్తే హైపర్ పిగ్మంటేషన్ బారి నుంచి బయటపడొచ్చు. మంచి శరీర ఛాయను సొంతం చేసుకోవచ్చు.

పేరెంటచ్

అండర్‌లైన్ చేస్తే ఎంతో మేలు!



చదివిన ప్రతిసారీ మొత్తంగా చదవడం అనేది ఎంత కాదన్నా భారమైన పనే. ఉన్నఫలాన ఒక పాఠం గురించి అనుకున్నప్పుడు దానికి సంబంధించిన ఒక్క ముక్కా ఆ క్షణాన గుర్తుకు రాకపోవచ్చు. అంత మాత్రాన కంగారు పడాల్సిన పనిలేదు. మనసును కాస్త కుదుటపరుచుకుని కూర్చుంటే, కొంత అస్పష్టంగానే అయినా, ఒక్కొక్కటిగా అన్నీ గుర్తుకు వస్తాయి. అందు వల్ల రెండోసారి పైపైన చూసినా, పూర్తిస్థాయి స్పష్టత వచ్చేస్తుంది.

అందుకే రెండోసారి చదువుతున్నప్పుడు ప్రతి వాక్యాన్నీ చదవాల్సిన అవసరం సాధారణంగా ఉండదు. నిజానికి, చాలా పాఠాలు రెండోసారి చదివినప్పుడే అందులోని విషయం పూర్తిస్థాయిలో అవగాహనకు వస్తుంది. ముఖ్యమైన పాయింట్ ఏదో, కానిదేదో అప్పుడే తెలుస్తుంది. వాటిని మార్క్ చేయడానికి తోడ్ప డుతుంది. ఒకసారి హైలైట్‌లను మార్క్ చేసేసుకుంటే ఆ తర్వాత ఇంకెప్పుడూ మొత్తం పాఠం చదవాల్సిన అవసరం ఉండదు. రెండు మూడు నిమిషాలకు ఒక పేజీని తిప్పేస్తూ, మొత్తం విషయాన్ని ఆకళింపు చేసుకోవచ్చు.

అండర్‌లైన్ చేయడం, లేదా ఏదైనా గుర్తు పెట్టడం వల్ల పుస్తకం పాడైపోతుందన్న భావనతో కొందరుంటారు. తక్కువ సమయంలో ఎక్కువ విషయాన్ని మెదడులోకి ఎక్కించుకోవడంలో ప్రయోజనం ఉంది గానీ, పుస్తకాన్ని కాపాడుకోవడంలో గొప్పే ముంది? అందుకే ముఖ్యమైన అంశాలు ఎక్కడ ఉంటే అక్కడ ఏదో ఒక గుర్తు పెట్టడం మంచిదే. దాని వల్ల మానసిక శ్రమ తప్పుతుంది. ఈ విషయాలన్నీ దృష్టిలో ఉంచుకుని పిల్లలకు ఈ టెక్నిక్‌నూ, దాని లాభాలనూ తలితండ్రులే వివరించి చెప్పాలి.

ఫ్యామిలీ కౌన్సెలింగ్



అతనితోనే ఉండాలని...

నాకు వివాహమై ఆరునెలలైంది. వివాహమైన రెండు నెలలకే ఆయన విదేశాలకు వెళ్లారు. నాకు వీసా రాలేదని పుట్టింటికి పంపారు. ఇప్పుడేమో విడాకులు ఇమ్మంటున్నారు. ఆయనకిది రెండో వివాహం. మొదటి భార్యకి విడాకులు ఇచ్చాడు. నాకు ఆయనతోనే ఉండాలని ఉంది. విడాకులు ఇష్టం లేదు. ఏం చేయను?

- కవిత

మొదటి వివాహం విఫలమవడానికి కారణాలు చెప్పలేదు. మీరన్నా వివరంగా తెలుసుకున్నారా? లేదా విదేశాల్లో ఉద్యోగం అని మురిసిపోయి చేసుకున్నారా? రెండోసారి కూడా విడాకులు కావాలంటున్నాడంటే ఎక్కడో తేడా ఉంది. మీ పెద్దవాళ్ల ద్వారా మాట్లాడండి. మీరెందుకు ఆయనతోనే ఉండాలనుకుంటున్నారో అర్థం కావడం లేదు. కేవలం రెండు నెలలు కలిసి ఉన్నారు. వద్దంటున్న వారిని కోరుకోవడం ఎంతవరకు మీకు మేలు చేస్తుందోగానీ మీకిష్టం లేకుండా విడాకులు ఇవ్వలేరు. మిమ్మల్ని తీసుకెళ్లమని అడగండి. స్పందించకపోతే చట్టపరంగా చర్యలు తీసుకోండి.

- కె.శోభ
ఫ్యామిలీ కౌన్సెలర్, హార్ట్ టు హార్ట్
shobhas292@gmail.com

89 ఏళ్ల సర్పంచ్!

ఎనభై తొమ్మిదేళ్ల వయస్సులోనూ ప్రజాసేవ చేయాలనే దృఢ సంకల్పం ఆమెది. స్వాతంత్ర్య సమరయోధుడైన భర్త నుంచి సేవాగుణం ఒంట బట్టిందామెకు. ఆయన స్ఫూర్తితోనే ఎనిమిదేళ్ల క్రితం ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టి, ప్రజా శ్రేయస్సు కోసం అవిశ్రాంతంగా శ్రమిస్తున్న కార్య శీలి ఆమె. ఇటీవల ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మల్లారం గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైన పెద్దవయస్కురాలిగా రికార్డు సృష్టించారు దుగ్గిదేవర సామ్రాజ్యం. ప్రభుత్వ సహకారం, ప్రజల భాగస్వామ్యంతో మల్లారాన్ని ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దుతానంటున్న ఆమె 'నవ్య'తో పంచుకున్న అనుభవాలు...



విశేషం



తెలంగాణ సాయుధ పోరాటంలో నా భర్త దుగ్గిదేవర నరసయ్య పాల్గొన్నారు. రావి నారాయణరెడ్డి దళంలో కొరియర్‌గా పనిచేశారాయన. మా ఆయన ధనిక రైతు కుటుంబంలో జన్మించినప్పటికీ స్వార్థం తెలియని మనిషి. నిత్యం ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోరాటం సాగించేవారు. ఆస్తులన్నీ ప్రజాసేవకు కరిగించారు. నాలుగు దశాబ్దాలకుపైగా ప్రజా ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించారు. రెండుసార్లు జైలుశిక్ష కూడా అనుభవించారు. ఎల్లప్పుడూ ప్రజాసమస్యలపై పోరాడే నాభర్త తక్కువ కాలంలోనే మల్లారం ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్నారు. దాంతో రెండుసార్లు మల్లారం గ్రామ పంచాయతీకి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. కొన్నాళ్లకు క్యాన్సర్ వ్యాధితో ఆయన మంచాన పడ్డారు. ప్రజలకు మంచి చేయాలనే ఆయన ఆశయం ఆగిపోకూడదనే ఉద్దేశంతో నన్ను రాజకీయాల్లోకి వెళ్లమన్నారు. అలా ఆయన సూచన మేరకు 2001 సంవత్సరంలో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చాను.

ఓటమన్నదే తెలియదు...

2001లో తొలిసారిగా మల్లారం ఎంపీటీసీకి పోటీచేసి విజయం సాధించాను. 2006లో మల్లారం గ్రామపంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికయ్యాను. 2013లో తల్లాడ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం డైరెక్టర్‌గా, 2014లో రెండోసారి ఎంపీటీసీగా గెలుపొందాను. ఎంపీటీసీ సభ్యురాలిగా కొనసాగుతూనే గ్రామ పంచాయతీ నోటిఫికేషన్ రావడంతో పోటీ చేసి సర్పంచ్‌గా విజయం సాధించాను.

అభివృద్ధి పనులు సకాలంలో...

నేను ఎంపీటీసీ ఉన్న కాలంలో రహదారుల పునర్నిర్మాణం, కల్వర్టు, సైడ్‌వాల్స్ నిర్మింపజేశాను. తల్లాడ నుంచి సబ్‌స్టేషన్ మీదుగా గంగదేవిపాడు వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణానికి రూ.6.70కోట్ల నిధులు మంజూరు అయ్యేలా చేశాను.

సర్పంచ్‌గా ఉన్నప్పుడు తాగునీటి ఎద్దడి నివారణకు గ్రామాల్లో వాటర్ ట్యాంకుల నిర్మాణం, పైపులైన్ల విస్తర్ణ, మల్లారంలో హాస్టల్, ఆరోగ్య ఉపకేంద్రం, పక్కా గృహాలు, వ్యక్తిగత మరుగుదొడ్లు, సీసీ రోడ్డు, సైడ్‌డ్రెయినేజీ, చెరువులకు రివిట్‌మెంట్, తూములు, లింక్ కెనాల్ నిర్మాణం, మెటల్ రోడ్డు వంటి అభివృద్ధి పనులను పూర్తిచేశాను. ఈ పనులన్నీ సకాలంలో పూర్తవడంలో అధికారుల సహకారం, సమన్వయం మరువలేనిది.

నా భర్త ఆశయ స్ఫూర్తితో తుదిశ్వాస విడిచేంత వరకూ ప్రజాసేవకే నా జీవితం అంకితం చేయాలని నిర్ణయించుకున్నా. ప్రజలు నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయకుండా నిత్యం వారి సమస్యల పరిష్కారం కోసం శ్రమిస్తాను. అభివృద్ధిలో మల్లారాన్ని ఇతర గ్రామాలకు మార్గదర్శకంగా నిలిపేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తా.

● మాదిరాజ్ సుధాకర్, సత్తుపల్లి

మన దగ్గరే!



ఆధ్యాత్మికతతో ఆదివాసీ సంస్కృతి పెనవేసుకున్న అపురూపమైన వేడుక నాగోబా జాతర. ఆదివాసీలు తమ ఆరాధ్యదైవమైన సర్పదేవత నాగోబాను అర్చిస్తూ ఎంతో ఘనంగా జరిపే ఈ వేడుక ప్రాచీనమైనదే కాదు... ఎన్నో విశిష్టతలు కలిగినది కూడా.

నాగోబా జాతర... ఆదివాసీ మేళా!

ప్రతియేటా పుష్యమాసం రాగానే తెలంగాణలోని కేస్లాపూర్‌లో నాగోబా జాతర సంరంభం ప్రారంభమవుతుంది. అతి తక్కువ జనాభా ఉండే ఈ గ్రామం జాతర రోజుల్లో జనసముద్రమైపోతుంది. ఆదిమ గిరిజనుల్లో గోండు తెగకు చెందిన మెస్రం వంశస్థులు నాగోబాకు పూజలు నిర్వహిస్తారు. వందల ఏళ్ళ నుంచీ ఈ సంప్రదాయం ఏమాత్రం మార్పు లేకుండా కొనసాగుతూ ఉండడం విశేషం. నాగోబాను పూజిస్తే పంటలు సమృద్ధిగా పండుతాయనీ, శాంతి నెలకొంటుందనీ, రోగాలు మటుమాయం అవుతాయనీ భక్తులు విశ్వసిస్తారు. నాగోబా ఆవిర్భావం గురించి అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి. పూర్వం మెస్రం కుటుంబానికి చెందిన నాగాయి మోతి రాణికి కలలో కనిపించి, సర్పరూపంలో ఆమె గర్భాన జన్మిస్తానని చెప్పాడట. ఆ కల నిజమయిందట. గోండుల ఇళ్ళలో కొత్తగా పెళ్ళయిన ప్రతి జంటనూ తన సన్నిధికి తీసుకువచ్చి, తనకు పరిచయం చేయాలని నాగేంద్రుడు కోరాడట. ప్రతి సంవత్సరం పుష్య అమావాస్య రోజున స్వయంగా ప్రత్యక్షమవుతానని వరమిచ్చాడట!

ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని మెస్రం గిరిజనులతో పాటు ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌గడ్, ఒరిస్సా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన మెస్రం గిరిజనులు ఈ వేడుకలకు తరలి వస్తారు.

ఇరవై తెగలు- ఏడుగురు దేవతలు

మెస్రం వంశంలో ఇరవై తెగలున్నాయి. వారు కొలిచే దేవతలు ఏడుగురు. నాగోబా జాతరలో పూజలను ఈ వంశీయులు నిర్వహిస్తారు. జాతరకు ముందు రోజు నాటికి ఎక్కడెక్కడో ఉన్న ఈ వంశం వారంతా కేస్లాపూర్ చేరుకొని, నాగోబా ఆలయం పక్కన విడిది చేస్తారు. వారి పూజలు పూర్తయ్యాకే ఇతరులను నాగోబా దర్శనానికి అనుమతిస్తారు.

నెలల రోజుల ముందే...

నాగోబా జాతరకు ఏర్పాట్లు నెల రోజుల ముందే మొదలవుతాయి. పుష్య పౌర్ణమి రోజున మెస్రం వంశీయులు కేస్లాపూర్‌లో పూజలు నిర్వహిస్తారు. అనంతరం పవిత్ర గోదావరి జలాలను తీసుకురావడానికి కాలినడకన బయలుదేరుతారు. జన్నారం మండలంలోని కలమడుగు ప్రాంతంలో ఉన్న గోదావరి హస్తిన మడుగులో జలాలకు పూజలు చేస్తారు. కుండల్లో, పాత్రల్లో తీసుకొని, తిరిగి కేస్లాపూర్‌కు పయనమవుతారు. ఇంద్రవెల్లిలోని ఇంద్రాయి గ్రామం వద్దకు చేరుకొని, ఇంద్రాయి దేవతను పూజిస్తారు. అదే రోజు రాత్రి కేస్లాపూర్ చేరుకొని, ఆలయ ప్రాంగణంలోని మర్రి చెట్టు



దగ్గర విడిది చేస్తారు. పుష్య అమావాస్య (ఫిబ్రవరి నాలుగో తేదీ) రాత్రి నాగోబాకు అభిషేకాలు జరుపుతారు. మరుసటి రోజు నుంచి ప్రధాన జాతర ప్రారంభమవుతుంది. కొత్త కుండల్లో నీటిని మహిళలు తీసుకువచ్చి ఆలయాన్ని శుద్ధి చేస్తారు. గోదావరి జలాలను ఊరేగింపుగా తీసుకువెళ్ళి, నాగోబాను అభిషేకిస్తారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని మేస్రం గిరిజనులతో పాటు ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌గడ్, ఒరిస్సా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన మెస్రం గిరిజనులు ఈ వేడుకలకు తరలి వస్తారు. పూజలకు కావలసిన సామగ్రినీ, వంట కోసం సరుకులనూ, కట్టెలనూ సైతం తమతో తీసుకువస్తారు. జాతరకు చేరుకోవడానికి ఇప్పటికీ వారు ఎడ్ల బళ్ళనే ఉపయోగిస్తున్నారు. మహిళలు, పిల్లలు, వృద్ధులూ ఆ బళ్ళలో కూర్చుంటారు. పురుషులు వివిధ వాయిద్యాలు వాయిస్తూ కాలినడకన వెంట వస్తారు. జాతరలో పితృదేవతల పూజలు ప్రధానంగా ఉంటాయి.

కొత్త కోడళ్ళ పరిచయం

మెస్రం కుటుంబాల్లోకి కొత్త కోడళ్ళుగా వచ్చినవారు నాగోబా దర్శనానికి తప్పనిసరిగా రావాల్సి ఉంటుంది. దీన్ని 'బేటింగ్' అంటారు. పరిచయం కావాల్సిన



వధువులను 'బేటి కోరియాడ్' అని అంటారు. ఆ పరిచయం తరువాత మాత్రమే నాగోబా పూజలకు వారిని అనుమతిస్తారు. నాగోబాకు పరిచయం చేసిన తరువాతే, మిగిలిన వంశీయులకు వారిని పరిచయం చేస్తారు.

నాగోబా దర్బార్

జాతరలో నాలుగో రోజున (ఈ నెల ఏడో తేదీన)



1941లో మొదటి సారి నాగోబా దర్బారు నిర్వహించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా జిల్లా అధికారులు దర్బారు నిర్వహణను కొనసాగిస్తున్నారు.

నాగోబా దర్బారు జరుగుతుంది. నాగోబా చెంతకు వస్తున్న గిరిజనులందరినీ సారి కలిసి, వారి సమస్యలు తెలుసుకొని, పరిష్కరించడానికి ఈ జాతర అనువైనదని ఈ ప్రాంతాన్ని సందర్శించిన హెమన్ డార్ఫ్ అనే మానవ పరిణామ శాస్త్రవేత్త భావించారు. ఆయన ఆలోచనలకు అనుగుణంగా 1941లో మొదటి సారి నాగోబా దర్బారు నిర్వహించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా జిల్లా అధికారులు దర్బారు నిర్వహణను కొనసాగిస్తున్నారు.

ఎక్కడ?: తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో

ఎప్పుడు?: ఫిబ్రవరి 4 నుంచి 7 వరకూ

ఎలా వెళ్ళాలి?: ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి 40 కి.మీ. దూరంలో ముత్నూరు ఉంది. అక్కడికి నాగోబా ఆలయం 4 కి.మీ. దూరంలో ఉంటుంది. ఆసిఫాబాద్, మంచిర్యాల నుంచి వచ్చేవారు ఉట్నూర్ మీదుగా ముత్నూరు చేరుకోవచ్చు.

• **పొదిల సుదర్శన్**, ఉట్నూర్

మీకు తెలుసా!

బుల్లెట్... కాదు స్టవ్!



బుల్లెట్ ట్రైన్ అంటే కళ్ల ముందు మెదిలే దేశం జపాన్. దాని స్ఫూర్తితో అన్ని దేశాలూ ఆ సాంకేతికతను అందుకోవడానికి సన్నాహాలు చేస్తున్నాయి. కానీ జపాన్ మాత్రం శీతకాలంలో మాత్రం వెనక్కి వెళుతుంది. గత కాలపు జ్ఞాపకాలను గుర్తుతెచ్చేలా.... పాతకాలపు ట్రైన్లను నడుపుతోంది. ప్రయాణికులకు సరికొత్త అనుభూతిని అందిస్తోంది. 1930ల్లో ఆ దేశంలో 'స్టవ్ ట్రైన్లు' ఉండేవి. అవి కేవలం గంటలకు 50 కి.మీ వేగంతో వెళతాయి. ఇప్పుడు మళ్లీ వాటిలో ప్రయాణించే అవకాశాన్ని ఆ దేశానికి చెందిన సుగురు రైల్వే అందిస్తోంది. అందుకే శీతాకాలం వచ్చిందంటే, స్థానికులే కాదు... పర్యాటకులూ ఈ ప్రయాణాలకు క్యూ కడతారు. ఎందుకంటే ఈ ట్రైన్లు నడిచేది అక్కడే. ఈ ట్రైన్ల బయట బయట గడ్డకట్టించేంత చలిగా ఉంటుంది. కానీ లోపల వెచ్చగా ఉంటుంది. ఎందుకంటే ప్రతి బోగీలోనూ వేడిని అందించే స్టవ్ ఒకటి ఉంటుంది. అందుకే దీన్ని 'స్టవ్ ట్రైన్' అని పిలుస్తారు. గోషాగవరా స్టేషన్ నుంచి నకాసటో స్టేషన్‌కు చేరుకోవడానికి 45 నిమిషాలు పడుతుంది. మంచు దుప్పటి కప్పుకొని ఉన్న దారిలో ట్రైన్ వెళుతూ, చుట్టూ ఉండే పరిసరాలను ఆస్వాదించాలనుకునేవారికి 'స్టవ్ ట్రైన్' ఇప్పుడు కేరాఫ్ అడ్రస్. ప్రతి ఏడాది డిసెంబర్ నుంచి మార్చి నెలాఖరు వరకు ఈ సర్వీసులను సుగరు రైల్వే లైన్ నడుపుతోంది.



సమాచారం

షిప్‌లో షికారు..!

క్రూయిజ్ టూరిజమ్.... ఇప్పుడు లేటెస్ట్ ట్రెండ్. ప్రైవేటు ఆపరేటర్లు ఇటీవలే ముంబయి, సింగపూర్ లాంటి దేశాలకు మన దేశంలోని ప్రధాన పోర్టుల నుంచి సర్వీసులను ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ప్రభుత్వ సంస్థ ఐఆర్‌సీటీసీ కూడా క్రూయిజ్ టూరిజంలోకి అడుగుపెట్టింది. కొత్తగా డెన్మార్క్ దేశానికి 12 రోజుల టూర్ ప్రకటించింది. ఈ ఏడాది జూన్ 24 నుంచి జూలై 6 వరకూ ఈ టూర్ సాగుతుంది. ఢిల్లీ నుంచి అరబ్ ఎమిరేట్స్ మీదుగా డెన్మార్క్ రాజధాని కోపెన్‌హాగ్ చేరుకున్నాక, అక్కడి నుంచి క్రూయిజ్ ప్రయాణం ప్రారంభమవుతుంది. హెల్‌సింకీ, స్టాక్‌హోమ్‌ల నగరాల మీదుగా యాత్ర సాగుతుంది. మళ్లీ జూలై 6న కోపెన్‌హాగ్ చేరుకుంటుంది.

టికెట్ ధర: రూ. 4,83,630 (పెద్దలకు)
రూ. 2,43,516 (పిల్లలకు)



చూసొద్దామా?



అక్కడ ఆరేళ్ల పిల్లలు వెయిట్ లిఫ్టింగ్‌లో కరణం మల్లీశ్వరిని తలపిస్తారు
80 ఏళ్ల వాళ్లు పరుగుల్లో పీటీ ఉషను మరపిస్తారు
ఎవరైనా సరే పోటీకి సై అంటారు
ఎడ్ల పందేలు లేదా కుస్తీలు కావచ్చు...
అంతర్జాతీయ క్రీడలకు దీటుగా నిలుస్తాయి.
అదే 'కిలా రాయ్‌పూర్ స్పోర్ట్స్ ఫెస్టివల్'.

ఈ 'ఒలింపిక్స్' పక్కా లోకల్!

పంజాబ్ రాష్ట్రంలోని కిలా రాయ్‌పూర్‌లో జరిగే ఈ స్పోర్ట్స్ ఫెస్టివల్ కథ ఇప్పటిది కాదు. దీని గురించి తెలుసుకోవాలంటే 1930 దశకానికి వెళ్లాల్సిందే. ఇందర్‌సింగ్ గ్రేవాల్ అనే వ్యక్తి 1933లో దీనికి శ్రీకారం చుట్టారు. ప్రతి ఏడాది చుట్టుపక్కల ఊళ్లల్లోని రైతులను కలిసి సరదాగా ఆటల పోటీలు నిర్వహించేవాడు. పురుషులే కాదు... మహిళలు, పిల్లలు అందరూ ఆ క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనేవారు. క్రమంగా అది ఆ ఊరికి సరికొత్త గుర్తింపు తీసుకొచ్చింది. అలా 86 ఏళ్ల నుంచి ఈ పోటీలు చుట్టుపక్కల ఊరివారికి అలవాటయ్యేలా చేసింది గ్రేవాల్ స్పోర్ట్స్ కమిటీ! కానీ మధ్యలో ఒకటి, రెండు సార్లు ఈ పోటీలను అనివార్య కారణాల వల్ల నిర్వహించలేదు. క్రమంగా ఇతర ప్రాంతాలవారూ, విదేశీయులు కూడా ఆకర్షితులయ్యారు. ఈ ఏడాది ఫిబ్రవరి 1వ తేదీన ప్రారంభమయ్యే గ్రామీణ క్రీడల్లో పాల్గొనడానికి విదేశీ జట్లు కూడా సై అంటున్నాయి. ఇప్పటికే కెనడాలోని వాంకోవర్ నుంచి కబడ్డీ, ఖోఖో ఆడటానికి అక్కడి క్రీడాకారులు వచ్చేశారు. అంతేకాదు దివ్యాంగుల కోసం ప్రత్యేక పోటీలు నిర్వహిస్తూ ఉంటారు. ఈ ఉత్సవాలను స్పాన్సర్ చేయడానికి బడా బడా కంపెనీలు సైతం పోటీపడుతూ ఉంటాయి. అందుకే ఇవి 'రూరల్ ఒలింపిక్స్'గా అందరినీ ఆకర్షిస్తున్నాయి.

ఎప్పుడు: ఫిబ్రవరి 1 నుంచి 3వ తేదీ వరకు



ఈ ఏడాది ఫిబ్రవరి 1వ తేదీన ప్రారంభమయ్యే గ్రామీణ క్రీడల్లో పాల్గొనడానికి విదేశీ జట్లు కూడా సై అంటున్నాయి. ఇప్పటికే కెనడాలోని వాంకోవర్ నుంచి కబడ్డీ, ఖోఖో ఆడటానికి అక్కడి క్రీడాకారులు వచ్చేశారు.

ఎక్కడ: పంజాబ్ రాష్ట్రంలోని లుధియానా జిల్లాలోని కిలా రాయ్‌పూర్‌లో

ఎలా వెళ్లాలి?: తెలుగు రాష్ట్రాలలోని హైదరాబాద్, విజయవాడ, తిరుపతి తదితర ప్రధాన ప్రాంతాల నుంచి లుధియానాకు నేరుగా రైళ్లు ఉన్నాయి. లుధియానా విమానాశ్రయం ఉన్నా, అక్కడికి రెగ్యులర్ సర్వీసులు తక్కువ. న్యూఢిల్లీ, అమృత్‌సర్ వరకూ వెళ్లి అక్కడి నుంచి రైలు, రోడ్డు మార్గాల్లో లుధియానా చేరుకోవచ్చు. అక్కడి నుంచి కిలా రాయ్‌పూర్ 15 కి.మీ దూరంలో ఉంది.

ఏ ఆటకైనా రెఢీ!

ఫిబ్రవరి నెల దగ్గర పడుతోందంటే పంజాబ్‌లోని కిలా రాయ్‌పూర్ గ్రామం కొత్త కళ సంతరించుకుంటుంది. చుట్టుపక్కల ఊళ్లలోని ప్రజలందరూ అక్కడికి ఎప్పుడెప్పుడు వెళ్లాలా అని ఆత్రతగా ఎదురుచూస్తూ ఉంటారు. వారందరి నిరీక్షణ 'కిలాపూర్ స్పోర్ట్స్ ఫెస్టివల్' కోసమే. సాధారణ ఒలింపిక్స్ తరహాలో ఇక్కడ కూడా లాంగ్‌జంప్, హైజంప్, మార్షల్ ఆర్ట్సులలో పోటీలు ఉంటాయి. అంతేకాదు, గుర్రపు పందేలు, ఎడ్ల పందేలు, డాగ్ రేస్‌లు, సైకిల్ పోటీలు, ఆర్చరీ, ప్యారా గ్లైడింగ్, ఖోఖో, కబడ్డీ లాంటి క్రీడలూ చోటుచేసుకుంటాయి. కేవలం దంతాలు, ముక్కుతో ట్రాక్టర్, కార్లు లాగే కొందరు పలకరిస్తారు. తమ గగుర్పొడిచే విన్యాసాలతో ఆశ్చర్యపోయేలా చేస్తారు.



భక్తులు ఆలయాలకు వెళ్ళడం, దేవుడికి కోరికలు విన్నవించుకోవడం సర్వసాధారణం. అవి 'ఆ దైవం వింటున్నాడా?' అని సందేహపడేవారూ కొందరుంటారు. ఆ ఆలయానికి వెళ్ళే భక్తులు మాత్రం స్వామి తమ కోర్కెలు స్వయంగా ఆలకిస్తాడని బలంగా విశ్వసిస్తారు. పైగా ఆ స్వామికి 'మాట్లాడే దేవుడు' అనే ఖ్యాతి కూడా ఉంది. అదే తమిళనాడులోని కాంచీపురానికి దగ్గరలో ఉన్న కూళంపందళ్‌లో కొలువైన 'పేసుం పెరుమాళ్'!

'మాట్లాడే' దేవుడు!



తమిళ ప్రాంతాన్ని తెలుగు చోళరాజులు పాలించే కాలంలో ఇప్పటి కూళంపందళ్‌ను 'విక్రమ చోళపురం' అని పిలిచేవారు. తంజావూరు చోళుల కాలంలో 'పేసుం పెరుమాళ్' (మాట్లాడే మహావిష్ణువు) ఆలయం నిర్మితమైనట్టు చరిత్ర చెబుతోంది. క్రీ.శ. 1270వ దశకంలో నెల్లూరుకు చెందిన విజయకంఠ గోపాలరాజు ఈ ఆలయానికి నిత్యం వస్తుండేవాడనీ, ఆయన స్వామివారితో మాట్లాడేవాడనీ ఆలయం వద్ద వేసిన శాసనాలు చెబుతున్నాయి. విజయకంఠ గోపాలరాజు స్వామివారి సన్నిధిలో కూర్చుని సుదీర్ఘ ధ్యానం చేసేవాడట! ఆయన తన ఆలోచనలు, తనకు ఎదురయ్యే సమస్యలు అన్నీ స్వామివారితో చర్చించేవాడట! అందుకే ఈ పెరుమాళ్‌కు 'పేసుం పెరుమాళ్' (మాట్లాడే పెరుమాళ్) అని పేరు వచ్చిందంటారు. ఇదే ప్రాంగణంలో శివాలయం వుండేదని, క్రీ.శ. 1012-1044 మధ్య కాలంలో రాజేంద్ర చోళుడు దానిని నిర్మించాడని కూడా చరిత్ర చెబుతోంది. అలాగే తెలుగు చోళులు ఇచ్చిన మాన్యాలను దుర్వినియోగం చేసి, యువతులను చెరబట్టి, వారిని



చంపి, ఆ చితాభస్మాన్ని పాలలో కలిపి తనకు తిరుమంజనం చేసిన ఆ ఊరి పెద భట్టార్‌ను స్వామి దగ్ధం చేశాడని మరో కథనం ఉంది. ఆ వివరాలను స్వామి స్వయంగా చెప్పి, శిలాశాసనాలు వేయించాడట! జరిగిన విషయాన్ని ఎత్తిచూపిన కారణంగా స్వామివారికి 'మాట్లాడే పెరుమాళ్' అనే పేరు వచ్చిందని మరో కథనం ప్రచారంలో వుంది. ఇక్కడ శ్రీదేవి, భూదేవి సమేతుడైన వేంకటేశ్వరుడు నిలుచునే భక్తులకు అభయ హస్తంతో దర్శనమిస్తాడు. మాటలు రాని వారూ, వినికిడి లోపం ఉన్నవారూ ఈ స్వామివారిని పూజిస్తే మంచి ఫలితం ఉంటుందని నమ్మిక. భక్తుల మాటలు

క్రీ.శ. 1270వ దశకంలో నెల్లూరుకు చెందిన విజయకంఠ గోపాలరాజు ఈ ఆలయానికి నిత్యం వస్తుండేవాడనీ, ఆయన స్వామివారితో మాట్లాడేవాడనీ ఆలయం వద్ద వేసిన శాసనాలు చెబుతున్నాయి.

స్వామి ఆలకిస్తున్నారన్న విశ్వాసానికి ప్రతీకగా ఇక్కడున్న ఆపదమొక్కులవాడి చెవులు పెద్దవిగా ఉంటాయి.

ఇవీ ఉత్సవాలు

పెరుమాళ్ ఆలయంలో వైశాఖమాస విశాఖ నక్షత్రం రోజున 15 గ్రామాల భక్తులు అత్యంత వైభవంగా గరుడసేవ నిర్వహిస్తారు. ఇతర ముఖ్య పర్వదినాల్లో కూడా ప్రత్యేక పూజలు జరుగుతాయి.

ఈ ఆలయంలో నిర్వహించే ప్రధాన ఉత్సవాల్లో గుడారవల్లి ఉత్సవం ఒకటి. కూరగాయలు, పండ్లు, నూట ఎనిమిది ద్రవ్యాలు, మూలికలు, పుష్పాలతో ఏర్పాటైన మండపంలో (గుడారంలో) ఈ ఉత్సవాలు ప్రతి సంవత్సరం డిసెంబర్- జనవరి నెలల మధ్య జరుగుతాయి. ఈ గుడారంలో ఆండాళ్, నాచ్చియార్‌లు కూడా ఆసీనులై పూజలు అందుకుంటారు. ఈ ఉత్సవంలో పాల్గొనే వారికి వివాహ అడ్డంకులు తొలగిపోతాయంటారు.

ఎలా వెళ్ళాలి?: తమిళనాడు రాజధాని చెన్నైకి తెలుగు రాష్ట్రాలలోని అన్ని ముఖ్య ప్రాంతాల నుంచి బస్సు, రైలు, విమాన సౌకర్యాలున్నాయి. అక్కడికి సుమారు 80 కి.మీ. దూరంలో కంచి (కాంచీపురం ఉంది) కాంచీపురానికి 18 కి.మీ. దూరంలో, వందవాసి వెళ్ళే మార్గంలో కూళంపందళ్ (లేదా కూళమండల్) ఉంది. బస్సులు, ఆటోల్లో చేరుకోవచ్చు.

• **డాక్టర్ ఎస్.కె.ఎం.డి.గౌస్ బాషా**, చెన్నై.



'వెంకీ మామ'తో... ఇది మూడోసారి




వెంకటేశ్ - శ్రియ జోడీ మరోసారి కనువిందు చేయనుంది! 'సుభాష్ చంద్రబోస్'లో తొలిసారి... 'గోపాల గోపాల'లో మలిసారి... వెంకటేశ్ సరసన కథానాయికగా శ్రియ రెండుసార్లు నటించారు. 'తులసి'లో ప్రత్యేక గీతం చేశారు. ఇప్పుడు ముచ్చటగా మూడోసారి కథానాయికగా నటించేందుకు సిద్ధమవుతున్నారు. వెంకటేశ్, నాగచైతన్య కథానాయకులుగా కె.ఎస్. రవీంద్ర (బాబీ) దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమా 'వెంకీ మామ'. ఇందులో నాగచైతన్యకు జోడీ రకుల్‌ప్రీత్ సింగ్‌ని ఎంపిక చేశారు. వెంకీకి జోడీగా శ్రియను తీసుకున్నారు. ఫిబ్రవరి 22 తరవాత నుంచి హైదరాబాద్‌లో చిత్రీకరణ ప్రారంభం కానుంది. నిజ జీవితంలో మామాఅల్లుళ్లు అయిన వెంకీ, చైతూ ఈ చిత్రంలోనూ మామాఅల్లుళ్లుగా సందడి చేయనున్నారు. ప్రేమ, వినోదం, యాక్షన్ అంశాలతో చక్కటి కుటుంబ కథా చిత్రంగా 'వెంకీమామ'ను రూపొందిస్తున్నారట! ఈ చిత్రాన్ని సురేశ్ ప్రొడక్షన్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, కోన ఫిల్మ్ కార్పొరేషన్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

అనసూయ 'కథనం'



"నేను అసోసియేట్ దర్శకురాలిగా, ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రమిది. అందరూ అనుకుంటున్నట్టు, 'క్షణం'లో చేసిన పోలీస్ పాత్ర కాదు. కథ, కథనాలు ఉత్కంఠభరితంగా సాగుతాయి. 'క్షణం', 'రంగస్థలం'.. నేను నటించిన చిత్రాలు విజయాలు సాధించాయి. 'అనసూయ.. మంచి చిత్రాల్లో నటిస్తుంది' అని ప్రేక్షకులు ఓ నమ్మకం పెట్టుకున్నారు. ఆ నమ్మకాన్ని వమ్ము చేయను. ప్రేక్షకులకు ఈ చిత్రం నచ్చుతుంది" అని అనసూయ అన్నారు. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా 'కథనం'. రాజేశ్ నాదెండ్ల దర్శకుడు. అవసరాల శ్రీనివాస్, రణధీర్, ధన్‌రాజ్, 'వెన్నెల' కిశోర్ ముఖ్య తారాగణం. ది మంత్ర ఎంటర్‌టైన్‌మెంట్స్, ది గాయత్రి ఫిల్మ్స్ పతాకాలపై బి. నరేంద్రరెడ్డి, శర్మ చుక్కా నిర్మిస్తున్నారు. ఈ సినిమా టాకీ పార్ట్ చిత్రీకరణ బుధవారంతో పూర్తయింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బి. నరేంద్రరెడ్డి మాట్లాడుతూ "నేను డిస్ట్రిబ్యూషన్ నుంచి ప్రొడక్షన్‌లోకి వచ్చాను. 'మంగళ' చిత్రానికి పార్ట్ టైమ్ నిర్మాతగా చేశా. ఈ సినిమాతో ఫుల్ టైమ్ నిర్మాతగా మారా. అనసూయ చిన్న పాత్రల్లో నటించిన సినిమాలు బ్లాక్‌బస్టర్స్ అయ్యాయి. ఈ సినిమా డబుల్ బ్లాక్‌బస్టర్ అవుతుంది" అన్నారు. రాజేశ్ నాదెండ్ల మాట్లాడుతూ "క్రైమ్ థ్రిలర్ చిత్రమిది. ఫిబ్రవరిలో బ్యాలెన్స్ రెండు పాటలు చిత్రీకరించి, వేసవిలో సినిమాను విడుదల చేయాలనుకుంటున్నాం" అన్నారు. ఈ కార్యక్రమంలో రణధీర్, ధన్‌రాజ్ పాల్గొన్నారు. ఈ చిత్రానికి సునీల్ కశ్యప్ సంగీత దర్శకుడు.

చినుకే నాకే చూపే...



వినాయక్, అనురాగ్

అనురాగ్ కొణిదెన హీరోగా పరిచయవుతున్న చిత్రం 'మళ్లీ మళ్లీ చూశా'. సాయిదేవ రామన్ దర్శకత్వంలో కొణిదెన కోటేశ్వరరావు నిర్మించిన ఈ చిత్రంలోని 'చినుకే నాకే చూపే' పాటను ఆదిత్య మ్యూజిక్ సంస్థ ద్వారా దర్శకుడు వినాయక్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 'పాట వినసొంపుగా ఉంది. ట్రైలర్ సైతం అందరికీ చేరువయ్యేలా ఉంది. హీరో అనురాగ్ లుక్ , స్క్రీన్ ప్రజెన్స్ బాగుంది. టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్' అని చెప్పారు. 'ప్రేమకు ప్రకృతి తోడైతే ఎంతో అందంగా ఉంటుందన్న కాన్సెప్ట్‌తో తీసిని చిత్రమిది. శ్రవణ్ సంగీతం, సతీశ్ ముత్యాల ఫొటోగ్రఫీ ఎసెట్స్‌గా నిలుస్తాయి. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి' అన్నారు. చాలా రోజుల తర్వాత వస్తున్న ఆహ్లాదకరమైన ప్రేమకథా చిత్రమిదని నిర్మాత కోటేశ్వరరావు చెప్పారు. ఈ చిత్రానికి సాయి సతీశ్ పాలకుర్తి ఎగ్జిక్యూటివ్ నిర్మాత.

'శివాజీ' తర్వాత మరో మంచి పాత్ర

- సుమన్



'ఈ సినిమాలో నేను హీరోయిన్ తండ్రి పాత్ర పోషించాను. చాలా ప్రాక్టికాలిటీ ఉన్న పాత్ర. కామెడీ, ట్రాజెడీ, నెగెటివ్, పాజిటివ్.. ఇలా అన్ని రకాల కోణాలు కలిగిన విభిన్న పాత్ర అది. 'శివాజీ' చిత్రం తర్వాత నేను పోషించిన మరో విభిన్నమైన విలన్ పాత్ర ఇది' అని చెప్పారు సుమన్. ఆయన కీలక పాత్ర పోషించిన 'బిచ్చగాడా మజాకా' (బ్రేకప్ లవ్‌స్టోరీ) చిత్రం ఫిబ్రవరి ఒకటిన విడుదల కానుంది. ఎస్.ఎ.రెహమాన్ సమర్పణలో బి.చంద్రశేఖర్ ఈ సినిమా నిర్మించారు. కె.ఎస్.నాగేశ్వరరావు దర్శకుడు. సుమన్ చిత్రం గురించి వివరిస్తూ 'కష్టపడి పని చేయడం ఎందుకు? షార్ట్‌కట్‌లో డబ్బు వచ్చేస్తే ఎంజాయ్ చేసేద్దాం అనే ఆలోచన కలిగిన యువతకు సంబంధించిన కథ ఇది. కామెడీ, సెంటిమెంట్, ఎమోషన్, లవ్ అంశాలు అలరిస్తాయి. హీరో అర్జున్ రెడ్డి నటనకు మంచి అవకాశం ఉన్న పాత్ర పోషించాడు. సాదారణంగా కొత్త హీరోలు ఈ తరహా సీన్లలో నటించడానికి ఇబ్బంది పడతాడు. కానీ ఇతను బాగా చేశాడు. హీరోయిన్ నేహా దేశ్ పాండే కూడా ఎమోషనల్ సీన్లలో బాగా నటించింది. అలాగే బాబూమోహన్‌గారు మరో మంచి పాత్ర పోషించారు. దర్శకుడు కె.ఎస్.నాగేశ్వరరావు ఎంతో అనుభవం కలిగిన దర్శకుడు. చాలా కాలం తర్వాత ఇద్దరం కలిసి పనిచేశాం. పరిమిత బడ్జెట్ చిత్రాలను వేగంగా తీయడం చాలా ముఖ్యం. కొన్ని ఇబ్బందులు ఎదురైనా తన అనుభవంతో చక్కని చిత్రం రూపొందించారాయన' అని అన్నారు.



అలెక్సా, తనిష్క్‌రెడ్డి, మేఘ్లా ముక్తా

వందశాతం వినోదం!

తనిష్క్‌రెడ్డి, మేఘ్లా ముక్తా జంటగా నటించిన చిత్రం 'సకల కళా వల్లభుడు'. శివ గణేశ్ దర్శకుడు. అనిల్, త్రినాథ్, కిశోర్, శ్రీకాంత్ నిర్మాతలు. బీరం సుధాకర్‌రెడ్డి చిత్రసమర్పకుడు. ఈ శుక్రవారం సినిమా ప్రేక్షకుల ముందుకొస్తుంది. ఈ సందర్భంగా అనిల్, శ్రీకాంత్ మాట్లాడుతూ "కుటుంబ అనుబంధాలు, వినోదం, యాక్షన్ అంశాలతో తెరకెక్కిన చిత్రమిది. ప్రేక్షకులకు వందశాతం వినోదాన్ని పంచుతుంది. నటీనటులు కొత్తవారైనా చాలా బాగా నటించారు" అన్నారు. "2019లో విజయవంతమైన చిత్రాల్లో మా 'సకల కళా వల్లభుడు' చోటు దక్కించుకుంటాడని ఆశిస్తున్నా" అని శివ గణేశ్ అన్నారు. "పాటలు, ఫైట్స్, వినోదం... సకల హంగులున్న చిత్రమిది" అని తనిష్క్‌రెడ్డి అన్నారు



రాయ్ లక్ష్మి

పాపా... అత్తిలి పాపా... నీకేదంటే ఇష్టం!

రాయ్ లక్ష్మి ప్రధాన పాత్రలో నటించిన హారర్ కామెడీ చిత్రం 'వేర్ ఈజ్ వెంకటలక్ష్మి'. కిశోర్‌కుమార్ దర్శకుడు. ఎం. శ్రీధర్‌రెడ్డి, హెచ్. ఆనంద్‌రెడ్డి, ఆర్కే రెడ్డి నిర్మాతలు. రామ్ కార్తీక్, పూజితా పొన్నాడ జంటగా నటించారు. సినిమా చిత్రీకరణ పూర్తయింది. అలాగే, ఇటీవల 'పాపా... అత్తిలి పాపా... నీకేదంటే ఇష్టం' పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ "సినిమాలో రాయ్ లక్ష్మి నటన, అందంతో పాటు ప్రవీణ్, మధునందన్ కామెడీ హైలైట్‌గా నిలుస్తుంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, పాటలకు మంచి స్పందన లభిస్తోంది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలో టీజర్, మార్చిలో చిత్రాన్ని విడుదల చేయాలని అనుకుంటున్నాం" అన్నారు. ఈ చిత్రానికి రచయిత: తాటవర్తి కిరణ్, సంగీతం: హరి గౌర.

తల్లిదండ్రుల ప్రోత్సాహమే బలం

- ఎస్వీ కృష్ణారెడ్డి



టువ, ఈశ్వర్, అంకిత

"చిత్రసీమలోనే కాదు.. ఏ రంగంలోనైనా తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఆశీర్వాదమే బలం. ఆ బలం లేకుండా రాణించడం కష్టం. హీరో కావాలనే ఈశ్వర్ గొప్ప కలను తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారు. తను మంచి స్థాయికి ఎదగాలని కోరుకుంటున్నా" అని ఎస్వీ కృష్ణారెడ్డి అన్నారు. ఈశ్వర్‌ని హీరోగా పరిచయం చేస్తూ దొమ్మరాజు హేమలత, దొమ్మరాజు ఉదయ్‌కుమార్ నిర్మించిన చిత్రం '4 లెటర్స్'. 'కుర్రాళ్ళకి అర్థమవుతుందిలే...' అనేది ఉపశీర్షిక. అంకిత, టువ హీరోయిన్లు. ఆర్. రఘురాజ్ దర్శకుడు. భీమ్స్ స్వరకర్త. ఈ చిత్రం పాటల్ని బుధవారం ఎస్వీ కృష్ణారెడ్డి, అచ్చిరెడ్డి విడుదల చేశారు. నిర్మాణ సంస్థ శ్రీచక్ర క్రియేషన్స్ లోగోను 'జెమిని' కిరణ్ విడుదల చేశారు. "నటీనటులు, నిర్మాణ వ్యయంతో సంబంధం లేకుండా సినిమాలో విషయం ఉంటే ప్రేక్షకులు హిట్ చేస్తున్నారు. యువతకు కావాల్సిన మసాలా అంశాలను దట్టించి దర్శకుడు సినిమా తీశారు. పెద్ద విజయం సాధిస్తుందని ఆశిస్తున్నా. చిన్న చిత్రాలు విజయం సాధిస్తే పరిశ్రమకు మంచిది" అన్నారు. "మా అబ్బాయిని డాక్టర్ చేద్దామని అనుకుంటే.. హీరో అవుతానన్నాడు. విశాఖ సత్యానంద్ దగ్గర శిక్షణ ఇప్పించి, ఈ సినిమా చేశాం. ఇంజనీరింగ్ నేపథ్యంలో రూపొందింది. ఫిబ్రవరి 8న చిత్రాన్ని విడుదల చేయాలనేది ప్లాన్" అని నిర్మాత ఉదయ్‌కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో 'మా' అధ్యక్షుడు శివాజీరాజా, స్వరకర్త భీమ్స్, గీత రచయితలు చంద్రబోస్, సురేశ్ ఉపాధ్యాయ పాల్గొన్నారు.



అవకాశాల అకౌంటెన్సీ.. సీఎంఏ

సర్వీస్ రంగం నుంచి సాఫ్ట్‌వేర్ సంస్థల వరకు ప్రతీ కంపెనీకి అవసరం ఉన్న విభాగం కాస్ట్ మేనేజ్‌మెంట్ అకౌంటెన్సీ (సీఎంఏ). ఇతర కోర్సులతో పోల్చితే స్వల్ప కాలంలో పూర్తి చేసే అవకాశం, చదువు పూర్తయిన వెంటనే ఉద్యోగం వంటి కారణాలతో విద్యార్థుల్లో సీఎంఏ కోర్సుకు మంచి ఆదరణ లభిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ కోర్సుకు సంబంధించిన విశేషాలు తెలుసుకుందాం..

సీఎంఏ కోర్సుకి సంబంధించిన అన్ని వ్యవహారాలను ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఎంఏఐ) పర్యవేక్షిస్తుంది. సీఎంఏలో మూడు దశలు ఉంటాయి. అవి.. ఫౌండేషన్, ఇంటర్మీడియెట్, ఫైనల్. ఇంటర్ లేదా డిగ్రీలో ఏ గ్రూప్ వారైనా సీఎంఏ కోర్సులో చేరొచ్చు. ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారు కూడా ఈ కోర్సును ఎంచుకోవచ్చు. ఈ కోర్సును పూర్తి చేయడానికి డిగ్రీ / ఇంజనీరింగ్ తరవాత రెండేళ్లు, పదో తరగతితో అయితే నాలుగేళ్లు, ఇంటర్మీడియెట్‌తో రెండున్నరేళ్లు, ఇంటర్ (ఎంఈసీ) విద్యార్థులకు రెండేళ్లు పడుతుంది.

ఫౌండేషన్‌తో మొదలు

- అర్హత: ఇంటర్‌లో ఏ గ్రూప్ చదివినవారైనా సీఎంఏ ఫౌండేషన్ కోర్సు కోసం పేరు నమోదు చేసుకోవచ్చు. అదే ఇంటర్ ఎంఈసీ విద్యార్థులు అయితే ఇంటర్‌తో సమాంతరంగా ఫౌండేషన్ కోర్సును రెండేళ్లలో పూర్తి చేయవచ్చు.
- **రిజిస్ట్రేషన్:** సీఎంఏ ఫౌండేషన్ కోర్సు కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే తప్పనిసరిగా ఇంటర్ (10+2) లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి. ఇందుకు కావల్సిన దరఖాస్తును రూ.250 చెల్లించి సీఎంఏ చాప్టర్లు, బ్రాంచీలు, ఇన్ఫర్మేషన్ సెంటర్ల నుంచి పొందొచ్చు. తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, నెల్లూరు, కొత్తగూడెం, రాజమండ్రిలలో సీఎంఏ చాప్టర్లు ఉన్నాయి. పూర్తి చేసిన దరఖాస్తుకు ఏదైనా షెడ్యూల్డ్ బ్యాంకులో కోల్‌కతాలో చెల్లే విధంగా తీసిన రూ.4 వేల డీడీ జత చేయాలి. ఈ విధంగా పూర్తి చేసిన దరఖాస్తును కోల్‌కతా చాప్టర్‌కు పంపొచ్చు. లేదా అందుబాటులోని సీఎంఏ అనుబంధ సంస్థల్లో ఇవ్వొచ్చు. మరిన్ని వివరాలను www.icmai.in వెబ్‌సైట్ ద్వారా పొందొచ్చు.
- సీఎంఏ ఫౌండేషన్ పరీక్షను జూన్‌లో రాయాలంటే జనవరి 31వ తేదీలోగా, డిసెంబరులో పరీక్షకు హాజరవ్వాలంటే జూలై 31వ తేదీలోగా పేరు నమోదు చేసుకోవాలి.
- పరీక్ష ఫీజు: రూ.1,200. జూన్‌లో పరీక్ష రాయాలంటే మార్చి 31లోగా, డిసెంబర్‌లో పరీక్షకు హాజరవ్వాలంటే సెప్టెంబరు 30లోగా పరీక్ష ఫీజును చెల్లించాలి.
- **సబ్జెక్ట్‌లు:** ఫౌండేషన్ కోర్సులో మొత్తం 8 సబ్జెక్ట్‌లు ఉంటాయి. వీటిని 4 పేపర్లుగా విభజించారు. అంటే రెండు సబ్జెక్ట్‌లకు కలిపి ఒక పేపర్. ప్రతి పేపర్ ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ పద్ధతిలో 100 మార్కులకు ఉంటుంది. మొత్తమ్మీద 4 పేపర్లకు కలిపి 400 మార్కులు కేటాయించారు. ఇందులో 50 శాతం అంటే 200 లేదా అంతకంటే ఎక్కువ మార్కులు సాధిస్తే ఉత్తీర్ణులుగా ప్రకటిస్తారు. అంటే ప్రతి పేపర్‌లో 40 శాతం కంటే ఎక్కువ మార్కులు స్కోర్ చేయాలి. ఈ పరీక్ష ఏడాదికి రెండు సార్లు జూన్, డిసెంబరులలో జరుగుతుంది.
- ఫౌండేషన్ దశలోని సబ్జెక్ట్‌లు: ఫండమెంటల్స్ ఆఫ్ ఎకనామిక్స్ & మేనేజ్‌మెంట్, ఫండమెంటల్స్ ఆఫ్ అకౌంటింగ్, ఫండమెంటల్స్ ఆఫ్ లాస్ అండ్ ఎథిక్స్, ఫండమెంటల్స్ ఆఫ్ బిజినెస్ మ్యాథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్.

ఇంటర్.. రెండో దశ

ఫౌండేషన్ కోర్సులో ఉత్తీర్ణులైన వారికి ఇంటర్ చదివే అర్హత లభిస్తుంది. ఈ దశనే సీఎంఏ ఎగ్జిక్యూటివ్ కోర్సు అని కూడా పిలుస్తారు.

- అర్హత: ఫౌండేషన్ కోర్సును పూర్తి చేసిన విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్న ఒక సంవత్సరం తరవాత ఇంటర్ పరీక్ష రాయొచ్చు. డిగ్రీ ఉత్తీర్ణులు (ఏదైనా గ్రూపు) / ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారు ఫౌండేషన్‌తో నిమిత్తం లేకుండా సీఎంఏ ఇంటర్ దశ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు, శిక్షణ కూడా తీసుకోవచ్చు.
- **రిజిస్ట్రేషన్:** రిజిస్ట్రేషన్ కోసం రూ.20 వేలు చెల్లించాలి. ఇటీవల ఫౌండేషన్ తరవాత ఇంటర్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకునే విద్యార్థులకు ఒక వెసులుబాటు కల్పించారు. దీని ప్రకారం ఫౌండేషన్ పూర్తి చేసిన అభ్యర్థులు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.20 వేలల్లో ముందు రూ.12 వేలు చెల్లించి, మిగతా రూ.8 వేలు మూడు నెలల తరవాత కట్టొచ్చు. సీఎంఏ ఇంటర్ పరీక్ష జూన్‌లో రాయాలంటే అదే సంవత్సరం జనవరి 31వ తేదీలోగా, డిసెంబరులో పరీక్షకు హాజరవ్వాలంటే జూలై 31వ తేదీలోగా పేరు నమోదు చేసుకోవాలి.
- పరీక్ష ఫీజు: రూ.1,200. అదే రెండు గ్రూపులకు రూ.2,400. జూన్‌లో పరీక్ష రాయాలంటే మార్చి 31లోగా, డిసెంబరులో పరీక్షకు హాజరవ్వాలంటే సెప్టెంబరు 30లోగా పరీక్ష ఫీజును చెల్లించాలి.
- ఇంటర్ దశలో గ్రూపు-1, గ్రూపు-2 ఉంటాయి. వీటిల్లో మొత్తం సబ్జెక్ట్‌లు ఎనిమిది. వీలును బట్టి రెండు గ్రూపులు ఒకేసారి లేదా విడివిడిగా ఒక్కో గ్రూపు 6 నెలల వ్యత్యాసంతో రాయొచ్చు.
- **గ్రూపు-1:** ఇందులో 4 పేపర్లు కలిపి 400 మార్కులకు ఉంటాయి. వీటిల్లో 50 శాతం అంటే 200 లేదా అంతకంటే ఎక్కువ మార్కులు సాధిస్తే ఉత్తీర్ణులుగా ప్రకటిస్తారు. అంటే ప్రతి పేపర్‌లో 40 శాతం కంటే ఎక్కువ మార్కులు స్కోర్ చేయాలి. ఈ గ్రూపులోని సబ్జెక్ట్‌లు.. ఫైనాన్షియల్ అకౌంటింగ్ (100 మార్కులు), లాస్ అండ్ ఎథిక్స్ (100 మార్కులు), డైరెక్ట్ టాక్సేషన్ (100 మార్కులు), కాస్ట్ అకౌంటింగ్ (100 మార్కులు).
- **గ్రూపు-2:** ఇందులో 4 పేపర్లు కలిపి 400 మార్కులకు ఉంటాయి. వీటిల్లో కూడా 50 శాతం అంటే 200 లేదా అంతకంటే ఎక్కువ మార్కులు సాధిస్తే ఉత్తీర్ణులుగా ప్రకటిస్తారు. అదే సమయంలో ప్రతి పేపర్‌లో 40 శాతం కంటే ఎక్కువ మార్కులు స్కోర్ చేయాలి.
- ఈ గ్రూపులోని సబ్జెక్ట్‌లు: ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ & స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్ (100 మార్కులు), కాస్ట్ & మేనేజ్‌మెంట్ అకౌంటింగ్ & ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ (100 మార్కులు), ఇన్‌డైరెక్ట్ ట్యాక్సేషన్ (100 మార్కులు), కంపెనీ అకౌంట్స్ & ఆడిట్ (100మార్కులు).

చివరి దశ.. ఫైనల్

సీఎంఏ ఇంటర్ / ఎగ్జిక్యూటివ్ దశను పూర్తి చేసి, 6 నెలల ప్రాక్టికల్ శిక్షణను పొందిన తరవాత ఫైనల్ పరీక్షకు హాజరు కావచ్చు.

- రిజిస్ట్రేషన్: సీఎంఏ ఫైనల్ రిజిస్ట్రేషన్ కోసం రూ.17 వేలు చెల్లించాలి.



ఎం. ప్రకాష్
డైరెక్టర్, మాస్టర్ మైండ్స్

- సీఎంఏ ఫైనల్ పరీక్ష జూన్‌లో రాయాలంటే జనవరి 31లోగా, డిసెంబరులో పరీక్షకు హాజరవ్వాలంటే జూలై 31లోగా పేరును నమోదు చేసుకోవాలి.
- పరీక్ష ఫీజు: రూ.1,400. అదే రెండు గ్రూపులకు రూ.2,800. జూన్‌లో పరీక్ష రాయాలంటే మార్చి 31వ తేదీలోగా, డిసెంబరులో పరీక్షకు హాజరవ్వాలంటే సెప్టెంబరు 30వ తేదీలోగా పరీక్ష ఫీజును చెల్లించాలి.
- సీఎంఏ ఫైనల్‌లో రెండు గ్రూపులు (గ్రూపు-3, గ్రూపు-4) ఉంటాయి. వీలును బట్టి రెండు గ్రూపులు ఒకేసారి లేదా విడివిడిగా ఒక్కో గ్రూపు 6 నెలల వ్యత్యాసంతో రాయొచ్చు.
- **గ్రూపు-3:** ఇందులో 4 పేపర్లు కలిపి 400 మార్కులకు ఉంటాయి. వీటిల్లో 50 శాతం అంటే 200 లేదా అంతకంటే ఎక్కువ మార్కులు సాధిస్తే ఉత్తీర్ణులుగా ప్రకటిస్తారు. అదే సమయంలో ప్రతి పేపర్‌లో 40 శాతం కంటే ఎక్కువ మార్కులు స్కోర్ చేయాలి. ఈ గ్రూపులోని సబ్జెక్ట్‌లు.. కార్పొరేట్ లాస్ & కంప్లెయిన్స్ (100 మార్కులు), స్ట్రాటజిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ (100 మార్కులు), స్ట్రాటజిక్ కాస్ట్ మేనేజ్‌మెంట్ డెసిషన్ మేకింగ్ (100 మార్కులు), డైరెక్ట్ ట్యాక్స్ లాస్ అండ్ ఇంటర్నేషనల్ ట్యాక్సేషన్ (100 మార్కులు).
- **గ్రూపు-4:** ఇందులో కూడా 4 పేపర్లు కలిపి 400 మార్కులకు ఉంటాయి. వీటిల్లో 50 శాతం అంటే 200 లేదా అంతకంటే ఎక్కువ మార్కులు సాధిస్తే ఉత్తీర్ణులుగా ప్రకటిస్తారు. అదే సమయంలో ప్రతి పేపర్‌లో 40 శాతం కంటే ఎక్కువ మార్కులు స్కోర్ చేయాలి. ఈ గ్రూపులోని సబ్జెక్ట్‌లు.. కార్పొరేట్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ (100 మార్కులు), ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ లాస్ & ప్రాక్టీస్ (100 మార్కులు), కాస్ట్ & మేనేజ్‌మెంట్ ఆడిట్ (100 మార్కులు), స్ట్రాటజిక్ ఫర్ఫామెన్స్ మేనేజ్‌మెంట్ & బిజినెస్ వాల్యుయేషన్ (100 మార్కులు).
- ఫైనల్ పూర్తి చేసిన అభ్యర్థులు కంప్యూటర్ ట్రైనింగ్‌ను పూర్తి చేయాలి. ఇందుకోసం మరో రెండున్నరేళ్లు ప్రాక్టికల్ శిక్షణ తీసుకోవాలి (ఇంటర్ తరవాత ఉండే ప్రాక్టికల్ శిక్షణకు ఇది అదనం). తద్వారా సొంతంగా ప్రాక్టీస్ చేసుకునేందుకు అర్హత లభిస్తుంది.



ప్రాక్టికల్ శిక్షణ తప్పనిసరి

సీఎంఏ ఫైనల్ పరీక్ష రాయాలంటే ముందుగా ప్రాక్టికల్ శిక్షణ తీసుకోవాలి. ఇంటర్ / ఎగ్జిక్యూటివ్ దశలో ఉత్తీర్ణత సాధించినవారు గుర్తింపు పొందిన సంస్థలో నిర్దేశించిన విభాగాల్లో లేదా ప్రాక్టీసింగ్ కాస్ట్ అకౌంటెంట్ దగ్గర ఆరు నెలలపాటు ప్రాక్టికల్ శిక్షణను పొందాలి. సొంతంగా ప్రాక్టీస్ చేయాలనుకుంటే ప్రాక్టికల్ శిక్షణను మూడేళ్లు పొందాలి.

అవకాశాలు

సీఎంఏ కోర్సు చేసిన వారికి అవకాశాలకు కొదవలేదు. ఒక అధ్యయనం మేరకు దేశంలో 1,50,000 మంది కాస్ట్ అకౌంటెంట్‌ల కొరత ఉంది. దీన్ని బట్టి ఈ వృత్తికి ఉన్న డిమాండ్‌ను అర్థం చేసుకోవచ్చు. సీఎంఏ చాప్టర్‌లలో క్యాంపస్ డ్రైవ్స్ కూడా ఉంటాయి.

జువాలజీలో మెరుగైన మార్కులకు

ఇంటర్మీడియెట్.. విద్యార్థి జీవితంలో కీలకమైన దశ. ఇక్కడ సాధించే మార్కులే భవిష్యత్ గమనానికి పునాదిగా నిలుస్తాయి. ఇక్కడ పొందే అవగాహన ఎంసెట్, నీట్ వంటి పోటీ పరీక్షల్లో కూడా ఉపయోగపడుతుంది. ఫిబ్రవరి చివరి వారంలో ఇంటర్మీడియెట్ పబ్లిక్ ఎగ్జామ్స్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ద్వితీయ సంవత్సరం జువాలజీలో అత్యధిక మార్కుల సాధనకు ఎటువంటి వ్యూహం అనుసరించాలో చూద్దాం..

ఇంటర్మీడియెట్ బైపీసీ గ్రూపులో కీలకమైన సబ్జెక్ట్‌లలో జువాలజీ ఒకటి. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్స్ ఒక వైపు, ఇంటర్ పరీక్షలు, పోటీ పరీక్షలు మరో వైపు ఉంటాయి. వీటన్నింటినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలి. మెరుగైన మార్కులు సాధించేందుకు కృషి చేయాలి.

60 మార్కులు.. 3 విభాగాలు

ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం జువాలజీ పరీక్ష విధానాన్ని పరిశీలిస్తే.. మొత్తం 60 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. ఇందులో మూడు విభాగాలు ఇస్తారు. అవి..

- సెక్షన్-ఎ: 1 నుంచి 10 ప్రశ్నలు ఉంటాయి. ఇవి అతి స్వల్ప సమాధాన ప్రశ్నలు. ప్రతి ప్రశ్నకు 2 మార్కులు.
- సెక్షన్-బి: 11 నుంచి 18 ప్రశ్నలు ఉంటాయి. ఇవి స్వల్ప సమాధాన ప్రశ్నలు. ప్రతి ప్రశ్నకు 4 మార్కులు.
- సెక్షన్-సి: 19 నుంచి 21 ప్రశ్నలు. ఇవి దీర్ఘ సమాధాన ప్రశ్నలు. ప్రతి ప్రశ్నకు 8 మార్కులు.
- సెక్షన్-బిలో 2 ప్రశ్నలు, సెక్షన్-సిలో 1 ప్రశ్నను ఛాయిస్‌గా ఇస్తారు.

రివిజన్‌కు ప్రాధాన్యం

ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమయంలో మొత్తం సిలబస్‌ను రివిజన్ చేయడానికి ప్రాధాన్యం ఇవ్వాలి. గత నాలుగు సంవత్సరాల ప్రశ్నాపత్రాలను పరిశీలిస్తే కొన్ని నిర్దిష్ట పాఠ్యాంశాల నుంచి క్రమం తప్పకుండా ప్రశ్నలు ఇస్తున్నారనే విషయాన్ని అవగాహన చేసుకోవచ్చు. ఈ విశ్లేషణ ఆధారంగా దృష్టి సారించాల్సిన ముఖ్యమైన పాఠ్యాంశాలు...

Unit-I Human Anatomy & Physiology-I

ఇందులో ముఖ్యమైన పాఠ్యాంశాలు.. Digestion and Absorption, Breathing and Exchange of Gases. ఈ యూనిట్ నుంచి ఎక్కువగా 2 మార్కులు, 4 మార్కుల ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి కచ్చితంగా ప్రాక్టీస్ చేయాల్సిన అంశాలు కొన్ని ఉన్నాయి. అవి..

- Unit-I A: Digestion and Absorption: ఈ చాప్టర్‌లో ముఖ్యమైన పాఠ్యాంశాలు.. Dental formula, L.S. of teeth diagram, Structure of teeth, Types of papillae on tongue, Types of salivary glands, Digestion in stomach, Functions of proteins, Functions of liver, Structure of liver.
- Unit-I B: Breathing and Exchange of Gases: ఈ చాప్టర్‌లో దృష్టి సారించాల్సిన పాఠ్యాంశాలు.. Mechanism of Breathing, Transport of CO_2, Transport of O_2, Process of chloride shift, Disorders of respiratory system.

Unit-II Human Anatomy & Physiology-II

ఇందులోని ముఖ్యమైన పాఠ్యాంశాలు.. Body fluids and circulation, Excretory products and their elimination. ఈ యూనిట్ నుంచి ఎక్కువగా రెండు మార్కులు, 8 మార్కుల ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో కచ్చితంగా సాధన చేయాల్సిన అంశాలు..

- Unit-II A: Body fluids and circulation: ఈ చాప్టర్‌లో ముఖ్యమైన పాఠ్యాంశాలు.. Structure of Human Heart, Function of Human Heart, Cardiac cycle, Cardiac output, Differences between arteries and veins.
- Unit-II B: Excretory products and their elimination: ఈ చాప్టర్‌లో ముఖ్యమైన పాఠ్యాంశాలు.. Definition of glomerular filtration, columns of bertini, Disorders of excretory system.

Unit-III Human Anatomy & Physiology-III

ఇందులో రెండు చాప్టర్లు ఉన్నాయి. అవి.. Muscle skeletal system, Neural control and coordination. ఈ యూనిట్ నుంచి ఎక్కువగా 2 మార్కులు, 4 మార్కుల ప్రశ్నలు ఇస్తారు. ఇందులోంచి కచ్చితంగా ప్రాక్టీస్ చేయాల్సిన అంశాలు...

- Unit-III A: Muscle skeletal system: ఈ చాప్టర్‌లో ముఖ్యమైన పాఠ్యాంశాలు.. Description and diagram of synovial joint, Differences between action & Myosin filaments, Triad system, Biochemical changes behind muscle contraction, Structure of sarcomere.
- Unit - III B: Excretory products and their elimination: ఈ చాప్టర్‌లో ముఖ్యమైన పాఠ్యాంశాలు.. Definition of glomerular filtration, columns of bertini, Disorders of excretory system.

Unit-IV Human Anatomy & Physiology-IV

ఇందులో ముఖ్యమైన పాఠ్యాంశాలు Endocrine system and chemical coordination, Immune System. ఈ యూనిట్ నుంచి ఎక్కువగా 2 మార్కులు, 8 మార్కుల ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. ఇందులోంచి కచ్చితంగా ప్రాక్టీస్ చేయాల్సిన అంశాలు..



- Unit-IV A Endocrine system and chemical coordination: ఈ చాప్టర్‌లో ముఖ్యమైన పాఠ్యాంశాలు.. Hypothyroidism - Hyperthyroidism, Differences between Diabetes mellitus and Diabetes insipidus, Insulin shock, Addissons disease, Acromegaly.
- Unit-IV B: Immune System: ఈ చాప్టర్‌లో ముఖ్యమైన పాఠ్యాంశాలు.. Vaccination, Hypersensitivity, AIDS / HIV, Auto Immune disorder

Unit-V Human Reproduction

ఇందులోని ముఖ్యమైన పాఠ్యాంశాలు.. Human Reproductive system, Reproductive Health. ఈ యూనిట్ నుంచి ఎక్కువగా 2 మార్కులు, 4 మార్కులు, 8 మార్కుల ప్రశ్నలు ఇచ్చే అవకాశం ఉంది. ఈ చాప్టర్ నుంచి కచ్చితంగా ప్రాక్టీస్ చేయాల్సిన అంశాలు..

- Unit-V A: Human Reproductive system: ఈ చాప్టర్‌లో ముఖ్యమైన పాఠ్యాంశాలు.. Description for male Human Reproductive system with diagrams, Description for female Human Reproductive system with diagrams, Functions of leydig cells and sertoli cells, Structure of Sperm cell, Menstruation cycle.
- Unit-V B: Reproductive Health: ఈ చాప్టర్‌లో ముఖ్యమైన పాఠ్యాంశాలు.. Amniocentesis, MTP, ART, Contraceptive Methods.

Unit-VI Genetics

ఇందులోంచి ఎక్కువగా 4 మార్కులు, 8 మార్కుల ప్రశ్నలు ఇస్తారు. ఈ చాప్టర్‌లో ముఖ్యమైన పాఠ్యాంశాలు.. Multiple Allelism, A,B,O Blood grouping system, Sex determination in Human, Sex determination in Honeybee, Genic balance theory, CrissCross inheritance.

Unit-VII Organic Evolution

ఈ యూనిట్ నుచిఇ ఎక్కువగా 4 మార్కుల ప్రశ్నలు అడుగుతున్నారు. ఈ చాప్టర్‌లో ముఖ్యమైన పాఠ్యాంశాలు.. Darwin's theory of evolution, Mutations, Homologous and Analogous organs, Genetic drift, Foundation effect.

Unit-VIII Applied Biology

ఇందులోంచి సాధారణంగా 4 మార్కులు, 2 మార్కుల ప్రశ్నలు ఇస్తారు. ఈ చాప్టర్‌లో ముఖ్యమైన పాఠ్యాంశాలు.. MOET, Poultry farming, Types of cancers, ELISA.



ఎ. శ్రీనివాసరావు
సీనియర్ అధ్యాపకులు

జాబ్ కార్నర్

పంజాబ్ నేషనల్ బ్యాంక్

ఖాళీలు 325

పంజాబ్ నేషనల్ బ్యాంక్ వివిధ కేడర్లలో మేనేజర్లు, ఆఫీసర్ల ఖాళీల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.

- ఉద్యోగాలవారీ ఖాళీలు: సీనియర్ మేనేజర్ (క్రెడిట్) 51, మేనేజర్ (క్రెడిట్) 26, సీనియర్ మేనేజర్ (లా) 55, మేనేజర్ (లా) 55, మేనేజర్ (హెచ్ఆర్‌డి) 18, ఆఫీసర్ (ఐటీ) 120
- వయసు: జనవరి 1 నాటికి సీనియర్ మేనేజర్ (క్రెడిట్)కు 25 నుంచి 37 ఏళ్ల మధ్య, మేనేజర్(క్రెడిట్)కు 25 నుంచి 35 ఏళ్ల మధ్య, సీనియర్ మేనేజర్ (లా)కు 28 నుంచి 35 ఏళ్ల మధ్య, మేనేజర్ (లా)కు 25 నుంచి 32 ఏళ్ల మధ్య, మేనేజర్ (హెచ్ఆర్‌డి)కు 25 నుంచి 35 ఏళ్ల మధ్య, ఆఫీసర్ (ఐటి)కు 21 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
- అర్హత: ఉద్యోగ నిబంధనల ప్రకారం సీఏ / ఐసీడబ్ల్యుఏ / పీజీడీఎం / ఎంబీఏ / జనరల్ డిగ్రీ / లా డిగ్రీ / (పీజీ/ పీజీ డిప్లొమా) (పర్సనల్ మేనేజ్‌మెంట్ / ఇండస్ట్రియల్ రిలేషన్స్ / హెచ్ఆర్ / హెచ్ఆర్‌డి / హెచ్ఆర్ఎం/ లేబర్ లా) / ఎంసీఏ/ బిఈ / బీటెక్ (ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్/ కంప్యూటర్ సైన్స్/ కంప్యూటర్ సైన్స్ & టెక్నాలజీ/ ఐటీ) ఉత్తీర్ణులై ఉండాలి. నిర్దేశించిన విధంగా అనుభవం తప్పనిసరి.
- ఎంపిక: ఆన్‌లైన్ ఎగ్జామ్, ఇంటర్వ్యూ ద్వారా
- ఆన్‌లైన్ ఎగ్జామ్ వివరాలు: పరీక్ష 200 మార్కులకు ఉంటుంది. మొత్తం 200 ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష సమయం 2 గంటలు. రీజనింగ్‌కు 50 మార్కులు, ఇంగ్లీష్ లాంగ్వేజ్‌కు 25 మార్కులు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌కు 50 మార్కులు, ప్రొఫెషనల్ నాలెడ్జ్‌కు 75 మార్కులు కేటాయించారు. ఒక్కో విభాగం నుంచి 50 ప్రశ్నలు ఇస్తారు. ఇంగ్లీష్ లాంగ్వేజ్ మినహా అన్ని విభాగాల్లో ప్రశ్నలను ఇంగ్లీషు, తెలుగు మాధ్యమాల్లో ఇస్తారు. రుణాత్మక మార్కులు ఉన్నాయి.
- ఆన్‌లైన్ ఎగ్జామ్ జరుగు తేదీ: మార్చి 17
- దరఖాస్తు ఫీజు: రూ.400
- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఫిబ్రవరి 1
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 15
- వెబ్‌సైట్: www.pnbindia.in

ఓఎన్‌జీసీ

ఖాళీలు 86

ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఓఎన్‌జీసీ) - సదరన్ సెక్టార్‌లో కింది ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ఉద్యోగాలు: అసిస్టెంట్ టెక్నీషియన్, గ్రేడ్ 3 అసిస్టెంట్, జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ టెక్నీషియన్, జూనియర్ అసిస్టెంట్, జూనియర్ ఫైర్ సూపర్‌వైజర్, జూనియర్ మోటార్ వెహికిల్ డ్రైవర్, జూనియర్ ఫైర్ మ్యాన్
- అర్హత: ఉద్యోగ నిబంధనల ప్రకారం మెట్రిక్యులేషన్/ ఇంజనీరింగ్ డిగ్రీ ఉండాలి. హెవీ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు నిర్దేశించిన శారీరక ప్రమాణాలు ఉండాలి
- ఎంపిక: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, టైపింగ్ టెస్ట్, డ్రైవింగ్ టెస్ట్ ద్వారా
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 20
- వెబ్‌సైట్: www.ongcindia.com

ఇంజనీర్లు

ఖాళీలు 35

ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్ వివిధ విభాగాల్లో ఇంజనీర్లు, ఆఫీసర్ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ఉద్యోగాలు: డిప్యూటీ మెడికల్ ఆఫీసర్లు 9, పారా మెడికల్ సర్వీసెస్ (బయో కెమిస్ట్ 1, ఫార్మసిస్ట్ 2), పవర్ స్టేషన్ ఇంజనీరింగ్ (డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ - మెకానికల్ 6, ఎలక్ట్రికల్ 3, సీ&ఐ 2), ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ (డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ 4, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ 8)
- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఫిబ్రవరి 4
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 25
- దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: మార్చి 4
- వెబ్‌సైట్: www.nlcindia.com

షార్ట్ టర్మ్‌పై మక్కువ

శాస్త్ర సాంకేతిక రంగాల్లో వచ్చిన మార్పుల కారణంగా నూతన తరహా ఉద్యోగాలు అందుబాటులోకి వస్తున్నాయి. ఈ నూతన ఉద్యోగాలను అందుకోవాలన్నా, కెరీర్‌పరంగా ఉన్నత స్థానాలను అందుకోవాలన్నా, తదనుగుణంగా నైపుణ్యాలను పెంచుకోవడం తప్పనిసరి. ఇందుకోసం భారతీయ విద్యార్థులు ఎక్కువగా షార్ట్‌టర్మ్ కోర్సులపై ఆధారపడుతున్నారని పియర్సన్ పబ్లికేషన్స్ నిర్వహించిన సర్వే పేర్కొంది. ఇండియా, మలేషియా, యూకే, ఆస్ట్రేలియా, యూఏఈ దేశాల్లో ఈ సర్వేను నిర్వహించారు. దీని ప్రకారం 56 శాతం మంది భారతీయులు కెరీర్ అడ్వాన్స్‌మెంట్ కోసం, 55 శాతం మంది నాలెడ్జ్‌ను పెంచుకోవడానికి షార్ట్‌టర్మ్ కోర్సులను ఎంచుకుంటున్నట్లు తెలిపారు. అధిక శాతం మంది భారతీయులు యూనివర్సిటీ డిగ్రీలకు కొనసాగింపుగా ఎంప్లాయర్స్‌కు చూపించడానికి ఏదో ఒక అర్హత తమ పేరు చివర ఉండాలని కోరుకుంటున్నారు.

షేర్ల బైబ్యాక్‌పై 4న నిర్ణయం : సీఐఎల్

న్యూఢిల్లీ : మరో ప్రభుత్వ రంగ సంస్థ షేర్ల బైబ్యాక్‌కు సిద్ధమవుతోంది. సోమవారం జరిగే బోర్డు సమావేశంలో కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) దీనిపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఆర్థిక సంవత్సరం ముగిసే లోపు ప్రభుత్వ రంగ సంస్థల నుంచి వీలైనన్ని నిధులు సంపాదించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగానే షేర్ల బైబ్యాక్ కోసం సీఐఎల్‌పైనా ప్రభుత్వం ఒత్తిడి తెస్తోందని భావిస్తున్నారు.

చందా కొచ్చర్‌కు చుక్కెదురు



- పదవీ విరమణ ప్రయోజనాలు రద్దు
- ఇచ్చినవి వెనక్కి.. రాజీనామాను తొలగింపుగా పరిగణన
- ఐసీఐసీఐ బ్యాంకు సంచలన నిర్ణయం
- జస్టిస్ శ్రీ కృష్ణ కమిటీ నివేదికపై స్పందన

న్యూఢిల్లీ : 'ఐసీఐసీఐ బ్యాంకు మాజీ సీఈఓ చందా కొచ్చర్ బ్యాంకు ప్రవర్తనా నియమావళిని, అనేక అంతర్గత నిబంధనలను ఉల్లంఘించారు. ఆమె హయాంలో నిబంధనల ప్రకారం బయటకు వెల్లడించాల్సిన అంశాల్లో పారదర్శకత లేదు' అని జస్టిస్ (రిటైర్డ్) బి.ఎన్ శ్రీకృష్ణ కమిటీ తేల్చి చెప్పింది. శ్రీకృష్ణ కమిటీ నివేదికను ఆధారంగా చేసుకుని కొచ్చర్‌కు చెల్లించాల్సిన అన్ని పదవీ విరమణ ప్రయోజనాలను నిలివేయాలని బ్యాంకు సంచలనాత్మక నిర్ణయం తీసుకుంది. 2009పదవీ విరమణ ప్రయోజనాలను నిలిపివేయడమే కాక.. 2009 నుంచి చెల్లించిన బోనస్‌లను వెనక్కి తీసుకోవాలని కూడా బ్యాంకు నిర్ణయించింది. గత అక్టోబరులో కొచ్చర్ చేసిన రాజీనామాను తొలగింపుగా (టెర్మినేషన్ ఫర్ కాజ్) పరిగణిస్తున్నట్లు ప్రకటించింది. వీడియోకాన్‌కు రుణాలు మంజూరు చేయడంలో గతంలో చందా కొచ్చర్‌కు క్లీన్ చిట్ ఇచ్చిన బ్యాంకు బోర్డు ఇప్పుడు ఇటువంటి కఠిన నిర్ణయం తీసుకోవడం విశేషం. వీడియోకాన్‌కు రూ.3,250 కోట్ల రుణాలు ఇచ్చిన కేసులో కొచ్చర్‌పై సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసిన కొద్ది రోజుల్లోనే శ్రీకృష్ణ కమిటీ నివేదిక ఆధారంగా బ్యాంకు ఈ నిర్ణయం తీసుకుంది. ఈ కేసులో విచారణ జరిపేందుకు శ్రీకృష్ణ కమిటీని నియమించారు.

అసలేం జరిగింది..?

వీడియోకాన్ గ్రూపునకు ఐసీఐసీఐ బ్యాంక్ 2012లో రూ.3,250 కోట్ల రుణ మంజూరు చేసింది. ఈ వ్యవహారంలో చందా కొచ్చర్ భర్త దీపక్ కొచ్చర్ అయాచిత లబ్ధి పొందారని, కొచ్చర్ కుటుంబానికి, వీడియోకాన్ అధినేత వేణుగోపాల్ ధూత్ మధ్య 'క్విడ్ ప్రో కో' (నీకిది, నాకది) జరిగిందన్న ఆరోపణలు వచ్చాయి. ఇందుకు సంబంధించి సీబీఐ 2017 డిసెంబరులోనే ప్రాథమిక దర్యాప్తు ప్రారంభించింది. 2009 జూన్-2011 అక్టోబర్ మధ్యకాలంలో వీడియోకాన్ సంస్థలకు ఇచ్చిన రూ.1,875 కోట్ల విలువైన ఆరు రుణాల్లో అవకతవకలు జరిగినట్లు దర్యాప్తు ఏజెన్సీ గుర్తించింది. సీబీఐ ఎఫ్ఐఆర్‌లో ఆరోపించిన ప్రకారం.. వీడియోకాన్ గ్రూపునకు రెండు టర్మ్ లోన్లు చందా కొచర్ ఆధ్వర్యంలోని కమిటీ ద్వారా మంజూరయ్యాయి. వీడియోకాన్ ఇంటర్నేషనల్ ఎలక్ట్రానిక్స్‌కు ఇచ్చిన రూ.300 కోట్ల రుణానికి 2009, ఆగస్టు 26న, వీడియోకాన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌కు ఇచ్చిన రూ.750 కోట్ల రుణానికి 2011 అక్టోబరు 31న కొచర్ ఆధ్వర్య కమిటీ మంజూరు చేసింది. బ్యాంకు విధానాలు, నిబంధనలకు విరుద్ధంగా ఈ రుణాలకు కమిటీ క్లియరెన్సులు ఇచ్చింది. 2009 సెప్టెంబరు 7న వీడియోకాన్ ఇంటర్నేషనల్‌కు రూ.300 కోట్ల రుణ నిధులు విడుదల కాగా.. ఆ మరుసటి రోజునే దీపక్ కొచర్‌కు చెందిన న్యూపవర్ రెన్యువబుల్ లిమిటెడ్‌కు వేణుగోపాల్ ధూత్ రూ.64 కోట్లు బదిలీ చేశారు. ధూత్ స్థాపిత కంపెనీ సుప్రీం ఎనర్జీ ద్వారా ఈ నిధులు బదిలీ అయ్యాయి. న్యూపవర్ లిమిటెడ్ తన తొలి విద్యుత్ ప్లాంట్ కొనుగోలుకు లభించిన అతిపెద్ద మూలధన పెట్టుబడి అది. ఆ తర్వాత కాలంలో సుప్రీం ఎనర్జీ కూడా దీపక్ చేతుల్లోకి వెళ్లింది. దీన్ని బట్టి చందా కొచర్ తన భర్త కంపెనీ ద్వారా లంచం పుచ్చుకున్నారని సీబీఐ ఆరోపించింది.

2.7 శాతం క్షీణించిన లాభం

ఐసీఐసీఐ బ్యాంకు వర్తమాన ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో స్టాండ్ అలోన్ నికరలాభంలో 2.7 శాతం క్షీణతను నమోదు చేసింది. మొండి బకాయిలకు కేటాయింపులు పెంచడం లాభంలో క్షీణతకు దారి తీసింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో బ్యాంకు లాభం రూ.1650 కోట్లు కాగా అది ఈ ఏడాది క్యు3లో రూ.1604.91 కోట్లకు దిగజారింది. అయితే మొత్తం ఆదాయం మాత్రం రూ.16,832.22 కోట్ల నుంచి రూ.20,163.25 కోట్లకు పెరిగింది. అయితే స్థూల మొండి బకాయిలు 7.82 శాతం నుంచి 7.75 శాతానికి, నికర ఎన్‌పీఏలు కూడా 4.20 శాతం నుంచి 2.58 శాతానికి దిగివచ్చాయి. పన్నులు, ఇతర అనుబంధ కేటాయింపులు మాత్రం రూ.4,244.15 కోట్లున్నాయి. గత ఏడాది డిసెంబరు త్రైమాసికంలో ఈ కేటాయింపులు రూ.3,569.56 కోట్లున్నాయి. రూపాయి విలువలో స్థూల ఎన్‌పీఏలు రూ.51,591.47 కోట్లు, నికర ఎన్‌పీఏలు రూ.16,252.44 కోట్లు స్థాయిలో ఉన్నాయి. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన లాభం స్వల్పంగా ఒక శాతం క్షీణించి రూ.1,874 కోట్లకు చేరింది. కన్సాలిడేటెడ్ ఆదాయం రూ.33,433 కోట్లకు పెరిగింది. మొత్తం ఆదాయం రూ.28,501 కోట్ల నుంచి రూ.33,433 కోట్లకు చేరగా నికర వడ్డీ ఆదాయం 21 శాతం పెరిగి రూ.6875 కోట్లకు చేరింది.

ధర ఎక్కువైనా పర్వాలేదు!



ప్రీమియం స్మార్ట్‌ఫోన్లకు పెరుగుతున్న గిరాకీ
గత ఏడాది 8 శాతం వృద్ధి.. కౌంటర్‌పాయింట్ నివేదిక

న్యూఢిల్లీ: దేశంలో రూ.30,000 కంటే అధిక విలువ చేసే ప్రీమియం స్మార్ట్‌ఫోన్లకు డిమాండ్ క్రమంగా పెరుగుతోందని కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ తాజా నివేదిక వెల్లడించింది. గత ఏడాది ప్రీమియం స్మార్ట్‌ఫోన్ విక్రయాలు 8 శాతం వృద్ధి చెందాయని, 34 శాతం మార్కెట్ వాటాతో సామ్‌సంగ్ అగ్రగామి కంపెనీగా నిలిచిందని రిపోర్టు తెలిపింది. 33 శాతం మార్కెట్ వాటాతో చైనా కంపెనీ వన్‌ప్లస్ రెండో స్థానంలో ఉంది. ఐఫోన్ దిగ్గజం యాపిల్ మాత్రం 23 శాతం వాటాతో మూడో స్థానానికి పరిమితమైంది. అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో మాత్రం వన్‌ప్లస్ 36 శాతం మార్కెట్ వాటాతో ప్రీమియం సెగ్మెంట్లో నం.1 స్థానాన్ని దక్కించుకుంది. సామ్‌సంగ్ 26 శాతం మార్కెట్ షేర్‌తో సరిపెట్టుకుంది. డిసెంబరుతో ముగిసిన మూడు నెలల్లో ప్రీమియం స్మార్ట్‌ఫోన్‌ల విక్రయాలు వార్షిక ప్రాతిపదికన 16 శాతం వృద్ధి నమోదు చేసుకోగా.. టాప్-3 బ్రాండ్లైన వన్‌ప్లస్, ఆపిల్, సామ్‌సంగ్‌లు 92 శాతం మార్కెట్ వాటాను సొంతం చేసుకున్నాయి. ఈ ఏడాదిలో ప్రీమియం బ్రాండ్ల మధ్య పోటీ మరింత తీవ్రతరం కావచ్చని నివేదిక పేర్కొంది.

ఐఫోన్లకు ఆదరణ తగ్గుతోందా..?

తమ బ్రాండ్ స్మార్ట్‌ఫోన్ల యూజర్ ఎక్స్‌పీరియెన్స్‌ను మెరుగుపర్చేందుకు గడిచిన కొన్ని త్రైమాసికాలుగా చేపట్టిన చర్యలు విక్రయాల వృద్ధికి దోహదపడ్డాయని వన్‌ప్లస్ ఇండియా జనరల్ మేనేజర్ వికాస్ అగర్వాల్ తెలిపారు. దేశంలోని ప్రధాన నగరాల్లో సొంత స్టోర్లను ప్రారంభించడంతో పాటు సర్వీసింగ్ నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు భారీగా పెట్టుబడులు పెడుతున్నట్లు ఆయన చెప్పారు. గతేడాది వన్‌ప్లస్ స్మార్ట్‌ఫోన్ల విక్రయాలు 58 శాతం వృద్ధి చెందాయని, ఈ ఏడాదిలోనూ అదే జోరు కనబరుస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. డిసెంబరు త్రైమాసికంలో ఆపిల్ ఐఫోన్ విక్రయాలు మాత్రం 25 శాతం తగ్గాయని కౌంటర్‌పాయింట్ వెల్లడించింది. మిగతా ప్రీమియం స్మార్ట్‌ఫోన్లతో పోలిస్తే ఐఫోన్ల ధర మరీ ఎక్కువగా ఉండటం ఇందుకు ప్రధాన కారణమని విశ్లేషకులు అంటున్నారు. యాపిల్ మాత్రం విదేశాల నుంచి దిగుమతి చేసుకోవడానికి 20 శాతం సుంకం చెల్లిస్తుండటంతో భారత్‌లో ఐఫోన్ల ధర మధ్యతరగతి వారికి అందుబాటులో ఉండటం లేదంటున్నారు.

రూ.8,000కే 32 అంగుళాల స్మార్ట్ టీవీ



న్యూఢిల్లీ : ప్రస్తుత మార్కెట్‌లో 32 ఇంచ్ స్మార్ట్ టీవీ టీవీ కావాలంటే కనీసం రూ.10,000 పెట్టాలి. ఢిల్లీకి చెందిన సామి ఇన్ఫర్‌మాటిక్స్ కంపెనీ మాత్రం, అన్ని ఖర్చులతో కలిపి రూ.8,000కే 32 ఇంచ్ స్మార్ట్ ఆండ్రాయిడ్ టీవీ ఇస్తామంటోంది. కంపెనీ బుధవారం దీన్ని మార్కెట్‌లో విడుదల చేసింది. నిజానికి ఈ టీవీ ఉత్పత్తి ధర రూ.4,999 మాత్రమే. అయితే రూ.1,200 షిప్పింగ్, ఇన్‌స్టాలేషన్ ఖర్చులు, 18 శాతం జీఎస్‌టీని కలిపితే మొత్తం రూ.8,000 వరకు పడుతుంది. కంపెనీకి చెందిన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఆన్‌లైన్ ద్వారా మాత్రమే టీవీని బుక్ చేసుకోవాలి. ఒకే వ్యక్తి ఎక్కువ టీవీలు బుక్ చేయకుండా 'ఆధార్' నంబర్ సహాయంతో ఒకరికి ఒక టీవీ బుకింగ్‌ని మాత్రమే అనుమతిస్తారు. ఢిల్లీ సమీప ప్రాంతాల్లోని వినియోగదారులు దీన్ని అన్ని ఖర్చులతో కలిపి రూ.7,000కే అందుకోవచ్చు. దేశంలోని మిగతా ప్రాంతాల కొనుగోలుదారులు మాత్రం రూ.8,000 వరకు చెల్లించాల్సి ఉంటుంది.

నెల వారి రిటర్నుల్లోనే ఈ-వే బిల్లు డేటా

న్యూఢిల్లీ: జీఎస్‌టీ ఎగవేతలను అడ్డుకునే ప్రయత్నాల్లో భాగంగా కేంద్రం మరో చర్య చేపట్టింది. రూ.50 వేల కంటే విలువైన సరుకును సరఫరా చేసే వ్యాపారాలు ఇకపై నెలవారీ సేల్స్ రిటర్న్(జీఎస్‌టీఆర్-1)ల్లోనే ఈ-వే బిల్లుల వివరాలను పొందుపర్చే వసతిని జీఎస్‌టీ నెట్‌వర్క్ అందుబాటులోకి తెచ్చింది. ఈ-వే బిల్లు ఇన్వాయిస్‌లను జీఎస్టీఆర్-1లోని విక్రయ వివరాలతో సరిపోల్చి చూసేందుకు పన్ను అధికారులకు వీలుపడుతుందని జీఎస్‌టీఎన్ అంటోంది. ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి రూ.50 వేల కంటే అధిక విలువైన సరుకు సరఫరా కోసం ఈ-వే బిల్లును తప్పనిసరి చేసింది ప్రభుత్వం. గత ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఈ విధానం అమలులోకి వచ్చింది.


డీఐపీపీ ఇకపై డీపీఐఐటీ

న్యూఢిల్లీ: కేంద్ర వాణిజ్య శాఖ పరిధిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రియల్ పాలసీ అండ్ ప్రమోషన్ (డీఐపీపీ) పేరును డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ)గా మార్చారు. స్టార్టప్‌లు, వ్యాపార నిర్వహణకు సానుకూలత పెంచడంతోపాటు పలు అంతర్గత వాణిజ్య వ్యవహారాలను పర్యవేక్షించే బాధ్యతలు సైతం అప్పగించిన నేపథ్యంలో డిపార్ట్‌మెంట్ పేరును మార్చినట్లు తెలుస్తోంది. అంతర్గత వాణిజ్య వ్యవహారాలను డీపీఐఐటీ పరిధిలోకి తీసుకొచ్చేందుకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోదం తెలిపారు.

ఎస్‌జీఎస్‌టీ ఆర్డినెన్స్ జారీ

కాంపోజిషన్ స్కీమ్ పరిమితి పెంపు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వస్తు సేవల పన్ను ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ బుధవారం ఆమోదముద్ర వేశారు. దానికి అనుగుణంగా న్యాయ శాఖ కార్యదర్శి జీఓ జారీ చేస్తూ 'తెలంగాణ గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్ (అమెండ్‌మెంట్) ఆర్డినెన్స్-2019' ఫిబ్రవరి 1 నుంచి అమలులోకి రానున్నట్టు ప్రకటించారు. శాసన సభ ప్రోరోగ్ కావడంతో ప్రభుత్వం ఈ ఆర్డినెన్స్ తీసుకురావాల్సి వచ్చింది. జీఎస్‌టీ కౌన్సిల్ చేసిన మార్పులకనుగుణంగా ఇందులో ఆ పన్నుకు సంబంధించి పలు సవరణలు చేపట్టారు. చిన్న వ్యాపారుల రిజిస్ట్రేషన్ కోసం అమలు చేసే కాంపోజిషన్ స్కీమ్ కింద వార్షిక టర్నోవర్ పరిమితిని రూ.కోటి నుంచి రూ.కోటిన్నరకు పెంచారు. ఇదివరకు ఒక రాష్ట్రంలో పలు చోట్ల వ్యాపారం విస్తరించి ఉంటే ఆ సంబంధిత వ్యాపారికి ఒకేఒక జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ నెంబర్‌ను కేటాయించేవారు. దీనిని సవరించి రాష్ట్రంలో ఎన్ని చోట్ల వ్యాపారం విస్తరించి ఉంటే అన్ని చోట్లా రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి అవకాశాన్ని కల్పించారు.



థాయిలాండ్ ప్రతినిధుల బృందం శ్రీసిటీ సందర్శన

సత్యవేడు : థాయిలాండ్ వాణిజ్య మంత్రిత్వ శాఖకు చెందిన తొమ్మిది మంది ప్రతినిధుల బృందం బుధవారం శ్రీసిటీని సందర్శించింది. జనరల్ సోమ్‌దేట్ సూసోంబూన్ నేతృత్వంలో ఇక్కడకు విచ్చేసిన బృందానికి శ్రీసిటీ ప్రెసిడెంట్ రమేష్ సుబ్రహ్మణ్యం సాదర స్వాగతం పలికి శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతి, ప్రత్యేకతలు, వ్యాపార అనుకూలతల గురించి వారికి వివరించారు. అనంతరం శ్రీసిటీ పరిసరాలను, థాయిలాండ్‌కు చెందిన ఫర్నిచర్ తయారీ పరిశ్రమ రాక్‌వర్త్‌ను సందర్శించి అక్కడ ఉత్పత్తులు పరిశీలించారు. ఈ సందర్భంగా సోమ్‌దేట్ సూసోంబూన్ మాట్లాడుతూ శ్రీసిటీలోని మౌలిక వసతులు, స్నేహపూర్వక వ్యాపార వాతావరణం తమను ఆకట్టుకున్నాయని తమ దేశానికి చెందిన వివిధ సంస్థలు ఇక్కడ పెట్టుబడులు పెట్టగలవన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

'అమర రాజా'కు ఇస్రో లిథియం అయాన్ టెక్నాలజీ

బెంగుళూరు : ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన అమర రాజా బ్యాటరీస్ అత్యంత అధునాతన లిథియం అయాన్ బ్యాటరీల తయారీకి సిద్ధమవుతోంది. ఈ బ్యాటరీల తయారీకి అవసరమైన టెక్నాలజీ బదిలీ కోసం, భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మొత్తం పది కంపెనీలను ఎంపిక చేసింది. ఇందులో అమర రాజా బ్యాటరీస్ కంపెనీతో పాటు హైదరాబాద్‌కు చెందిన గల్ఫ్ ఆయిల్ గ్రూపునకు చెందిన జీఓసీఎల్ కార్పొరేషన్ లిమిటెడ్ కంపెనీ కూడా ఉంది. ఇంకా పుణెలోని బీఈఎల్, కార్బొరాండం యూనివర్సల్ (కొచ్చిన్), నాల్కో (భువనేశ్వర్), సుఖబీర్ ఆగ్రో ఎనర్జీ లిమిటెడ్ (ఢిల్లీ), టాటా కెమికల్స్ (ముంబై), థర్మాక్స్ (పుణె) కంపెనీలు కూడా ఇస్రో నుంచి ఈ టెక్నాలజీ బదిలీ కోసం అర్హత సంపాదించాయి. లిథియం ఐయాన్ బ్యాటరీల వలన కాలుష్య రహిత వాహనాల అభివృద్ధి మరింత ఊపందుకుంటుందని భావిస్తున్నారు. తిరువనంతపురంలోని ఇస్రో 'విక్రం సారాభాయ్ స్పేస్ సెంటర్' ఈ టెక్నాలజీని అభివృద్ధి చేసింది.

పెన్షన్‌దారులకు పెరిగిన డీఆర్

అమరావతి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పెన్షన్‌దారులకు ఇచ్చే డీఆర్ రేటును సవరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. 2018 జనవరి 1నుంచి అమల్లో ఉన్న రిటైర్డ్ ఉద్యోగుల రేటును కేటగిరీల వారీగా రివైజ్ చేస్తూ ఆదేశాలిచ్చారు. రాష్ట్ర పెన్షన్‌దారులు రివైజ్డ్ పేస్కేల్ 2010లో 105.288 శాతం ఉన్నవారికి 107.856శాతంగా, 2005 రివైజ్డ్ పేస్కేల్ 2005లో 243.978శాతం ఉన్నవారికి 249.63శాతం, రివైజ్డ్ పేస్కేల్ 1999లో 242.128శాతం ఉన్నవారికి 247.036 శాతానికి పెంచారు. యూజీసీ పెన్షన్‌దారులకు యూజీసీ పేస్కేల్ 2006లో 139శాతం ఉన్నవారికి 142శాతంగా, యూజీసీ పేస్కేల్ 1996లో 268శాతం ఉన్న పెన్షన్‌దారులకు 274శాతానికి, ఉన్నత విద్యాశాఖ జీవో నెం.54, 34 ప్రకారం పెన్షన్ పొందుతున్నవారికి 139శాతం నుంచి 142శాతానికి పెంచారు. జ్యుడీషియల్ పెన్షన్ పొందుతున్న పెన్షన్‌దారులకు 139శాతం నుంచి 142శాతానికి డీఆర్ రేట్‌ను పెంచుతూ ఆర్థికశాఖ ఆదేశాలిచ్చింది. 2018 జనవరి 1నుంచి 2019 మార్చి 31వరకు అందాల్సిన ఉపశమన మొత్తాన్ని 2019 ఏప్రిల్ పెన్షన్‌తో పాటు మే నెలలో అందించనున్నారు.

భారత్‌లో అవినీతి తగ్గింది!

అమెరికా, చైనా ర్యాంకులు దిగజారాయి.. తొలి 20 దేశాల్లో పెద్దన్న గాయబ్

- ఓఆర్ఓబీ అవినీతితో చైనా ర్యాంకుకు దెబ్బ
- ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 30: భారీగా కాకపోయినా భారతదేశంలో అవినీతి తగ్గుతోంది. 2018 సంవత్సరానికి తాజాగా ప్రకటించిన ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ ర్యాంకింగ్‌లో భారత్ పరిస్థితి మెరుగుపడింది. 2017లో భారత్ ర్యాంకింగ్ 81 ఉండగా, తాజాగా మూడు స్థానాలు మెరుగుపడి 78వ ర్యాంకు సాధించింది. 2016లో భారత్ 79వ ర్యాంకు వద్ద నిలిచింది. గత ఏడాది 40 పాయింట్లు సాధించిన భారత్ తాజాగా 41 పాయింట్లు సాధించింది. అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన అమెరికా, చైనాలు ట్రాన్స్‌పరెన్సీ ర్యాంకుల్లో దిగజారాయి. 2011 తర్వాత తొలిసారిగా అమెరికా తొలి 20 దేశాల జాబితాలో చోటు సంపాదించలేక పోయింది. 2017లో 75 పాయింట్లతో 16వ ర్యాంకులో ఉన్న అమెరికా ఇప్పుడు 71 పాయింట్లతో 22వ స్థానానికి దిగజారింది. చైనా ఏకంగా 77వ ర్యాంకు నుంచి 87వ ర్యాంకుకు దిగజారడం గమనార్హం. వివాదాస్పద 'ప్రాజెక్టు వన్ బెల్ట్ వన్ రోడ్'లో అవినీతి కారణంగా చైనా ర్యాంకింగు దారుణంగా పడిపోయిందని చెబుతున్నారు. అతి తక్కువ అవినీతితో డెన్మార్క్, న్యూజిలాండ్‌లు ర్యాంకింగ్‌లో తొలి రెండు స్థానాల్లో ఉండగా, దక్షిణ సూడాన్, సోమాలియాలు అట్టడుగున ఉన్నాయి. ఆరోగ్యవంతమైన ప్రజాస్వామ్యం, ప్రభుత్వరంగ సంస్థల్లో అవినీతి వ్యతిరేక పోరాటం ద్వారా అవినీతిని తగ్గించవచ్చని ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ వ్యాఖ్యానించింది. మూడింట రెండు వంతుల దేశాలు 50 పాయింట్లు దాటలేక పోయాయి. భారత్, మలేసియా, పాకిస్థాన్, మాల్దీవుల్లో అవినీతి వ్యతిరేక చర్యలు అనేకం తీసుకున్నా వాటి ర్యాంకుల్లో ఆ మేరకు భారీ మెరుగుదల కనిపించలేదు. పాకిస్థాన్ 117వ స్థానానికి దిగజారింది. ప్రపంచ సగటు పాయింట్లు 43కు రెండు పాయింట్ల దూరంలో భారత్ ఆగిపోయింది.

చేపల ప్యాకింగ్ పాయింట్ల వద్దే చర్యలు: సీఎస్

అమరావతి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నుంచి బిహార్, కోల్‌కతాతోపాటు మేఘాలయ తదితర ఈశాన్య రాష్ట్రాలకు సరఫరా చేసే చేపల ప్యాకింగ్‌లో ఫార్మాలిన్ వాడటంలేదని సంబంధిత అధికారులు ధృవీకరణ చేసిన తర్వాతే వాటిని ఎగుమతి చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్‌చంద్ర పునేఠా ఆదేశించారు. చేపల ప్యాకింగ్ పాయింట్ల వద్దే ఈ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏపీ నుంచి బిహార్ తదితర ప్రాంతాలకు చేపల ఎగుమతిపై బుధవారం సచివాలయంలో మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్‌తోపాటు మత్స్యశాఖ అధికారులు, చేపల ఉత్పత్తి, ఎగుమతిదారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. ఏపీ నుంచి సరఫరా అయ్యే చేపలపై గతంలో విధించిన నిషేధాన్ని ఎత్తివేస్తున్నట్లు బిహార్ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిందని చెప్పారు.

నీలేకని 'ఆధార్' కార్డ్ భేష్


బ్లాగులో బిల్‌గేట్స్ ప్రశంసలు



బెంగళూరు (ఆంధ్రజ్యోతి): 'ఆధార్' కార్డు రూపకర్త, ఇన్ఫోసిస్ కంపెనీ ప్రస్తుత చైర్మన్ నందన్ నీలేకనిని మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్ తన బ్లాగులో ప్రశంసలతో ముంచెత్తారు. వంద కోట్లకు మించిన జనాభా ఉన్న భారత్‌లో అందరికీ ఒకే విధమైన గుర్తింపు కార్డు 'ఆధార్' రూపకర్త నందన్ నీలేకని అని ప్రత్యేకంగా కొనియాడారు. గేట్‌నోట్స్ పేరుతో ఉన్న తన బ్లాగులో 'హీరోస్ ఇన్ ది ఫీల్డ్' అనే వీడియోలో నీలేకని పేరును ప్రత్యేకంగా ప్రస్తావించారు. రెండున్నర నిమిషాల నిడివి ఉండే ఈ వీడియోలో నీలేకని పరిచయంతోపాటు, సామాన్యులకు ప్రయోజనం కలిగించే ఆధార్ కార్డుల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. సామాన్యుల నుంచి శ్రీమంతుల వరకు అందరికీ 'ఆధార్' ఒకే వేదికలా గుర్తింపు ఇచ్చిందన్నారు. అమెరికాలో గ్రీన్‌కార్డ్, పాస్‌పోర్ట్‌లతో గుర్తింపు పొందితే, భారత్‌లో బయోమెట్రిక్ 'ఆధార్' గుర్తింపు కార్డు ద్వారా పౌరులను గుర్తించడం ఓ అద్భుత విషయమని గేట్స్ పేర్కొన్నారు.

పాత ఐ ఫోన్లతోనే గడిపేస్తున్నారు

వర్ధమాన మార్కెట్లలో క్షీణతపై టిమ్ కుక్



న్యూఢిల్లీ : కస్టమర్లు దీర్ఘకాలం పాటు పాత ఐఫోన్లతో గడిపేయడమే వర్ధమాన మార్కెట్లలో ఐఫోన్ల అమ్మకాలు తగ్గడానికి కారణమని యాపిల్ సీఈఓ టిమ్ కుక్ చెప్పారు. భారత మార్కెట్‌ను ప్రత్యేకంగా ప్రస్తావించకుండానే వర్ధమాన మార్కెట్లలో ఇటీవల కాలంలో ఐ ఫోన్ల అమ్మకాలు పుంజుకోకపోవడానికి చాలా కారణాలున్నాయన్నారు. గత ఏడాది వర్ధమాన మార్కెట్ల నుంచి ఐ ఫోన్ల అమ్మకాల ద్వారా ఆదాయం 15 శాతం క్షీణించిందని విశ్లేషకుల సమావేశంలో తెలిపారు.



34 వేలకు పసిడి

న్యూఢిల్లీ: పసిడి ధర పరుగులు పెడుతోంది. ఢిల్లీ, హైదరాబాద్ బులియన్ మార్కెట్లో ఏకంగా రూ.34 వేల స్థాయిని దాటింది. 24 కేరట్ల బంగారం పది గ్రాముల ధర బుధవారం నాడు ఢిల్లీలో రూ.320 పెరిగి రూ.34,070కు చేరుకోగా హైదరాబాద్‌లో రూ.34,200 పలికింది. వెండిదీ ఇదే ట్రెండు. అంతర్జాతీయ కమోడిటీ మార్కెట్లో విలువైన లోహాలకు డిమాండ్ పెరగడంతో దేశీయంగా రిటైల్ ఆభరణ వర్తకులు కొనుగోళ్లు పెంచారు. ధరల పెరుగుదలకు అదే ప్రధాన కారణమని బులియన్ మార్కెట్ వర్గాలు తెలిపాయి. వాణిజ్య యుద్ధానికి తెరదించే దిశగా అమెరికా-చైనా మధ్య చర్చలపై అనిశ్చితి నెలకొంది. చైనా టెలికాం దిగ్గజం హువేపై అమెరికా ప్రభుత్వం క్రిమినల్ చర్యలు చేపట్టడం ఇరు వర్గాల మధ్య చర్చలను అనిశ్చితిలోకి నెట్టాయి. తత్ఫలితంగా అంతర్జాతీయంగా ఈక్విటీ మార్కెట్లపై ఒత్తిడి పెరగడంతో ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను విలువైన లోహాల్లోకి మళ్లించారు. దాంతో బంగారం, వెండి రేట్లు మరింత ఎగబాకాయి. న్యూయార్క్ మార్కెట్లో ఔన్స్ బంగారం ధర 1,314.76 డాలర్లకు, వెండి 15.96 డాలర్లకు చేరుకుంది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో గడిచిన రెండ్రోజుల్లో పుత్తడి రేటు రూ.450 మేర పెరిగింది.

ఐఓసీ లాభంలో భారీ క్షీణత



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని ఆయిల్ మార్కెటింగ్ కంపెనీ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) లాభాలకు 2018 డిసెంబరు త్రైమాసికంలో భారీగా గండి పడింది. గత ఏడాది ఇదే కాలంలో రూ.7,883.22 కోట్లున్న కంపెనీ నికర లాభం 90.9 శాతంతగ్గి రూ.716.82 కోట్లకు పడిపోయింది. ముడి చమురు ధరలు తగ్గడంతో కంపెనీ దగ్గర నిల్వ ఉన్న చమురు ఉత్పత్తుల విలువ తగ్గడం ఇందుకు ప్రధాన కారణమని తెలిపింది. అయితే ఇదే సమయంలో కంపెనీ ఆదాయం రూ.1.32 లక్షల కోట్ల నుంచి రూ.1.6 లక్షల కోట్లకు పెరిగింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే దేశీయ అమ్మకాలు మూడు శాతం పెరిగి 2.15 కోట్ల టన్నులకు చేరాయి.

వేరుగా పోస్టల్ బీమా వ్యాపారం

న్యూఢిల్లీ: జీవిత బీమా వ్యాపారాన్ని విభజించి ప్రత్యేక విభాగంగా ఏర్పాటు చేయాలని తపాలా శాఖ భావిస్తోందని, ఈ ప్రతిపాదనను కేబినెట్ ఆమోదం కోసం పంపిందని కేంద్ర సమాచార శాఖ మంత్రి మనోజ్ సిన్హా బుధవారం వెల్లడించారు. పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ కార్యకలాపాలను తొలుత ప్రత్యేక వ్యాపార విభాగంగా, ఆ తర్వాత దశలో పూర్తి స్థాయి బీమా సంస్థగా ఏర్పాటు చేయనుందని మంత్రి చెప్పారు. మరో పక్షం రోజుల్లో కేబినెట్ ఇందుకు ఆమోదం తెలిపే అవకాశం ఉందని ఆయన సంకేతాలిచ్చారు. ఇండియన్ పోస్టల్ పేమెంట్స్ బ్యాంక్ గడిచిన ఐదు నెలల్లో సేవల నెట్‌వర్క్‌ను 1.26 లక్షల యాక్సెస్ పాయింట్లకు పెంచుకుందని, మరో పది రోజుల్లో ఈ సంఖ్య 1.36 లక్షలకు చేరుకోనుందన్నారు.

10700 వద్ద రియాక్షన్

టెక్ వ్యూ

మార్కెట్ ప్రారంభ సెషన్‌లో మరింత రికవరీలో నిరోధ స్థాయి 10700 వరకు వెళ్లింది. ఆ స్థాయిలో బలమైన రియాక్షన్‌తో ప్రధాన మద్దతు స్థాయి 10600 వరకు దిగజారి తిరిగి రికవరీ సాధించింది. డే గరిష్ఠ, కనిష్ఠ స్థాయిల మధ్యన క్లోజ్ కావడం ట్రెండ్‌లో అనిశ్చితిని సూచిస్తోంది. గత కొద్ది రోజుల్లో 10600 వద్ద మద్దతు పొందుతోంది. ఇప్పటికీ టెక్నికల్‌గా స్వల్పకాలిక కరెక్షన్ కొనసాగుతోంది.

గురువారం స్థాయిలివే...

నిరోధం : 10700 **మద్దతు** : 10600

- మరింత అప్‌ట్రెండ్ కోసం 10700 కన్నా పైన బలంగా క్లోజ్ కావాలి. మరో ప్రధాన నిరోధం 10800.
- మరింత కరెక్షన్‌లో పడి 10600 వద్ద విఫలమైతే స్వల్పకాలిక కరెక్షన్ మరింతగా కొనసాగుతుంది. ప్రధాన మద్దతు స్థాయిలు 10500-10450.
- బ్యాంక్ నిఫ్టీ టెక్నికల్ బౌన్స్‌బ్యాక్ సాధించింది. 27000 వద్ద నిరోధం ఎదుర్కొంటోంది.

■ వి.సుందర్ రాజా

ప్రథమార్ధం సాధారణంగా మెరుగు

ఆస్ట్రో వ్యూ

తిథి : పుష్య బహుళ ఏకాదశి
నక్షత్రం : జ్యేష్ఠ

కృత్తిక, ఉత్తర, ఉత్తరాషాఢ నక్షత్ర జాతకులు, ధనుస్సు, మేష రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ : 10651.80 (-0.40)

ట్రెండ్ మార్పు వేళలు : 11.19; 12.05

ధోరణి : నిఫ్టీ ఫ్యూచర్స్ నిస్తేజంగా ప్రారంభమై 10 గంటల నుంచి ఒంటి గంట మధ్యలో మెరుగ్గా ట్రేడ్ కావచ్చు. ఆ తర్వాత 3 గంటల వరకు నిస్తేజంగా ఉండి తదుపరి చివరి వరకు మరోసారి మెరుగ్గా మారే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం : నిఫ్టీ ఫ్యూచర్స్ 10 గంటల సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని ఒంటి గంట సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 1.15 తర్వాత ఎటిపి కన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని 3 గంటల సమయంలో క్లోజ్ చేసుకోవచ్చు.

నిరోధం : 10690, 10725

మద్దతు స్థాయిలు : 10610, 10575


ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి


www.thefinanciala strologer.blogspot.in

బులియన్



బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	34,200	---	---	33,700	33,080
క్రితం ముగింపు	33,880	33,520	33,950	33,450	32,920
22 క్యారెట్లు	31,670	---	---	31,200	31,610
క్రితం ముగింపు	31,370	31,100	32,130	30,970	31,450
వెండి (కిలో)	41,400	---	---	41,400	43,800
క్రితం ముగింపు	40,800	41,200	41,100	40,800	43,600

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.55 నెక్ (100 గుడ్లు)



హైదరాబాద్	395	చిత్తూరు	423
వరంగల్	397	చెన్నై	430
విజయవాడ	395	నమక్కల్	420
గోదావరి	395	బెంగళూరు	425
విశాఖపట్నం	395	ముంబై	450

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	85	విజయవాడ	86
కరీంనగర్	84	గుంటూరు	87
వరంగల్	83	ఒంగోలు	88
మహబూబ్‌నగర్	85	చిత్తూరు	88
కర్నూలు	85	నెల్లూరు	88
విశాఖపట్నం	83	అనంతపురం	87
గోదావరి	84		

ఎన్‌టీపీసీ లాభం రూ.2,385 కోట్లు

1:5 నిష్పత్తిలో బోనస్ షేర్లు.. మధ్యంతర డివిడెండు రూ.3.58

న్యూఢిల్లీ : డిసెంబరు, 2018తో ముగిసిన మూడో త్రైమాసికం ప్రభుత్వ రంగంలోని విద్యుత్ ఉత్పత్తి కంపెనీ ఎన్‌టీపీసీకి పెద్దగా కలిసి రాలేదు. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే కంపెనీ ఆదాయం 15.27 శాతం పెరిగి రూ.24,308.01 కోట్లకు చేరింది. నికర లాభంలో మాత్రం పెద్దగా వృద్ధి లేదు. గత ఆర్థిక సంవత్సరం (2017-18) మూడో త్రైమాసికంలో రూ.2,360.81 కోట్లున్న కంపెనీ నికర లాభం, ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి స్వల్పంగా పెరిగి రూ.2,385.41 కోట్లకు చేరింది. ఇంధన ధరలతో పాటు, అప్పుల భారం మూడో త్రైమాసికంలో కంపెనీ లాభాలను బాగా దెబ్బతీశాయి.

తొమ్మిది నెలలకు చూసినా నిరాశే

ఈ ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలల (ఏప్రిల్-డిసెంబరు, 2018) ఆర్థిక ఫలితాలను పరిగణనలోకి తీసుకున్నా, ఎన్‌టీపీసీ ఆర్థిక ఫలితాలు అంత ఆశాజనకంగా లేవు. ఈ కాలంలో కంపెనీ ఆదాయం 13.06 శాతం వృద్ధితో రూ.61,590.12 కోట్ల నుంచి రూ.69,633.95 కోట్లకు చేరింది. ఇదే కాలంలో నికర లాభం మాత్రం రూ.7,417.58 కోట్ల నుంచి రూ.7,399.57 కోట్లకు పడిపోయింది.

ఆర్థిక ఫలితాలు అంతంత మాత్రంగానే ఉన్నా వాటాదారులకు 1:5 నిష్పత్తిలో బోనస్ షేర్లు జారీ చేయాలని బుధవారం సమావేశమైన ఎన్‌టీపీసీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది. అంటే వాటాదారుల దగ్గర ఉన్న ప్రతి ఐదు షేర్లకు ఒక షేరు బోనస్‌గా లభిస్తుంది. వాటాదారుల ఆమోదానికి లోబడి, ఈ బోనస్ షేర్లు జారీ చేస్తారు. బోనస్ ఇష్యూతో పాటు వాటాదారులకు ఒక్కో షేరుపై 35.8 శాతం చొప్పున మధ్యంతర డివిడెండు చెల్లించాలని కంపెనీ బోర్డు సిఫారసు చేసింది. ఈ లెక్కన రూ.10 ముఖ విలువ ఉన్న ఒక్కో షేరుపై రూ.3.58 చొప్పున మధ్యంతర డివిడెండు లభిస్తుంది.

మూడో త్రై మాసికానికి..

- 76.92 శాతం నుంచి 77.70 శాతానికి పెరిగిన స్థాపిత ఉత్పత్తి సామర్థ్య (పీఎల్ఎఫ్) వినియోగం.
- 67.78 బిలియన్ యూనిట్ల నుంచి 70.07 బిలియన్ యూనిట్లకు పెరిగిన విద్యుత్ ఉత్పత్తి.
- ఏప్రిల్-డిసెంబరు, 2018 మధ్య కాలంలో అమ్మిన ఒక్కో యూనిట్ విద్యుత్ సగటు ధర రూ.3.47.
- 60,000 టన్నుల నుంచి 1.9 లక్షల టన్నులకు పెరిగిన బొగ్గు దిగుమతులు.

‘హెరిటేజ్’ లాభంలో 20% వృద్ధి

మూడో త్రైమాసికానికి రూ. 20 కోట్లు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హెరిటేజ్ ఫుడ్స్ డిసెంబరు, 2018తో ముగిసిన మూడో త్రైమాసికానికి కంపెనీ మంచి ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ఈ కాలానికి కంపెనీ అనుబంధ కంపెనీలతో కలిపి (కన్సాలిడేటెడ్) రూ.618.76 కోట్ల ఆదాయంపై రూ.20.1 కోట్ల నికరలాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 6.9 శాతం మాత్రమే పెరిగినా, నికర లాభం మాత్రం 20 శాతం పెరిగింది. ఇదే కాలంలో కంపెనీ నిర్వహణా లాభమూ 22.3 శాతం పెరిగి రూ.46.44 కోట్లకు చేరింది. ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటి వరకు ముగిసిన తొమ్మిది నెలలను పరిగణనలోకి తీసుకున్నా హెరిటేజ్ ఫుడ్స్ మంచి ఆర్థిక ఫలితాలే సాధించింది. ఈ తొమ్మిది నెలల కాలంలో కంపెనీ రూ.1,879.73 కోట్ల ఆదాయంపై రూ.62.43 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఆదాయం 3.7 శాతం మాత్రమే పెరిగినా ఈ కాలంలో కంపెనీ నికర లాభం 45.6 శాతం పెరిగింది. నిర్వహణ లాభం కూడా 62.2 శాతం వృద్ధితో రూ.144.52 కోట్లకు చేరింది. ‘గత తొమ్మిది నెలల కాలంలో మా నిర్వహణ లాభం చెప్పుకోదగ్గ స్థాయిలో పెరిగింది. ప్రస్తుతం అన్ని ప్రాంతాలు, మార్కెట్లలో మా ఉత్పత్తులకు మంచి డిమాండ్ కనిపిస్తోంది. ఆదాయం పెంచుకునేందుకు కీలక ఉత్పత్తుల మార్కెట్‌లో మార్కెట్ వాటా మరింత పెంచుకోవాలని భావిస్తున్నాం’ అని హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రాహ్మణి చెప్పారు.

మూడో త్రైమాసిక ఫలితాలు (రూ. కోట్లలో)

కంపెనీ	లాభం 2018-19	లాభం 2017-18	వృద్ధి/ క్షీణత(%)	ఆదాయం 2018-19	ఆదాయం 2017-18	వృద్ధి/ క్షీణత(%
జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ	146	47	210	2,491	2,081	19.73
టొరెంట్ ఫార్మా	246	58	324	2,051	1,463	40.19
హెక్సావేర్	123	121	2	1,252	1,004	24.60
ఈఐహెచ్	64	43	49	457	375	21.86
చోళమండలం	304	--	41	--	--	--
అంజతా ఫార్మా	67	147	-55	485	587	-17.37

బజాజ్ ఆటో ఆదాయం రూ.7,879 కోట్లు

న్యూఢిల్లీ: వాహన తయారీ సంస్థ బజాజ్ ఆటోకు వర్తమాన ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం బాగానే కలిసొచ్చింది. ఈ కాలానికి కంపెనీ కన్సాలిడేటెడ్ ఆదాయం రూ.7,879.34 కోట్లపై రూ.1,220.77 కోట్ల నికరలాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 19.49 శాతం, నికర లాభం 20.49 శాతం పెరిగాయి. ప్లాటినా, పల్సర్, సిటీ 100 బైకుల అమ్మకాలు పెరగడం ఇందుకు బాగా దోహదం చేసింది. ఈ కాలంలో అమ్మిన వాహనాల సంఖ్య 26 శాతం పెరగడం, కంపెనీకి బాగా కలిసొచ్చింది. గత ఏడాది మూడో త్రైమాసికంలో దేశీయ మార్కెట్‌లో 10.01 లక్షల యూనిట్లున్న వాహనాల అమ్మకాలు, ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో 12.59 లక్షల యూనిట్లకు చేరాయి. ఇదే కాలంలో దేశీయ మార్కెట్‌లో విక్రయించిన మోటారు సైకిళ్ల సంఖ్య 38 శాతం వృద్ధి రేటుతో 4.66 లక్షల యూనిట్ల నుంచి 6.44 లక్షల యూనిట్లకు చేరాయి. ఎగుమతి చేసిన వాహనాల సంఖ్యా 23 శాతం పెరిగి 5.24 లక్షల యూనిట్లకు చేరాయి. దీంతో గత మూడేళ్లలో ఎన్నడూ లేని విధంగా దేశీయ టూ వీలర్ల మార్కెట్‌లో కంపెనీ మార్కెట్ వాటా 20.3 శాతానికి చేరింది.

ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్

2018-19 ఆర్థిక సంవత్సరం డిసెంబరు త్రైమాసికంలో ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ 25.5 శాతం వృద్ధితో రూ.596.31 కోట్ల నికరలాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన లాభం రూ.475.10 కోట్లు. వడ్డీ ఆదాయాలు పెరగడంతో తాము మెరుగైన లాభం ఆర్జించగలిగామని సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఇదే కాలంలో మొత్తం ఆదాయం రూ.4,439.21 కోట్లు కాగా వడ్డీ ఆదాయం రూ.4,414.15 కోట్లని తెలియచేసింది. వ్యయాలు కూడా రూ.2,907.90 కోట్ల నుంచి రూ.3,579.62 కోట్లకు పెరిగాయి.



లాభం నుంచి నష్టంలోకి

మార్కెట్‌ను వెంటాడిన బడ్జెట్ భయాలు

స్టాక్ మార్కెట్ వరుసగా నాలుగో రోజూ మదుపరులను నిరాశ పరిచింది. ఉదయం 200 పాయింట్ల లాభాలతో ప్రారంభమైన సెన్సెక్స్, ఒక దశలో 359 పాయింట్ల వరకూ పెరిగింది. చివరికి 1.25 పాయింట్ల నష్టంతో 35,591.25 దగ్గర క్లోజైంది. నిఫ్టీ కూడా 0.40 పాయింట్ల స్వల్ప నష్టంతో 10,651.80 దగ్గర ముగిసింది. సెన్సెక్స్‌లో అత్యధిక వెయిటేజి ఉన్న ఐసీఐసీఐ బ్యాంక్, టాటా స్టీల్ కంపెనీల షేర్లు ఐదు శాతానికిపైగా పెరగడంతో, సూచీలు పెద్దగా పతనం కాకుండా బయటపడ్డాయి. లేకపోతే నష్టం మరింత ఎక్కువగా ఉండేది.

పతనానికి కారణాలు

శుక్రవారం నాడు ప్రకటించే కేంద్ర బడ్జెట్ ఎలా ఉంటుందోనన్న భయాలు బుధవారంనాడు కూడా మార్కెట్‌ను ప్రధానంగా వెంటాడాయి. గురువారం నాటి జనవరి నెల డెరివేటివ్స్ ట్రేడింగ్ ముగింపు ఎలా ఉంటుందోనన్న భయాలూ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. వడ్డీ రేట్లపై బుధవారం రాత్రి అమెరికా కేంద్ర బ్యాంక్ ‘ఫెడరల్ రిజర్వ్’ ఏ నిర్ణయం ప్రకటిస్తుందోనన్న భయం కూడా మార్కెట్‌ను వెంటాడింది. వాణిజ్య యుద్ధానికి తెరదించేందుకు అమెరికా-చైనా మధ్య ప్రారంభమైన చర్చలపైనా మార్కెట్ పెద్దగా ఆశలు పెట్టుకోలేదు. ప్రధాన అంతర్జాతీయ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవడమూ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఎఫ్ఎంసీజీ, రియల్టీ, ఫార్మా కంపెనీల షేర్లు అధికంగా అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. మెటల్, ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లు మాత్రమే లాభాలతో ట్రేడయ్యాయి.

డీహెచ్ఎఫ్ఎల్ షేర్లలో ఆగని పతనం

కోబ్రా పోస్ట్ కథనంతో డీహెచ్ఎఫ్ఎల్ షేర్లు బుధవారమూ తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఉదయం ట్రేడింగ్ ప్రారంభంలో బీఎస్ఈలో ఈ కంపెనీ షేర్లు 10 శాతం నష్ట పోయి రూ.154కి చేరి 35 నెలల కనిష్ఠ స్థాయిని తాకాయి. చివరికి 4.97 శాతం నష్టంతో రూ.161.60 దగ్గర ముగిశాయి. దీంతో గత మూడు రోజుల్లోనే ఈ షేర్లలో మదుపరులు 23 శాతం వరకు నష్టపోయారు.

లాభాల్లో యాక్సిస్ బ్యాంక్ షేర్లు

యాక్సిస్ బ్యాంక్ షేర్లు బుధవారం చురుగ్గా ట్రేడయ్యాయి. బీఎస్ఈలో ఒక దశలో ఈ షేర్లు 6.38 శాతం దూసుకు పోయాయి. చివరికి 4.56 శాతం లాభంతో రూ.690.90 దగ్గర ముగిశాయి. దీంతో బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ బుధవారం ఒక్క రోజే రూ.7,744.81 కోట్లు పెరిగి రూ.1.77 లక్షల కోట్లకు చేరింది.

పుంజుకున్న డిష్ టీవీ షేర్లు

జీ గ్రూపునకు చెందిన డిష్ టీవీ షేర్లు బుధవారం మరింత పుంజుకున్నాయి. బీఎస్ఈలో ఈ కంపెనీ షేర్లు 10.55 శాతం లాభంతో రూ.24,10 దగ్గర ముగిశాయి.

బీఎస్ఈలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు

ACI INFOCOM .6(.6)470
ADITYA SPIN. 5.5(5.67)1800
AGRO TECH FO 554.8(565.6)227
AISHWARYA TE 2.65(2.74)2205
ALPHAGEO (I) 472.8(486.55)736
ALU FLUORIDE 86.9(89.85)11598
AMAR RAJA BA 749.95(749.7)36899
ANDHRA BANK 25.95(26)62219
ANDHRA CEMEN 4.63(4.5)2950
ANDHRA PETRO 57.45(55.35)52662
ANJANI PORTL 113.4(107.6)207
ASTRA MICRO 77.75(80.1)12963
AUROB.PHARMA 778.4(760.85)435298
AVANTEL LTD 220.65(225.55)414
AVANTI FEEDS 316.4(309.7)37543
B.N.RATHI SE 24.85(24)106
BALAJI AMINE 425(424.85)1908
BAMBINO AGRO 180(184.5)521
BARTRONICSIN 6.51(6.5)400
BCG 2.95(2.83)41376
BHAGIRA.CHEM 423.6(423)4512
BHAGYA INL 33.25(35.45)379
BHARATFIN 932.65(924.4)13431
BNR UDYOG 17.34(17)15
CAMBRIDGE 44(43.5)4
CAT TECHN. .56(.58)1310
CCHHL 6.63(6.59)4559
CCL PRODUCTS 267.45(270.5)747
CELESTIAL 6.91(6.86)6512
CIL SECURITS 14.5(14.85)100
COROM INTER 447(442.9)7794
CYBERMATE 1.92(1.84)29661
CYIENT 611.2(584.5)10579
DANLAW TECH. 83.2(86.15)886
DIAMONPOWER 1.44(1.51)1400
DIVI'S LAB. 1503.35(1501.95)18068
DIVYA.GRANIT 95.55(98.7)55
DQ ENT 6.25(6.4)4531
DR.REDDY'S 2664.85(2661.6)13711
EMPEE SUGARS 1.4(1.39)408
EVEREST ORG. 165.25(137.75)24936
FACOR ALLOYS 1.93(2)28292
GATI LTD. 74.65(72.65)112580
GAYATRI PROJ 167.15(169.4)2550
GENNEX LAB 3.13(2.91)100195
GMR INFRASTR 15.5(15.55)838334
GODAVARI DRU 21.85(21.55)372
GOLDSTONE EN 12.65(12.1)15042
GRANULES (I) 92.4(88.4)364183
GVK POWERINF 6.65(6.62)91778
HBL P SYS 26.85(24.65)90413
HERITGFOOD 482.2(474.35)4469
HIND.FLUROCA 15.1(15.2)2312
IPAPPM 428.2(420.05)10280
IVRCL LTD .91(.92)69989
KAKATIYA CEM 183.4(182.65)3290
KALLAM 16.75(17)4879
KAVERI SEED 596.55(573.15)20832
KCP LTD 84.5(83.9)144
KERNEX MICRO 25.3(24.2)2151
KNR CONST 205.5(205.6)2135
KREBS BIOCHM 107.15(113.95)32869
LOKESH MACH 41.45(42.45)610
LOTUS CHOC 24.85(23.9)300
MADHUCON PRJ 6.05(6.15)1306
MOLD-TEK TEC 45.15(45.7)9143
MOSCHIP SEMI 20.55(20.7)17447
MSR INDIA 9.08(9.5)10116
N C L IND. 119.5(121.65)3501
NACLIND 27.25(27.25)1817
NATCO PHARM 677.3(665.5)8708
NCC 80.4(81.4)474087
NEHA INTER. 4.11(4.11)14129
NETTLINX LTD 43.15(43.7)14083
NEULAND LAB. 490.9(500.4)418
NIHAR INFO 10.81(10.31)3400
NILE LTD. 305.3(333.2)15407
OIL COUNTRY 13.7(14.3)7604
OLECTRA 227.3(226.45)6854
PADMALAYA TE 2(2.09)1403
PALRED 35.25(35.25)224
PANYAM CEMEN 10.69(10.73)7328
PENNAR STEEL 35.25(35.7)11413
PFL INFOTECH 8.33(8.49)50
PHYTOCHEM I. 42(39.6)395
PITTIENG 57.7(48.5)78511
POKARNA LTD 177.05(175.85)12826
PRAJAY ENGS. 8.25(8.05)1000
PREMIER EXPL 241.5(251.55)3134
PRSMJOHNSN 69.9(73.25)27861
RAIN 117.8(112.6)276780
RAJ PACKAGIN 27(27)102
REG.CERAMIC 4.09(4.3)1500
RESTILE CER. 3.85(3.77)500
SAMKRG PIST. 178.4(178.45)3064
SAMPRE NUTRI 44.55(44.55)100
SANGHI IND. 56.3(55.85)2713
SATVAH.ISPAT 9.9(9)1065
SAVEN TECHNO 26.55(27.8)9666
SIBAR AUTO 27.55(29)100
SMPL .39(.39)60
SMS PHARMACE 65.1(64.85)4961
SREE RAYALA 145.75(145.65)419
STEEL EXCH 11.8(11.35)998
SUJANA INDUS .3(.31)3850
SURANATP 4.39(4.33)10768
SURYACHAKRA .28(.27)5307
SURYLAK.COTT 38.9(39.85)154
SUVEN LIFE S 193.45(192.75)34633
TAJ GVK HOTL 177.7(176.6)296
TANLA 39.3(37.3)87934
TRANSCORP IN 24.7(23.2)752
TRANSGENE BI 5.44(5.48)342561
TRANSPORT CO 278.95(275.75)1010
USHER AGRO 2.38(2.38)1123
VICEROY HOTE 3.29(3.46)45550
VIJAY TEXTIL 35.5(34.85)4082
VIMTA LABS 252.85(253.15)5419
VIRAT CRANE 28.8(29)2221
VIRINCHI 73.6(73.15)6574
VISAKA IND. 363.85(368.6)2087
VISTA PHARMA 24.55(24.05)129370
VIVIMED LABS 22.85(22.9)53443
VST INDUS. 3252.2(3230.4)1032
WATERBASE 145.05(145.1)31443
XLENERGY 1.01(1)1
ZEN TECH 76(75.75)6529
ZENOTECH 27.6(28.15)19409

ఎన్ఎస్ఈ-500

షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం వరుసగా

AARTIDRUGS 591.25(585.35)19396
AARTIIND 1600.6(1550)191966
ABAN 66.25(65.55)353788
ABB 1264.65(1258.9)74899
ABFRL 208.5(203)859652
ABGSHIP 1.85(1.85)3223
ACC 1386.6(1359.65)572247
ADANIENT 139.9(140.8)3102926
ADANIPORTS 338.15(349.25)7672859
ADANIPOWER 44.5(43.15)16323067
ADANITRANS 213.9(213.95)175288
AEGISCHEM 188.8(188.85)60776
AHLUCONT 267.8(268.85)3457
AIAENG 1625.05(1619.95)19738
AJANTPHARM 1088.85(1090.8)563045
AKZOINDIA 1728.5(1725.1)3560
ALBK 44.9(43.9)4059691
ALLCARGO 106.75(104.8)40560
ALOKTEXT 3.85(3.7)2306352
AMARAJABAT 751.8(752.4)416778
AMBUJACEM 204.65(200.85)1461921
ANANTRAJ 32.1(31.8)117056
ANDHRABANK 25.9(25.95)686682
APARINDS 615.7(621.65)6281
APLLTD 599.25(598.15)64704
APOLLOHOSP 1319.6(1299.65)315858
APOLLOTYRE 203.3(203.05)1409006
ARVIND 91(89.45)1023539
ASHIANA 110.4(111.35)22006
ASHOKA 121.85(120.8)79334
ASHOKLEY 80.95(82.3)17250863
ASIANPAINT 1390.4(1393.3)1313152
ASTRAL 1126.35(1088.1)273249
ASTRAZEN 1600.95(1600.75)4709
ATUL 3497.85(3445.4)16675
AUROPHARMA 778.3(762.9)1404668
AXISBANK 690.95(660.75)46912230
BAJAJ-AUTO 2499.7(2567.65)2450943
BAJAJCON 351.35(352.15)36400
BAJAJELEC 456.7(426.85)189241
BAJAJFINSV 6247.2(6233.05)338788
BAJAJHIND 8.1(8.05)1022464
BAJAJHLDNG 2852.65(2844.9)10198
BALKRISIND 811.55(811.45)404674
BALLARPUR 3.7(3.7)851159
BALMLAWRIE 186.4(185.35)11940
BALRAMCHIN 101.05(99.55)997748
BANKBARODA 113.7(113.75)32710788
BANKINDIA 99.15(98.15)14637481
BASF 1355.6(1340.95)5801
BATAINDIA 1103.8(1103.5)574214
BBTC 1195.9(1207.7)68877
BEML 796.35(793.2)1404372
BERGEPAINT 317(312.55)966291
BFUTILITIE 197.05(194.7)383429
BGRENERGY 54.35(52.75)52859
BHARATFIN 932.3(923.8)1424142
BHARATFORG 475.3(486.05)1008221
BHARTIARTL 303.7(307.85)5906356
BHEL 63.9(64.4)7509058
BIOCON 646.1(648.2)1865144
BIRLACORPN 489.9(490.2)60370
BLISSGVS 148.1(148.45)811513
BLUEDART 3006.3(2973.1)2138
BLUESTARCO 599.65(601.55)133949
BOMDYEING 107.05(106.95)488112
BOSCHLTD 18454.1(18171.95)18985
BPCL 342.7(344.9)2782631
BRFL 8(8.15)32431
BRIGADE 208.65(208.9)87820
CADILAHC 319.15(321.7)1276905
CANBK 249.75(246.3)4417310
CARERATING 1005.7(1015.25)159759
CASTEXTECH .95(1)530077
CASTROLIND 163.15(161.4)1636676
CCL 265.65(269.85)12553
CEATLTD 1086.1(1111.45)965933
CENTRALBK 31.35(31.15)243658
CENTURYPLY 164.3(165.5)47704
CENTURYTEX 800.05(795.05)395184
CERA 2480.4(2535.45)2693
CESC 689(679.5)169132
CHAMBLFERT 169.85(164.75)224917
CHENNPETRO 242.5(243.2)431826
CHOLAFIN 1131.35(1109.1)307024
CIPLA 505.8(505.05)1524621
CLNINDIA 386(393.6)3521
COALINDIA 225.2(222.55)7349253
COLPAL 1272.9(1263.75)568374
COROMANDEL 448(443.3)141954
CORPBANK 26.2(26.3)342131
COX&KINGS 153.55(150.85)48047
CRISIL 1662.85(1660.3)1597
CUB 194(192.3)945956
CUMMINSIND 799.35(784.95)383639
CYIENT 612.35(587.7)164943
DABUR 431.15(423.15)1919495
DBCORP 169.25(166.9)43656
DBREALTY 24.35(25.1)56177
DCBBANK 177.35(174.3)1988752
DCMSHRIRAM 327.25(304.8)480616
DEEPAKFERT 113.85(114.25)250159
DELTACORP 226.05(225.75)335382
DEN 71.25(71.35)139257
DENABANK 12.65(12.7)1050946
DHANUKA 417.75(406.2)9426
DHFL 161.45(169.7)57307542
DISHTV 24.05(21.65)60260998
DIVISLAB 1503.15(1504.8)218871
DLF 164.2(164.9)4379914
DREDGECORP 401.5(382.3)428415
DRREDDY 2665.4(2666.45)657014
DYNAMATECH 1369.8(1373.35)1423
ECLERX 1042.4(1042.35)6643
EDELWEISS 154.8(155.6)2873780
EICHERMOT 18919.15(18877.25)102632
EIDPARRY 201.05(204.85)62241
EIHOTEL 180.2(180.6)65164
ELECTCAST 21.4(20.45)183049
ELGIEQUIP 240.05(240.2)12346
EMAMILTD 415.75(403.4)259610
ENGINERSIN 114.85(114.9)598267
EROSMEDIA 79(79.65)298207
ESCORTS 657.65(644.15)2198248
ESSDEE 14.7(14.45)12062
ESSELPACK 108.1(108)708917
EVEREADY 214.2(211.7)51473
EXIDEIND 222.6(217.35)4776065
FCONSUMER 40(39.25)1694457
FDC 166(166.35)40382
FEDERALBNK 86.5(86.5)7628375
FINCABLES 418.1(420.4)20596
FINPIPE 525.3(528.95)30179
FLFL 417.7(420.05)29117
FORTIS 135.3(135.5)590319
FSL 47(47.2)1304212
GAIL 321.6(323.6)6159363
GATI 74.6(72.85)474951
GDL 99.3(98.8)1169612
GEPIL 781.75(803.8)21127
GESHIP 302.25(280.85)52434
GET&D 294.4(296.05)28201
GILLETTE 6499.45(6494.1)19774
GLAXO 1426.6(1408.4)10102
GLENMARK 638.6(645.65)367742
GLOBOFFS 13.15(13.1)10209
GMDCLTD 87.05(86.05)50272
GMRINFRA 15.55(15.55)17156388
GODFRYPHLP 936.3(933.15)147406
GODREJCP 693.5(751.2)4595384
GODREJIND 494.75(510.55)388464
GODREJPROP 745.3(753.65)101779
GPPL 85.65(87.9)201891
GRANULES 92.35(88.45)4417308
GREAVESCOT 120(119.05)117952
GREENPLY 129.3(130.75)81541
GRINDWELL 544.95(548.9)6187
GRUH 212.35(215.8)1066505
GSFC 94.65(94.4)823758
GSKCONS 7190.25(7246.2)7573
GSPL 177.95(176.85)387821
GUJFLUORO 850.3(852.1)24738
GULFOILLUB 900.95(875.4)22974
GVKPIL 6.65(6.6)810388
HATHWAY 31.85(31.85)635528
HAVELLS 703.35(700.95)861622
HCC 12.5(12.8)2807894
HCL-INSYS 20.1(20.1)663995
HCLTECH 1018.4(988.45)7026674
HDFC 1885.8(1922.3)4127767
HDFCBANK 2034.7(2057.6)4628540
HDIL 26.15(26.6)2524454
HEIDELBERG 146.4(144.95)35332
HEROMOTOCO 2611(2633.3)696557
HEXAWARE 322.6(322.25)1109975
HFCL 22.7(21.25)3463508
HIMATSEIDE 205.55(206.95)12093
HINDALCO 205.8(199.55)5619506
HINDCOPPER 45.95(45.4)366756
HINDPETRO 231.15(235.3)4284743
HINDUNILVR 1733.35(1756.7)1259978
HINDZINC 261.65(259.6)597557
HMT 17.2(16.65)1805
HMVL 117.05(119.05)6692
HONAUT 21280.15(21217.4)736
HOTELEELA 13.75(13.9)74259
HSIL 237.35(232.85)509663
HTMEDIA 39.4(39.3)109286
IBREALEST 73.65(74)1294536
IBULHSGFIN 672.9(698.6)14013626
ICICIBANK 365.9(346.85)39400056
ICRA 3040.25(2996.4)187
IDBI 54.4(56.25)3179220
IDEA 30.55(30.7)16496180
IDFC 38.7(39.1)1664668
IFBIND 822.1(786.75)3609
IFCI 13.6(13.95)3452012
IGARASHI 514.65(517.75)7103
IIFL 450.4(438.2)83104
IL&FSTRANS 7.8(8.2)418377
INDHOTEL 133.35(133.9)351636
INDIACEM 84.55(83.55)5976171
INDIANB 227.2(225.35)2463501
INDOCO 185.2(189.25)8538
INDUSINDBK 1476.1(1461.85)3193022
INEOSSTYRO 632.35(628)579
INFRATEL 290.3(297.35)6293196
INFY 725.9(727.9)5763026
INGERRAND 582.85(585.05)3406
INOXLEISUR 253.2(248.55)28936
INOXWIND 67.4(67.95)28693
INTELLECT 186.8(191.6)287906
IOB 13.45(13.45)408664
IOC 134.55(137.35)16613250
IPAPPM 427.3(421.4)39935
IPCALAB 781.75(779.6)47528
IRB 145.5(148.8)863721
ITC 275.5(278.45)10449713
J&KBANK 41.3(40.4)1328705
JAGRAN 102.3(104.15)58085
JAICORPLTD 100(97.9)717001
JBCHEPHARM 311.35(304.2)10034
JBFIND 18.5(18.65)20379
JCHAC 1751.4(1740.5)2768
JETAIRWAYS 242.45(243.1)7392210
JINDALPOLY 242.7(236.2)12384
JINDALSTEL 129.95(129.75)12665753
JISLJALEQS 58.65(58.35)5221179
JKCEMENT 703.35(705.5)4682
JKIL 106.25(108.5)211964
JKLAKSHMI 299.7(296.65)10606
JKTYRE 92.15(92.9)305849
JMFINANCIL 77.2(77.55)238391
JPASSOCIAT 6.4(6.45)12745388
JPINFRATEC 3.05(3.2)1252036
JPPOWER 1.8(1.85)2215428
JSWENERGY 67.85(64.2)2802144
JSWHL 2723.55(2689.1)3221
JUBILANT 705.85(714.15)307775
JUBLFOOD 1200.2(1195.75)6994644
JUSTDIAL 468.5(477.75)1515251
JYOTHYLAB 183.5(179.7)1026024
KALPATPOWR 360.25(360.25)32349
KANSAINER 434.2(430.35)219239
KEC 245.6(237.05)618996
KESORAMIND 71.45(71.7)89346
KIRLOSENG 174.05(177)18331
KITEX 103.35(104.7)59777
KOLTEPATIL 259.5(252.45)934045
KOTAKBANK 1222.2(1251.4)2754232
KPIT 115.35(114.95)3365805
KRBL 335(310.1)601999
KSCL 595.9(573.2)474075
KSK 1.25(1.3)351869
KTKBANK 117.9(118.1)946769
KWALITY 6.75(6.65)1031889
L&TFH 132.7(131)6491534
LAKSHVILAS 66.4(68.95)600988
LAOPALA 215.1(209.05)28993
LAXMIMACH 5300.35(5300.7)2094
LICHSGFIN 433.5(452.5)2785978
LT 1294.45(1278.05)2385425
LUPIN 866.9(860.65)930968
M&M 678.65(669.65)2738163
M&MFIN 405.05(401.05)1069316
MAGMA 98.55(97.4)25344
MAHINDCIE 230.3(229)148024
MAHLIFE 391.8(396.1)48524
MANAPPURAM 91.25(90.95)2127891
MANPASAND 75.75(76.55)169174
MARICO 365.9(365.5)1786445
MARKSANS 25.25(25.5)919559
MARUTI 6548.25(6526.95)583773
MAYURUNIQ 373.35(369.5)8487
MCLEODRUSS 97.05(97.45)44197
MERCK 3254.55(3111.65)16318
MHRIL 208(205.5)64716
MINDACORP 138.65(139.65)45935
MINDTREE 890.45(903.6)1661063
MMTC 26.4(26.25)635284
MOIL 157.95(155.4)101016
MONSANTO 2584.7(2569.95)1028
MOTHERSUMI 141.3(142.25)4332416
MOTILALOFS 635(672)492300
MOTILALOFS 636.7(638.75)397535
MPHASIS 1011.2(972.8)872640
MRF 61329.4(61868.15)6589
MRPL 68.35(68.15)1360363
MTNL 13.65(13.55)887049
MUTHOOTFIN 500.5(495.45)452304
NATCOPHARM 679.7(665.95)112219
NATIONALUM 60(60)3498115
NAUKRI 1705.25(1689.3)658955
NAVKARCORP 46.55(44.2)146651
NCC 80.35(81.25)5241571
NETWORK18 36.35(36.95)88413
NHPC 24.5(24.45)2325256
NIITTECH 1286.1(1305.2)625321
NITINFIRE 1.45(1.5)19230
NLCINDIA 66.25(66.8)552897
NMDC 96.1(92.05)7768913
NTPC 138.7(138.5)11481494
OBEROIRLTY 433.3(444.45)198099
OFSS 3768.95(3748.25)27170
OIL 166.6(170.3)1789394
OMAXE 211.85(211.35)277757
ONGC 139.7(141.05)8511453
ORIENTBANK 95.25(94.85)5406350
ORIENTCEM 70.9(70.1)14573
ORISSAMINE 778.15(773.45)3503
PAGEIND 23157.7(22826.75)30436
PARSVNATH 6.1(5.8)130075
PCJEWELLER 73.15(73.95)5513701
PEL 2075.35(2124.4)1233683
PERSISTENT 601.85(583.4)557488
PETRONET 225.6(223.05)3383553
PFC 100.6(100.55)6197600
PFIZER 2998.2(2913.2)102581
PFS 15.15(15.3)585775
PGHH 9919.6(9892.6)1369
PHOENIXLTD 596.9(596.25)359358
PIDILITIND 1110.1(1105.85)1000557
PIIND 843.9(854.1)38634
PNB 77.25(77.3)11238545
POWERGRID 187.1(185.6)7150221
PRAJIND 129.4(129.7)6348868
PRESTIGE 200.95(200.6)1485682
PRSMJOHNSN 69.5(73)637980
PTC 75.2(79.25)6405984
PUNJLLOYD 2.8(2.9)462173
PURVA 70.45(69.85)23094
PVR 1599.95(1607.65)196820
RADICO 417.1(406.5)1047858
RAIN 117.65(112.5)845416
RAJESHEXPO 616.4(598.6)146134
RALLIS 161.1(161.9)97830
RAMCOCEM 592.55(573.6)525738
RAMCOSYS 226.5(224.9)19838
RATNAMANI 893.9(883.3)4214
RAYMOND 764(763.35)343827
RCF 62.1(61.25)903785
RCOM 11.55(12.1)43666454
RECLTD 125.3(123.15)11103647
REDINGTON 73.5(73.25)750505
RELAXO 724.4(734.55)13020
RELCAPITAL 198.65(198.5)3017605
RELIANCE 1195.7(1210.65)7846940
RELINFRA 269.2(265.45)2724905
RENUKA 10.15(10.15)304190
REPCOHOME 397.75(395.7)425853
RIIL 313.25(312.35)131521
RKFORGE 489.2(498.2)60025
RNAVAL 11.75(11.8)1348531
ROLTA 5.5(5.75)235752
RPOWER 26.65(26.7)4160107
RTNPOWER 3.55(3.6)890079
RUCHISOYA 6.85(6.9)446503
SADBHAV 201.3(193)118312
SADBHIN 88.8(90.3)2219
SAIL 47.3(46.2)9742271
SANOFI 6441.5(6350.75)28772
SBIN 287.45(280.6)18908654
SCHAEFFLER 5298.45(5287.8)5103
SCHNEIDER 92.35(88.75)81948
SCI 40.9(40.6)277345
SHARDACROP 315.4(309.3)17887
SHILPAMED 379.75(381.2)2216
SHK 166.4(156.95)19089
SHOPERSTOP 509.75(511.2)41328
SHREECEM 15450.35(15456.35)16654
SHRIRAMCIT 1728(1716.2)3388
SIEMENS 1013.45(1011.95)191122
SIMPLEXINF 156.5(158.45)16298
SINTEX 9.85(10)1715682
SITINET 6.65(6.85)124877
SJVN 25.4(25.7)1008114
SKFINDIA 1925.85(1920.05)21470
SMLISUZU 583.25(588.1)2766
SNOWMAN 31.05(31.1)458973
SOBHA 463.8(469.1)76160
SOMANYCERA 337.65(336.6)14381
SONATSOFTW 327.65(316.95)61994
SOUTHBANK 13.15(13.3)11424999
SPARC 157.5(161.65)616715
SREINFRA 29.85(30.15)2951651
SRF 2035.2(2025.85)143998
SRTRANSFIN 1014.7(1026.6)1722444
STAR 476.8(490.6)4188404
STCINDIA 116.7(114.2)107907
SUNDARMFIN 1449.05(1424.2)37628
SUNDRMFAST 530.65(503.65)58635
SUNPHARMA 417.95(422.4)4351530
SUNTV 533.65(533.45)1604734
SUPREMEIND 999.5(1009.3)215672
SUVEN 192.9(193.05)250726
SUZLON 5(4.95)13420926
SWANENERGY 97.2(97.95)193519
SYMPHONY 1148.1(1174.3)69704
SYNDIBANK 36.55(35.3)6256215
SYNGENE 565.1(559.75)81656
TAKE 138.35(137.5)41601
TATACHEM 680.3(667.1)253234
TATACOFFEE 88.85(90.85)388222
TATACOMM 490.25(495)3201920
TATAELXSI 879.3(884.95)382653
TATAGLOBAL 204.5(204.85)1407845
TATAMOTORS 174.6(173.6)7757847
TATAMTRDVR 90.55(90.3)2009667
TATAPOWER 68.15(71.05)4846733
TATASPONGE 752.65(699.5)272140
TATASTEEL 467.45(443.8)10857925
TATASTLBSL 29.75(30.35)584908
TBZ 58.85(57.7)29935
TCS 1981.4(1982.75)2429575
TECHM 714.6(731.5)2139900
TEXRAIL 56.45(53.45)319245
THERMAX 1111.15(1110.8)17108
THOMASCOOK 217.7(215.15)95350
TIDEWATER 5075.75(5118.7)441
TIMKEN 564.15(535.2)18074
TITAN 968.9(966.1)1468812
TNPL 228.3(232.25)51515
TORNTPHARM 1850.05(1876.05)112962
TORNTPOWER 246.5(246.8)547517
TREEHOUSE 4.1(3.95)7492
TRIDENT 66.3(63.85)6600000
TRIDENT 66.6(65.55)445980
TRITURBINE 106.7(106.35)9608
TTKPRESTIG 7548.45(7684.8)1701
TTML 3.7(3.75)664371
TV18BRDCST 32.75(33.15)2983644
TVSMOTOR 492(495.45)878292
TVSSRICHAK 2333.35(2308.8)1078
TVTODAY 351.25(352.45)7775
UBL 1428.45(1437.05)215269
UCOBANK 18.8(18.75)270395
UFLEX 250.7(249.35)13989
ULTRACEMCO 3442.2(3409.65)303793
UNICHEMLAB 198.7(200.65)67026
UNIONBANK 81.2(80.05)6665473
UNITECH 1.55(1.6)1322282
UPL 767.35(760.3)1057185
VAIBHAVGBL 664.1(645.9)6506
VAKRANGEE 40.95(39)11671991
VEDL 194.1(192.65)10015876
VIDEOIND 2.85(2.9)86601
VIJAYABANK 44.7(44.65)1852445
VINATIORGA 1572.4(1548)109019
VIPIND 472.35(454.3)416744
VOLTAS 541.6(541.35)572806
VRLLOG 271.25(268.15)18348
VSTIND 3241.95(3219.3)5709
VTL 1080(1053.9)2505
WABAG 293.9(295.15)57784
WABCOINDIA 6260.4(6284.65)1303
WELCORP 104.45(108.1)437313
WELSPUNIND 59.8(58.9)521031
WHIRLPOOL 1488.8(1470.3)37271
WIPRO 363.25(359.4)7408937
WOCKPHARMA 443.8(449.05)706195
WONDERLA 282.55(280.8)16086
ZEEL 388.85(377.4)15810931
ZEELEARN 29.25(25.7)1173169
ZYDUSWELL 1285.4(1298.45)3096



చుక్కల భూముల ఆర్డినెన్స్‌పై గవర్నర్ కొర్రీలు

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన చుక్కల భూముల ఆర్డినెన్స్‌ను గవర్నర్ నరసింహన్ వెనక్కుపంపించారు. ఇప్పటికే అసెంబ్లీ సమావేశాల షెడ్యూల్ విడుదలైనందున ఆర్డినెన్స్ స్థానంలో సభలో బిల్లు పెట్టుకోవాలని సూచించారు. దీంతోపాటు ఆర్డినెన్స్‌పై రెండు కొర్రీలు వేశారు. అందులో ప్రతిపాదించిన రెండు అంశాలు మూల చట్టం(చుక్కల భూముల చట్టం-2017)కు విరుద్ధంగా ఉన్నాయని అభ్యంతరం తెలిపారు.



బీఏసీ సమావేశంలో స్పీకర్ కోడెల, సీఎం చంద్రబాబు, బీజేపీ నేత విష్ణు

మోదీ ద్రోహంపై 1న అసెంబ్లీలో చర్చ

▸▸ 5న ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్.. 8న విజన్ డాక్యుమెంటు ప్రదర్శన

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి కేంద్రం చేసిన నయవంచన, మోదీ ద్రోహం, కేంద్రం ఇచ్చిన విభజన హామీలపై ఫిబ్రవరి 1న శాసనసభలో చర్చ జరగనుంది. హోదా సాధన సమితి పిలుపు మేరకు ఆ రోజు రాష్ట్ర బంద్ జరుగుతుండటంతో దానికి అనుగుణంగా అసెంబ్లీలోనూ రాష్ట్రానికి కేంద్రం చేసిన మోసంపై చర్చించాలని బీఏసీలో నిర్ణయించారు. స్పీకర్ కోడెల శివప్రసాదరావు అధ్యక్షతన బుధవారం సభా వ్యవహారాల సంఘం (బీఏసీ) సమావేశం జరిగింది. అసెంబ్లీలో ప్రాతినిధ్యం ఉన్న మూడు పార్టీల్లో టీడీపీ, బీజేపీ సమావేశానికి హాజరయ్యాయి. వైసీపీ నుంచి ఎవరూ రాలేదు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల ప్రకారం.. ఫిబ్రవరి రెండు నుంచి నాలుగో తేదీ వరకూ సమావేశాలకు విరామం ఇస్తున్నారు. ఆ తేదీల్లో పెంచిన పింఛన్లు, డ్వాక్రా సంఘాల సభ్యులకు చెక్కుల పంపిణీ ఉండటంతో..ఎమ్మెల్యేలు వాటిల్లో పాల్గొనే నిమిత్తం సమావేశాలకు సెలవు ఇస్తున్నారు. ఫిబ్రవరి ఒకటో తేదీన కూడా సెలవు ఇవ్వాలని ముందుగా అనుకొన్నా.. హోదా సాధన సమితి పిలుపు మేరకు ఆరోజు రాష్ట్ర బంద్ జరుగుతుండటంతో దానికి అనుగుణంగా అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి.. విభజన హామీలపై చర్చ జరపాలని నిర్ణయం తీసుకున్నారు. దానికి ముందు జనవరి 31న శాసనసభ, శాసనమండలి రెండూ సిటింగ్ సభ్యులకు నివాళి అర్పించి వాయిదా పడతాయి. ఫిబ్రవరి ఐదో తేదీన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెడతారు. ఆరోతేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకూ గవర్నర్ ప్రసంగం, బడ్జెట్‌పై చర్చ నిర్వహిస్తారు. వీటితోపాటు రోజుకో అంశంపై ప్రత్యేక చర్చలు జరుగుతాయి. ఐదో తేదీన వ్యవసాయం, అనుబంధ రంగాలు, ఏడోతేదీన ఇరిగేషన్, సంక్షేమ కార్యక్రమాలు, ఎనిమిదో తేదీన రాష్ట్ర భవిష్యత్, విజన్ ప్రణాళికపై చర్చలు ఉంటాయి. ఆరో తేదీన పూర్తిగా గవర్నర్ ప్రసంగంపై చర్చ, ముఖ్యమంత్రి సమాధానం ఉంటాయి. కాగా, సమావేశాలను మరో రోజు పొడిగించాలని బీజేపీ పక్ష నేత విష్ణుకుమార్ రాజు కోరారు. తొమ్మిదో తేదీన రాష్ట్రవ్యాప్తంగా నూతన గృహ ప్రవేశాల కార్యక్రమం పెట్టుకొన్నందువల్ల పొడిగించలేమని సీఎం చంద్రబాబు చెప్పారు. ప్రత్యేక చర్చలకు ఎక్కువ సమయం ఇచ్చే నిమిత్తం ప్రశ్నోత్తరాల సమయం, జీరో అవర్ ఈసారి ఉండబోవని స్పీకర్ చెప్పారు. అయితే ప్రశ్నోత్తరాల సమయం ఉంచాలని బీజేపీ కోరడంతో స్పీకర్ అంగీకరించారు.

వైసీపీ తీరు అప్రజాస్వామికం: కాలవ

రాష్ట్రానికి కేంద్రం చేసిన నయవంచన, మోదీ ద్రోహం, విభజన హామీలపై ఫిబ్రవరి 1న సభలో చర్చిస్తామని మంత్రి కాలవ శ్రీనివాసులు చెప్పారు. మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ.. రాజకీయ ప్రయోజనాల కోసమే కొన్ని పార్టీలు అఖిలపక్ష సమావేశానికి రాకపోయి ఉండొచ్చన్నారు. వైసీపీ అసెంబ్లీ సమావేశాలకు హాజరవ్వకపోవడం అప్రజాస్వామికమన్నారు.

కేంద్రం గాయపరిచింది

నాలుగున్నరేళ్లయినా విభజన కష్టాలు తీర్చలేదు

అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కేంద్రప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌ను గాయపరిచిందని గవర్నర్ నరసింహన్ ఆవేదన వ్యక్తంచేశారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా బుధవారం ఉభయ సభలనుద్దేశించి గవర్నరు ప్రసంగించారు. గంటపాటు సాగిన ప్రసంగంలో కేంద్రం తీరును ఎండగడుతూనే నాలుగున్నరేళ్లలో రాష్ట్రం సాధించిన పురోగతిని అంశాల వారీగా నివేదించారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ సందేశమైన 'ప్రజాస్వామ్యంలో సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లు' అన్న ప్రకటన స్ఫూర్తితో తన ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. 'నవ్యాంధ్ర పురోగతికి ఎంతో ఉపయోగపడుతుందనుకున్న ప్రత్యేక హోదా ఇవ్వలేదు. కేంద్రం సహాయనిరాకరణ చేసినా.. అద్భుత నాయకత్వంతో ప్రతికూలతలను అధిగమించి సంక్షేమం, అభివృద్ధిలో నా రాష్ట్రం దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచింది' అని పేర్కొన్నారు. గవర్నరు ప్రసంగంలోని కీలకాంశాలు ఆయన మాటల్లోనే..

నాలుగున్నరేళ్లలో కేంద్రం ఏం చేసింది?

'ఆర్థికంగా చేయూతనిచ్చే రాజధాని నగరం లేని నూతన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. భారీ రెవెన్యూ లోటు, ఆస్తులను సక్రమంగా పంచకపోవడం, పరిశోధన, అభివృద్ధి సంస్థలు లేకపోవడం, అసంబద్ధ ప్రమాణాలు పాటించడం ఈ సంక్షోభాన్ని మరింత పెంచాయి. విభజన చట్టంలో పేర్కొన్న నిబద్ధతలు, గత ప్రధానమంత్రి రాజ్యసభలో ఇచ్చిన హామీలను కేంద్ర సర్కారు నెరవేరుస్తుందని రాష్ట్ర ప్రజలు చాలా కాలంపాటు ఆతృతతో ఎదురుచూశారు. వినియోగ ధ్రువపత్రాల(యూసీ)ను నీతి ఆయోగ్ ధ్రువీకరించినప్పటికీ ఏడు వెనుకబడిన జిల్లాలకు ఇచ్చిన రూ.350 కోట్లు కేంద్రం వెనక్కి తీసుకోవడం అనూహ్య పరిణామం. ప్రత్యేక హోదా ఇవ్వరాదని కేంద్రం తీసుకున్న నిర్ణయం రాష్ట్ర అభివృద్ధి ప్రక్రియకు ప్రధాన అవరోధంగా నిలిచింది'

సంక్షేమానికి పెద్దపీట..

'ఈ జనవరి నుంచి ఎన్టీఆర్ భరోసా పింఛను మొత్తాన్ని రూ.1,000 నుంచి రూ.2,000కి పెంచాం. అన్ని వర్గాలు, నిరుపేదల సంక్షేమానికి వివిధ పథకాలను అమలు చేస్తున్నాం. ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లకు



గవర్నర్ నరసింహన్‌కు స్వాగతం పలుకుతున్న సీఎం చంద్రబాబు

ఇబ్బంది కలగకుండా ఈడబ్ల్యూఎస్ కోటా కింద కాపులకు 5 శాతం, ఇతర ఆర్థిక బలహీన వర్గాలకు మరో 5 శాతం కేటాయించాం. స్వయం సహాయక బృందాల సభ్యులకు మరోసారి రూ.10 వేల చొప్పున ఒకేసారి ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించాం. నా ప్రభుత్వానికి పేదల గృహనిర్మాణమే ప్రాధాన్యాంశం. ఎన్టీఆర్ పట్టణ గృహనిర్మాణ పథకం కింద రూ.31,793 కోట్ల వ్యయంతో 15.78 లక్షల గృహాలను మంజూరు చేశాం. దీపం పథకం కింద నాలుగున్నరేళ్లలో 30.61 లక్షల మందికి ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్లు అందించాం. రూ.24వేల కోట్ల రుణ మాఫీతో రైతులను విజయవంతంగా అప్పుల ఊబి నుంచి బయటపడేశాం. రైతాంగం కోసం నాలుగేళ్లలో రూ.81,543కోట్ల బడ్జెట్‌ను కేటాయించాం'

తగ్గిన నేరాలు..

'శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం తీసుకుంటోన్న చర్యల వల్ల నేరాలు తగ్గాయి. మహిళలపై నేరాలు గణనీయంగా తగ్గిపోయాయి. నిఘా ప్రాజెక్టు కింద 5,148 సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని ఏకీకరణ చేశాం.

ఈ ఏడాది చివరకు పోలవరం పూర్తి..

పోలవరం ప్రాజెక్టు పూర్తికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోంది. ఇప్పటిదాకా రూ.15,585.17కోట్లు ఖర్చుపెట్టింది. వచ్చే ఖరీఫ్‌లో గ్రావిటీ ద్వారా నీటిని సరఫరా చేయాలన్నది లక్ష్యం. ఈ ఏడాది చివరి నాటికి ప్రాజెక్టును పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం.

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అవసరమున్న చోటల్లా ఆస్పత్రులను ఏర్పాటు చేశాం. 2020 నాటికి జనవాసాలన్నిటికీ రక్షిత మంచినీరు సరఫరా సర్కారు సంకల్పం.'

పెట్టుబడులు.. ఉద్యోగాల కల్పన..

గత నాలుగేళ్లలో రూ.14,292 కోట్ల పెట్టుబడితో పారిశ్రామిక యూనిట్లను నెలకొల్పి 3.3లక్షల మందికి ఉపాధి కల్పించాం. కియ మోటార్స్, దాని అనుబంధ సంస్థలు అనంతపురం రూపురేఖలు మార్చాయి. రూ.20వేల కోట్లతో వ్యయంతో అనంతపురం-అమరావతి ఎక్స్‌ప్రెస్‌వే కీలక దశకు చేరుకుంది.

రాజధానికి 1.09 లక్షల కోట్లు

అమరావతిలో మౌలిక సదుపాయాల నిర్మాణానికి రూ.1.09 లక్షల కోట్లు కావాలని అంచనా. 1,375 ఎకరాల్లో శాసనమండలి, హైకోర్టు, సచివాలయం, శాఖాధిపతుల కార్యాలయాలు, రాజ్‌భవన్, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధుల గృహాలు, ప్రభుత్వ కార్యాలయాల సముదాయం ఉంటాయి.' ఉభయసభలనుద్దేశించి గవర్నరు సరిగ్గా గంటసేపు ప్రసంగించారు. అందులో 99 అంశాలు ఉన్నాయి. గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకుని గవర్నరు కోరిక మేరకు సభ 2 నిమిషాల పాటు మౌనం పాటించింది.

'విభజన కారణంగా ఆర్థిక, ఇతర వనరులపై తీవ్ర ఒత్తిడి ఏర్పడినప్పటికీ నా ప్రభుత్వం తిరుగులేని నిబద్ధత, చురుకైన నాయకత్వ పటిమతో ఈ కష్టాలను అధిగమించింది. కేంద్రం నుంచి మద్దతు లేనప్పటికీ గత నాలుగున్నరేళ్లలో అన్ని రంగాల్లో విజయాలు సాధించింది. అన్ని రకాల ప్రతికూలతలను అధిగమించి ఇతరులకు మార్గదర్శిగా నిలిచింది. ఇవన్నీ నా ప్రభుత్వ పనితీరుకు నిదర్శనాలు. కేంద్రం సహాయ నిరాకరణ చేస్తున్నా.. రాష్ట్ర వృద్ధి సగటున 10.66%గా ఉంది. ఇది దేశంలోనే అత్యధికం. కేంద్రం సహకరించి ఉంటే మరింత అభివృద్ధి జరిగేది'

ప్రతికూలతను అధిగమించి పురోగమనం..

గవర్నర్ ప్రసంగం అవాస్తవాల పుట్ట: సీపీఎం, సీపీఐ

అసెంబ్లీలో గవర్నరు చేసిన ప్రసంగం ప్రజల వాస్తవ సమస్యలను విస్మరించిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు అన్నారు. ప్రసంగం మొత్తం ప్రభుత్వ గొప్పలు చాటుకొనేదిగానే ఉందన్నారు. సీఎం చంద్రబాబు ఆరు నెలలుగా చెబుతున్న మాటల్నే అసెంబ్లీలో గవర్నర్ మరోసారి ప్రస్తావిస్తూ ప్రసంగించారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఎద్దేవా చేశారు. కేవలం అబద్ధాలు చెప్పించేందుకే గవర్నర్‌ను హైదరాబాద్ నుంచి రప్పించారని విమర్శించారు. అధికారులు డబ్బు సంపాదనే పనిగా పనిచేస్తున్నారని, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు డబ్బుసంపాదనలో మునిగితేలుతున్నారని ఆరోపించారు.

10, 16న రాష్ట్రంలో మోదీ పర్యటన

▸▸ గుంటూరు, విశాఖలో ఎన్నికల ప్రచారం

▸▸ 'హోదా' ముగిసిన అధ్యాయం

▸▸ కియా వచ్చింది మోదీ వల్లే: కన్నా



విశాఖపట్నం/అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫిబ్రవరి 10, 16 తేదీల్లో రాష్ట్రంలో పర్యటించనున్నారు. దీనికి సంబంధించిన షెడ్యూల్ ఖరారైనట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. పూర్తిగా ఎన్నికల ప్రచారం కోసమే ఆయన వస్తున్నారని వివరించాయి. ఫిబ్రవరి 10న గుంటూరు, 16న విశాఖపట్నంలోను మోదీ కార్యక్రమాలు ఉంటాయని బీజేపీ నేతలు తెలిపారు. దీనికంటే ముందు పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ఫిబ్రవరి 4న విజయనగరం వస్తున్నారు. ఉత్తరాంధ్రాలోని 7 పార్లమెంటు నియోజకవర్గాల్లో ఉన్న 'శక్తి' కేంద్రాల ప్రతినిధులతో ఆయన భేటీ అవుతారు. ఇదిలావుంటే, రాష్ట్రానికి ప్రత్యేక హోదా అనేది ముగిసిన అధ్యాయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. కేంద్ర ప్రభుత్వ చొరవతోనే రాష్ట్రానికి 'కియ' కార్ల పరిశ్రమ వచ్చిందని వ్యాఖ్యానించారు. మేకిన్ ఇండియాలో భాగంగా ప్రధాని మోదీ రాష్ట్రానికి కియను తీసుకొస్తే చంద్రబాబు తన ఖాతాలో వేసుకున్నారని ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టును చంద్రబాబు విహార కేంద్రంగా మార్చారని కన్నా మండిపడ్డారు. ప్రభుత్వ పథకాలకు హెరిటేజ్ నుంచి డబ్బులు ఖర్చు చేస్తున్నట్లు చంద్రబాబు మాట్లాడుతున్నారని బీజేపీ ఎంపీ జీవీఎల్ ఆరోపించారు.

విభజన హామీలు 95% అమలు చేశాం: హరిబాబు

విశాఖపట్నం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో పేర్కొన్న హామీల్లో 95 శాతం నెరవేర్చేశామని విశాఖ ఎంపీ కంభంపాటి హరిబాబు చెప్పారు. బుధవారం విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో రిఫ్రెషింగ్ లాంజ్, రైల్ డిజిటల్ మ్యూజియంలను ఆయన ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నాలుగు అంశాలు తప్ప విభజన చట్టంలోని మిగిలినవన్నీ అమలు చేశామన్నారు. కట్టుబట్టలతో వచ్చినా, రాష్ట్రంలో ఏమీ లేకపోయినా రెండంకెల అభివృద్ధి సాధించామని చెబుతున్నారని, కేంద్రం సాయం లేకుండా ఇంతటి అభివృద్ధి సాధ్యమా అని ప్రశ్నించారు. దుగరాజపట్నానికి ప్రత్యామ్నాయంగా మరోచోట స్థలం చూపిస్తే పోర్టు నిర్మాణానికి కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. కడప ఉక్కు కర్మాగారం విషయంలో ఉక్కు గనుల లభ్యతపై నివేదిక కోరగా ఇంత వరకు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా ఉక్కు కర్మాగార నిర్మాణానికి శ్రీకారం చుట్టడం సంతోషకరమన్నారు. విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ ఏర్పాటు హామీ అమలుకు కూడా కట్టుబడి ఉన్నామని చెప్పారు. మరో మూడు నెలల సమయం ఉందని, జోన్ ఏర్పాటుకు పార్లమెంట్ సమావేశాలతో సంబంధం లేదని, అది పాలనాపరమైన నిర్ణయమని వివరించారు. విశాఖ నుంచి వారణాసికి రైలు మంజూరైందని, అయితే ర్యాక్‌ల కొరత వల్ల పట్టాలెక్కలేదని ఒక ప్రశ్నకు సమాధానం ఇచ్చారు.

ఢిల్లీ దద్దరిల్లేలా..!



అఖిలపక్ష సమావేశంలో సీఎం, మంత్రులు, పార్టీలు.. ఉద్యోగ సంఘాల నేతలు

(మొదటి పేజీ తరువాయి)

దీక్ష చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిశ్చయించారు. మర్నాడు 12న రాష్ట్రపతి రామనాథ్ కోవింద్‌ను అఖిల పక్ష నేతలు కలిసి రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని వివరిస్తారు. బుధవారం సచివాలయంలో తన కార్యాలయంలో అఖిలపక్ష పార్టీల ప్రతినిధులతో చంద్రబాబు సమావేశమయ్యారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 13వ తేదీ వరకు వివిధ రూపాల్లో రాష్ట్రంలో నిరసనలు సాగించాలని సీఎం పిలుపిచ్చారు. దీని కోసం అఖిలపక్షం తరపున కమిటీ వేయాలని నిర్ణయించారు. ఈ కమిటీకి 'ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా, విభజన హామీల జేఏసీ' అని పేరు పెట్టారు. రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, మేధావులు, ఉద్యోగ, విద్యార్థి సంఘాల ప్రతినిధులతో పోరాట కమిటీ, ఎగ్జిక్యూటివ్ కమిటీలను ఏర్పాటు చేస్తారు. బుధవారం నాటి అఖిలపక్షానికి రాని పార్టీలను కూడా కలిసి ఈ జేఏసీలోకి ఆహ్వానించాలని సీఎం సూచించారు. 1వ తేదీన రాష్ట్రంలో పెద్దఎత్తున నిరసన చేపట్టాలని, 11న ఢిల్లీలో ఆందోళనలు నిర్వహించాలని నిర్ణయించారు. ఢిల్లీలో నిర్వహించే ఆందోళనలను రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహిస్తుందని సీఎం తెలిపారు. 'రాష్ట్ర ప్రయోజనాల కోసం చేపడుతున్న ఈ ఆందోళనల్లో 5 కోట్ల మంది ప్రజలను భాగస్వాములను చేయాలి. అన్ని వర్గాలు వివిధ రూపాల్లో నిరసనలు తెలియజేస్తే అది గొప్ప ప్రజాఉద్యమంగా మారుతుంది. దీనిని రాజకీయ పోరాటంగా భావించకూడదు. ఒక ప్రభుత్వం మరో ప్రభుత్వంపై చేసే పోరాట కార్యక్రమంగానే ఈ ఉద్యమాన్ని తీసుకోవాలి. రాష్ట్రానికి న్యాయం జరగాలి.. తెలుగువారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టాలి. ఆంధ్రతో అనవసరంగా పెట్టుకున్నామనే భయం ఢిల్లీ పెద్దల్లో కలగాలి' అని పేర్కొన్నారు. ఇంకా సీఎం ఏమన్నారంటే..

జైలుకెళ్తారు.. అఖిలపక్షానికి రారు

'మంగళవారం ఉండవల్లి అరుణ్‌కుమార్ నిర్వహించిన సమావేశానికీ ప్రతిపక్ష వైసీపీ ఎందుకు రాలేదు? ఈ పనులన్నీ ఎవరి మేలు కోసం చేస్తున్నారు? జైలు కెళ్లి కూర్చుంటారు, కానీ అఖిలపక్షానికి రారు. ప్రతిపక్షాల వైఖరిలో మార్పురాకపోతే ప్రజలే వారి సంగతి చూస్తారు. హైదరాబాద్‌లో ఉంటున్న సెలబ్రిటీలు వచ్చి ఆందోళనలో పాల్గొనాలని కోరుకోవడం సబబు కాదు. వారి ప్రయోజనాలు వారికి ఉంటాయి. స్వచ్ఛందంగా వస్తే కలుపుకొని పోవాలి'

హోదా కోసం నేను చేయాల్సింది చేశా

'ప్రత్యేక హోదా సాధనకు నేను చేయాల్సిందంతా చేశాను. హోదా చట్టంలో అంశాల అమలుకు విశ్వప్రయత్నాలు చేశాం. చివరకు రెవెన్యూ లోటు భర్తీకి కూడా ఇంతవరకు సరిగా నిధులివ్వలేదు. పోలవరానికి రాష్ట్రం ఖర్చు చేసిన మొత్తంలో ఇంకా రూ.4,000 కోట్లు రీయింబర్స్ చేయాల్సి ఉంది. ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వకపోగా వెనుకబడిన జిల్లాలకు ఇచ్చిన రూ.350 కోట్లు వెనక్కితీసుకోవడం దారుణం. కేంద్రం రాష్ట్రానికి రూ. 1,03,980 కోట్లు ఇవ్వాలని లోక్‌సత్తా అధినేత జయప్రకాశ్ నారాయణ చెప్పారు. కేంద్రం నుంచి రూ. 74,500 కోట్లు రావాలని జనసేన అధినేత పవన్ కల్యాణ్ నియమించిన కమిటీ నివేదిక ఇచ్చింది. చట్టంలో పేర్కొన్న అంశాలపై, ప్రత్యేక హోదాపై తర్వాత కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం మాట మార్చింది. పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి.. పెరిగిన అంచనా వ్యయాన్ని భరిస్తామని అప్పటి మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం ఆఖరి మంత్రిమండలి సమావేశంలో ఆమోదించింది. ప్రాజెక్టు నిర్మాణం రాష్ట్ర ప్రభుత్వమైతేనే శ్రద్ధగా చేస్తుందని చెప్పి మనకు అప్పగించారు. తర్వాత లేనిపోని దురుద్దేశాలు అంటగట్టారు. విశాఖ రైల్వేజోన్ ఇవ్వడానికి కేంద్రానికి ఇబ్బందేంటి?'

ఉపాధి నిధులు ప్రత్యేకంగా ఇవ్వలేదు

'ఉపాధి నిధుల్లో రావలసినవే ఇచ్చారు. కేంద్రం ప్రత్యేకంగా ఏమీ ఇవ్వడం లేదు. ఉపాధి చట్టం ప్రకారం మనకివ్వాల్సిన నిధులను కూడా 3 నెలల నుంచి ఇవ్వడం లేదు. ఈ పథకానికి సంబంధించి నేను, మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ ఇచ్చిన నివేదికలను ఎందుకు అమలు చేయడం లేదు?

ప్రజలకు, ఉద్యోగులకు అభినందనలు

'60 ఏళ్ల శ్రమ, కష్టం వదులుకుని ఇక్కడకు వచ్చాం. కష్టమైనా, నష్టమైనా భరించిన ప్రజలు, ఉద్యోగులకు అభినందనలు. రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. మిగులు రాష్ట్రం కంటే ఎక్కువ ప్రయోజనాలను మన రాష్ట్ర ఉద్యోగులకు కల్పించాం. కేంద్రం సహకరించపోగా మన పొట్టగొడుతున్నారు. ప్రధాని మోదీ దేశాన్ని మతాలు, కులాల వారీగా విడదీస్తున్నారు. రాష్ట్రాల్లో అశాంతి సృష్టిస్తున్నారు.'

హక్కుగా రావలసిందే..

'విభజన వల్ల తీరని అన్యాయం జరిగిన రాష్ట్రానికి హక్కుగా రావలసిందే అడుగుతున్నాం. కేంద్రంతో పోరాటమే తప్ప ప్రాధేయపడేది లేదు. కేంద్రానికి రాష్ట్రం గుమాస్తా కాదు. పన్నులు కడుతూ నిధులివ్వమని అడుగుతున్నాం. ఏ రాష్ట్ర స్వయంప్రతిపత్తి ఆ రాష్ట్రానికి ఉంటుంది. ఇది పరస్పర సహకార స్ఫూర్తి తో ముందుకు సాగే సమాఖ్య విధానమే తప్ప కేంద్రం పెత్తనం చేయడం కుదరదు. కేంద్రం తనకింద పనిచేసే గుమాస్తాను అడిగినట్లు రాష్ట్రాలను లెక్కలు అడుగుతోంది. ఇదేం పద్ధ తి? మీకు పన్నులు కట్టకపోతే ఆడబ్బులతో మేమే ప్రాజెక్టులన్నీ కట్టుకుంటాం. ప్యాకేజీ ఇస్తామని ప్రకటించి ఆ తర్వాత కేంద్రం వెనక్కితగ్గింది. రాష్ట్రంపై ఎందుకింత కక్ష.. వివక్ష

పోర్టులు, ఎయిర్‌పోర్టులూ మనమే..

'లాభాలొచ్చే పోర్టుల నిర్మాణానికి మాత్రమే సహకరిస్తామన్నట్లు కేంద్రం వ్యవహరిస్తోంది. పోర్టులు, ఎయిర్‌పోర్టుల అభివృద్ధిలో మనకు అన్యాయం చేసింది. రామాయపట్నం రేవును రాష్ట్రప్రభుత్వమే నిర్మిస్తోంది. వచ్చే రోజుల్లో భావనపాడు ఓడరేవును మనమే కట్టుకోవాలి. ఓర్వకల్లు విమానాశ్రయం మనమే కట్టుకున్నాం'

బంద్‌కు సంఘీభావం తెలుపలేం కానీ..

'రాష్ట్రానికి జరిగిన అన్యాయానికి నిదర్శనగా 1వ తేదీన అఖిలపక్షాలు ఇచ్చిన రాష్ట్రబంద్‌కు సంఘీభావం తెలుపలేం. అయితే అసెంబ్లీలో నల్లబ్యాడ్జీలు ధరించి కేంద్రానికి నిరసన తెలియజేస్తాం. రాష్ట్రం, రాష్ట్రాభివృద్ధిపై బాధ్యతతో ప్రజాసంఘాలంతా అఖిల పక్షానికి వచ్చారు. మీ అందరికీ స్వాగతం. తమిళనాడులో రాష్ట్ర ప్రయోజనాల కోసం అన్ని పార్టీలు ఏకమవుతాయి. ఇక్కడ మాత్రం భిన్నమైన పరిస్థితి ఉంది'.

ఐఎస్‌బీ నేపథ్యం..

'హైదరాబాద్‌కు ఐఎస్‌బీ తేవడానికి, మైక్రోసాఫ్ట్ తేవడానికి, అనంతపురానికి కియా మోటార్స్ తేవడానికి ఎంతో శ్రమించా. ఐఎస్‌బీ ఈ రోజు ఇండియాలో నంబర్ వన్. ప్రపంచంలో 24వ స్థానంలో నిలిచింది. ఆ రోజు ఐఎస్‌బీ ప్రతినిధులు దక్షిణాది రాష్ట్రాల్లో ఎక్కడ స్థాపించాలో అధ్యయనం చేయడానికి వెళ్లినప్పుడు వారిని హైదరాబాద్ పిలిపించాను. వారిని రిసీవ్ చేసుకోవడానికి ఇద్దరు మంత్రుల్ని ఎయిర్‌పోర్టుకు పంపించాను. పోర్టికోలో నేనే స్వయంగా బొకేలిచ్చి స్వాగతం పలికాను. ఎలాంటి రాయితీలిస్తారో చెప్పాలని వారు అడిగారు. మీరు చెన్నై, బెంగళూరు వెళ్లి రండి.. అక్కడ ఇచ్చే ప్రోత్సాహకాలకు ప్లస్ చేసి ఇక్కడ ఇస్తానని చెప్పాను. ఆయా నగరాలకు వెళ్తే వీరిని సరిగ్గా రిసీవ్ చేసుకోలేదు. చెన్నై వెళ్తే బొకేలు వీరికిచ్చి ముఖ్యమంత్రికి ఇమ్మన్నారు. ముంబై వెళ్తే అస్సలు అపాయింట్‌మెంటే ఇవ్వలేదు. చివరకు వారు హైదరాబాద్ వచ్చారు. ఇక్కడే ఐఎస్‌బీ పెడతామన్నారు. ప్రాజెక్టులను రప్పించాలంటే ఇలా విశ్వసనీయత ఉండాలి.'



జగన్‌కు ఏపీ ప్రజలపై నమ్మకం లేదు

▸▸ ముహూర్తాలు చూసుకుని అఖిలపక్షం పెట్టరు


▸▸ సమయం లేకపోవడానికి జగన్, పవన్ విదేశాల్లో ఉన్నారా?: టీడీపీ నేతల ఫైర్

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): విపక్ష నేత జగన్‌కు ఏపీ ప్రజలపై నమ్మకం లేదని మంత్రులు, టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మండిపడ్డారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ దగ్గర మాట్లాడుతూ వైసీపీపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 'ప్రతిపక్ష నేత జగన్ అసెంబ్లీని, ప్రజల్ని, పోలీసుల్ని నమ్మే పరిస్థితిలో లేరు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన అఖిలపక్షానికి రాకుండా జగన్, పవన్ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారు. అఖిలపక్ష సమావేశాన్ని ముహూర్తం చూసుకుని ఎవరూ పెట్టరు. సమయం సరిపోలేదని చెప్పడం సరైంది కాదు. సమయం సరిపోకపోవడానికి ప్రతిపక్ష నేతల విదేశాల్లో ఉంటున్నారా?. పాదయాత్ర తర్వాత రాష్ట్రంలో జగన్ కాదు, అతని ఫోటో కూడా కనిపించడం లేదు. జగన్‌కు ఇల్లిస్తే అద్దెకట్టకుండా వెళ్లిపోతారన్న భయంలో ప్రజలున్నారు' అని మంత్రి జవహర్ విమర్శించారు. గవర్నర్ ప్రసంగం రాష్ట్ర ప్రగతికి నిదర్శనం. 13 రకాల పెన్షన్లను ఒకేసారి రెట్టింపు చేసి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న ఘనత సీఎందే అని బుచ్చయ్యచౌదరి, బచ్చుల అర్జునుడు అన్నారు. పసుపు-కుంకుమ పేరుతో డ్వాక్రా మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న 10వేలు అప్పు కాదు. దీనిపై విపక్షం దుష్ప్రచారం చేస్తోంది అని మాజీ మంత్రి మృణాళిని, సుగుణమ్మ, యామిని బాల, పోతూరి సునీత మండిపడ్డారు. విపక్ష నేత జగన్ రాయలసీమ ద్రోహిగా నిలిచిపోతారని పల్లె రఘునాథరెడ్డి అన్నారు. పోలవరం పూర్తిచేసి అభినవ శ్రీకృష్ణదేవరాయలుగా, రాయలసీమ దేవుడిగా సీఎం నిలిచిపోతారు.

కాపులకు 'రిజర్వేషన్' మోదీ ఘనతే

▸▸ కియ రాకకు కారణం ప్రధానే

▸▸ గవర్నర్ ప్రసంగం.. వాస్తవాలకు దూరం: సోము, మాధవ్



అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): "కాపుల విషయంలో సీఎం చంద్రబాబు జీరో అయ్యారు. కాపులకు రిజర్వేషన్ కల్పిస్తున్నట్లు చంద్రబాబు ప్రచారం చేసుకుంటున్నారు. కాపులకు 5 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానం పాస్ చేస్తే ఆ ఘనత మోదీకే దక్కుతుంది" అని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద సహచర ఎమ్మెల్సీ మాధవ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. "రాష్ట్రానికి కియ మోటర్స్ తెప్పించిన ఘనత కూడా మోదీకే దక్కుతుంది. 2015లో సౌత్ కొరియా వెళ్లిన మోదీని అక్కడ హ్యూండయ్ ప్రతినిధులను కలిసి కియను భారతదేశంలో ఏర్పాటు చేస్తామని ప్రతిపాదించారు. ఆ సమయంలో మోదీ ఆంధ్రప్రదేశ్‌ను సూచించారు. కేంద్రం నుంచి రాయితీలు ఇస్తామని చెప్పారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం మొత్తం వాస్తవాలకి ఆమడదూరంలో ఉంది. గవర్నర్ ప్రసంగంలోని 99 అంశాల్లో 74 అంశాలు పూర్తిగా కేంద్ర సహాయంతో చేస్తున్నవే. రాష్ట్రంలో 24 గంటల కరెంటు ఘనత కేంద్రానికే దక్కుతుంది. గవర్నర్ ప్రసంగం ద్వారా అవాస్తవాలు చెప్పడం సరికాదు. 74 అంశాలపై ప్రభుత్వంతో చర్చించడానికి బీజేపీ సిద్ధంగా ఉంది" అని సోము అన్నారు. మాధవ్ మాట్లాడుతూ "గవర్నర్ ప్రసంగం అభ్యంతరకరంగా ఉంది. కేంద్రం సహాయ నిరాకరణ, కుట్ర లాంటి పదాలు చెప్పారు. వాటిని తీవ్రంగా ఖండిస్తున్నాం. టీడీపీ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో చాలా వాటిని అమలు చేయలేదు" అని దుయ్యబట్టారు.



విజయవాడ ఆర్టీసీ బస్టాండ్ గేటు వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

6న ఆర్టీసీ మెరుపు సమ్మె

- బడ్జెట్‌లో 3600 కోట్లు కేటాయించాలి: జేఏసీ

విజయవాడ(విద్యాధరపురం)/గుంటూరు, జనవరి 30: ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి, సంస్థ అభివృద్ధికి ఫిబ్రవరి 6వ తేదీన మెరుపు సమ్మెకు కార్మికులందరూ సిద్ధంగా ఉండాలని జేఏసీ నేతలు పిలుపునిచ్చారు. ఆర్టీసీ జేఏసీ పిలుపుమేరకు బుధవారం విజయవాడలో వందలాది కార్మికులతో ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు జేఏసీ నేతలు మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో ఆర్టీసీకి రూ.3,600 కోట్లు కేటాయించి, ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 2న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఆల్ పార్టీ రౌండ్‌టేబుల్ సమావేశాలు, 4న విజయవాడలో భారీ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆర్టీసీ యాజమాన్యం ఫిబ్రవరి 6లోగా స్పందించకుంటే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆర్ఎంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు వైవీ రావు, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జిలానీ బాషా, టీఎన్‌టీయూసీ రీజనల్ సెక్రటరీ వై.రమేశ్, తదితరులు పాల్గొన్నారు. గుంటూరులోనూ ఆర్ఎం కార్యాలయం ఎదుట జేఏసీ నిర్వహించిన ధర్నాలో ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు వైవీ రావు మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తేనే మనుగడ సాధ్యమని చెప్పారు. కార్మిక పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరహాలనాయుడు మాట్లాడుతూ 50 శాతం ఫిట్‌మెంట్‌తో కూడిన వేతన సవరణ కార్మికుల గొంతెమ్మ కోర్కె కాదన్నారు.

చంద్రన్న రుణం తీర్చుకుందాం: ఆప్కో చైర్మన్



అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని చేనేత వర్గాలపై వరాల వర్షం కురిపించిన సీఎం చంద్రబాబు రుణాన్ని ఓటుతో తీర్చుకుందామని ఆప్కో చైర్మన్ గుజ్జల శ్రీనివాస్ నేత వర్గానికి పిలుపునిచ్చారు. బుధవారం చంద్రబాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆకలి, అప్పులతో బలవన్మరణాలకు పాల్పడుతున్న నేతన్నలకు రూ.110 కోట్ల రుణమాఫీ ప్రకటించిన సీఎం.. వారి జీవితాల్లో వెలుగులు నింపారని శ్రీనివాస్ అన్నారు.

ఏపీ విభజన హామీల స్థితిపై నేడు నివేదిక: జేపీ

హైదరాబాద్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు విభజన సమయంలో ఇచ్చిన హామీల అమలు, ప్రస్తుత స్థితిని జాతీయ స్థాయిలో వివరించేందుకు స్వతంత్ర నిపుణుల బృందం రూపొందించిన నివేదికను ఢిల్లీలో గురువారం విడుదల చేయనున్నట్లు లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ్ తెలిపారు. పార్టీలు, భావోద్వేగాలకు అతీతంగా ప్రజాస్వామ్య పీఠం(ఫౌండేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్) చొరవతో నిష్పాక్షికంగా రూపొందించిన ఈ నివేదికను జనవరి 7న విజయవాడలో విడుదల చేశామని పేర్కొన్నారు.

ఓటరు ఐడీ ఉన్నవారందరికీ ఓటు: సీఎస్

అమరావతి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఓటరు ఐడీ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠా స్పష్టం చేశారు. ఐడీ కార్డు ఉన్నా, ఓటు లేదనే ఆరోపణలు రాకూడదన్నారు. ప్రతి ఓటరూ వీఐపీయేనని, అందరూ ఓటు వినియోగించుకునేలా చైతన్యం తీసుకురావాలన్నారు. 2019 సాధారణ ఎన్నికల నిర్వహణపై అమరావతి సచివాలయంలో తన కార్యాలయంలో జిల్లా కలెక్టర్లు, జేసీలు, ఎస్పీలతో సీఎస్ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మరో 20, 30రోజుల్లో ఎన్నికల కోడ్ రానుందని, ఈలోగానే సొంతజిల్లాల్లో పనిచేస్తూ ఎన్నికలతో ప్రత్యక్ష సంబంధం కలిగిన, పనిచేసిన స్థలంలో మూడేళ్లకాలం నిండిన ఎన్నికల నిర్వహణలో ప్రత్యక్ష సంబంధం ఉండే అధికారులను తక్షణమే సొంతజిల్లాల నుంచి బదిలీ చేయాలన్నారు. త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో శ్రీకాకుళం నుంచి గుంటూరు వరకూ 7జిల్లాల్లో బదిలీలు వచ్చేనెల 10లోగా, మిగిలిన జిల్లాల్లో వచ్చేనెల 28లోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

అధికారం కాంగ్రెస్‌దే: జేడీ శీలం

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఈసారి ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం అన్నారు. ప్రియాంకా గాంధీ రాకతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం పెరిగిందన్నారు. ఆమె ప్రభావం ఈ ఎన్నికల్లో ఉంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ప్రియాంకా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని చెప్పారు.

పీఏసీఎస్‌ల పదవీ కాలం 6 నెలలు పొడిగింపు

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలకవర్గాల పదవీకాలాన్ని ప్రభుత్వం మరో 6 నెలలు పొడిగించింది. ఇప్పటికే సంవత్సరకాలం పొడిగించిన ప్రభుత్వం ప్రస్తుతం ఎన్నికలు నిర్వహించే అవకాశం లేకపోవడంతో మళ్లీ పొడిగిస్తూ ఉత్తర్వులిచ్చింది.

ఆయేషా కేసులో దర్యాప్తు ఆపండి

విజయవాడ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఆయేషా మీరా హత్యకేసులో సిట్ పునఃదర్యాప్తుకు బ్రేక్ పడింది. దర్యాప్తును నిలిపివేయాలని ఆదేశిస్తూ హోంశాఖ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. సత్యంబాబును హైకోర్టు నిర్దోషిగా ప్రకటిస్తూ.. కేసును సీబీఐకి అప్పగించిన సంగతి తెలిసిందే. ప్రధాన ఘటనతోపాటు, రికార్డుల ధ్వంసంపై సీబీఐ 2 ఎఫ్ఐఆర్‌లను నమోదు చేసింది. తాజాగా ఈ కేసును దర్యాప్తు చేసిన పోలీసులను విచారించాలని సీబీఐ నిర్ణయించింది. 15 మంది అధికారులతో జాబితానూ సిద్ధం చేసింది. సీబీఐ రంగంలోకి దిగిన తరువాత విశాఖ రేంజ్ డీఐజీ శ్రీకాంత్ నేతృత్వంలో ఏర్పాటైన సిట్ విచారణ నెమ్మదించింది. ఇప్పుడు హోంశాఖ ఆదేశాల నేపథ్యంలో సిట్ కూడా రద్దు అయినట్టుగా చెబుతున్నారు.

తెలంగాణలో 2 నుంచి కొత్త సర్పంచ్‌ల పాలన

హైదరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల ఘట్టం విజయవంతంగా ముగిసింది. మూడు విడతలుగా జరిగిన ఎన్నికలు బుధవారంతో పరిసమాప్తమయ్యాయి. మొత్తం 12751 పంచాయతీలకు గాను 12711 చోట్ల ఎన్నికలు నిర్వహించారు. ప్రజా తీర్పు వెలువడడంతో పల్లెసీమల్లో శనివారం నుంచి గ్రామ స్వపరిపాలన మొదలు కానుంది. పంచాయతీల్లో కొత్త పాలక మండళ్లు కొలువుదీరనున్నాయి. పంచాయతీలకు ఎన్నికైన పాలక మండళ్ల తొలి సమావేశాలను ఫిబ్రవరి 2న నిర్వహించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ నీతూకుమారి ప్రసాద్ బుధవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు, వార్డు సభ్యులు ఆ రోజు ప్రమాణ స్వీకారం చేస్తారు. పాలకమండళ్ల తొలి సమావేశం నుంచి వారి పదవీకాలం ప్రారంభమవుతుంది. అసెంబ్లీ ఎన్నికల్లో అప్రతిహత విజయం సాధించిన టీఆర్ఎస్.. పంచాయతీ ఎన్నికల్లోనూ జోరు కొనసాగించింది. మొత్తం మూడు విడతల్లోనూ అధికార పార్టీ మద్దతిచ్చిన అభ్యర్థులే భారీ సంఖ్యలో విజయ కేతనం ఎగురవేశారు. మూడింట రెండొంతుల స్థానాలు వారి వశమయ్యాయి. మొత్తం 8494 పంచాయతీల్లో గులాబీ జెండా ఎగిరింది. 2516 పంచాయతీలతో కాంగ్రెస్ రెండో స్థానంలో నిలిచింది. బీజేపీ 100 పంచాయతీలను దక్కించుకోగా.. టీడీపీ 65 పంచాయతీలకే పరిమితమైంది. ఇక వామపక్షాలు రెండంకెల స్థానాలతో సరిపెట్టుకున్నాయి. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన మరుసటి నెలలోనే పంచాయతీ ఎన్నికలు ఎదుర్కోవాల్సి రావడం అన్ని పార్టీలకు కాస్త ఇబ్బందిగానే మారింది. అయితే, గ్రామాల్లో మాత్రం పోటీ ఆసక్తికరంగా సాగింది. గతంలో ఎన్నడూ లేనంతగా ఏకగ్రీవాలు జరిగాయి. ద్విముఖ, త్రిముఖ పోటీలే ఎక్కువ. ప్రతి ఓటరును పోలింగ్ కేంద్రం వరకు తరలించడంలో అభ్యర్థులంతా సఫలీకృతమయ్యారు. ఫలితంగానే రాష్ట్రంలో 87.29 శాతం పోలింగ్ నమోదైంది. మూడో విడతలో బుధవారం 3,506 పంచాయతీలకు ఎన్నికలు జరగ్గా.. టీఆర్ఎస్ దాదాపు 2500 స్థానాలను గెలుచుకుంది. మూడు విడతల్లోనూ టీఆర్ఎస్ హవా ఇలాగే కొనసాగింది.

కూల్.. కూల్.. కేపిటల్



- ఇంటింటికీ పైపు ద్వారా ఏసీ
- రాజధానికి వినూత్న చల్లదనం
- దుబాయ్ కంపెనీ ముందుకు
- రూ.260కోట్లు,20వేల టన్నుల సామర్థ్యంతో ఒక్కో ఏసీ ప్లాంటు
- భూమి,డక్ట్ సర్కార్ ఇస్తే చాలు
- ఖర్చంతా భరించనున్న కంపెనీ
- 2.5 ఎకరాల్లో ఏర్పడే ప్లాంటుతో 500 ఎకరాల్లోని భవంతికి ఏసీ

అమరావతి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ పైపుల ద్వారా మంచినీళ్లు, గ్యాస్ సరఫరా చేస్తున్నట్లే, ఏసీ కూడా సరఫరా చేసే రోజులు వచ్చేశాయి. నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో ఇంటింటికీ పైపుల ద్వారా ఏసీని అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సీఆర్‌డీఏ కమిషనర్ సీహెచ్ శ్రీధర్ బుధవారం మీడియా ప్రతినిధులతో ముచ్చటిస్తూ ఈ విషయం తెలిపారు. దుబాయ్‌కి చెందిన తబ్రీద్ అనే సంస్థ నూతన రాజధానిలో ఈ సౌకర్యం కల్పించడానికి ముందుకు వచ్చింది. ఈ సంస్థతో సీఆర్‌డీఏ ఇప్పటికే దీనిపై ఒక ఒప్పందం కూడా కుదుర్చుకొంది. దుబాయ్‌లో ఇప్పటికే ఈ తరహా విధానం అమలు అవుతోంది. రాష్ట్ర ప్రభు త్వ అధికారులు అక్కడకు వెళ్లి చూసి సంతృప్తి చెందిన తర్వాత దానిని అమరావతిలో అమలు చేయడానికి పచ్చ జెండా ఊపారు. రాష్ట్ర ప్రభుత్వానికి పైసా ఖర్చు లేకుండా ఈ విధానం అమల్లోకి వస్తుండటం విశేషం. డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టం అనే విధానం ద్వారా దీనిని అమలు చేస్తారు.

రెండున్నర ఎకరాల్లో ఏర్పాటయ్యే ఒక ప్లాంట్ సుమారుగా 500 ఎకరాల్లో నిర్మితమయ్యే భవనాలకు అవసరమయ్యే ఏసీని సరఫరా చేస్తుంది. భారీ కంప్రెసర్లతో ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తారు. దీని నుంచి పైపుల ద్వారా చల్లదనం ఈ భవనాలకు సరఫరా అవుతుంది. అక్కడ అంతర్గతంగా నిర్మించే పైపుల ద్వారా ప్రతి గదికి చల్లదనం చేరుతుంది. ఈ విధానంలో ఈ తరహా సౌకర్యం పొందేవారు విడిగా ఏసీ యంత్రాలు కొనుక్కోవాల్సిన అవసరం లేదు. ఏసీ సరఫరా, నియంత్రణకు అవసరమయ్యే పరికరాలను మాత్రం గదుల్లో ఏర్పాటు చేసుకొంటే సరిపోతుంది. ఒక ప్లాంట్ ఏర్పాటుకు సుమారుగా రూ. 260 కోట్లు వ్యయం అవుతుంది. ఈ డబ్బును తబ్రీద్ సంస్థ తానే పెట్టుబడి పెడుతుంది. ఏసీ సరఫరా ద్వారా ఈ మొత్తాన్ని రాబట్టుకొంటుంది.

అహ్మదాబాద్ తరువాత..

భారతదేశంలో ఇప్పటివరకూ పైపులైన్ ఏసీ సదుపాయం గుజరాత్ అహ్మదాబాద్‌లోని గిఫ్ట్ సిటీ అనే భవనానికి ఉంది. 5 వేల టన్నుల ఏసీని ఈ భవనానికి సరఫరా చేస్తున్నారు. అమరావతిలో అంత కంటే భారీగా ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ ఒక్కో ప్లాంట్ 20 వేల టన్నుల సామర్థ్యంతో ఏర్పాటు అవుతోంది. అవసరమైతే దానిని 40 వేల టన్నులకు విస్తరించగలిగే అవకాశం ఉంది. నగరంలో నిర్మాణాలు పెరుగుతున్న కొద్దీ ఇటువంటి ప్లాంట్లు మరిన్ని వచ్చే అవకాశం ఉంది. దుబాయ్‌లో ఇటువంటి ప్లాంట్లు 90 ఉన్నాయి. దేశంలో ఇంత విస్తృత స్థాయిలో ఇటువంటి ప్లాంట్లు నవీన టెక్నాలజీతో అమరావతిలోనే ఏర్పాటు అవుతున్నాయి.

తన్నుకుపోయిన తబ్రీద్

అమరావతిలో పైపులైన్ ఏసీ ఏర్పాటుకు సింగపూర్ పవర్ సంస్థ కూడా పోటీ పడింది. తబ్రీద్ తక్కువ ధరకు అందివ్వడానికి ముందుకు రావడంతో దానిని ఎంపిక చేశారు. ప్రభుత్వం దానికి అవసరమైన భూమి, పైపుల ఏర్పాటుకు డక్ట్‌లో సదుపాయం మాత్రం ఇవ్వాల్సి ఉంటుంది. మంచినీరు, విద్యుత్ వంటి వాటి కోసం అమరావతిలో ప్రతి రోడ్డు వెంటా ఇప్పుడు సిమెంట్ డక్ట్‌లు నిర్మిస్తున్నారు. అందులోనే ఈ పైపులకు కూడా చోటు కల్పిస్తారు. అమరావతిలో కొత్త సచివాలయం, అసెంబ్లీ, రాజ్‌భవన్, హైకోర్టు, అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉద్యోగుల నివాస భవనాలకు కలిపి రెండు ప్లాంట్లు అవసరం అవుతాయని అంచనా వేశారు. సింగపూర్ స్టార్టప్ సిటీకి రెండు ఏసీ ప్లాంట్లు కావాలని అంచనా. ఆ సిటీకి కూడా ఈ సదుపాయం కల్పించాలని నిర్ణయించారు. హ్యాపీ నెస్ట్ పేరుతో సీఆర్‌డీఏ నిర్మిస్తున్న నివాస సముదాయాలు 1- 2 దశల భవనాలకు కూడా ఈ సదుపాయం కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ప్రైవేట్ సంస్థలు తమకు కూడా ఇటువంటి సదుపాయం కావాలంటే సంబంధిత సంస్థతో ఒప్పందం కుదుర్చుకోవాల్సి ఉంటుంది.

11వేల క్యూబిక్ మీటర్ల ర్యాఫ్ట్

మొత్తం 5 టవర్లుగా సచివాలయం ఉంటుంది. భూగర్భంలో ఒక దాని నుంచి మరొకదానికి వెళ్ళడానికి దార్లు ఉంటాయి. ఇవికాక ఉద్యోగులు అటూ ఇటూ తిరగడానికి రెండో అంతస్థులో అన్నింటిని కలుపుతూ వంతెనలు నిర్మిస్తున్నాం. 40 అంతస్థుల ఎత్తుతో నిర్మిస్తున్న ఈ టవర్లకు సిమెంట్‌తో నిర్మించిన ర్యాఫ్ట్ ఫౌండేషన్ దేశంలో ఒక రికార్డు. ఒక్కో టవర్‌కు 11,000 క్యూబిక్ మీటర్ల సిమెంట్ ఫౌండేషన్ వేశాం. మొత్తం 5 టవర్లకు 55 వేల క్యూబిక్ మీటర్ల ఫౌండేషన్ వచ్చింది.

– శ్రీధర్, కమిషనర్, సీఆర్‌డీఏ

కేసీఆర్ అలా అన్నా..

అమరావతిలో కొత్తగా నిర్మిస్తున్న సచివాలయం 69 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో నిర్మితం అవుతోందని సీఆర్‌డీఏ కమిషనర్ శ్రీధర్ తెలిపారు. ఇందులో 17 వేల మంది ఉద్యోగులు పనిచేయబోతున్నారని ఆయన వెల్లడించారు. హైదరాబాద్‌లో ప్రస్తుత సచివాలయం పది లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉందని, అమరావతిలో అవసరం లేకుండా పెద్ద సచివాలయం నిర్మిస్తున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల విలేకరుల సమావేశంలో విమర్శించారు. ఈ వ్యాఖ్యల ప్రస్తావన శ్రీధర్ వద్ద వచ్చింది. "అమరావతి సచివాలయం నమూనా వేరు. హైదరాబాద్ సచివాలయంలో డైరెక్టరేట్లు, కమిషనరేట్లు లేవు. అవన్నీ నగరంలో వివిధ ప్రదేశాల్లో వివిధ భవనాల్లో ఉన్నాయి. మేం ఇక్కడ కొత్త సచివాలయంలో వీటన్నింటిని అందులోకి తెచ్చేస్తున్నాం. చాలావరకూ కార్పొరేషన్లు కూడా ఇందులోకే వచ్చేస్తాయి. విజయవాడ, గుంటూరు నగరాల్లో ఉన్న ప్రభుత్వ శాఖల కార్యాలయాలన్నీ కొత్త సచివాలయంలోకి వచ్చేస్తాయి. ప్రజలు అనేక చోట్లకు తిరగాల్సిన పని లేకుండా అన్నీ ఒక చోటే ఉంటాయి. ఒక శాఖకు సంబంధించిన కార్యదర్శులు, కమిషనర్లు, డైరెక్టరు, అనుబంధ శాఖలు, వాటి అధికారులు, కార్పొరేషన్లు అన్నీ ఒక చోటే ఉండేలా ముఖ్యమంత్రి ఈ సచివాలయాన్ని నిర్మింప చేస్తున్నారు. అందుకే ఇంత విస్తీర్ణంలో నిర్మిస్తున్నాం" అని ఆయన వివరించారు. ఈ కార్యాలయాలు అన్నింటిలో కలిపి ప్రస్తుతం 17 వేల మంది ఉద్యోగులు ఉన్నారని, వారందరూ కూర్చోవడానికి అనువైన వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ఇంత మంది ఉద్యోగులను దృష్టిలో ఉంచుకొని వారికి అవసరమైన క్యాంటీన్లు, ఆస్పత్రులు, జిమ్‌లు, ఈత కొలను, సూపర్ మార్కెట్లు, ఉద్యోగుల పిల్లల కోసం క్రష్‌లు, ప్లే స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నామని, 4 వేల కార్లు, ఐదారువేల ద్విచక్ర వాహనాలకు పార్కింగ్ ఉంటుందని ఆయన అన్నారు. రోజూ నాలుగైదు వేల మంది సందర్శకులు ఉంటారు.

కరెంటు ఖర్చు తక్కువే..

సాధారణంగా ఏసీ అనగానే కరెంటు బిల్లు భారీగా వస్తుందని భయపడతారు. అయితే, ఇప్పుడు విద్యుత్ ద్వారా అయ్యే వ్యయం కంటే ఈ కేంద్రీకృత విధానంలో తక్కువ ఖర్చు అవుతుందని సీఆర్‌డీఏ కమిషనర్ వెల్లడించారు. ఏసీ యంత్రాల వాడకానికి విద్యుత్‌కు సుమారుగా రూ. పది వ్యయం అవుతుందని అనుకొంటే ఈ విధానంలో రూ. ఆరు మాత్రమే ఖర్చు అవుతుందని ఆయన తెలిపారు. దీనివల్ల సాధారణ ఏసీ యంత్రాలతో వచ్చే కాలుష్య సమస్య తగ్గుతుందని, మరింత సమర్థవంతంగా చల్లదనాన్ని అందివ్వడం వీలవుతుందని కమిషనర్ వివరించారు.

'సీమ'లో హైకోర్టు బెంచ్!

(మొదటి పేజీ తరువాయి)

పిల్ దాఖలు చేశారు. రాష్ట్ర విభజన అనంతరం రాజధాని ఆంధ్ర ప్రాంతంలో ఉన్నందున హైకోర్టును రాయలసీమలో ఏర్పాటు చేయాలని, ఆ మేరకు కేంద్రానికి ఆదేశాలివ్వాలని అభ్యర్థించారు. ఈ కేసు విచారణలో ఉండగానే అమరావతిలో హైకోర్టు ఏర్పాటు చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయం తీసుకున్నాయి. బుధవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి సి.ప్రవీణ్‌కుమార్, జస్టిస్ ఎం.సత్యనారాయణ మూర్తితో కూడిన ప్రథమ ధర్మాసనం ముందు ఈ వాజ్యం విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా పిటిషనర్ మాట్లాడుతూ... గతంలో కేంద్రంతో సంబంధం లేకుండా ఔరంగాబాద్ బెంచ్‌ను బాంబే హైకోర్టు సీజే ఏర్పాటు చేశారని, ఆ మేరకు హైకోర్టు సీజేకు అధికారాలున్నాయని వాదించారు. ఆ తరువాత జరిగిన విచారణలో దీన్ని సుప్రీంకోర్టు కూడా సమర్థించిందని గుర్తు చేశారు. ఆ తీర్పు ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి సీమలో కనీసం హైకోర్టు బెంచ్ అయినా ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. దీనిపై కేంద్రప్రభుత్వం తన అభిప్రాయాన్ని చెప్పాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను వచ్చేనెల 13కు వాయిదా వేసింది.

అక్రమార్కులపై ఉపేక్ష ఎందుకు?

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్‌శాఖలో జరిగిన కోట్లాది రూపాయల అక్రమాలపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అక్రమార్కులను ఎందుకు ఉపేక్షిస్తున్నారు? వారిపై క్రిమినల్ చర్యలు తీసుకునేందుకు ఎందుకు వెనకాడుతున్నారు? అలాంటి వారిని ఎందుకు జైలుకు పంపట్లేదంటూ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సి. ప్రవీణ్‌కుమార్, జస్టిస్ ఎం.సత్యనారాయణ మూర్తితో కూడిన ప్రథమ ధర్మాసనం ప్రశ్నించింది. విద్యుత్ కండక్టర్ల కొనుగోళ్లలో రూ.143కోట్ల మేర అవినీతి జరిగిందని, దీనిని చర్యలు తీసుకోవాలని కోరుతూ శాంతికిరణ్ అనే వ్యక్తి గతేడాది ఉమ్మడి హైకోర్టును ఆశ్రయించారు. అక్రమాలు వాస్తవమేనని విజిలెన్స్ విభాగం అంగీకరించింది. ఈ నేపథ్యంలో బుధవారం ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బాధ్యులపై ప్రభుత్వపరంగా తీసుకున్న చర్యలు తదితర వివరాలతో నివేదిక సమర్పించాలని ఆదేశించిన ధర్మాసనం, తదుపరి విచారణను వచ్చే మంగళవారానికి వాయిదా వేసింది.

వెయ్యికాళ్ల మంటపం పునర్నిర్మించండి

- హైకోర్టులో ఎమ్మెల్యే రోజా పిటిషన్

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): తిరుమలలో వెయ్యికాళ్ల మంటపం పునర్నిర్మాణానికి టీటీడీ పాలకమండలిని ఆదేశించాలని కోరుతూ వైసీపీ ఎమ్మెల్యే రోజా హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. బుధవారం ఈ వ్యాజ్యాన్ని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి సి. ప్రవీణ్‌కుమార్, జస్టిస్ ఎం. సత్యనారాయణమూర్తితో కూడిన ప్రథమ ధర్మాసనం విచారించింది. నారాయణగిరిలో వెయ్యికాళ్ల మంటపం నిర్మించాలని టీటీడీ నిర్ణయించిందని టీటీడీ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ధర్మాసనం కేసు విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

రాహుల్ ఫోన్ చేసినా.. కాంగ్రెస్‌లో ఉండలేను



- ఒంటరి పోరుకు నేను వ్యతిరేకం
- సీఎంతో ఉన్న అనుబంధంతోనే కలిశాను
- కార్యకర్తల అభీష్టం మేరకే తుది నిర్ణయం: కోట్ల
- 8 తర్వాత టీడీపీలో చేరే అవకాశం?

కర్నూలు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో ఒంటరిగా పోటీ చేయాలని, పొత్తులు ఉండవని కాంగ్రెస్ కోర్ కమిటీ భేటీలో పార్టీ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకించి బయటకు వచ్చాను. నాతో ఎవరూ మాట్లాడలేదు. టూ లేట్.. ఇప్పుడు రాహుల్‌గాంధీ ఫోన్ చేసినా కాంగ్రెస్‌లో ఉండలేను' అని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం రాత్రి తన సతీమణి, డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, తనయుడు రాఘవేంద్రరెడ్డితో కలిసి ఆయన అమరావతిలో సీఎం చంద్రబాబును కలిసిన సంగతి తెలిసిందే. సమావేశానంతరం బుధవారం కర్నూలుకు చేరుకున్న ఆయనకు అభిమానులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా కోట్ల విలేకరులతో మాట్లాడారు. 'ముఖ్యమంత్రి చంద్రబాబుతో మా కుటుంబానికి ఎన్నో ఏళ్లుగా సన్నిహిత సంబంధం ఉంది. దాంతోనే మమ్మల్ని కలవాలని ఆయన ఆహ్వానించడంతో వెళ్లాం. టీడీపీలో చేరాలని ఆయన నన్ను కోరలేదు. జిల్లాలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు' అని తెలిపారు. కర్నూలు లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో నిత్యం వెంటాడుతున్న కరువును శాశ్వతంగా పరిష్కరించాలంటే గుండ్రేవుల జలాశయం, వేదవతి ప్రాజెక్టు, ఎల్లెల్సీ బైపాస్ పైప్‌లైన్ నిర్మించాలని సీఎంకు సూచించానన్నారు. వేదవతి ప్రాజెక్టుకు సీఎం జీవో ఇచ్చారని.. గుండ్రేవుల ప్రాజెక్టు ఇస్తేనే రైతుల సమస్య శాశ్వతంగా తీరుతుందని తెలిపారు. తనను పార్టీలోకి ఆహ్వానించేందుకు టీడీపీ, వైసీపీ, బీజేపీ నాయకులు కలిసిన మాట వాస్తవమేనని, కార్యకర్తల నిర్ణయమే తనకు శిరోధార్యమని, వాళ్లు ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటానని తెలిపారు. చివరకు స్వతంత్రంగా పోటీ చేయాలన్నా సిద్ధమేనన్నారు. ఆయన కార్యకర్తలు, ముఖ్య నేతలతో విడివిడిగా సమావేశమై వారి అభిప్రాయాలు తెలుసుకుని.. టీడీపీలో చేరే అవకాశం ఉందని కోట్ల వర్గీయులు పేర్కొంటున్నారు. ఫిబ్రవరి 6న టీడీపీలో చేరతారని అనుకున్నారు. అయి తే.. 6, 7 తేదీల్లో కోట్ల బంధువుల పెళ్లి ఉండడంతో.. 8 తర్వాత చేరే అవకాశముందని చెబుతున్నారు.

'కోట్ల' చేరికపై.. సీఎం అడిగితే చెబుతా!: కేఈ

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి టీడీపీలో చేరికపై డిప్యూటీ సీఎం, అదే జిల్లాకు చెందిన సీనియర్ నాయకుడు కేఈ కృష్ణమూర్తి నర్మగర్భంగా స్పందించారు. బుధవారం ఆయన అసెంబ్లీ లాబీల్లో విలేకరులతో మాట్లాడారు. "నేను ఈ రోజు(బుధవారం) సీఎం చంద్రబాబుని కలిశాను. శ్రీశైలం ఆలయ పాలక మండలి నియామకంపై చర్చించా. కోట్ల కుటుంబం పార్టీలో చేరిక అంశాన్ని సీఎం నా వద్ద ప్రస్తావించలేదు. నేను కూడా అడగలేదు. ముఖ్యమంత్రి అడిగినప్పుడు నా అభిప్రాయం చెబుతా" అని ఆయన అన్నారు. కోట్ల కుటుంబం పార్టీ నుంచి ఏం ఆశిస్తోందో, ఏయే సీట్లు అడుగుతున్నారో కూడా తనకు తెలియదన్నారు.

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై 'లోక్‌సభ' పోలింగ్ తర్వాత చెబుతా

- అనుమానాలను ఈసీ నివృత్తి చేయాలి
- అవకాశం వస్తే తెలంగాణలో పోటీ: లగడపాటి



న్యూఢిల్లీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు తన సర్వేకు విరుద్ధంగా ఎందుకు వచ్చాయో.. లోక్‌సభ ఎన్నికల పోలింగ్ తర్వాత చెబుతానని మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ అన్నారు. లోక్‌సభ ఎన్నికలపై కూడా పోలింగ్ ముగిసిన తర్వాతే సర్వే ఫలితాలు వెల్లడిస్తానన్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై వివిధ రాజకీయ పార్టీలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని, వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు. అనేక నియోజకవర్గాల్లో వీవీ ప్యాట్ల స్లిప్పులను లెక్కించాలనే డిమాండ్లు వచ్చాయని, ఓటింగ్ శాతం ప్రకటనపై అనుమానాలు వ్యక్తమయ్యాయని, హైకోర్టు దాకా విషయం వెళ్లిందని గుర్తు చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఢిల్లీలో విలేకరులతో మాట్లాడారు. తాను 2003 నుంచి అనేక రాష్ట్రాల్లో, సార్వత్రిక ఎన్నికల్లో సర్వేలు నిర్వహిస్తున్నానని, ఎప్పుడూ అంచనాలు తప్పలేదని అన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను చూసి మాత్రం తాను ఆశ్చర్యపోయానన్నారు. ఆ ఫలితాలు చూశాక.. పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయడానికి కూడా ఎవరూ ముందుకు రారనుకున్నానని, కానీ.. ఈ ఎన్నికల్లో ప్రతిపక్షం బలం గణనీయంగా పెరిగిందని పేర్కొన్నారు. ఇంతకాలం తాను మాట్లాడలేదని, ఇటీవలి కాలం లో తన వ్యక్తిత్వంపై సోషల్ మీడియాలో కరకాల కథనాలు వస్తుండటంతో మాట్లాడుతున్నానని చెప్పారు. తాను ఎవరి ఒత్తిళ్లకూ లొంగే వ్యక్తిని కాదని, మాట తప్పే వ్యక్తినీ కాదని లగడపాటి స్పష్టం చేశారు.

ఎవరి జోక్యంతోనో నడచుకోను..

తాను ఎవరి జోక్యంతోనో నడచుకునే వ్యక్తిని కాదని లగడపాటి అన్నారు. తన సర్వే తప్పయితే క్షమాపణలు చెప్పేందుకూ అభ్యంతరం లేదన్నారు. తాను ఒక సిద్ధాంతానికి కట్టుబడి రాజకీయాలకు దూరంగా ఉన్నానని, అవకాశం వస్తే తెలంగాణ నుంచి పోటీ చేస్తానని ఇదివరకు చెప్పానని గుర్తు చేశారు. ఏపీలో పోటీ చేస్తానని మాత్రం చెప్పలేదన్నారు. బుధవారం ఏపీ సీఎం చంద్రబాబును కలవడంపై ప్రశ్నించగా, 'సీఎంనే కాదు.. గతంలో జగన్‌ను కూడా కలిశాను. పవన్‌తోనూ ఫోన్‌లో మాట్లాడా. నేను ఏ రాజకీయ పార్టీలో లేను. ఏ పార్టీ నేతనైనా కలుస్తా. నాకు ఆంక్షలు లేవ'ని చెప్పారు. జగన్, టీఆర్ఎస్ కలయికపై ప్రశ్నించగా.. 'తెలంగాణలో బాహాటంగా పొత్తులు పెట్టుకున్నారు. ఏపీలోనూ పెట్టుకుంటే తప్పేమీ లేదు. టీఆర్ఎస్ వచ్చి విజయవాడ, వైజాగ్‌లో పోటీ చేయవచ్చు. టీఆర్ఎస్ కూడా తెలుగు రాష్ట్రానికి చెందిన పార్టీనే'అని వ్యాఖ్యానించారు.

కౌలు రైతుకూ సాయం!

(మొదటి పేజీ తరువాయి)

ఖరారు చేశారు. పొరుగున ఉన్న తెలంగాణలో అక్కడి ప్రభుత్వం ఎకరానికి రూ.4 వేల చొప్పున ఇచ్చింది. అక్కడ కోటి ఎకరాల వ్యవసాయ భూమికి ఈ సాయం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో సాగు భూమి కోటిన్నర ఎకరాలు ఉందని ప్రభుత్వ లెక్కలు సూచిస్తున్నాయి. ఎకరానికి రూ.2,500 చొప్పున ప్రభుత్వం సాగు సాయం కింద ఇచ్చే మొత్తం ఒక సీజన్‌కు రూ.4 వేల కోట్లుగా ఉండబోతోంది. ఈ సాయాన్ని వచ్చేఏడాది భారీగా పెంచితే భారం కూడా పెరుగుతుంది. తెలంగాణలో కౌలు రైతులకు ఈ సాయం ఇవ్వలేదు. భూమి ఎవరి పేరు మీద ఉంటే వారికే ఇచ్చారు. ఏపీలో మాత్రం కౌలు రైతులకు కూడా సాయం చేయాలని నిర్ణయించారు. ఒక ఎకరానికి ఇచ్చే మొత్తంలో కౌలుదారుకు రూ.1,500, భూ యజమానికి రూ.1,000 చొప్పున ఇస్తారు. కౌలు రైతు లేకపోతే మొత్తం భూ యజమానిగా ఉన్న రైతుకే వస్తుంది.

కౌలు రైతులకు గుర్తింపు లేక..

కౌలు రైతులకు సంబంధించి నిర్దిష్ట సమాచారం లేకపోవడం ప్రభుత్వానికి సమస్యగా ఉంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం ప్రస్తుతం రాష్ట్రంలో 76 లక్షల మంది రైతులు ఉన్నారు. వీరు భూ యజమానులు. కౌలు రైతులు 15 లక్షల మంది ఉన్నారు. వీరికి కౌలుదారు గుర్తింపు ఉంది. కౌలు రైతులకు ఇచ్చే రుణాలు వీరికి అందుతున్నాయి. ఇంకా పెద్ద సంఖ్యలో కౌలు రైతులు ఉన్నా.. వారికి గుర్తింపు లేదు. తమ భూమిని కౌలుకు చేస్తున్నారని భూయజమానులు ఎవరికీ లిఖితపూర్వక గుర్తింపు లేదా లిఖిత పూర్వక ఒప్పందాలివ్వడం లేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుతానికి గుర్తింపు పొందిన కౌలు రైతులకే ఈ సాయాన్ని ఇచ్చే అవకాశముంది.

సాగు సమయానికే సాయం..

చేయదలచిన సాయాన్ని సాగు సమయంలోనే ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ఖరీఫ్ సాగు వచ్చే జూన్‌లో మొదలుకానుంది. ఇప్పుడే ఆ సాయం చేస్తే అది ఇతర ఖర్చులకు వ్యయమయ్యే అవకాశం ఉంది. కొంత ఆలస్యంగా ఇద్దామంటే ఈ లోపు ఎన్నికల నియమావళి అమల్లోకి వస్తుంది. కోడ్ వచ్చాక సాయం పంపిణీకి వీలుండదు. అందువల్ల తర్వాత తేదీని ముద్రించిన (పోస్ట్ డేటెడ్) చెక్కులను రైతులకు పంపిణీ చేయాలని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం. ఒక చెక్కుపై ఒక తేదీని ముద్రించాక అప్పటి నుంచి మూడు నెలల లోపు దానిని మార్చుకోవలసి ఉంటుంది. ఖరీఫ్ సాగు సమయానికి ఈ డబ్బు రైతులకు అందేలా తేదీ వేసి.. కోడ్ అమల్లోకి వచ్చేలోపు ఈ చెక్కులను రైతులకు పంపిణీ చేయాలని ప్రభుత్వ వర్గాలు యోచిస్తున్నాయి. ఈ పథకం అమలు, విధి విధానాలపై ముఖ్యమంత్రి ఇప్పటికే 2-3 దఫాలు మంత్రులు, అధికారులతో చర్చలు జరిపారు. కొద్ది రోజుల్లోనే అధికార ప్రకటన విడుదలయ్యే అవకాశముంది.

మీ సలహాలు కావాలి!

- ఉద్యోగులకు విపక్ష నేత జగన్ లేఖలు
- పోస్టు ద్వారా నేరుగా చేరుతున్న ఉత్తరాలు



కడప, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ విపక్షం వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఉద్యోగులకు స్వయంగా లేఖలు రాస్తున్నారు. 2 రోజులుగా కడప జిల్లాలో ఉద్యోగులకు చేరుతున్న ఈ లేఖలు చర్చనీయాంశంగా మారాయి. ఈ నెల 15న రాసిన లేఖపై పార్టీ గుర్తు ఫ్యాన్, జగన్ ఫొటోను ముద్రించారు.

లేఖ సారాంశం ఇదీ..

నమస్కారం(ఉద్యోగి పేరును పేర్కొంటూ). మీరు చేస్తున్న కృషిని ప్రశంసిస్తూ మిమ్మల్ని కలిసి ఏపీ ప్రగతికి మీ సలహాలు తీసుకోవాలని ఆశిస్తున్నాను. నేను మీ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, ఉభయకుశలోపరి, మీరు ఉద్యోగి అని తెలుసుకున్నాను. మీద్వారా గ్రామస్తులు ప్రయోజనం పొందడానికి కృషి చేస్తున్నందుకు నా అభినందనలు. మీరు ఇదేవిధంగా తోటి వారికి సహాయం చేస్తూ మరిన్ని పేరు ప్రఖ్యాతులు సంపాదించుకోవాలని కోరుకుంటున్నాను. ఏపీకి పూర్వ వైభవం తీసుకురావడానికి రాష్ట్ర ప్రజలంతా స్వచ్ఛందంగా ముందుకొచ్చి రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఉంది. 429 రోజులు నేను చేసిన పాదయాత్రలో మీ గుండెచప్పుడు విని నా గుండె చప్పుడుగా మార్చుకున్నాను. పాదయాత్రలో భాగంగా మీలాంటి ఎంతో మంది స్ఫూర్తిదాయకమైన వ్యక్తులను కలుసుకోవడం నా అదృష్టం. ఏపీ ప్రగతి కోసం నేను రూపుదిద్దే కార్యాచరణ కోసం మీ విలువైన సలహాలు, సూచనలు తెలుసుకోవాలనుకుంటున్నాను. ఈ మెయిల్ ఐడీకి పంపించండి. లేదా నన్ను కలవడానికి 91996 91996 ఫోను నెంబరుకు సంప్రదించండి.

ఇట్లు.. మీ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి

జగన్‌తో అమెరికన్ కాన్సులేట్ జనరల్ భేటీ



హైదరాబాద్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు, ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్ జనరల్ కేథరిన్ బి హడ్డా కలిశారు. బుధవారం ఇక్కడ లోటస్ పాండ్‌లో జగన్ నివాసానికి వచ్చిన కేథరిన్.. ఆ యనతో సమావేశమయ్యారు. భవిష్యత్తులో భారత్, అమెరికా సంబంధాల్లో ఆంధ్ర పాత్ర ఎలా ఉండాలనే విషయమై జగన్ తన కు వివరించారని కేథరిన్ ట్విటర్ ద్వారా తెలిపారు. అమెరికా ఎంబసీ అధికారులు, వైసీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీ మిథున్‌రెడ్డి ఈ భేటీలో పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

స్పోర్ట్స్

విజయవాడ ● గురువారం 31 జనవరి 2019



టాప్-50లో మనికా బాత్రా

న్యూఢిల్లీ: భారత టేబుల్ టెన్నిస్ స్టార్ క్రీడాకారిణి మనికా బాత్రా ప్రపంచ ర్యాంకింగ్స్‌లో అదరగొట్టింది. ఈ ఢిల్లీ ఏస్ కెరీర్‌లోనే అత్యుత్తమంగా సింగిల్స్‌లో 47వ ర్యాంకు సాధించింది. దీంతో ప్రపంచ టీటీ ర్యాంకింగ్స్‌లో టాప్-50లో నిలిచిన తొలి భారత మహిళా ప్యాడ్లర్‌గా మనికా రికార్డు సృష్టించింది. ఇక, పురుషుల సింగిల్స్‌లో మూడుస్థానాలు మెరుగుపరచుకొన్న జి. సాథియాన్ కెరీర్ బెస్ట్‌గా 28వ ర్యాంకులో నిలిచాడు. అంతేకాదు.. వెటరన్ స్టార్ శరత్ కమల్‌ను అధిగమించి భారత్ తరఫున నెంబర్ వన్ ప్యాడ్లర్‌గా అవతరించాడు. శరత్ మూడుస్థానాలు కోల్పోయి 33వ ర్యాంకులో కొనసాగుతున్నాడు.

పోలీసుల ఒత్తిడి వల్లే అంగీకరించా!

● శ్రీశాంత్ కేసులో ట్విస్ట్



న్యూఢిల్లీ: తన కుటుంబంపై తప్పుడు కేసులు బనాయించి హింసిస్తామని ఢిల్లీ పోలీసులు బెదిరించడం వల్లే తాను నేరాన్ని అంగీకరించానని బుధవారం సుప్రీం కోర్టులో విచారణ సందర్భంగా నిషేధం ఎదుర్కొంటున్న క్రికెటర్ శ్రీశాంత్ చెప్పాడు. తన లాయర్ ద్వారా అతడు దఖలు పరిచిన వాటిని పరిగణనలోకి తీసుకున్న కోర్టు.. ఫిక్సింగ్ విషయంలో శ్రీశాంత్‌ను నిలదీసింది. ఫిక్సింగ్ సమాచారాన్ని తక్షణం బీసీసీఐ దృష్టికి ఎందుకు తీసుకెళ్లలేదని ప్రశ్నించింది. ఈ మొత్తం వ్యవహారంలో క్రికెటర్ నడత ఆక్షేపణీయంగానే ఉందని ధర్మాసనం అభిప్రాయపడింది. జీవితకాల నిషేధం అంటే ఎంతో కఠినమైన శిక్ష అని శ్రీశాంత్ కోర్టుకు విన్నవించాడు. ఎటువంటి కచ్చితమైన ఆధారాలు లేకపోయినా.. తనకు దారుణమైన శిక్ష వేశారని వాపోయాడు. కేరళ హైకోర్టు తనపై విధించిన నిషేధాన్ని పునరుద్ధరించడాన్ని శ్రీశాంత్ సుప్రీం కోర్టులో సవాల్ చేశాడు. మాజీ క్రికెటర్ అజరుద్దీన్‌పై నిషేధాన్ని ఎత్తివేసిన విషయాన్ని శ్రీశాంత్ లాయర్ సల్మాన్ ఖుర్షీద్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. తనను వేరే దేశంలోనైనా ఆడుకునేలా అనుమతినివ్వాలని శ్రీశాంత్ అభ్యర్థిస్తున్నాడు. 2013 ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ ప్లేయర్ శ్రీశాంత్‌పై ఫిక్సింగ్ కేసు నమోదైన విషయం తెలిసిందే.

శర్మ..రెండు రికార్డులు

ఈ వన్డేతో రోహిత్ రెండు రికార్డులు నెలకొల్పే అవకాశముంది. వన్డేల్లో ఇప్పటివరకూ 215 సిక్సర్లు కొట్టిన రోహిత్..ధోనీతో సమంగా నిలిచాడు. రోహిత్, ధోనీలిద్దరూ ఈ మ్యాచ్‌తో ఆ రికార్డును అధిగమించే అవకాశముంది. ఫామ్‌పరంగా చూస్తే రోహిత్‌కు అవకాశాలెక్కువ. న్యూజిలాండ్‌లో సెంచరీ చేసిన భారత కెప్టెన్‌గా మరో రికార్డు రోహిత్‌ను ఊరిస్తోంది. 2015లో ఆక్లాండ్‌లో జింబాబ్వేపై ధోనీ చేసిన 85 (నాటౌట్) స్కోరే ఇప్పటిదాకా భారత సారథి కివీస్‌లో చేసిన అత్యధిక రన్స్ రికార్డుగా ఉంది.



సిరీస్‌ను ఇప్పటికే 3-0తో భారత్ చేజిక్కించుకోవడంతో న్యూజిలాండ్‌తో గురువారం జరిగే నాలుగో వన్డే పెద్దగా ఆసక్తి ఏముంటుందిలే అని అభిమానులు అనుకోవచ్చు..కానీ ఈ మ్యాచ్‌కూ ఎంతో ప్రాధాన్యముంది. తాత్కాలిక కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్న రోహిత్ శర్మకు ఇది 200వ వన్డే. అయితే.. సారథిగా బాధ్యతలు చేపట్టిన ప్రతిసారీ రోహిత్‌లో మరో బ్యాట్స్‌మన్ సాక్షాత్కరిస్తాడు.. సెంచరీనేకాదు 'డబుల్'నూ ఇట్టే కొట్టేస్తాడు. కెప్టెన్‌గా శతకం, ద్విశతకం ఇప్పటికే బాదేసిన రోహిత్ ఈ సిరీస్‌లో అద్భుత ఫామ్‌లో ఉండడంతో మరో సెంచరీ.. వీలైతే 'డబుల్' సాధిస్తాడేమో చూడాలి! ఇకపోతే మరో విరాట్‌గా క్రికెట్ పండితుల ప్రశంసలు అందుకుంటున్న పంజాబ్ యువ బ్యాట్స్‌మన్ శుభమన్ గిల్ ఈ మ్యాచ్‌తో సీనియర్ జట్టుకు అరంగేట్రం చేసే చాన్సుంది. దాంతో ఈ 19 ఏళ్ల చిచ్చరపిడుగు విన్యాసాలను తిలకించేందుకైనా ఈ మ్యాచ్‌ను వీక్షించాల్సిందే!

ఉదయం 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్ 1, 3లో

కళ్లన్నీ రోహిత్ డబుల్‌పైనే!

● న్యూజిలాండ్‌తో నాలుగో వన్డే నేడు
● శుభమన్ గిల్‌కు చాన్స్!

హామిల్టన్: తాత్కాలిక సారథిగా రోహిత్ బాగా విజయవంతమయ్యాడు. న్యూజిలాండ్‌తో నాలుగో వన్డేలో అతడు 'స్టాండిన్'గా అదే జోరు కొనసాగించాలని తహతహలాడుతున్నాడు. అంతేకాదు తన 200వ వన్డేను మరింత చిరస్మరణీయం చేసుకోవాలని భావిస్తున్నాడు. ఇక్కడి సెడాన్ పార్క్ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలించే అవకాశం ఉండడంతో వన్డేల్లో నాలుగో డబుల్ సెంచరీపై రోహిత్ కన్నేశాడు. కెప్టెన్‌గా అతడి సగటు 102.8. ఎనిమిది వన్డేల్లో కెప్టెన్‌గా వ్యవహరించిన రోహిత్ రెండు హాఫ్ సెంచరీలు, ఓ సెంచరీ, మరో డబుల్ సెంచరీ సాధించాడు. ఈ సిరీస్‌లోనూ అతడు అదరగొడుతున్నాడు. మూడు మ్యాచ్‌ల్లో ఇప్పటికే 160 పరుగులు చేశాడు. గత రెండు వన్డేల్లో అర్థ శతకాలు (87, 62) బాదాడు. దాంతో మూడంకెల స్కోరుకు చేరడం రోహిత్‌కు కష్టం కాబోదని అంచనా. ఈ మ్యాచ్‌లోనూ గెలిస్తే భారత్ 4-0తో తిరుగులేని ఆధిక్యంలో నిలుస్తుంది. అదే జరిగితే.. 52 ఏళ్లుగా న్యూజిలాండ్‌లో పర్యటిస్తున్న టీమిండియాకు ఇదే అతిపెద్ద సిరీస్ విజయం అవుతుంది.

శుభమన్‌పైనే అందరి దృష్టి!

సిరీస్ ఇప్పటికే కైవసం చేసుకోవడంతో మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో రిజర్వ్ ఆటగాళ్లకు జట్టు యాజమాన్యం అవకాశం ఇస్తుందేమో చూడాలి. తొడ కండర గాయంతో మూడో వన్డేకు దూరమైన ధోనీ బుధవారం నెట్స్‌లో సాధన చేశాడు. నాలుగో వన్డేలో అతడు ఆడేది లేనిది టాస్‌కు ముందు మాత్రమే తేలనుంది. ధోనీ ఫిట్‌గా ఉంటే కోహ్లీ స్థానంలో జట్టులోకి వచ్చే అవకాశముంది. ఈ పర్యటనలో మిగిలిన మ్యాచ్‌ల నుంచి విరాట్‌కు విశ్రాంతి ఇచ్చిన సంగతి తెలిసిందే. కోహ్లీకి బదులు ధోనీని కాకుండా మరొకరిని బరిలోకి దించాలంటే 19 ఏళ్ల బ్యాట్స్‌మన్ శుభమన్ గిల్‌కు చాన్స్ ఖాయంగా కనిపిస్తోంది. తాను 19 ఏళ్ల వయస్సులో ఉన్నప్పుడు ప్రస్తుతం శుభమన్ ఆడుతున్న స్థాయిలో కనీసం 10 శాతం ప్రదర్శన కూడా చేయలేదని కోహ్లీ ఇటీవల గిల్‌ను ప్రశంసించాడు. భవిష్యత్‌లో విరాట్‌లా మరో సూపర్ స్టార్ అవడం ఖాయమని కూడా క్రికెట్ పండితుల కితాబు అందుకుంటున్నాడు. ఈ పంజాబ్ యువ బ్యాట్స్‌మన్‌కు కనుక చాన్స్ ఇస్తే నాలుగో నెంబర్‌లో పరీక్షించవచ్చు. లేదంటే కోహ్లీ స్థానమైన మూడో నెంబర్‌లో వస్తాడేమో చూడాలి? నాలుగోస్థానంలో అంబటి రాయుడు ఫర్వాలేదనిపిస్తున్నాడు కానీ.. అమోఘంగా రాణించడం లేదు. ఈ నేపథ్యంలో గిల్‌ను నాలుగో నెంబర్‌లో దించే అవకాశాలూ లేకపోలేదు. ధోనీ, గిల్ ఇద్దరినీ జట్టులో చేరిస్తే దినేశ్ కార్తీక్‌కు విశ్రాంతి ఇవ్వొచ్చు.

ఎదురులేని బౌలింగ్ విభాగం

భారత బౌలింగ్ విభాగం తిరుగులేని స్థాయిలో సత్తా చాటుతోంది. కుల్దీప్ యాదవ్ (3 మ్యాచ్‌ల్లో 8 వికెట్లు), చాహల్ (3 మ్యాచ్‌ల్లో 6 వికెట్లు) కివీస్‌కు చుక్కలు చూపుతున్నారు. వరుసగా రెండు వన్డేల్లో 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డులు దక్కించుకున్న పేసర్ షమికి విశ్రాంతి ఇచ్చే అవకాశాలు లేకపోలేదు. ఆస్ట్రేలియాతో సిరీస్ నుంచి అతడు అవిశ్రాంతంగా ఆడుతున్నాడు. షమికి విశ్రాంతి ఇస్తే.. ఖలీల్ అహ్మద్ లేదా మహ్మద్ సిరాజ్‌లో ఒకరు బరిలోకి దిగుతారు.



శుభమన్ గిల్

జట్లు (అంచనా)

భారత్: రోహిత్ శర్మ (కెప్టెన్), ధవన్, రాయుడు, ధోనీ/దినేశ్ కార్తీక్, కేదార్ జాదవ్, హార్దిక్ పాండ్యా, కుల్దీప్, భువనేశ్వర్, షమి, చాహల్, శుభమన్ గిల్.

న్యూజిలాండ్: కేన్ విలియమ్సన్ (కెప్టెన్), గప్టిల్, మన్రో, రాస్ టేలర్, టామ్ లాథమ్ (కీపర్), హెన్రీ నికోల్స్, జేమ్స్ నీషమ్, మిచెల్ శాంట్నర్, టాడ్ ఆస్లే, లూకీ ఫెర్గూసన్, ట్రెంట్ బౌల్ట్.

పిచ్/వాతావరణం

సెడాన్ పార్క్‌లో చివరి మూడు వన్డేల్లో 260-290 పరుగుల లక్ష్యాలను జట్లు అలవోకగా ఛేదించాయి. ఆ మూడు మ్యాచ్‌ల్లోనూ స్పిన్నర్లు సత్తా చాటారు. ఒక మ్యాచ్‌లో స్పిన్నర్ శాంట్నర్ కొత్త బంతితో బౌలింగ్ ప్రారంభించాడు. ఇక మ్యాచ్‌కు వాతావరణంతో అంతరాయం కలిగే అవకాశం లేదు.

కివీస్ కోలుకుంటుందా ?

సిరీస్ ఆరంభం నుంచి భారత్ ధాటికి కుదేలైన కివీస్ ఈ మ్యాచ్‌తోనైనా ఒకింత కోలుకుంటుందా అన్నది చూడాలి. అన్ని విభాగాల్లో భారత్ చేతిలో తాము చిత్తయ్యామని కెప్టెన్ విలియమ్సన్ అంగీకరించడం గమనార్హం. కుల్దీప్, చాహల్ బౌలింగ్‌ను ఎదుర్కోవడం న్యూజిలాండ్‌కు పెద్ద పజిల్‌గా మారింది. తొలి స్పెల్‌లో షమి.. బ్యాట్స్‌మెన్‌ను ఏమాత్రం కుదురుకోనివ్వకపోవడం కూడా ఆతిథ్య జట్టుకు పెద్ద సమస్యగా మారింది. కెప్టెన్ విలియమ్సన్ (64, 20, 28) పర్లేదనిపిస్తున్నా భారీస్కోర్లు చేయడంలో విఫలమవుతున్నాడు. మార్టిన్ గప్టిల్ కొత్త బంతిని ఆడడంలో తంటాలు పడుతున్నాడు. టామ్ లాథమ్, రాస్ టేలర్ భారీస్కోర్లు చేస్తున్నా వారిలో నిలకడ లోపించింది. బౌలింగ్‌లో..పేసర్ ట్రెంట్ బౌల్ట్‌కు ఫెర్గూసన్, బ్రేస్‌వెల్ నుంచి సహకారం కొరవడుతోంది. భారత స్పిన్నర్లు చెలరేగుతున్న చోట తమ లెగ్‌స్పిన్నర్ ఇష్ సోధీ పూర్తిగా నిరాశపరుస్తుండడం కివీస్ కష్టాలను రెట్టింపు చేస్తోంది. ఈ మ్యాచ్‌లో ఆల్‌రౌండర్ నీషమ్ తుది 11 మందిలో కచ్చితంగా చోటు లభించనుంది.

15 200వ వన్డే ఆడుతున్న 15వ భారత ఆటగాడు రోహిత్

2012 ఓ వన్డే సిరీస్‌లో నాలుగు మ్యాచ్‌లను న్యూజిలాండ్ చివరి సారి 2012లో వెస్టిండీస్‌లో కోల్పోయింది. అయితే న్యూజిలాండ్‌లో ఆస్ట్రేలియా రెండుసార్లు, శ్రీలంక ఓసారి కివీస్‌పై నాలుగు మ్యాచ్‌లు నెగ్గాయి.

సిరీస్ దక్షిణాఫ్రికాదే

● ఆఖరి వన్డేలో పాకిస్థాన్ చిత్తు

కేప్‌టౌన్: పాకిస్థాన్‌తో జరిగిన ఐదు వన్డేల సిరీస్‌ను దక్షిణాఫ్రికా 3-2తో కైవసం చేసుకొంది. బుధవారం ముగిసిన ఆఖరిదైన 5వ వన్డేలో సౌతాఫ్రికా 7 వికెట్ల తేడాతో పాక్‌పై విజయం సాధించింది. టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న ప్రొటీస్ జట్టు ప్రత్యర్థిని స్వల్ప స్కోరుకే కట్టడి చేసింది. నిర్ణీత 50 ఓవర్లలో పర్యాటక జట్టు 8 వికెట్లు కోల్పోయి 240 పరుగులు మాత్రమే చేసింది. ఫఖర్ జమాన్ అర్ధసెంచరీ (70)తో రాణించాడు. అనంతరం ఆతిథ్య జట్టు 3 వికెట్లు కోల్పోయి 40 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. ఓపెనర్ డికాక్ (58 బంతుల్లో 83) చెలరేగాడు. ఆ తర్వాత ఆమ్లా (14), హెండ్రిక్స్ (34) తక్కువ స్కోర్లకే వెనుదిరిగినా డుప్లెసిస్ (50), వాండెర్ డుస్సెన్ (50) అజేయ అర్ధశతకాలతో రాణించడంతో దక్షిణాఫ్రికా జయకేతనం ఎగరేసింది.

ఇండియా-ఎలో భుయ్, భరత్

● ఇంగ్లండ్ లయన్స్‌తో అనధికారిక టెస్ట్



న్యూఢిల్లీ: ఆంధ్ర ఆటగాళ్లు రికీ భుయ్, వికెట్ కీపర్ కేఎస్ భరత్‌కు ఇండియా-ఎ జట్టులో చోటు లభించింది. ఇంగ్లండ్ లయన్స్‌తో వచ్చేనెల 7 నుంచి వయనాడ్ (కేరళ)లో జరిగే తొలి అనధికారిక టెస్ట్‌కు 14 మంది సభ్యుల ఇండియా-ఎ జట్టును బుధవారం ప్రకటించారు. అంకిత్ బావ్నే కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. సస్పెన్షన్ నుంచి విముక్తుడైన కేఎల్ రాహుల్‌కు కూడా చోటు కల్పించారు. సిరీస్‌లో భాగంగా రెండు అనధికార టెస్ట్‌లు జరగనున్నాయి.

ఇండియా-ఎ: అంకిత్ బావ్నే (కెప్టెన్), కేఎల్ రాహుల్, రికీ భుయ్, కేఎస్ భరత్ (వికెట్ కీపర్), ఈశ్వరన్, పాంచల్, సిద్ధేష్ లాడ్, జలజ్ సక్సేనా, నదీమ్, మయాంక్ మార్కండే, నవదీప్ సైనీ, శార్దూల్ ఠాకూర్, అవేష్ ఖాన్, వరుణ్ అరోన్.



పాపం.. సైక్లిస్టులు

● వణికించే చలిలో నేలపైనే నిద్ర
● జాతీయ చాంపియన్‌షిప్‌లో వసతుల లేమి

జైపూర్: భారత్ క్రీడా దేశంగా ఎదగాలని.. ఇందుకోసం అత్యుత్తమ వసతులు, ప్రోత్సాహకాలు అందజేస్తున్నామని పాలకులు ఊదరగొట్టేస్తున్నారు. కానీ, వాస్తవాలు మాత్రం అత్యంత దారుణంగా ఉన్నాయి. రాజస్థాన్‌లోని సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో జాతీయ చాంపియన్‌షిప్ కోసం వచ్చిన 30 మంది ఆ రాష్ట్ర సైక్లిస్టులు కనీస సౌకర్యాలు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఎముకలు కొరికే చలిలో వెలోడ్రమ్ కింద ఒక చిన్న హాల్‌లో వీరు తలదాచుకుంటున్నారు. 10 డిగ్రీలకంటే తక్కువకు పడిపోయిన ఉష్ణోగ్రతల్లో నేలపైనే నిద్రిస్తున్నారు. స్నానం చేయడానికి వేడి నీళ్లు కూడా సరఫరా చేయడం లేదని ఓ సైక్లిస్ట్ ఆవేదన వ్యక్తం చేశాడు. అయితే, తీవ్రమైన నిధుల కొరత ఉన్నందున తాము ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నామని రాజస్థాన్ సైక్లింగ్ అసోసియేషన్ అధికారి అశక్తత వ్యక్తం చేయడం గమనార్హం. ఒక్క రాజస్థాన్ జట్టుకే కాదు.. అనేక రాష్ట్రాల నుంచి వచ్చిన టీమ్‌లకు కూడా ఇలాంటి అనుభవాలే ఎదురవుతున్నాయి. అయితే, ఫిర్యాదు చేస్తే తమపై వేటు వేస్తారేమోనన్న భయంతో చాలామంది సర్దుకుపోతున్నారని ఓ సైక్లిస్ట్ చెప్పాడు. సర్వీసెస్, రైల్వేస్ లాంటి టీమ్‌లు సొంత వసతిని ఏర్పాటు చేసుకున్నాయి. అంతర్జాతీయ ప్లేయర్లకు మాత్రం హోటళ్లలో వసతి కల్పించారు. మరో అధికారి వాదన వేరే రకంగా ఉంది. హోటళ్లలో ఉండడానికి సైక్లిస్టులే ఇష్టపడలేదని చెప్పాడు. 'చాలా హోటళ్లలో సైకిళ్లను రూమ్‌లోకి తీసుకెళ్లడానికి అనుతించలేదు. కానీ తమ వస్తువులను వదిలి వెళ్లడానికి సైక్లిస్టులు ఒప్పుకోలేద'ని ఆర్గనైజింగ్ సెక్రటరీ రితేష్ చౌధురి తెలిపాడు. తమకు బెడ్‌లు వద్దని.. చాపలు చాలని అథ్లెట్లే కోరారని పేర్కొన్నాడు.

ఫిట్‌నెస్‌లో కోహ్లీ, రోహిత్ స్ఫూర్తి

● యువ ప్లేయర్లు గిల్, ఖలీల్



ప్రాక్టీస్‌లో ఖలీల్

హామిల్టన్: టీమిండియాను ఫిట్‌నెస్ మంత్రం జపించేలా చేసిన విరాట్ కోహ్లీ, సీనియర్ బ్యాట్స్‌మన్ రోహిత్ శర్మ.. జట్టులోని యువ ఆటగాళ్లకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. సుదీర్ఘ కాలంగా క్రికెట్ ఆడుతున్నా వీరి ఫిట్‌నెస్ లెవల్స్ మాత్రం అమోఘమని.. తాము కూడా వారి మార్గాన్నే అనుసరిస్తామంటున్నారు యువ సంచలనం శుభ్‌మన్ గిల్, పేసర్ ఖలీల్ అహ్మద్. గత రెండేళ్లుగా జట్టుతో ఉన్న స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ కూడా వీరితో ఏకీభవించాడు. అంతర్జాతీయస్థాయిలో తన ప్రదర్శన అనూహ్యంగా మెరుగుపడడానికి కఠినమైన ఫిట్‌నెస్ ప్రోగ్రామ్‌లే కారణమని కుల్దీప్ చెప్పాడు. 'తీవ్రంగా కసరత్తులు చేస్తున్నానని కాదు. మాకు ఇచ్చిన ఫిట్‌నెస్ ప్రోగ్రామ్‌ను క్రమం తప్పకుండా అనుసరించడం ఎంతో సహాయకారిగా ఉంద'ని బీసీసీఐ టీవీ తరఫున యజ్వేంద్ర చాహల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కుల్దీప్ పేర్కొన్నాడు. అత్యున్నత ఫిట్‌నెస్ ప్రమాణాలు పాటించడం వల్ల ఎప్పుడు పిలుపు అందినా మ్యాచ్‌కు సన్నద్ధంగా ఉండే అవకాశం ఉంటుందని ఖలీల్ చెప్పాడు. 'రోజూ ఎలా బ్రష్ చేసుకుంటామో.. వర్కవుట్‌లు చేయడం కూడా అలాగే అలవాటు చేసుకోవాలి. శరీరాన్ని చక్కగా చూసుకుంటేనే సుదీర్ఘ కాలం ఆటగాడిగా కొనసాగగలమ'ని అన్నాడు. తమకు ఇచ్చిన షెడ్యూల్‌ను తు.చ తప్పకుండా అనుసరిస్తానని గిల్ తెలిపాడు. జట్టులో చోటు దక్కడం ఎంతో ఆనందంగా ఉందని చెప్పాడు.

క్వార్టర్స్‌లో ఆంధ్ర ఓటమి

కూచ్ బెహార్ ట్రోఫీ

ఒంగోలు (కార్పొరేషన్): కూచ్ బెహార్ అండర్-19 టోర్నీలో ఆంధ్ర జట్టుకు నిరాశ ఎదురైంది. ఒంగోలులోని శర్మ కళాశాల మైదానంలో జరిగిన ఈ మ్యాచ్‌లో విదర్భ జట్టు ఏడు వికెట్ల తేడాతో ఆంధ్రను ఓడించి సెమీస్ చేరింది. మూడో రోజైన బుధవారం ఓవర్‌నైట్ స్కోరు 141/7తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర మరో 40 పరుగులు జోడించి 181 రన్స్‌కు ఆలౌటైంది. అనంతరం 147 పరుగుల విజయ లక్ష్యాన్ని విదర్భ జట్టు 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. మహేంద్ర మెహల్ (58) అర్ధసెంచరీతో రాణించాడు. ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 138, విదర్భ 173 పరుగులు చేశాయి.

పంజాబ్ X హరియాణా

● ప్రొ రెజ్లింగ్ లీగ్ ఫైనల్ నేడు
● సెమీస్‌లో ఢిల్లీ చిత్తు



రాత్రి. 8 గం. నుంచి సోనీ సిక్స్, టెన్-3లో

గ్రేటర్ నొయిడా: ప్రొ రెజ్లింగ్ లీగ్‌లో గతేడాది ఫైనల్ పునరావృతమైంది. గురువారం జరిగే టైటిల్ ఫైట్‌లో డిఫెండింగ్ చాంప్ పంజాబ్ రాయల్స్‌కు హరియాణా హ్యామర్స్ మరోసారి సవాల్ విసరనుంది. బుధవారం జరిగిన రెండో సెమీఫైనల్లో హరియాణా 6-3తో ఢిల్లీ సుల్తాన్స్‌ను మట్టికరిపించి ఫైనల్ చేరింది. 65 కిలోల్లో రజనీష్ 9-3తో విటకోవిక్కీపై నెగ్గి 5-2తో హ్యామర్స్ విజయాన్ని ఖరారు చేశాడు. రవికుమార్, కిరణ్, నిచిత, అలెగ్జాండర్.. ఆడిన ఆరు బౌట్లలో నాలుగు నెగ్గారు. 86 కిలోల్లో షబనోవ్ 5-0తో సంజీత్‌పై గెలిచి హ్యామర్స్‌కు మరో పాయింట్ అందించాడు. మహిళల 62 కిలోల్లో ఢిల్లీ స్టార్ రెజ్లర్ సాక్షి మాలిక్ 6-2తో ఒమెల్‌చెంకోపై నెగ్గి హ్యామర్స్ ఆధిక్యాన్ని తగ్గించింది. అంతకుముందు 57 కిలోల్లో రవి కుమార్ 7-1తో పంకజ్‌పై గెలిచి హరియాణా ఖాతా తెరిచాడు. తర్వాతి బౌట్‌లో కిరణ్ 6-1తో అనస్టాసియాపై నెగ్గి హ్యామర్స్‌ను 2-0 ఆధిక్యంలో నిలిపింది. కానీ, 74 కిలోల్లో కీతిక్ సబలోవ్ 9-0తో ప్రవీణ్ రాణాను మట్టికరిపించి ఢిల్లీకి తొలి పాయింట్ అందించాడు. మహిళల 56 కిలోల్లో నిచిత 11-2తో కేథరీనాపై గెలిచి హరియాణా ఆధిక్యాన్ని 3-1కి పెంచింది. 125 కిలోల్లో అలెగ్జాండర్ 16-0తో సతేంద్ర మాలిక్‌ను ఓడించి హ్యామర్స్‌ను విజయానికి చేరువ చేశాడు. మహిళల 53 కిలోల్లో ఢిల్లీ రెజ్లర్ పింకీ 3-1తో సీమను ఓడించి హ్యామర్స్ విజయాన్ని కొంత ఆలస్యం చేసింది.



అమెరికా @ -50 డిగ్రీలు

- -60కి పతనమయ్యే ప్రమాదం
- గడ్డకట్టిన మిన్నెసోటా, డకోటా
- 1000 విమాన సర్వీసులు రద్దు

విస్కాన్సిన్, జనవరి 30: ఎముకలు కొరికే చలితో అమెరికా గజగజ వణికిపోతోంది. తీవ్ర హిమపాతంతో ధ్రువ ప్రాంతాన్ని తలపిస్తోంది. మధ్య పశ్చిమ ప్రాంతంలో శీతలం ప్రమాదకరస్థాయికి చేరింది. రహదారులు మచ్చుకైనా కనిపించకుండా మంచు కప్పేసింది. ఇంటి నుంచి అడుగు బయట పెట్టాలంటే ప్రాణాలతో చెలగాటంలా ఉంది. ఆర్కిటిక్ నుంచి వీస్తున్న చలిగాలులతో చాలాచోట్ల ఉష్ణోగ్రతలు సున్నా డిగ్రీల కంటే కిందకు పడిపోయాయి. ఉత్తర మిన్నెసోటా, డకోటా ప్రాంతాలు గడ్డకట్టుకుపోయాయి. ఈ రెండు చోట్లా ఉష్ణోగ్రత మైనస్ 50 డిగ్రీలకు పడిపోయింది. ఇది -60 డిగ్రీలకు పతనమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిక జారీ అయింది. దాదాపు 9 కోట్ల మంది ప్రజలు భయంకరమైన చలితో అవస్థలు పడుతున్నారు. వీరిలో దాదాపు 2.5 కోట్ల మంది మైనస్ 20 కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్న ప్రాంతాల్లోనే ఉన్నారు. విస్కాన్సిన్, ఇల్లీనాయిస్, గ్రేట్ లేక్స్, మిన్నెపోలీస్, డెట్రాయిట్, షికాగో, మిషిగన్ తదితర ప్రాంతాల్లో సైతం చలి తీవ్రత ప్రమాదకరంగా ఉంది. షికాగోలో 1985, జనవరి 20న మైనస్ 27 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. ఇప్పుడు ఆ రికార్డు బద్దలు కావచ్చని, మైనస్ 29 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోవచ్చని అమెరికా జాతీయ వాతావరణ సంస్థ పేర్కొంది. హిమపాతం కారణంగా అమెరికాలో వెయ్యి విమానాలను రద్దు చేశారు. విస్కాన్సిన్, మిన్నెసోటీ వర్సిటీలకు సెలవులు ప్రకటించారు.

మంచు దుప్పట్లో మనాలీ

సిమ్లా: హిమాచల్ ప్రదేశ్‌లోని మనాలీలో బుధవారం కనీస ఉష్ణోగ్రత మైనస్ 2.4 డిగ్రీలు నమోదయింది. గిరిజన జిల్లా లాహౌల్-స్పీతి కేంద్రం కీలాంగ్‌లో రాష్ట్రంలోనే అతి తక్కువగా మైనస్ 14 డిగ్రీలకు పడిపోయింది. ఇంకా ఐదారు ప్రాంతాల్లో సున్నా డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మంచు తీవ్రంగా కురుస్తోంది.

దీర్ఘకాలిక ప్యాక్‌లను కొనసాగించండి

వినియోగదారుల ఆకాంక్షలను గౌరవించండి

డీటీహెచ్ ఆపరేటర్లకు ట్రాయ్ సూచన

న్యూఢిల్లీ, జనవరి 30: వినియోగదారుల ఆకాంక్షలను గౌరవించాలని, ఇప్పటికే దీర్ఘకాలిక ప్యాక్‌లలో కొనసాగుతున్న వారి ప్రసారాలకు అంతరాయం కలిగించవద్దని టెలికాం నియంత్రణ సంస్థ (ట్రాయ్) సూచించింది. వినియోగదారులు కోరుకుంటే వారి ప్లాన్ ముగిసేవరకు వెసులుబాటు కల్పించాలని పేర్కొంది. ఫిబ్రవరి 1 నుంచి కొత్త టారిఫ్ విధానం అమలు నేపథ్యంలో డీటీహెచ్ ఆపరేటర్లకు ట్రాయ్ ఈ సూచనలు చేసింది. ఒకవేళ వినియోగదారులు ప్రస్తుతం కొనసాగుతున్న దీర్ఘకాలిక ప్లాన్‌ను మధ్యలోనే మార్చుకోవాలని అనుకుంటే, వినియోగదారుడి ఖాతాలో మిగిలిన బ్యాలెన్స్‌ను కొత్త టారిఫ్‌తో సర్దుబాటు చేయాలని ట్రాయ్ చైర్మన్ ఆర్ఎస్ శర్మ సూచించారు.

ఓటాన్ అకౌంటే



(మొదటిపేజీ తరువాయి)

బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతోందనీ, ఓటాన్ అకౌంట్ కాదనీ మంగళవారం నాడు వాణిజ్య శాఖ ఓ వాట్సాప్ సందేశాన్ని పంపడంతో అయోమయం నెలకొంది. దీనిపై ఆర్థికశాఖ ఓ వివరణ ఇచ్చింది. ఓటాన్ అకౌంట్ అన్న పదం అధికారికంగా లేదని, యూనియన్ బడ్జెట్ అని మాత్రమే ఉందని, అంచేత బడ్జెట్ అనే పదం వాడారని పేర్కొంది. తాము తెచ్చేది ఓటాన్ అకౌంటేనని తేల్చిచెప్పింది. లోక్‌సభ కార్యక్రమాల పట్టిక కూడా శుక్రవారం ఓటాన్ అకౌంట్ ఉంటుందని ప్రచురించింది. మే నెలలో సార్వత్రిక ఎన్నికలు ముగిశాక వచ్చే కొత్త ప్రభుత్వం పూర్తి స్థాయి బడ్జెట్‌ను జులై నెలలో ప్రవేశపెడుతుంది. అప్పుడే ఆర్థిక సర్వే కూడా ఉంటుంది. బడ్జెట్ సమావేశాల తొలిరోజు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రసంగిస్తారు. అనంతరం సభ వాయిదా పడుతుంది. ఫిబ్రవరి 1న కేవలం బడ్జెట్ మాత్రమే ఉంటుంది. కేన్సర్ చికిత్స కోసం ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ అమెరికా వెళ్లడంతో ఆయన స్థానే తాత్కాలిక ఆర్థికమంత్రి పీయూష్ గోయల్ దీన్ని ప్రవేశపెడతారు. పేరుకు ఇది వచ్చే నాలుగు నెలల కాలానికి పద్దు అయినప్పటికీ.. సార్వత్రిక ఎన్నికలు ముందున్నందున వివిధ వర్గాలకు తాయిలాలు ప్రకటించే అవకాశాలూ లేకపోలేదని బలంగా వినిపిస్తోంది. రైతులనుంచి నిరుద్యోగుల వరకూ దాదాపు 3లక్షల కోట్ల మేర ప్రయోజనాలు కల్పించనున్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. మధ్యతరగతి ఆదాయవర్గాలను సంతృప్తిపరిచేందుకు ఆదాయపన్ను రాయితీని 5 లక్షలకు పెంచుతారా లేక 8లక్షల వరకు పెంచే అవకాశాలున్నాయా అన్న చర్చ సాగుతోంది.

కాంగ్రెస్ విప్ జారీ..

బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి 13 దాకా జరగనున్నాయి. ఈ సమయాన్ని సాధ్యమైనంత ఎక్కువగా సర్కార్‌ను ఇరుకున పెట్టేందుకు కాంగ్రెస్ సహా విపక్షాలు సమాయత్తమయ్యాయి. అన్ని రోజులూ తప్పనిసరిగా హాజరుకావాలని రాజ్యసభలోని తన సభ్యులకు కాంగ్రెస్ ఓ విప్ జారీ చేసింది. కేంద్రం మంగళవారం అయోధ్యలో వివాదస్పద స్థలం చుట్టూ సేకరించిన అదనపు, మిగులు భూమిని అసలు యజమానులకు అప్పగిస్తామని సుప్రీంకోర్టులో పిటిషన్ వెయ్యడాన్ని విపక్షాలు నిలదీయవచ్చు. దీంతోపాటు రాఫెల్ వివాదం, రైతాంగ దుస్థితి మొదలైనవి కూడా వాటి ఎజెండాలో ఉన్నాయి. అటు కేంద్రం పౌరసత్వ సవరణ బిల్లును, తక్షణ తలాక్ బిల్లును ఎలాగైనా ఆమోదింపచేయాలనే పట్టుదలతో ఉంది. అంతేకాక తనకు విశేషంగా ఓట్లు రాబట్టే ప్రవాస భారతీయుల ఓటింగ్ బిల్లును (ప్రజా ప్రాతినిధ్య సవరణ బిల్లు) కూడా ఎలాగైనా క్లియర్ చేయించాలన్న సంకల్పంతో ఉన్నట్లు తెలుస్తోంది. జాతీయ వైద్యమండలి ఏర్పాటు బిల్లు కూడా ఎజెండాలో ఒకటి. తక్షణ తలాక్, పౌరసత్వ బిల్లులను రాజ్యసభలో అడ్డుకోవడానికే కాంగ్రెస్ తన సభ్యులకు విప్ జారీచేసినట్లు సమాచారం.

రాఫెల్‌పై కాగ్ నివేదిక పార్లమెంటుకు!

రాఫెల్ ఒప్పందానికి సంబంధించి కాగ్ నివేదికను కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశ పెట్టనుంది. గురువారం బడ్జెట్ సమావేశాలు మొదలవుతున్నాయి. రాఫెల్ యుద్ధ విమానాల ధరల వివరాలతో కాగ్ మూడు కాపీలను ప్రచురించనుంది. వీటిని రక్షణ శాఖకు అందజేస్తారు. ధరల వివరాలు తీసేసి, తిరిగి కాగ్ నివేదికను ముద్రించి సభ్యులందరికీ అందజేస్తారు. ప్రభుత్వం నుంచి ఏ పత్రాలనైనా పరిశీలనకు అడిగే అధికారం ఉన్న ప్రజాపద్దుల సంఘం ధరల వివరాలతో కూడిన కాగ్ నివేదిక కావాలని కోరుకుంటే మాత్రం రక్షణ శాఖను అడగాల్సి ఉంటుంది.

నాకే ఓటేయండి

- మళ్లీ పూర్తి మెజారిటీ ఇవ్వండి
- సంకీర్ణానికి పాలన సాధ్యంకాదు: మోదీ

సూరత్, జనవరి 30: రానున్న ఎన్నికల్లో ఎన్‌డీఏకు మళ్లీ పూర్తి మెజారిటీ ఇవ్వాలని ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలను కోరారు. మెజారిటీ ప్రభుత్వమే దృఢమైన నిర్ణయాలు తీసుకోగలదని చెప్పారు. సంకీర్ణం కంటే సుస్థిర ప్రభుత్వమే మెరుగ్గా పనిచేయగలదని ఎన్‌డీఏ సర్కారు నిరూపించిందన్నారు. 30 ఏళ్ల పాటు 'హంగ్ పార్లమెంటు' వల్ల దేశాభివృద్ధికి విఘాతం కలిగిందని, నాలుగేళ్ల క్రితం ప్రజలు సంపూర్ణ మెజారిటీ ఇవ్వడంతో దేశం వేగంగా పురోగమిస్తోందని చెప్పారు. సూరత్ విమానాశ్రయం కొత్త టెర్మినల్ విస్తరణ పనులకు బుధవారం శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మోదీ ప్రసంగిస్తున్న సమయంలో ఓ కెమెరామేన్ స్పృహ తప్పి పడిపోవడంతో ప్రసంగం ఆపేసి తన భద్రతా సిబ్బందితో అతణ్ని ఆస్పత్రికి పంపించారు. కాగా మహాకూటమి అధికారంలోకి వస్తే రోజుకొకరు చొప్పున ప్రధానమంత్రి అవుతారని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా ఎద్దేవా చేశారు.

మోదీ రైతు బంధు?

బడ్జెట్లో భారీ తాయిలాలు ఖాయం... తెలంగాణ స్కీమా లేక ఒడిసా మోడలా?

'ఒక కుటుంబానికి ఒక రాయితీ' పథకంపై సమగ్ర చర్చ

సకాలంలో చెల్లిస్తే వడ్డీ మాఫీ!... దీనికయ్యే వ్యయం లక్షన్నర కోట్లు



న్యూఢిల్లీ, జనవరి 30: దుస్థితిలో ఉన్న రైతాంగానికి బడ్జెట్‌లో చేయూత నిచ్చేందుకు నరేంద్ర మోదీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో కసరత్తు చేసింది. మూడు హిందీబెల్ట్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో కొన్ని చోట్ల ఓటమికి రైతుల ఆగ్రహమే కారణమని తేలడం, ఇప్పటికీ వ్యవసాయదారుల్లో ప్రభుత్వ విధానాలపై అసంతృప్తి కొండలా పేరుకుపోవడంతో ఏదో ఒకటి చెయ్యాలన్న కృతనిశ్చయంతో కేంద్రం ఉంది. ఇందుకు అనేక ప్రత్యామ్నాయాలను పరిశీలించింది. పెట్టుబడి సాయం నేరుగా రైతులకు నేరుగా అందించే పథకం పట్ల మొగ్గు ఎక్కువగా ఉన్నట్లు అధికార వర్గాల సమాచారం. తెలంగాణ ప్రభుత్వం ప్రతీ రైతుకూ ప్రతీ పంటకూ ఎకరాకు రూ 4000 చొప్పున వారివారి అకౌంట్లలోనే నేరుగా జమ చేయడం టీఆర్ఎస్‌ను మళ్లీ అధికారంలోకి తెచ్చిందన్న అభిప్రాయాలను విశ్వసించిన కేంద్రం- 'రైతు బంధు' పథకంలోని లోటుపాట్లేమిటి, దేశవ్యాప్తంగా అమలు చేయాలంటే ఎంత ఖర్చవుతుంది అన్నది లెక్కలు వేసినట్లు తెలుస్తోంది.

రైతుబంధుతో పాటు కేంద్రపరిశీలనలో ఉన్న మరో పథకం ఒడిసా సర్కారు అమలు చేస్తున్న కలియా (కృషక్ అసిస్టెన్స్ ఫర్ లైవ్లీహుడ్ అండ్ ఇన్‌కమ్ ఆగ్మెంటేషన్) స్కీం. దీని కింద ఒక రైతు కుటుంబానికి వార్షికంగా రూ 10,000 చొప్పున జమ చేస్తారు. ఎంత పొలం ఉందీ, ఎవరెవరు హక్కుదారులు.. అన్న అంశాల జోలికి పోకుండా రైతు పేరిట జమ అయిపోతుంది. కొద్దిపాటి పొలం ఉన్న వారికీ, కౌలుదార్లకీ కూడా వర్తించేట్లుగా దీన్ని రూపొందించారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం- కేంద్రం కూడా ఇదే తరహాలో రాయితీని ప్రకటించాలని ఆలోచిస్తోంది. 'ఒక ఇంటికి ఒక రాయితీ' అన్న ఈ స్కీము కింద రూ 10,000లను ఏటా ఆ కుటుంబ ఖాతాలో జమచేస్తారు. ఎరువులు, విత్తనాలు, యంత్రసామగ్రి కొనుక్కోవడానికి దీన్ని ఉపయోగించుకోడానికి ఇది అందచేస్తారు. దీనికయ్యే ఖర్చు ఏడాదికి లక్షన్నర కోట్లు. దీనికి తోడు సమాంతరంగా మద్దతు ధర పెంపును కూడా అమలు చేయాలన్నది ఓ నిర్ణయం. సకాలంలో పంట రుణాలు చెల్లించేవారికి వడ్డీ మాఫీ కూడా మరో ప్రత్యామ్నాయం. అధికారంలోకొస్తే దేశవ్యాప్తంగా రుణమాఫీని అమలు చేస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ప్రకటించడంతో కేంద్రంపై ఒత్తిడి మరింత పెరిగింది. రుణమాఫీ తాత్కాలిక తాయిలం మాత్రమేనని, అసలు లబ్ధిదారులకు ఇది చేరదని నిపుణులతో పాటు బీజేపీ కూడా వాదిస్తోంది. కాంగ్రెస్ హామీకి దీటుగా గ్రామీణ ఓట్లను కైవసం చేసుకునేందుకు మోదీ ఏదో ఒక భారీ పథకాన్ని ఖచ్చితంగా ప్రకటిస్తారని అధికార వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

హిందూత్వ అజెండాతో బీజేపీ ప్రచారానికెళ్తే భారత్‌లో మత ఘర్షణలు?

- ఎన్నికల ముందు పొంచి ఉన్న ముప్పు.. అమెరికా నిఘా సంస్థ



న్యూఢిల్లీ, జనవరి 30: అధికార బీజేపీ హిందూ జాతీయవాద అంశాలను గట్టిగా లేవనెత్తితే ఎన్నికలకు ముందు మన దేశంలో మత ఘర్షణలు చెలరేగే అవకాశం బలంగా ఉందని అమెరికా జాతీయ నిఘా సంస్థ హెచ్చరించింది. "ప్రధాని నరేంద్ర మోదీ హయాంలో బీజేపీ విధానాలు ఆ పార్టీ పాలిత రాష్ట్రాల్లో మతపరమైన ఉద్రిక్తతలను పెంచాయి. ఈ నేపథ్యంలో హిందూ జాతీయవాద ప్రచారాన్ని ఆ పార్టీకి చెందిన హిందూ జాతీయవాదులు ఎంతో కొంత హింసకు ప్రేరేపిస్తున్న సంకేతంగా తీసుకోవచ్చు. ఇది వారి మద్దతుదారులను కదిలించేందుకు అవసరమని భావించవచ్చు" అని ఆ సంస్థ పేర్కొంది. ఈ ఏడాదిలో ప్రపంచవ్యాప్తంగా పొంచి ఉన్న ముప్పులు ఏంటి? అనే అంశంపై ఆ సంస్థ అంచనా వేసింది. దానిని ఆ సంస్థ డైరెక్టర్ డాన్ కోట్స్ నివేదిక రూపంలో శక్తిమంతమైన సెనేట్ సెలెక్ట్ కమిటీకి అందజేశారు. ఇందులో భాగంగానే భారత్‌లో రానున్న ఎన్నికలు, మత ఘర్షణల ప్రమాదం గురించి ప్రస్తావించారు. మత ఘర్షణలు భారత ముస్లింలను వేదనకు గురిచేస్తాయని, ఇస్లామిస్ట్ టెర్రరిస్టు గ్రూపులు దేశంలో తమ ప్రభావాన్ని విస్తరించడానికి కారణమవుతాయని పేర్కొన్నారు. సీమాంతర ఉగ్రవాదం, ఎల్‌వోసీ వెంబడి కాల్పుల నేపథ్యంలో భారత్-పాకిస్థాన్ మధ్య తీవ్రంగా దెబ్బతిన్న సంబంధాలను గుర్తుచేస్తూ కూడా హెచ్చరించారు. కోట్స్‌తో పాటు సీఐఏ, ఎఫ్‌బీఐ డైరెక్టర్లు కూడా కమిటీ ముందు హాజరై తమ నివేదికలను అందజేశారు. సీఐఏ డైరెక్టర్ హాస్పెల్ ఇటీవల భారత్‌లో పర్యటించి వెళ్లారు.

21 నుంచి రామాలయ నిర్మాణం

- ప్రతి హిందువూ 4 ఇటుకలు తేవాలి
- ధర్మసంసద్ అనంతరం ద్వారకా పీఠాధిపతి ప్రకటన

ప్రయాగ్‌రాజ్, జనవరి 30: అయోధ్యపై హిందూ సంస్థలు దూకుడు పెంచాయి. ఫిబ్రవరి 21 వతేదీన మహారామ మందిర నిర్మాణం మొదలుపెడతామని అనేక ధార్మిక సంస్థలతో కూడిన ధర్మసంసద్ బుధవారం ప్రకటించింది. కుంభమేళా పరిసరాల్లో మూడురోజులపాటు జరిగిన సమావేశంలో ఆలయ నిర్మాణంపై విస్తృతంగా చర్చించిన అనంతరం- ద్వారకా పీఠ శంకరాచార్య స్వరూపానంద సరస్వతి ఈ విషయాన్ని ప్రకటించారు. 21న శంకుస్థాపన చేయడానికి అయోధ్యకు ఓ దండులా తరలివెళతామని ఆయన చెప్పారు. "ఫిబ్రవరి 10న వసంత పంచమి. ఆ పుణ్య తిథినాడు గంగలో పవిత్ర స్నానం ఆచరించి అయోధ్యకు బయల్దేరతాం. బుల్లెట్ల వర్షం కురిసినా, ఎలాంటి ఆటంకాలు ఎదురైనా వెరవం. ప్రతి హిందువూ నాలుగు ఇటుకలు తీసుకొని అయోధ్యకు రావాలి. ఇది ఓ రకంగా శిలాన్యాస్ లాంటిదే. దీన్ని మేం "ఇష్టికాన్యాస్" (అంటే ఇటుకల స్థాపన పూజ) అంటాం. బీజేపీ సహా ఏ ప్రభుత్వమూ ఆలయ నిర్మాణానికి చొరవ చూపట్లేదు. అందుకే ఈ యజ్ఞం" అని ఆయన పేర్కొన్నారు. ఈ నిర్మాణం చేపట్టడం ద్వారా తాము కోర్టు ఆదేశాలను ధిక్కరించబోవడం లేదని ఆయన స్పష్టం చేశారు.

అయోధ్యలో వివాదాస్పద స్థలం చుట్టూ సేకరించి స్వాధీనపర్చుకున్న 67 ఎకరాల అదనపు మిగులు భూమిని వాటి సొంత హక్కుదారులకు అప్పగించడానికి వీలుగా 2003లో ఇచ్చిన ఆదేశాలను సవరించాలని కోరుతూ కేంద్రం సుప్రీంకోర్టులో పిటిషన్ వేసిన మర్నాడే ఈ పరిణామం చోటుచేసుకోవడం విశేషం. యథాతథ స్థితిని కొనసాగించాలన్న ఉత్తర్వులను తొలగించాలని కేంద్రం కోరుతోంది. ఇది అదనుగా హిందూ సంస్థలు అడుగు ముందుకేశాయి. శుక్రవారం నాడు విశ్వహిందూ పరిషత్ ఒక ధర్మ సంసద్‌ను నిర్వహించనుంది.



హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లోని నుమాయిష్ అగ్నికీలల్లో చిక్కుకుంది! దాదాపు 200 దుకాణాలను అగ్నిజ్వాలలు కబళించాయి. బుధవారం రాత్రి 8 గంటల సమయంలో ఆంధ్రా బ్యాంకుకు చెందిన స్టాల్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా రాజుకున్న మంటలు పెను విధ్వంసం సృష్టించాయి. మంటలు వ్యాపించడం మొదలుకాగానే సందర్శకులంతా భయంతో బయటకు పరుగులు తీశారు. ఆ సమయంలో స్వల్ప తొక్కిసలాట జరిగినప్పటికీ ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. దట్టంగా వ్యాపించిన పొగవల్ల 20 మంది దాకా అస్వస్థతకు గురయ్యారు. ప్రమాదంలో దాదాపు రూ.50 కోట్ల దాకా ఆస్తినష్టం జరిగినట్టు అంచనా.

రాహుల్... ఇదేం పని?

- పరామర్శకొచ్చి రాజకీయం చేస్తావా?
- రాఫెల్ డీల్‌పై మనమెక్కడ చర్చించాం?
- గోవా ముఖ్యమంత్రి పర్రీకర్ లేఖ
- మోదీ ఒత్తిడితోనే మీరు లేఖ రాశారు
- ఇలాంటి దాడి మీ నైజం కాదు: రాహుల్



గోవా అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెడుతున్న సీఎం పర్రీకర్

పనాజి(గోవా), జనవరి 30: అనారోగ్యంతో ఉన్న గోవా సీఎం పర్రీకర్‌ను పరామర్శించడానికి వచ్చిన కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఆయన్ను ఇరుకున పెట్టే విధంగా వివాదాస్పద ప్రకటన చేయడం సంచలనం సృష్టించింది. సవరించిన రాఫెల్ యుద్ధ విమానాల ఒప్పందంతో తనకు సంబంధం లేదని రక్షణ శాఖ మాజీ మంత్రి పర్రీకర్ తనతో చెప్పారని ఆయన్ను పరామర్శించిన కొద్ది గంటలకే రాహుల్‌గాంధీ ప్రకటించడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. నిజానికి మంగళవారం గోవాలో పర్రీకర్‌ను ఆయన కార్యాలయంలో కలిసిన రాహుల్, అనంతరం ఇది వ్యక్తిగత పర్యటన అని ట్వీట్ కూడా చేశారు. అదేరోజు కోచిలో సభలో మాట్లాడుతూ, "అనిల్ అంబానీకి మేలు చేసేందుకు మోదీ కుదిర్చిన కొత్త ఒప్పందంతో తనకు సంబంధం లేదని మాజీ రక్షణ మంత్రి పర్రీకర్ స్పష్టంగా చెప్పారు" అన్నారు. ఈ వ్యాఖ్యలతో పర్రీకర్ ఇరుకున పడ్డారు. దాంతో ఆయన కాంగ్రెస్ అధ్యక్షుడికి ఘాటుగా లేఖ రాశారు. అనారోగ్యంతో ఉన్న వ్యక్తిని మర్యాద పూర్వకంగా పరామర్శించడానికి వచ్చి, ఆ సమావేశాన్ని చిల్లర రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడం సరికాదని హితవు పలికారు. తనతో జరిగిన ఐదు నిమిషాల భేటీలో రాఫెల్ విషయమే చర్చకు రాలేదన్నారు. "మీరు ఈ పరామర్శ పర్యటనను రాజకీయంగా వాడుకున్న తీరు నన్ను తీవ్ర నిరాశ పరచింది. ఆ ఐదు నిమిషాల్లో రాఫెల్ గురించి మీరు మాట్లాడలేదు. మనిద్దరం దానికి సంబంధించిన ఇతర విషయాలు కూడా ఏమీ మాట్లాడుకోలేదు" అన్నారు. "మర్యాదపూర్వకంగా వచ్చి రాజకీయ లబ్ధి కోసం ఈ స్థాయికి దిగజారడం అసలు మీ పరామర్శ ఉద్దేశాలనే అనుమానాస్పదం చేసింది" అని పర్రీకర్ వ్యాఖ్యానించారు. అనారోగ్యంతో బాధ పడుతున్న వ్యక్తి గురించి అబద్ధాలు చెప్పిన రాహుల్‌ను ప్రజలు అసహ్యించుకుంటున్నారని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా దుయ్యబట్టారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి పర్రీకర్ లేఖకు రాహుల్ బదులిచ్చారు. తన లేఖను ట్విట్టర్‌లో ఉంచారు. పర్రీకర్‌తో మంగళవారం సమావేశంలో మాట్లాడిన విషయాలేవీ వెల్లడించలేదని చెప్పారు. తాను వ్యక్తిగత హోదాలోనే పర్రీకర్ దగ్గరకు వెళ్లానని తెలిపారు. "మనిద్దరి మధ్య మంగళవారం నాటి సంభాషణల వివరాలేవీ నేను వెల్లడించలేదు. మీతో భేటీ అనంతరం నేను రెండు సభల్లో మాట్లాడినవన్నీ ఇప్పటికే మీడియాలో మీరు మాట్లాడినట్లు విస్తృతంగా కవర్ అయినవే. 2015 ఏప్రిల్‌లో మీరు గోవాలో చేపల మార్కెట్‌ను ప్రారంభిస్తుంటే ఫ్రాన్స్‌లో మోదీ రాఫెల్ ఒప్పందంపై సంతకాలు చేసింది నిజం కాదా? రాఫెల్ పత్రాలు మీ బెడ్రూములో ఉన్నాయని, మోదీ ఆయన ద్వారా లబ్ధి పొందిన వారి జుట్టు మీ చేతిలో ఉందని గోవా మంత్రివర్గ సమావేశంలో మీరు వ్యాఖ్యానించినట్లు మీ మంత్రే చెప్పడం నిజం కాదా?" అని రాహుల్ ప్రశ్నించారు. "పర్రీకర్‌జీ మీ పరిస్థితిని నేను అర్థం చేసుకోగలను. మంగళవారం మనిద్దరి సమావేశం తర్వాత మీ మీద ఎంత తీవ్రమైన ఒత్తిడి వచ్చిందో నాకు తెలుసు. మీ నైజానికి విరుద్ధంగా మోదీ పట్ల అసాధారణ విధేయతను చాటుకోవడంలో భాగంగా మీరు నా మీద దాడి చేశారని అర్థం చేసుకోగలను" అన్నారు.

హెచ్ 1బీ 'ప్రీమియం' అర్జీల పరిశీలన షురూ

వాషింగ్టన్, జనవరి 30: పలుమార్లు వాయిదా పడుతున్న హెచ్ 1బీ వీసా దరఖాస్తుల ప్రీమియం ప్రాసెసింగ్ ప్రక్రియ తిరిగి ప్రారంభమైంది. త్వరితగతిన అంటే దరఖాస్తు చేసిన 15 రోజుల్లో అర్జీని పరిశీలనలోకి తీసుకుంటారు. అంతమాత్రాన వీసా మంజూరు చేస్తారన్న గ్యారెంటీ లేదు. అయితే వర్కింగ్ వీసా దరఖాస్తుల సంఖ్య భారీగా పెరిగిపోవడంతో.. వాటిని పరిష్కరించేందుకుగాను హెచ్1బీ దరఖాస్తుల ప్రీమియం ప్రాసెసింగ్‌ను యునైటెడ్ స్టేట్స్ సిటిజన్, ఇమిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) తాత్కాలికంగా వాయిదా వేసింది. అయితే 2019 సంవత్సరానికి సంబంధించి ఈ ప్రక్రియను ఈ నెల 28 నుంచి ప్రారంభించినట్లు యూఎస్‌సీఐఎస్ ఒక ప్రకటనలో తెలిపింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107
Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.